RNI No. APTEL/2003/12253

# భావవీణ

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 16 Issue No. 6(1) Monthly June 2019 ISSN No. : 2456-4702 Rs. : 15/-



ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500

## సురవరం ప్రతాపరెడ్డి




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Telugu Literary, Culture & Language Study**

(తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 16 - Issue. 6(1) - June 2019 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Dr. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**COVER PAGE & PAGE SETTING**

**TENALI PRAKASH**, G.L.S. ENTERPRISES, Guntur. 94 94 660 509.

---

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

---

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# సురవరం ప్రతాపరెడ్డి

తెలంగాణ రాజకీయ, సాంఘిక చైతన్యం అంటే టక్కున గుర్తొచ్చే పేరు సురవరం ప్రతాపరెడ్డి. పత్రికా సంపాదకుడిగా, పండితుడిగా, రచయితగా, ప్రేరకుడిగా క్రియాశీల ఉద్యమకారుడిగా బహుముఖ కోణాలలో సాగిన ప్రతాపరెడ్డి ప్రయాస, కృషి అనన్యమైనవి. స్థానిక చరిత్ర గూర్చి, స్థానిక ప్రజల కడగండ్ల గూర్చి, ఆయన పడిన నిరంతర తపనకు ప్రతి అక్షరం ప్రత్యక్ష సాక్ష్యం.

తెలంగాణాలో కవులే వేరన్న ముడంబ వెంకట రాఘవాచార్యుల నిందా వాక్యాల్ని సవాలుగా తీసుకొని 354 కవులతో కూడిన "గోల్కొండ కవుల సంచిక" గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో సహా ప్రచురించి గ్రంథ రూపంలోనే సమాధానమిచ్చిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణ ఆత్మాభిమానాన్ని ఎత్తిన పత్రిక 'గోల్కొండ కవుల సంచిక'.

సురవరం గారు తెలుగు భాషలోనే గాకుండా హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఫారసీ, ఆంగ్ల భాషలలో కూడా నిష్ణాతులు. పత్రికా సంపాదకత్వంలో కూడా ఆయనకు ఆయనే సాటి అనిపించుకున్నారు. అణగారిన బతుకుల్లో వెలుగుల రవ్వల జడి 'గోలకొండ పత్రిక'. దానికి అనుబంధంగా భారత సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికల్ని స్థాపించి, సంపాదకుడిగా, పత్రికా రచయితగా ప్రసిద్ధి చెందారు. 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర, 'హిందువుల పండుగలు', 'హైందవ ధర్మవీరులు', గ్రంథాలయోద్యమము' ఇతని ఇతర ముఖ్య రచనలు. ఇతిహాసాల చీకటి కోణాలపై ప్రసరించిన అక్షరదీపం 'రామాయణ విశేషాలు'. జన సంస్కృతి తొలినాళ్ళపై గురిపెట్టిన దుర్భిణి 'హిందువుల పండుగలు'. తారీఖులు, దస్తావేజులకు చెల్లుచీటి చూపి చారిత్రిక మూలాలపై, జనజీవన సరళులపై చూపు నిల్పి - చరిత్ర నిర్మాతలు ప్రజలేనంటూ - చాటిన ఉద్గ్రంథం 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'. ఈ రచనకు గాను 1955లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును కూడా కైవసం చేసుకున్నారు.

తన రచనలకొక లక్ష్యమూ - తన పరిశోధనకొక ఆదర్శమూ కల వ్యక్తి. తెలుగు సాహిత్యంలో ప్రతీ ప్రక్రియనూ చేపట్టి, సమర్థవంతంగా నిర్వహించి, తెలుగుదనం మేల్కొల్పి, తెలంగాణ అస్తిత్వాన్ని పాదుకొల్పి - 'పదండి పోదాం' అన్న వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. తన కృషి సమాజపరంగా సాగించిన ఉద్యమశీలి. తెలుగువారి గుండెల్లో నిలిచిన తెలంగాణ ముద్దుబిడ్డ. తన చుట్టూ ఉన్న జనంలో చైతన్యాన్ని రగిల్చిన విప్లవవీరుడు.

- సంపాదక వర్గం

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# Contents (విషయ సూచిక)


| | | |
|---|---|---|
| 1. శ్రీ తుమ్మల గారి రచనలు - సామాజికాంశములు | - డా॥. వై.వి.సి.హెచ్. లీలా పద్మజ | 6 |
| 2. చంద్రశాల - శిల్ప వైభవం | - డా॥. దోనెపూడి రామాంజనేయ శర్మ | 12 |
| 3. ఆంధ్రుల జానపద కళావైభవం - నేటిస్థితి | - వై. హర్షవర్ధన రెడ్డి | 17 |
| 4. సంపాదకుడు - సంపాదకీయం | - కె. జనార్ధన్ | 22 |
| 5. అన్నమయ్య, పురందరదాసు సంకీర్తనల్లో నైతిక విలువలు (నీతి) | - పి.ఆర్. ప్రకాష్‌బాబు | 25 |
| 6. అట్టడుగున పడి కనిపించని కథలు 'ఇప్పపూలు' | - బానోతు వీరన్న | 28 |
| 7. శ్రీ శివభారతము పాత్రచిత్రణ | - కె. లలిత & - డా.యన్ నరసింహులు | 32 |
| 8. మట్టివాసన కవిత సంపుటి - పరిశీలన | - యం. మునే నాయక్ | 37 |
| 9. 'హ్యారీపోటర్ - పరుసవేది' నవల విమర్శనాత్మక పరిశీలన | - ఎవివికె. చైతన్య | 39 |
| 10. పకృతి ఒడిలోకి 'ఒంటరి' పయనం | - డా॥ యస్. దివిజాదేవి | 48 |
| 11. చింతామణి నాటకం - స్త్రీలోలత్వం | - డా॥ గరికపాటి హరిబాబు | 51 |
| 12. జాషువా పిరదౌసి - స్త్రీ పాత్ర చిత్రణ | - డా॥ విస్తాలి శంకరరావు | 55 |
| 13. సంస్కృత రూపకాల ఆవిర్భావం - పరిశీలన | - బత్తుల లింగారెడ్డి | 60 |
| 14. దూరపు కొండలు నునుపు --ఎండమావులు నాటిక | - మూడే నాగేంద్ర నాయక్ | 64 |
| 15. తెలుగు కథా సాహిత్యం-గిరిజన ఉద్యమ కథలు | - డా॥ ముడావత్ వెంకటేష్ | 69 |
| 16. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి కథలు-మానవతా విలువలు | - డా॥ పి.వి. రమణారెడ్డి | 72 |
| 17. బండి నారాయణ స్వామి చారిత్రక నవల శప్తభూమి | - పొదిలి నాగరాజు | 75 |
| 18. విశ్వనాథవారి ధర్మచక్రం- రాజకీయ, సాంఘిక, మత పరిస్థితులు | - డా. సింగుపురం నారాయణరావు & డా. సుసర్ల ఇందిర | 86 |
| 19. పిల్లల్లో భాషావికాసం - గడించవలసిన నైపుణ్యాలు | - డాక్టర్ బి. ప్రసాద్‌బాబు | 91 |
| 20. కొలుపులు - అధ్యయనం | - డా. దాసర విజయకుమారి | 94 |
| 21. గిరిజనుల భిన్నాభక్తి దృక్పథాలు | - డా॥ హెచ్. కిషన్ | 99 |
| 22. బల్లి పురుషోత్తమ కవి "ఎస్తేరు" పాత్ర చిత్రణ | - డా॥. ఎస్. యజ్ఞశేఖర్ | 103 |
| 23. ఆధునిక తెలుగు సాహిత్యం - తెలంగాణ మాండలికం | - డా॥. జి. శ్రీనివాసరావు | 106 |

# శ్రీ తుమ్మల సీతారామమూర్తి గారి రచనలు - వాటిల్లో సామాజికాంశములు

- డా॥. వై.వి.సి.హెచ్. లీలా పద్మజ, విభాగాధిపతి, తెలుగు విభాగం,
రాజాహ్ ఆర్.ఎస్.ఆర్.కె. రంగారావు కళాశాల, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

నదిలో నీటిని అర్ఘ్యమిచ్చి నదిలోనే విడుచునట్లు సమాజం నుండి పుట్టిన కవి సమాజం నుండే నేర్చు కొంటాడు. మళ్ళీ తత్సంబంధిత కవిత్వానుభవమును సమాజహితవు కే ఉపయోగిస్తాడు. రోగికి వైద్యుని అవసరం వున్నట్లే సమాజానికి కవి అవసరం ఎప్పుడూ వుంటుంది. కవి తాను నివసించే సమాజం బాగుండాలని కోరుకోవడమే కాదు అలా వుండేటట్లు పూనుకొంటాడు.

అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతి :
యధాస్మైరోచతే విశ్వం తథేదం పరివర్తతే

బ్రహ్మత్వముతో తన సమాజాన్ని ధర్మబద్ధంగా వుంచాలి అనుకొంటాడు.

అనాదిగా కవులు, కవయిత్రులు తమ తమ రచనలతో జాతిని జాగృతం చేశారు. అలాంటి వారిలో తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు పేర్కొనదగినవారు.

సీతారామమూర్తిగారు వ్రాసిన 'ఆత్మార్పణము' అనే ఈ రచన (మినీ) ఒక చిన్న ధర్మశాస్త్ర గ్రంధమని పేర్కొన వచ్చు. నాడు భారతి పత్రికలో ప్రచురింపబడినది. తిక్కన గారు లుబ్ధకపోతోపాఖ్యానము అని వ్రాసిన దాన్ని 'ఆత్మార్పణం పేరు' తో మూర్తిగారు అద్భుతంగా మలచారు. ఎలమావి చెట్టు పై ఏ కొమ్మనెక్కినప్పటికీ కోయిల మాత్రం కుహూ అనే తన సంగీతాన్నే వినిపిస్తుంది. అలాగే సుకవి ఏ కధాంశాన్ని తీసుకున్నా తాను మాత్రం సమాజ హితవునే అందులో పదిలపరుస్తాడు. సమాజహితైషిగానే పలుకుతాడు. అందుకు సీతారామయ్యగారి ప్రతిరచన మనకు సోదాహరణమే.

'ఆత్మార్పణం పేరుతో ఈయన వ్రాసిన రచన పంచమవేదం అయిన సంస్కృత భారతంలో వుంది. దాన్ని తిక్కన తెనిగస్తే దానిని ప్రబంధశైలిని పెంచి శ్రీతుమ్మల గారు కొత్తగా ఆత్మార్పణం పేరుతో రూపుదిద్దారు.

ప్రమద్వర కొరకు రురుని వలెకపోతి గురించి కపోతం (మగపక్షి) విలపించడం జరిగింది. విశేషమే, కపోతి, కపోతము దాంపత్యం గురించి చెబుతూనే ఈయన సమాజానికి అన్యోన్యదాంపత్యం ఎట్లావుండాలో చెప్పినట్లున్నది. నేటి భాషలో 36లో కాదు 63లా వుండాలి అంటే ఆరు మూడు (63) ఒకవైపుకే వున్నాయి. మూడటు ఆరు ఇటుగా ఎడమోహం పెడమొహంలా లేవు. ఇక సీతారామమూర్తిగారు చెప్పిన ఈ దాంపత్యం గొప్పతనం చూడండి.

శబ్దార్థముల భంగి చంద్ర చంద్రికల యట్లున్యోన్య
మైత్రి నొప్పిరుచున్న మనకాపురంబు కపోతం రమ్య
కుసుమంబ - వీవు సౌరభము నేను
నిండు నెల వీవుపండువెన్నెలను నేను
పదము నీవు దదర్థసంపదను నేను - కపోతి
అరమరికలు లేని ఈ పిట్టల దాంపత్యంవలె మానవులలో

అనురాగం అన్యోన్యత వుండాలి, కనుకనే కపోత దాంపత్యం అనే కవి సమయం ఏర్పడింది. పక్షులకూ ఒక భాష వున్నదని తెలుసు వాటికీ ఒక జీవనము వున్నదని ఊహచేసి ఆదిమానవులకు ఆదర్శం కావలనే సందేశం అలాగే పశుపక్ష్యాదులను ఆదర్శప్రాయులుగా చేసి కధలు చెప్పి అది మానవులకు ఎట్టా ధర్మమో చెప్పేరీతి ఒక సాంప్రదాయంగా వుంది.

చెప్తున్నది కపోతముల జంట గురించే అయినా అంటే వస్తువేది అయినా సయమం దొరికినపుడు సామాజిక అంశాల్ని ప్రపంచ విషయాల్ని చూపించడం కవిగారిలోని గడుసుతనం, లోకజ్ఞత, మానవతా తత్వాలకు నిదర్శనం,

కపోతము కర్షక జనుల గొప్పతనంల గూర్చి చెప్పిన వాక్యములిందుకు నిదర్శనం రైతు వేసిన పంటలో కొద్ది గింజలు తినే పక్షలకే అంత విశ్వాసముంటే రైతు పండించే పంటనంతా తినే మానవులకు రైతు పట్ల ఎంత విశ్వాసం వుండాలి. అలాంటి అన్నదాత గురించి విస్మరిస్తే మనకు పుట్టతులుండవు. రైతు గురించి ఏది చెప్పినా అది సార్వ కాలిక సందేశమే ఔతుంది. ఏ కాలం నాటి వారైనా, ఏ జాతి వారైనా రైతన్నకు ఋణపడివుంటారనేది నిస్సందేహం.

ఎండకు వానకు జంకక
పండించిన ధాన్యమెల్ల బాతఅలందున్
నిండించి తినుచు బెట్టుచు
నుండెడి కర్షకు డెధన్యుడూ హింపంగన్ అంటూ
కర్షకుడిని
ఒక చోట ప్రశంసిస్తుంది మగ పక్షి. తమ జాతిలో
ఎక్కడ దొరికినవి.

అక్కడే తినేసి ఏ పూట ఆహారం ఆ పూటే వెతుక్కొనే అలవాటు వున్నతమ జాతి పద్దతిని నిందించుకొంది. వచ్చిన వారి కోసం తమ గూటిలో ఆహ్వారాన్ని నిల్వ వుంచుకొనే పద్ధతి లేనందుకుతన్ను తాను తిట్టుకొంది. మనం మనుషులుగా మనకు లేకపోతేనో, మన వారికి లేకపోతేనో మాత్రమే ఆరాటపడుతాం. ఇది మానవ జాతికి చెంప పెట్టులాంటి సంఘటన.

## సార్వకాలికం – ఈనీతులు :

1) ఆకలితో ఇల్లు చేరు అతిధికి తగు అన్నపానాదులు ఇచ్చి కొంచెమైనా మేటు చేయని బ్రతుకు బతుకు బ్రతికినా లాభమేమిటి? భూమికి బరువు చేటు - అని మగపక్షి అనుకొన్నది. తన భార్యను వలలో బంధించిన బోయవానికి ఎక్కడి నుండో ఎండు కట్టె తెచ్చి వర్షము చేత అన్నీ తడిసియుండడం చేత తన గూడునే మండించి చలి తీర్చినది. చివరికి అతడు ఆకలి అన్నప్పుడు ఆ ఆకలి తీర్చడం కోసం పక్షి పై మాటలు అనుకొన్నది.

2) బోయవానివలసలో చిక్కుకున్న ఆడపావురం చలికి వడకుతున్న బోయవానికి కష్టము బాపమని తన భర్తకు వుపదేశిస్తుంది. ఆ సందర్భంలోని ఈ మాట లన్నీ అక్షరామృత గుళికలే. దీనుల మొఱలాలింపని బలము, ధనము, వంశము, జీవితము వ్యర్ధము లన్నది. తన మానము, తన ప్రాణము తన విత్తము, తన బలము, తన సర్వస్వాన్ని విశ్వ శ్రేయస్సు కప్పు చెప్పేవాడే ముక్తుడన్నది. సుమతీ, దయానిధి, సుమహిత చరిత్ర అంటూ తన భర్త పావురాన్ని సంబోధించించింది. అవన్నీ విన్న మగ పావురం భావించింది. భావించడమే కాదు. అందుకు తన గూడుని, తన శరీరాన్నే త్యాగం చేసింది చివరికి.

3) తన జంట పక్షియైన అర్ధాంగి పక్షి కోసం మగపక్షి విలపిన్తూ అనుకొన్న మాటలు ఏనాటి సమాజానికైనా అర్ధాంగియైన ఏ స్త్రీకి అయిన కూడా అర్ధాంగి ధర్మా లను తెలిపేవిగా వున్నాయి. సాధారణంగా పురు షుడు ధార్మికతకు దూరమైనా, అవినీతికి దగ్గరై పరుల సొమ్మును ఆశపడినా అది ఎక్కువగా స్త్రీ ప్రేరణ వల్లా అర్ధాంగి కోరికలవల్లనే జరుగుతుంది. స్వతహాగా పురుషుడు చెడ్డవాడైతే ఏవెూగానీ మంచి వాడిగా ధర్మబద్దంగా వుండాలనుకొంటే భార్య కోరికల వ్యామోహంలో వున్నదైతే మాత్రం ఆ మగాడు చెడ్డవాడుగా మారతాడు. ఇక్కడ చూడండి తన ఆడ పక్షిలో లేని దుర్గుణాలు, వున్న సద్గుణాలు చెబుతాడు. ఇలా వుండాలి భార్య అంటే అన్నట్లు వుంటుంది.

కార్యేషు దాసికరణేషు మంత్రి, భోజ్యేషుమాతా అన్నట్లున్న తన అర్ధాంగి - అలాగే ఈ భర్త కూడా భార్య మాట నేనెందుకు వినాలి అనే అహం లేకుండా ఆమె చెప్పిన సజ్జన మార్గంలో అలోచించేవాడు.

సకల దుఃఖరోగ సందీడితున కింతి
యౌషధం బలన్ననబ్బురంబె
యావిధ ! నిన్ను గూడి యున్నంత వఱకునే

యాపదల నెఱుంగడయ్యెనితడు
పరుల సొమ్మున కాసపడక యొరుల
కొకకీడు, జౌతయు నొనరింపకమెలంగు
మన జీవితము దైవమున కదెంత
కలిమిలేములలోన భాగ్యంబు గొనుచు, మంచి
చెడ్డలలోన పొల్పంచుకొనుచు
మెలగుకర్ధాంగి దూరయైెతొలగి, నేనిఅంటూ విలపించాడు.

అలాగే ఆత్మార్పణంలో బోయవాని పశ్చాతాపం - బోయవాడు
ఇంటికి వెళ్ళే తరుణంలో ఆకస్మాత్తుగా భీకరవర్షం కురిసింది.
అప్పుడు కవి - ఇలాంటి క్రూర స్వభావులను చూసి ప్రకృతి కన్నెర్ర చేసిందా అన్నట్లు -
అనడం సమాజాకి ఒక హెచ్చరిక, పాపభీతి కలిగించే ఒక గుళిక.

ఈ పరమ కలుషహింస
వ్యాపారం బంతకంత తగ్గల మగుటన్
గోపించెననహస్కరు
డేపున నడిమింట - అంటూ ప్రకృతి ఎండా, వర్షం, గాలిలతో చేసి విలయతాండవం వర్ణించారు.

కట్ట : దయ వీడి యీ పాడు పొట్ట కొఱకు
నింతవఱ కెన్నిపుల్గులనేసి చంపి
జంటలెన్నిటి నేడ్చించి యుంటి నొక్కొ
కడకు గుడువంగవల దెతత్కలుష ఫలము అని బోయ
పడిన పశ్చాతాపం - సమాజానికి ఒక హితవు చేసిన
పాపం ఎక్కడకీ పోదు అది చెడని ఫలము
అన్నట్లు నవ్వుతూ చేస్తాం పావం ఏడుస్తూ అనుభవించాలి దాని ఫలం.

ఆత్మార్పణంలోని ఆపక్షి జంటలాగా మానవులు ఆలోచించగలిగిన నాడు విశ్వం శాంతి మయం కాక తప్పదు. ధర్మం వెల్లి విరియక తప్పదు. ధర్మోరక్షతి రక్షితః అనే నానుడి నిజం కాక తప్పదు.

**సార్వకాలిక - నీతులు :**

కృషీ వలాశ్రయములైన పలుఖండకావ్యాలు రచించారు. 'క్షేత్రజీవి' అను శీర్షికతో పరధర్మములను, పట్టణములను చూచి పరువు లెత్తు కర్షకుల నుద్దేశించి.

కదురుగల చోటు కవ్వంబు కదలుచోటు
కఱవులకు ధూమకేతువని - అంటూ కృషి జీవనములోని ప్రాశస్త్యము తెల్పారు. అంటే ఆనాటికే రైతులు దగాపడి పర వృత్తులకు, పట్టణాలకు వెళ్ళిపోవడం వుందన్నమాట.

'శివరక్షకుడు' అను శీర్షిర క్రింద శివునికి కర్షకునికి అభేదం చిత్రించారు. ముమ్మొనలములు కోల, బసవన్న మున్నగు సమాన ధర్మములలో ఈ సాదృశ్యము నిరూపించారు - పణిగపంట.

శ్రీతుమ్మలవారుస్పృశించని అంశం లేదు. వాటిని ఆధారంగా చేసుకొని చెప్పని నీతివాక్యము, స్పృశించని సామాజిక అంశం లేవంటే అతిశయోక్తి కాదు. డా॥ సి॥నా॥రె॥ గారు తన పరిశోధన గ్రంధంలో 'దేశనాయక స్మృతి' అనే అంశంలో 'పణిగ పంట' అను రచనలో తుమ్మలవారు విశ్వనాధ కాశీనాధుని వారు శివైక్యము చెందినారని చెప్పిన పద్యం - మాతృదాస్యపాశచ్ఛేద కౌశల్యమును గన్న కర్మయోగి - గా బలి, కర్ణ, మాంధతల విస్మృతికిందెచ్చు విశ్వదాతగా చదువులమ్మకు సేవ సలుపు బంటుగా కీర్తించారు. మరి ఇన్ని లక్షణాలు కలిగిన ఆయన కీర్తింపబడినాడంటే అలాంటి ఉత్తమ లక్షణాలను పెంపొందించుకోవాలనే సందేశం సమాజానికిచ్చినాడన్నమాటే.

యధ్యాదాచరతి శ్రేష్ఠ తత్తదేవేతరోజనః
సయత్రమాణం కురుతే లోకస్తదనువర్తతే అనే భగవద్గీతశ్లోకం మనకు గుర్తుకురాకమానదు.

డా॥ సి॥నా॥రె॥ గారి - ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు

1) ప్రయోగములు - 413 పుట.
2) డా॥సి॥నా॥రె॥ గారి - ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదయములు, ప్రయోగములు - పుట - 452 - తుమ్మల వారి - పఙిగ పంట.

చారిత్రక కథా వస్తువులను, పాత్రలకు కూడా తీసుకొని తుమ్మల దేశాభిమానాన్ని లేవనెత్తేరు. సిక్కు వీరులతో భారతీయుల్ని, మొగల్ ప్రభువుల వైఖరితో ఆంగ్లేయుల స్వభావాన్ని సరిపోలుస్తూ అన్యాపదేశంగా చెప్పారు.

చారిత్రకంగా రసపుత్రులు, మహారాష్టులు, సిక్కులు వీరగాధలు కవుల దృష్టినాకర్షించినది. తేజబహద్దరు అను సిక్కువీరుడు ఔరంగజేబు చేతికి చిక్కినాడు విధివశంచేత. మొగలు చక్రవర్తియైన ఔరంగజేబు అతనిని వంటయింటి కుందేలైనావని అపహాస్యం చేస్తూ ఇకనైనా ఇస్లాం మతం తీసుకొమ్మని క్రోధంగా పల్కినపుడు అంతకంటె పౌరుషంగా అతడు క్రూరతనూది నీవిపుడు కోసెదు నాశిర మంత మాత్రనజే.

కూరదు నీకు సంత సమకుంఠిత శౌర్యులు సిక్కు జోదు వీరుని నెత్తు చుక్కకొక వేవురు పుట్టి త్రీ మొగల్ ప్రభుత్వ ధాత్రీ రుహమున్ బెకల్తురు గరిష్టులు కూకటి వేరు లూడగన్ అని ఆ సిక్కు వీరుడు ఔరంగజేబును ధిక్కరించి అతని చేతిలో మరణించాడు. తుమ్మల వారు ఆదర్శవీరుడు అనే శీర్షికలో ఈ ఘట్టాన్ని అతి రసత్తరంగా వీర రస ప్రధానంగా చిత్రీకరించారు. సిక్కువీరుని ధైర్య సంభాషణలు, భారతీయులకు ప్రేరణగా, ఊరటగా నిల్చాయి.

ఆంధ్రదేశపు నీరు అది మాకునమృతము

ఆంధ్రదేశపు మట్టి అదిమహత్కనకము అని భావించిన రోజులవి. ఆ రోజుల్లో వారి రచనల్లో, భావాల్లో, చేతల్లో ఎడనెడా దేశభక్తి కనబడేది. ఈ భారతదేశంలోని ప్రతి వస్తువూ వారికి ప్రీతి పాత్రంగా తోచేది, అది భాష అయినా, వేషమైనా, వస్తువులైనా ఏవైనా సరే స్వస్థాన వేషాభిమతులు వీరు. అందుకే ఈ అంశాలను డా॥సి॥నా॥రె॥ గారు తమ పరిశోధన గ్రంథంలో 2 ఆంధ్ర జాత్యాభిమానం, శౌర్య ప్రశస్తి అనే వాటిలో చేర్చారు.

1) పతిగ పంట - తుమ్మల - పుట - 47.
2) డా॥సి॥నా॥రె॥ ఆధునికాంధ్ర కవిత్వం - సంప్ర దాయముల ప్రయోగములు పుట - 377.

ఊరక రాష్ట్ర మూడి పడునిక్క మహేశ్వరనట్లు మాతృభా॥

షారమణిన్ భజించుటకు సందర మందనిచచ్చు జాతికిన్ అని

తుమ్మలవారు భాషాభిమానం ప్రదర్శిస్తూ ఆంధ్రభాషా సేవ చెయ్యక

పోతే ప్రత్యేక ఆంధ్రరాష్ట్రంరాదనే భావాన్ని వ్యక్త పరచారు.

తెలుగు జోదులతుటారి కటారి చెలరేగి పగఱ జీల్చి నదినంబును

స్మరణకు తెచ్చుకొని కవినిట్లూర్చినాడు. ఆంధ్రుల గత శౌర్యాన్ని గుర్తుకు

తెచ్చుకొని అట్టి బంగారు యుగమున తాను పుట్టక ఏల పుట్టితి

నిపుడిసీ! యేటి బ్రతుకని తన్ను తానుచీదరించు కున్నాడు.

ఇదీ ఒక దేశభక్తుడి కుడవలసిన లక్షణమని వేరుగా చెప్పాలా?

దేశభక్తి కలిగిన ఏ వ్యక్తికైనా దేశంలోని ఏవస్తువైనా అది తన

దేశౌన్నత్యమును చాటేదిగానే కనబడుతుంది. లేదా ఆ వస్తువు ద్వారా తాను దేశౌన్నత్యమును చాట్ చెబుతాడు.

ఇక్కడ తుమ్మలవారు శ్లాఘించిన నౌకావ్యా పారము గురించి డా॥సి॥నా॥రె తన సిద్ధాంత గ్రంథంలో పేర్కొన్నారు.

రాష్ట్ర గానంలో తుమ్మల
ఈజిప్టు నుండి కృష్ణాజలమ్ములకు బా
రంబాటగా పరాక్రమము జూఫి
సకల దీవుల విజయటధ్వజములనాటి
తనదు తెరచాప వార్ధి రాజునకు కట్టు

కోకగా ...................... పూర్వము ఆంధ్రనౌక లేడు సంద్రముల మీద తిరుగాడి నవని తలచికొని పులకించి నారు. శాతవాహనుల కాలంలో ధాన్య కటకమున

విదేశీయులుతో జరిగిన నౌకా వ్యాపారము ఈ పద్యములో ధ్వనించుచున్నది. ఆంధ్రదేశమున బూదికి జీవము నిచ్చు ఔషధులున్నవని రారాజుల కిరీట రంగమ్ము లెక్కినిక్కిన వజ్రముల గన్నగనులున్న వని కొల్లూరి కోహినూరు తెలుగుతల్లి కొప్పులో పూవు వలె విరాజిల్లి నదని కీర్తించారు. ఆంధ్రభోగము కనుగొన్నచో ఇతరులకు పండ్లు పుల్లనైపోవునని లోకోక్తినివాడి తమ దేశాభిమానాన్ని ప్రకటించుకొన్నారు. ఆంధ్రులు రతనాలు, ముత్యాలు రాసులు పోసి రాయల రాచ వీధిలో అమ్మెడి వారని మంచు తెరల నీసడించు సెల్లాలు బందరు దుకాణములలో మెఱసెడివని మన వారి పనితనమును, గత వైభవమును చెబుతూ మోటుపల్లి.

డా॥సి॥నా॥రె॥ ఆధునికేంద్ర కవిత్వం - సంప్రదాయ ములు ప్రయోగములు

తుమ్మల - రాష్ట్రగానము - పుట - 377 - 378 పుట

రేవున కస్తూరిని కొల్లలు దిగుమతి చేసెడి వారని చంద్రవోలు పురములో మంటి కుండ, నులక మంచ మనగా నేమియో తెలియని ఐశ్వర్యముతో ప్రజలు తులదూగెడివారని అలనాటి. తెలుగు సిరిని కీర్తించినారు. తెలుగుబాషను విదేశీయులు పొగడినారు. అందులో బ్రౌన్ దొరగారి వంటి మాటల్ని దృష్టిలో పెట్టుకొని తుమ్మలవారు 'ఎల్లఖండమ్ముల వారి మెప్పులే సాక్ష్యములని' మన భాషాన్నత్యాన్ని మరి మరి ప్రస్తుతి చేశారు. లేజవరాలి మోవికిజిలేబికి బాలరసాల పల్లవ శ్రీకి ఆంధ్రవాణి రుచులు చెందెడిదని మాతృభాషను ప్రస్తుతించారు. మాతృభాషామానం దేశభక్తిలో భాగమనేది ఈయన జాతికిచ్చిన సార్వకాలిక సందేశం కాదనగలమా ? మానవ మనుగడలో భాష కూడా ఒక సామాజిక అంశమే కదా.

ఇక భారతమాతను గురించి - వెన్నతోడనె చతుర్వేద ఋక్కులు పంచిసుతులచుంచు దువ్వినదిగా భావిం చాడు. జాతీయాభిమానం వ్యక్తపరచారు.

రాష్ట్రగానంలో తుమ్మలవారి దేశభక్తికి పరాకాష్టగా, మిన్నుముట్టిన దేశాభిమానానికి కొలమానంగా వున్నవి కొన్ని ఆంధ్రశిల్పి అజంతా ఎల్లోరాలను నిర్మించాడన్నది అసమజంసము కాకాపోవచ్చు గానీ అరవలను దోమల నుట ఆంధ్రుని వేదండ మనుట కేవలమభిమాని తిరేకమువలన వెలువడిన మాటలే అంటూ డా॥సి॥నా॥రె॥ గారు తన సిద్ధాంత గ్రంథం 390వ పేజీలో పేర్కొన్నారు. తెలుగు వారికి రాష్ట్రము వచ్చినచో వారి విత్తము గుడిచి త్రేచెడి భాగ్యము పోవునని 'పొలలోబడిన బల్లులకైవడి తల్లడిల్లుచున్న అఱవల్ గఱువల్ నిరసించు ధర్మములు అన్న ధోరణి కూడా పై తీరులోనే వున్నదన్నారు. డా॥సి॥నా॥రె హిందీని, ఇంగ్లీషున్ పట్టుకొని వేలాడు తెలుగు వారిని తెలుగును విస్మరించరాదని వీరు హెచ్చరించారు.

పోతన్న కలము సొంపుల నెఱుంగకమున్నె తులసి దాసునికైతతోపనేమి ? అని వీరనుట అభిమానాతి శయమని అనలేము.

వేదండమయ్యు యోదోమలనాశ్రయించుకొని జోహార్లిచ్చెనీనాటికిన్ రాష్ట్ర గానం - అఱవలు - మాతృభాష - రాష్ట్ర గానం.

365వ పే - ఆధునికాంధ్ర సంప్రదాయములు ప్రయోగములు పఱిగ పంట - తుమ్మల - పుట - 36 డా॥సి॥నా॥రె॥ సిద్ధాంతగ్రంథం - 390 పుట.

కానీ వంగభస్మము అను శీర్షకతో వీరు వ్రాసిన పద్యములలోని స్వాభిమాన తీవ్రత పాఠకుల కాశ్చర్యము కల్గించకమానదు అన్నారు. (కీ॥శే॥) డా॥సి॥నా॥రె॥

సిగ్గు సిగు తెల్గుసీమలదత్తుతా
కూర్ బెనర్జి సేను, ఘూషే, బోసు
రే, యటన్న పేర్లు రేగెను 'పెగ్గడ'

భట్టు, సెట్టి వీడు వట్టిపోయె అన్నారు. ఈయనలోని తెలుగుదనాభిమానికి ఇంతకన్నా ఉదాహరణ ఇంకేం కావాలి. ఆ కాలమున భారతదేశములోని అన్ని రాష్ట్రము లలో ప్రసిద్ధులైన వారు వారి వ్యక్తిత్వముల చేత ప్రభా వితులైన కొందరాంధ్రులు తమ బిడ్డల పేర్లకు బెనర్జీ, బోసు మున్నగు వానిని చేర్చిరి. ఇది ఆంధ్రులకు విజాతీయమైదని తుమ్మల వారు తీవ్రంగా ఖండించారు. ఇది ఈయనలోని తెగువకు ధైర్యానికి, దేశాభిమానానికి నిదర్శనం స్వదస్థాన వేష భాషాభిమానం నూటికి నూరుపాళ్ళువున్న కవి వీరు. కట్టుబొట్టులో ఆంధ్రత్వము

నాచరించి చూపిన మహాత్ముని ఆస్థానకవులు అందు వలననే ఆంధ్రత్వము పట్ల వీరి స్వాభిఆనము గట్లు తెంచుకొని ప్రవహించినది అని డా॥సి॥నా॥రె పేర్కొన్నారు.

తుమ్మల వారి రచనలు సర్వోదయ గానం, ఆత్మార్పణం, పఱిగ పంట, ఆదర్శధవీరుడు, రాష్ట్ర గానం ఇలా ఏ ఖండికలో చూసుకొన్న వేటికవే ఒక ధార్మిక ఆకారాలు, ధర్మానికి ఆకరాలుగా భాసిల్లుతున్నాయి. కాలంతో నిలిచింది అంటేనే అందులో వున్న ధర్మసారం, సామాజిక నేపథ్యం మనకు అర్థమౌతున్నాయి. ఆయన రచనలు ఒక్కొక్కటి ఒక్కొక్క ధార్మిక గనివంటిది. అందులో తువ్వుకొన్న వారికి తవ్వుకొన్నంత లభ్యం కాక మానదు. అది వారి వారి సంస్కార ఫలితం అని మాత్రం అనక తప్పదు. వెన్నెల ముందున్నా అంధునికి గోచరం కానట్లు సాహితీ సంస్కారం లేని వారికి మాత్రం ఇవి కానరావు. అభివన తిక్కన

1) పఱిగ పంట - వంగ భస్మము - పుట - 121 డా॥సి॥నా॥రె సిద్ధాంత గ్రంథం.

తెనుగలెంక బిరుదులు ఈయనకు ఖచ్చితంగా తగియున్నవి. అవి ఈయన్ని చేరి సార్ధకం అయిన వనే చెప్పాలి. తెలుగుభాష పట్ల ఈయన సేవక భావాన్నే వ్యక్తం చేశారు. అలాగే జీవించారు. ఒక అభినవ తిక్కన అన్నది నిజమే ఈయన తిక్కన వలె తేట తెలుగు వాడి, అది కూడ అన్నల్పార్థ రచన చేసి తిక్కన నాటకీయశైలిలా ఈయన ఏది చెప్పినా మనకళ్ళకు కట్టినట్లు చెప్పి సార్థకుడు అయినాడు.

జయంతితే సుకృతినోరససిద్ధాః కవీశ్వరా

నాస్తితేషాం జరామరణంజం యశః కాయం భయం

నిజమే తుమ్మలవారు తమ రచనల ద్వారా ఎప్పటికీ మనతోనే వుంటారు. మనలోనే వుంటారు.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# చంద్రశాల - శిల్ప వైభవం

- డా॥. దోనెపూడి రామాంజనేయ శర్మ, రీజనల్ డైరెక్టర్, ఇగ్నో రీజనల్ సెంటర్, కొత్తపేట, విజయవాడ.

## సంక్షిప్త పరిచయం :

శ్రీ అంబటిపూడి వెంకటరత్నంగారు అనేక కావ్యాలు నాటకాలు వ్యాసాలు ఆధ్యాత్మిక గ్రంథాలు రాసిన కవి, రచయిత, విమర్శకుడు. వారు రచించిన పన్నెండు కావ్యాలలో ఒకటి అయిన చంద్రశాల కావ్యంలో వారు ప్రదర్శించిన శిల్ప వైభవాన్ని విశ్లేషించడం ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

## కీలక పదాలు :

భావ కవిత్వం, ఛందస్సు, గీతాలు, మాత్రా ఛందస్సు, ప్రతీకాత్మకత, నామౌచిత్యం.

## చంద్రశాల కావ్యం - సాహితీ నేపథ్యం :

ఈ కావ్యం శ్రీ కవిరత్న, రత్నకవి అంబటిపూడి వెంకటరత్నంగారు 1943 లో రచించారు. అంటే తెలుగు సాహిత్యంలో భావకవిత్వోద్యమం బాగా ప్రచారంలోకి వచ్చిన సమయమది.

అలాంటి భావ కవిత్వం 1940ల వరకు బాగా ప్రచారంలో ఉంది. ఆ సమయంలో వచ్చిన రచన గనుక ఈ చంద్రశాల కావ్యంపై కూడ ఆ భావకవిత్వ లక్షణాలు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. తెలుగు సాహితీప్రియులందరికీ భావకవిత్వ లక్షణాలు తెలిసినవే అయినా ముఖ్యాంశాల్ని మాత్రం ప్రస్తావించక తప్పటం లేదు.

## భావ కవిత్వం - ప్రధాన లక్షణాలు :

వస్తువు - సమకాలికం లేదా కాల్పనికం; ప్రక్రియ - ఖండకావ్యం; భాష - పద చిత్రాలు; అనుభూతి ప్రకటన ... నవ్యత; ఛందస్సు - వృత్తం / గీతం / మరేదయినా; శైలి - ముఖ్యంగా ఆత్మాశ్రయం; రసపోషణ - శృంగారం అధికం/ కరుణం ఒక్కోచోట ముఖ్యం-మరొక చోట గౌణం.

''చంద్రశాల'' కావ్యాన్ని ఈ విధమైన సాహితీ నేపథ్యంలో పరిశీలించాలన్నది ఇప్పటికి సహృదయ హృదయాలకు అర్థమై ఉంటుంది. కనుక భావకవిత్వ లక్షణాలు ఎంత వరకు దీనికి వర్తిస్తాయి; వాటికి అతీతంగా కవి ప్రదర్శించిన కవితా పరమైన యితర అంశాలేమిటి అన్నవి ప్రధాన చర్చనీయాంశాలుగా యిందులో పరిశీలించటం జరుగుతుంది.

## కథా సారాంశం :

సాధారణంగా భావకవిత్వంలో వస్తు, భావ, రచనలనే మూడు కవిత్వాంశాలలో భావానికే ప్రాధాన్యత ఉంటుంది గనుక అది భావ కవిత్వ మయిందనీ, కనుక మిగతా రెండంశాలయిన వస్తు, రచనలు అప్రధాన మయినాయని సాహితీ విమర్శకులు పేర్కొన్నారు. కానీ భావం ఎంత ప్రధానమైనా వస్తు రహితంగా ఉండజాలదు. కనుక ఈ 'చంద్రశాల'లో వస్తువు - లేదా కథాంశం ఏమిటన్నది కొంత పరిచయం చేయాలి.

ఈ కావ్యంలో ఆఱు కాండలున్నాయి. మొదటిది **ప్రవేశకాండ.** ఇందులో పడకటింటిలో మొదటి రాత్రితో కథ మొదలవుతుంది. నీకు నాపై ఇష్టం కలగనంతవఱకు వేచి ఉంటాను, అనే నాయకుని ప్రకటనతో ఈ కాండ ముగుస్తుంది. రెండవదయిన **జాగరకాండ**లో నాయకి మనసుపడిన పూర్వప్రియుని ఛాయా రూపంతో సంభాషణ, తరువాత దానిని గురించి నాయకి సతమతమవుతుండగా ఈ కాండ ముగుస్తుంది. ఇక, మూడదవదయిన **స్వప్నకాండ**లో నాయకుడు కలలో ఒక నరమృగాస్య తనను ప్రేమించినట్లు, బలవంతపెట్టినట్లు, తాను నిరాకరించినట్లు, అంతలోనే చంద్రుడు వారిద్దరినీ చంద్ర లోకానికి తీసుకువెళ్లి రాజీ కుదర్చటానికి యత్నించినట్లు, పరస్పరం ప్రేమించుకోండని సలహా యిచ్చినట్లు, దానికతడు నిరాకరిస్తుండగా కల కరిగిపోతుంది. తరువాతి దయిన **జాగరభాష్యకాండ**లో నాయకి తన ప్రియుడు

చెప్పిన మాటల గురించి ఆలోచిస్తూ 'నేనే నిరాకరించిన ఈ భర్తతో ఎట్లా కాపురం చేయాలి? అది లేకుండా నా ప్రియుడు నాకు పుత్రునిగా పుట్టడం ఎలా సంభవం? కనుక నేను నిజం చెప్పక తప్పదు' అని నిశ్చయించు కొనటంతో ఈ కాండ ముగుస్తుంది. తరువాతిదయిన స్వప్నకాండలో నాయకుడు తమ జీవితాలు ఇట్లా వ్యర్థం కావలసిందేనా? అని ఆలోచిస్తూ ఉంటాడు. చివరిదయిన **పరిణామకాండ**లో భార్యాభర్తల మధ్య సుదీర్ఘసంభాషణ తరువాత రాజీ కుదిరి వాళ్లిద్దరూ కలసి కాపురం చేయ డానికి నిశ్చయించుకోవటంతో కావ్యం ముగుస్తుంది.

పై కథా వస్తువు గమనిస్తే ప్రస్తుత కావ్యమైన 'చంద్రశాల'లో నాయికా నాయకుల అంతస్సంఘర్షణకు అమిత ప్రాధాన్యం కలిగించబడినదని సహృదయులంతా గ్రహించగలరు. అలా భావ ప్రధానమైన కావ్యం గనుక యిది భావకవిత్వ శాఖకు చెందిన కావ్యమైంది.

## కల్పన - నవ్యత - సార్థకత :

ఈ చంద్రశాల కథా వస్తువు పూర్తిగా కాల్పనిక మయినదని శ్రీ అంబటిపూడి సుబ్రహ్మణ్యశాస్త్రి గారు (కవిగారి పుత్రుడు) 'చంద్రశాల త్రిభాషా పద్య కావ్యం'లో వ్రాసిన ముందుమాటలో పేర్కొన్నారు. రచయితే స్వయంగా కావ్య శీర్షిక క్రింద 'కల్పిత కావ్య'మని పేర్కొ నటం గమనించవచ్చు. కథా వస్తువు పూర్తిగా కల్పితం అయినప్పటికీ, అది ఆనాటి సామాజిక పరిస్థితులను పూర్తిగా ప్రతిబింబిస్తున్నదని అంగీకరిస్తారు, కదా!

అయితే ఈ కల్పనలో 'నవ్యత' ఏమిటి? దాని సార్థకత ఏమిటి? అనేది కూడ కొంత చర్చ చేయాల్సిన అవసరం ఉంది.

1. ఈ కావ్యంలో 'నవ్యత'ను మనం చాల కోణాల్లో చూడవచ్చు. అవి-
   వస్తువు - ఛందస్సు - భాష (త్రిభాషాభివ్యక్తి)
   సమకాలీన సమాజ జీవితంలో జరిగే / జరుగుతున్న విషయాల్ని కథా వస్తువుగా స్వీకరించటం ఒక నవ్యత.
2. ఛందస్సును ఈ కవి ఒక మంత్రదండంలా వాడుకొని అనుకొన్న భావాల్ని మరింత ప్రభావ వంతంగా ప్రకటించగల్గాడనేది నిర్వివాదాంశం. ఇది ఛందోపర మయిన 'నవ్యత'.

సాధారణంగా ఖండ కావ్యాలన్నీ ఏదో ఒక ఛందస్సుకు పరిమితమయి ఒక పద్ధతిలో కొనసాగటం కద్దు. ఆ విధానానికి కాళిదాసు మేఘ సందేశం ఆది కావ్యం అన్న విషయం రసజ్ఞులకు తెలిసినదే.

ఈ కవి మాత్రం వృత్తాల్ని, ఉపజాతులను, వచనాన్నీ, మాత్రాఛందస్సును, సంస్కృత భాషలో రాస్తున్నప్పుడు ఆ భాషలోని అనేక ఛందస్సులను సందర్భోచితంగా వాడుకోవటం కన్పిస్తుంది. ఈ అంశాన్ని మున్ముందు మరింత విస్తృతంగా చర్చిస్తాను. గనుక యిక్కడ వివ రించను.

భాషా పరమైన నవ్యతను ఆయన శబ్ద చిత్రాలలోను, విచిత్ర ఉపమానాలతోను మూడు భాషలలో తానే రాయటంలోను ప్రదర్శించారు. దానినీ మున్ముందు చర్చించుకుందాం.

అయితే పైన పేర్కొన్న కల్పన, నవ్యతలకు ఏదైనా పరమార్థం ఉందా? లేక ఊరికే కవి పాండిత్య ప్రదర్శనకే పనికి వచ్చాయా అన్నదీ పరిశీలనార్హమైన అంశమే. మనకు తెలుసు అర్థం లేని కల్పన, నవ్యత నిరర్థకమని. భావు కుడు, రసజ్ఞుడు అయిన కవి అలాంటి అర్థ రహిత ప్రయోగ మెన్నడూ చేయడు. వీటికి సార్థకత ఏమంటే - కాల్పనికమంటూనే వస్తువులో సమకాలీన సామాజిక జీవితాంశాల్ని కళ్లకు కట్టినట్లు చూపించాడు. ఛందస్సుల ప్రయోగ పరమార్థం స్థాలీపులాక న్యాయంగా చెప్పుకున్నాం. భాషలో నవ్యత మరొక అంశంలో ప్రస్తావిస్తాను. ఇక మూడు భాషలలో రాయటం ఒక క్రొత్త ప్రయోగం. దాని తక్షణ పరమార్థం ఆ యా భాషా కోవిదులకు తన కావ్య ప్రతిపాద్యాంశాన్ని కవి తానుగా స్పష్టంగా చేరవేయటం.

## నామౌచిత్యం :

భావ కవిత్వ లక్షణం ప్రకారం దానిలో భావానికి అగ్ర తాంబూలమని దాని లక్షణ వివేచనలో చెప్పుకొన్నాం. అలాంటి భావాలు ఉదయించేది మన మనస్సులో. ఆ

మనస్సుకు అధిపతి చంద్రుడు. ఆ చంద్రుని శాల అంటే "మానస వేదిక" అక్కడి భావ సంఘర్షణకు ప్రాధాన్యత ఉన్న కావ్యం గనుక కవి ప్రతీకాత్మకంగా "చంద్రశాల" అని తన కావ్యానికి నామకరణం చేసి ఉంటారని నా అభిప్రాయం. అంతేకాదు స్వప్నకాండలో తనను తిరస్కరించిన నాయిక, ముందు వ్యాఘ్రిగాను, తరువాత తాను కొంత మేరకు నరముఖిగాను కన్పించటం, ఆపై చంద్రుడు ఆ రెండు ముఖాలను ఒకటి చేసి యిప్పుడు మీరు ముద్దాడండి అనటంలో - నాయకునికి నాయిక పట్ల గల ప్రీతి వ్యక్తమయింది. అది అతని అంతరంగ భావ తరంగం. కనుక ఆ మనో వేదికయే తదధిష్ఠాన దైవతమైన చంద్రుని శాల చంద్రశాల. కనుక ఈ 'చంద్రశాల' అనే కావ్యనామం అత్యంత ఔచితీ సమన్వితంగా ఉందని సహృదయులందరూ అంగీకరిస్తారని భావిస్తున్నాను.

## సమకాలీన సమస్య - పరిష్కారం :

కల్పిత వస్తువు అంటూనే నిజ జీవితంలో కనిపించే ఒక ముఖ్య సమస్యను చిత్రించి దానికి తనదైన శైలిలో పరిష్కారమార్గాన్ని సూచించారు కవిరత్నగారు. 'హితేన సహితం సాహిత్య' మనే నిర్వచనానికి అనుపమానమైన ఉదాహరణగా మలిచారు ఈ కావ్యాన్ని కావ్య శిల్పి శ్రీ అంబటిపూడి వేంకటరత్నం గారు.

పాశ్చాత్య సంస్కృతీ సంప్రదాయాల ప్రభావంతో ప్రేమలు, ప్రేమ విరహాలు అప్పుడప్పుడే మొదలవుతున్న మన సమాజంలో ఆనాడు కొన్ని సమస్యలు ఉత్పన్నం అయ్యాయి. అవి-

**అ.** రకరకాల కారణాల వల్ల ప్రేమ వైఫల్యం

**ఆ.** అందుకు గురైన నాయిక/నాయకుడు తన జీవితం వ్యర్థమైందని తలపోయటం

**ఇ.** వారి మానసిక స్థితిని గమనించకుండా / ప్రేమ వృత్తాంతం అవ్యక్తంగా ఉండిపోవటంవల్ల పెద్దలు వేరే పెళ్లి చేయటం

**ఈ.** అది సహించలేని / కొనసాగించలేని నాయికో / నాయకుడో ఆత్మహత్య చేసుకోవటం, లేదా కృంగి కృశించి నూతన జీవిత భాగస్వామి జీవితం కూడా భగ్నం చేయటం.

**ఉ.** అందుకు కారణమైన పెద్దలు ఆ విషయాలన్నీ తరువాత తెలుసుకొని తీరికగా పశ్చాత్తాప పడటం.

ఇలా ఎన్నో సమస్యలు ఎదురయ్యే నాటి యువతీ యువకుల జీవితాలలోంచి ఒక సమస్యను గ్రహించి కథా వస్తువుగా రూపొందించుకున్నారు 'కవిరత్న'గారు.

ఈ కావ్యంలో నాయిక ప్రియుడు మరణించినా ఆమె మనస్సు మాత్రం అతని పట్ల విరక్తం కాదు; నూతన జీవిత భాగస్వామితో ఎంతమాత్రం జీవితం పంచుకొనే రాజీ ధోరణి ఆమెలో లేదు. కనుకనే నన్ను తాకనే తాకవద్దంటుంది. పెళ్లికి ముందు తన విషయం తన పెద్దలకు చెప్పకుండా, నిశ్శబ్దంగా వివాహం చేసుకొని, భర్తతో అలా చెప్పి తాను దుఃఖపడుతూ - భర్తను బాధిస్తూ రెండు జీవితాలు నాశనం అవటానికి కారణ భూతమైంది నాయిక.

సరిగ్గా యిక్కడే కవి ప్రతిభ వ్యక్తమవుతుంది. పై వఱకు సమాజంలో జరిగే విషయమే కాని, దానికి పరిష్కార మార్గం ఏమిటి? అంటే అక్కడ నాయికా నాయకుల హృదయాలలో చెలరేగిన బడబానలాన్ని, భావ సంఘర్షణాత్మక అగ్ని పర్వతాల విస్ఫోటనాన్ని స్ఫుటంగా చిత్రీకరిస్తూనే నాయిక ప్రియుణ్ణి ఛాయామూర్తిగా ప్రవేశపెట్టి అతని నోట తనదయిన తీర్పు వినిపించారు కవిగారు.

అంతవరకు జరిగిన కథాంశం, వారి సంభాషణలు అత్యంత సహజంగా మానవ స్వభావాన్ని ప్రతిబింబింపజేస్తే - కవి చూపించిన పరిష్కారం పరమ రమణీయంగా ఉంది. ఆ భావోద్వేగానికి మూర్ఛపోవటం అబల అయిన నాయికకు సహజ లక్షణ మయితే - శైత్యోపచారాలు చేసిన నాయకుడిలో పరిమళించింది మానవత్వం. అక్కడ నాయకుడు ఈ నాటి యువకుల్లా మూర్ఖుడై నాయిక మనస్సు నొప్పింపనూ లేదు; దానవుడై ఆమెను తెగటార్చనూ లేదు. ఓదార్చాడు - ఆమె ప్రతిపాదనకు సరే

నన్నాడు - తాను వెళ్లిపోతానన్నాడు. తీరా వెళ్లబోయే ముందు నాయిక మళ్లీ పిల్చింది. ఇద్దరూ ఎంతో సేపు సంభాషించుకున్నారు. నాయిక నోట ఛాయా మూర్తిగా ఆమె పూర్వ ప్రియుడు చెప్పిన మాట పల్కించి హఠాత్తుగా నాయకుణ్ణి ఆశ్చర్యచకితుణ్ణి చేస్తాడు కవి. దాన్ని అంగీకరించటంలో నాయకుని ఉదాత్తత గిరి శిఖర మంతయి ఉన్నతంగా నిల్చింది. ఒక అగ్ని పర్వతాన్ని చిన్న మాటతో నీరుగార్చాడు కవి. భగ్నం కాబోయే రెండు జీవితాల్ని ఒక రాత్రిలో నిలబెట్టాడా కవి. 'సర్దుకుపోదాం రండి'. అంటూ ఒక కొత్త ప్రతిపాదనతో ఆ జంట చేత మధురోహలతో నూతన జీవితాలకు స్వాగతం పలికించాడు కవి; సమకాలీన సమాజంలో యువతీ యువకులు ఎదుర్కొనే అనేకానేక ప్రేమ సమస్యలకు ఏదో ఒక పరిష్కారమార్గం వెతుక్కోవచ్చునని ఆశ కల్పించాడు - దారి చూపించాడు కవిరత్న. సందేశంతో సమాజాన్ని జాగృతం చేశాడు వైతాళికుడైన రత్నకవి.

## భారతీయ సంస్కృతి - దాంపత్య ధర్మం :

సమస్త ప్రపంచం భారతీయ సంస్కృతిని కొనియాడేది, ఆశ్చర్యంతో చూసేది దానిలో భాగమయిన 'దాంపత్య ధర్మం' గురించే.

అలాంటి సంస్కృతి వర్ధిల్లుతున్న ఈ దేశంలో పాశ్చాత్య సంస్కృతి ఎంతగా ప్రభావం చూపినా మన సంస్కృతి తన మౌలిక ధర్మాన్ని కోల్పోకూడదు; కోల్పోదు. అది కథా ముఖంగా చెప్పటానికే కవి నాయికా నాయికలు విడిపోదగినంత కారణాన్ని చూపి కూడ మరల వారిద్దరిని ఒక్కటి చేసి భారతీయ సంస్కృతి, దాంపత్య ధర్మం ఎంత ఉన్నతమైనవో నిరూపించారు. ఈనాడు ప్రతి చిన్న విషయానికి ఘర్షణ పడడమూ, అహంకారంతో సర్దుబాటు లక్షణం లేకుండా ఎడబాటే మేలనుకుంటూ ఆవేశంలో విడిపోయి ఆనక తీరిగ్గా పశ్చాత్తాప పడే జంటలకు ఈ కథాంశం ఒక కనువిప్పు కావాలి.

కథాంశంలో నాయకుడు, నాయిక తనను తాకరాదని నియమం విధించినా అందుకంగీకరించాక జరిగిన సంభాషణలో నాయిక మూర్ఛపోయినపుడు మానవత్వంతో ఆమెకు సపర్యలు చేసి భర్తగా తనధర్మాన్ని పరిపాలించాడు. సాటిమనిషిగా స్పందించాడు. మానవత్వాన్ని పరిమళింపజేశాడు. కనుక ఈ కథాంశం భారతీయ దాంపత్యధర్మ స్ఫోరకంగా, సమాజంలోని యువతీ యువ కులకు ఆదర్శప్రాయంగా నిలుస్తుందని చెప్పడంలో సందేహం లేదు.

## కవితా మాధురి :

మొట్టమొదటి పద్యంలో నాల్గవ చరణంలో 'వలపు పసిబిడ్డ కిక నేడ బ్రతుకు దెరువు' అంటూ రూపకాలంకారంతో ఒక చక్కని అభివ్యక్తిని మనకు పరిచయం చేశారు కవి. వలపు ఒక పసిబిడ్డట. దానికి బ్రతుకులేదని చెప్పటం నిజంగా ఒక కొత్త అభివ్యక్తియే.

నిరీక్షణలో కాలం గడిపిన విధాన్ని కవి ఎలా వ్యక్తం చేస్తున్నాడో చూడండి.

"పగలిరులు గాక రేయెల్ల పగలు గాగ"

పగలంతా శూన్యం, ఏమీ కనిపించదు. తదేక ధ్యాసలో ఉన్నవానికి ప్రపంచం శూన్యం గనుక దృశ్యమానమైన జగత్తు అతనికి అదృశ్యం గనుక చీకటితో సమానమయిందని చెప్పటానికి పగలు ఇరులు (చీకట్లు)గా అయిందన్నాడు.

ఇక రెండవ సగంలో మరింత పదునైన అభివ్యక్తి కనిపిస్తుంది. అది 'రేయెల్ల పగలు గాగ' రాత్రి అంతా పగలు అయింది అంటే తాను నిద్రలేని రాత్రి గడిపానన్నది వ్యంగ్యార్థం. అంతే గాక అభంగ శబ్ద శ్లేషగా దానిని గ్రహిస్తే రేయెల్ల రాత్రి అతనితో శత్రుత్వం వహించిందని అర్థం. నిరీక్షణలో నిశా సమయం గడవకపోవటం, నిద్ర పట్టకపోవటం సహజం. దాని నిలా అభివ్యక్తీకరించాడు కవి.

'లయకాల సర్ప దంశితుడు హరి
మారిపోయెను స్తబ్ద శరీరుడగుచు'

అనటంలో ఉపమాలంకారం పరమ రమణీయం.

ఈ క్రింది పద్యాలలో వాడిన మాలోపమ (అనేక ఉపమలు) అలంకారం కవి రచనా నైపుణ్యాన్ని బహుచక్కగా వ్యక్తం చేస్తున్నాయి.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

1) మల్లిక వోలె, 2) పడగెత్తి నిల్చున్న పాము కన్నె విధాన, 3) బుట్టలో బుసవెట్టు కట్టుత్రాచు విధాన, 4) శీతల చంద్రిక.

ఈ మాలోపమ ప్రయోగం వల్ల నాయిక మనఃస్థితికి దర్పణం పట్టినట్లయింది.

'శయాళు'జేసి శయనింపజేసి అర్థంలో 'శయాళు జేసి' అనే పద ప్రయోగం ఆయన సంస్కృత భాషా పాండిత్యానికి నిదర్శనం.

లోక వృత్తాన్ని గమనించటం, దానిని కావ్యంలో వాడుకోవటం కవిలోక పరిశీలనకు ఉదాహరణ. ఈ క్రింది పంక్తులు అందుకు ఒక తార్కాణం--

"రాలి పడినట్టి ఫలమేని ప్రసవమేని
తిరిగి తరువృంతమును జేర మరలి చనునె?
విల్లు విడిన నారాచ మే విధిని గాని
వెడలుటే తక్క మరలుట పొడమ దెచట.
అభ్రఖండమ్ము విడిపడు నంబుకణము;
అక్షిగోళము విడి జారు నశ్రుకణము;
గతజలము లిట్టి వెన్నియో కలవు; ........."

త్రిభాషాభివ్యక్తి - అపూర్వం

కవిరత్న అంబటిపూడి వెంకటరత్నంగారు రచించిన ఈ కల్పిత కావ్యాన్ని వారే తెలుగులోనే కాక సంస్కృత, ఆంగ్లాలలోనికి అనువదించి రాయటం వారి బహుముఖ ప్రజ్ఞా పాటవాలకు నిదర్శనం. బహుభాషా పాండిత్యానికి నిలువుటద్దము. ఒకరు రచించిన కావ్యాన్ని మరొకరు వేరొక భాషలోనికి అనువదించటం సాధారణంగా కనిపించే విషయం. కానీ ఈ కవిరత్న గారు మాత్రం తన కావ్యాన్ని తానే మరో రెండు భాషలలోనికి మార్చి రాయటం వెనుక బహుశ రెండు కారణాలు ఉండి ఉండవచ్చు.

1. అ) తెలుగురాని ఆంగ్లభాషావేత్తలకు కావ్య మాధురి తెలియ జేయటం.

   ఆ) తన కావ్యం గీర్వాణ భాషలోనూ ఉండాలని కవి వాంఛించటం ఒక కారణం

   అయి ఉండవచ్చు. కాలాంతరంలో అంటే 1975లో ఈ కవి 'ఇందిరావిజయ' మనే నాటకాన్ని భారత సైన్యం - పాకిస్తాన్ పై సాధించిన విజయాన్ని కథాంశంగా గ్రహించి రాయటం జరిగింది. కనుక ఆ భాషపై కవికున్న మక్కువ, పట్టు కూడ ఇందుకు కారణాలు కావచ్చు.

2. ఇక రెండవ కారణం మరొకరు అనువదించటం వేరు; కవి స్వయంగా

రెండవ భాషలో రాయటం వేరు. ఏ అంశాన్ని ఎక్కడ ఎలా ఎంతవరకు ప్రాధాన్యమిస్తూ రాయాలి? అనేది కవికి తెలిసినంతగా అనువాదకునికి తెలియక పోవటంలో ఆశ్చర్యం లేదు. అంతే కాదు తనకున్న భాషా పాండిత్యం కూడా యిందుకు ఒక కారణం కావచ్చు; అందువల్ల ఎక్కడ ఏ భాషలో ఏ శబ్దం ప్రయోగించాలి? అన్నది 'కవి హృదయం' తెలిస్తే తప్ప అనువాదకునికి సాధ్యం కాదు. కానీ ఇక్కడ కవే ఆ పని చేశాడు గనుక బంగారానికి 'తావి' అబ్బినట్లయినది.

ఈ నేపథ్యంలో గ్రంథం లోని తక్కిన విశేషాలను చదువరులు గ్రహించి ఆనందించగలరని ఆశిస్తాను. మరిన్ని వివరములకు ''చంద్రశాల'' త్రిభాషా పద్యకావ్యాన్ని చూడగలరు.

**ముగింపు :**

పై పరిశీలనవల్ల "చంద్రశాల" కావ్యం నామకరణం నుండి ముగింపువరకు కవి ప్రదర్శించిన ప్రత్యేక శ్రద్ధ వలన సాహిత్య లోకంలో దానికి ఒక ప్రత్యేకస్థానం లభించిందనీ, కావ్య రచనలో కథా వస్తువు నిర్వహిస్తూ సమకాలీన సామాజిక సమస్యను తీసుకొని దానికి తనదైన పరిష్కారాన్ని, దిశా నిర్దేశాన్ని ప్రదర్శించి, కవి - కవిగా, సమాజంపట్ల తనకున్న బాధ్యతను బాగా నిర్వహించాడని చెప్పడంలో సందేహం లేదు. ఆయన తన కావ్య లక్షణాలను గురించి చెప్పుకుంటూ 'ఇందిరావిజయ' నాటకంలో ధర్మబోధ లేకుండా నేను ఏ రచనా చేయను అని చెప్పిన లక్షణాన్ని ఈ కావ్యంలో కూడా పూర్తిగా నిర్వహించి చూపించారు. అది ఆయనకు కావ్యరచనలో ఉన్న ప్రతిభా విశేషాలను, కవిగా లోకహితంకోసం పాటుపడే నిబద్ధతను చాటిచెబుతున్నాయి.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ఆంధ్రుల జానపద కళావైభవం – నేటిస్థితి

–వై. హర్షవర్ధన రెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు భాష & అనువాద అధ్యయనశాఖ, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

జానపదులు ప్రదర్శించే కళలు జానపద కళలు. జానపద కళలు అత్యంత ప్రాచీనమైనవి. ఈ జానపద కళలు ఒక దేశం, ఒక జాతి, సంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు. ఈ జానపద కళలు మానవునికి వినోదంతో పాటు విజ్ఞానాన్ని, మనోవికాసాన్ని కలిగిస్తాయి. ప్రతిజాతి తన జానపద కళలను ఎనలేని వారసత్వ సంపదగా పరిగణిస్తుంది. "Human Life without art is incomplete and barren" అని చైనీయులు ఆర్యోక్తి, తరతరాలుగా మానవ జీవితంతో ఈ జానపదకళలు విడదీయరాని సంబంధం కలిగివున్నాయి.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర సుమారు రెండు వేల సంవత్సరాల నుండి మనకు చారిత్రక ఆధారాలతో లభిస్తున్నది. నాటి నుండి నేటి వరకు ఆయా రాజులు, పాలకుల కాలంలో రకరకాలుగా ఈ జానపద కళలు పోషింపబడి, అభివృద్ధిచెందాయి. ఆంధ్రదేశంలో ఏ ప్రాంతంలో చూసినా వివిధ కులాలకు సంబంధించిన విశిష్టమైన జానపద కళారూపాలు అనేకం కనిపిస్తాయి. ఆంధ్రులు ప్రాచీన కాలం నుండి సహజసిద్ధంగా జానపద కళాపోషకులు, జానపద కళాభిమానులు. కావున నిన్న మొన్నటి వరకు ఈ జానపద కళలు ఆంధ్రదేశంలో ఎంతో వైభవోపేతంగా ప్రదర్శింపబడ్డాయి. కానీ నేటి ఆధునిక సాంకేతిక కాలంలో మారిన ప్రజల ఆలోచనా సరళి, తీరికలేని జీవన విధానం, అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక వినోదసాధనాలు మొదలైన వాటి కారణంగా, గతమెంతో ఘనకీర్తి కలిగిన ఈ జానపద కళలు రోజురోజుకి తమ ఉనికినీ, ప్రాధాన్యతనూ కోల్పోతున్నాయి. ఆంధ్రదేశంలోని కొన్ని జానపద కళల గతవైభవం, నేటి స్థితిగతులను గురించి ఈ వ్యాసంలో సంక్షిప్తంగా తెలుసుకుందాం.

**హరికథ :**

హరికథ కథాగానంలో పూర్వకాలంలో అధికభాగం ఆధ్యాత్మిక బోధనే చేసేవారు, మారుతున్న సమాజ అభిరుచులకు అనుగుణంగా హరికథాగానంలో చతురోక్తులకు, పిట్ట కథలకు స్థానం పెరుగుతూ వచ్చింది. దీని వల్లనే "హరికథలో పిట్టకథ" అనే సామెత పుట్టుకొచ్చింది. జనపదాలలో విరామ సమయాల్లో ఆంధ్రదేశపు హరిదాసులు ఈ కథలు చెప్పడం జరుగుతుంది. హరికథాగానం చేసే వారిని హరిదాసు, భాగవతార్ అని పిలుస్తారు. నిన్న మొన్నటి వరకు ఈ హరిదాసులకు సమాజంలో మంచి గౌరవం, గుర్తింపు ఉండేది. శ్రీ ఆదిభట్ల నారాయణదాసు గారు (1864-1945) హరికథను ఒక విశిష్ఠ కళారూపంగా తీర్చిదిద్ది, 'హరికథాపితామహుడు' గా కీర్తి గడించాడు. ఆంధ్రదేశంలోని అనేక మంది హరిదాసులు ఈ హరికథను వృత్తిగా ఎంచుకొని, ఈ కళకు బహుముఖ ప్రచారం కలిగించారు.

ఒకనాడు ఆంధ్ర దేశంలో జనజీవితాన్ని గొప్పగా ప్రభావితం చేసిన ఈ జానపద కళ నేడు నిరాదరణకు గురవుతూ, క్రమక్రమంగా తన వైభవాన్ని కోల్పోతున్నది. హరిదాసులకు సమాజంలో ఒకప్పుడు లభిస్తున్న గౌరవ మర్యాదలు నేడు లభించడం లేదు. నేడు ఈ హరికథనే వృత్తిగా నమ్ముకున్న అనేకమంది హరిదాసులు ఉపాధిలేక దయనీయ జీవితం గడుపుతున్నారు. కొందరు ఈ వృత్తినే వదులుకుంటున్నారు. గతంలో ఎంతో కీర్తి గడించి, నేడు ఆదరణ తగ్గుతూ వస్తున్న ఈ హరికథ కళారూపాన్ని కళాభిమానులు, కళాపోషకులు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ప్రోత్సహించవలసిన అవసరం ఉంది.

**బుర్రకథ :**

జానపద కళారూపాల్లో బహుళప్రాచుర్యం పొందిన కళ ఇది. శ్రీనాథుడు తన 'క్రీడాభిరామం' కృతిలో

యక్షగానాన్ని గురిచి పేర్కొనడాన్ని బట్టి, లభ్యమైన ఇతర ఆధారాలను బట్టి బుర్రకథ ప్రాచీన జానపద కళారూపం అని తెలుస్తున్నది. యక్షగానాల్లో ఇతివృత్తం పురాణగాథ లకు సంబంధించి ఉండేది. యక్షగానాలు, బుర్రకథ లుగా రూపాంతరం చెందిన తరువాత కరుణరస ప్రధాన మైన పాతివ్రత్య కథలూ, భారత రామాయణ గాథలకు సంబంధించిన అనేక కథలూ ఇతి వృత్తంగా చెప్పడం జరిగింది. ఆధునిక కాలంలో ఈ బుర్రకథలను రాజకీయ, సాంఘిక పరిస్థితులకు అన్వయించి ప్రచారం చేయడం జరిగింది. సమాజంలో సంభవించిన అనేకానేక అభ్యు దయ, విప్లవోద్యమాలకు ఈ బుర్రకథ ఒక ప్రధాన ఆయుధంగా ఉపయోగపడింది. షేక్‌నాజర్ బుర్రకథలను ప్రజలకు చేరువ చేయడంలో గణనీయమైన పాత్ర వహించి, 'బుర్రకథాపితామహుడు' గా కీర్తి గడించాడు. పద్మశ్రీ బిరుదు పొందారు. సినిమాలలో కూడా నాజర్ దళం - బుర్రకథలు చెప్పింది. శిర్విశెట్టి సుబ్బారావు, దంటు కృష్ణమూర్తి, జూనియర్ నాజర్, మొహమ్మద్ బాబ్జి మొదలైన అనేకమంది రచయితలూ, కళాకారులు ఈ బుర్రకథలను రచించి ప్రదర్శించడంలో ఎనలేని కీర్తి ప్రతిష్టలు గడించారు.

గతంలో మతప్రబోధానికి, దేశభక్తికీ, సమాజ చైతన్యా నికీ, సమాజంలోని దురాచారాల నిర్మూలనకు ప్రతి బింబంగా నిలబడిన ఈ బుర్రకథ కళారూపం క్రమ క్రమంగా తన వైభవాన్ని, ఉనికిని కోల్పోతున్నది. బుర్రకథ ఈనాడు కొన్ని కొన్ని వ్యాపార ప్రకటనలకు, కళాజాత మొదలైన కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారాలకు మాత్రమే ఉపయోగపడుతున్నది. గతంలో సమాజాన్ని చైతన్య పరచడంలో గణనీయమైన పాత్ర వహించిన ఈ జానపదకళ ప్రాభవాన్ని పునరుద్ధరించ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**తోలుబొమ్మలాట :**

నేడు తెలుగు ప్రాంతంలోని తోలుబొమ్మలాట కళాకారులందరూ గతంలో మహారాష్ట్ర ప్రాంతం నుండి వలస వచ్చిన వారేనని తెలుస్తున్నది. ఈ తోలుబొమ్మలాట మనదేశంలో ఇప్పటికీ నిలిచిఉన్న ప్రాచీన జానపద కళారూపంగా చెప్పవచ్చు. శ్రీశైలం శివరాత్రి మహోత్స వాలలో తోలుబొమ్మలాటలు ప్రదర్శించినట్లు పాలురెరికి సోమనాథుడు "పండితారాధ్య చరిత్ర" పర్వత ప్రకరణంలో వివరించడం జరిగింది. దీన్ని బట్టి ఆంధ్రదేశంలో కొన్ని వందల సంవత్సరాల ముందు నుంచే ఈ బొమ్మలాటలు ఆదరింపబడి, ప్రజాభిమానం పొందుతున్నాయని తెలు స్తున్నది.

తోలుబొమ్మల కళాకారులు తమ కళలను ప్రదర్శిస్తూ కీర్తి గడిస్తున్నారు, అనంతపురము జిల్లా ధర్మవరం మండలంలోని 'నిమ్మలకుంట' గ్రామ కళాకారులు, తోలుబొమ్మల తయారీలోను, ప్రదర్శనలోనూ ప్రపంచ ప్రఖ్యాతి పొందారు. ఈ గ్రామంలోని దాళవాయి రంగమ్మ, దాళవాయి కుళ్లాయప్ప మొదలైన కళాకారులు జర్మని, జపాన్, ఫ్రాన్స్, బెర్లిన్ వంటి విదేశాలలో కూడా తమ ప్రదర్శనలు ఇచ్చి, ప్రశంసలు అందుకున్నారు. ఈ గ్రామంలో తోలుబొమ్మల వృత్తిని ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ వారు ఒక కళా మందిరాన్ని నిర్మించారు. అయితే ఇటీవలి కాలంలో తోలుబొమ్మలాట కళకి ప్రోత్సాహం తగ్గిపోతున్నది. ఈ తోలుబొమ్మల కళాకారులకి తమ ప్రదర్శన ద్వారా ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు వస్తున్నప్పటికీ, వారి ఆర్థిక స్థితిమాత్రం మెరుగుపడడం లేదు. ఈ జానపద కళ అంతరించి పోకుండా ఉండాలంటే ప్రభుత్వం ఈ కళాకారులకు మెరుగైన ప్రోత్సహకాలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిం చాల్సి ఉంటుంది.

**కోలాటం :**

కోలాటం నృత్యాలు ఒకనాడు ఆంధ్రదేశమంతా విరివిగా ప్రదర్శింపబడ్డాయి. ఈ కోలాట నృత్యాలను తిరు ణాళ్ళు, ఉత్సవాలు, జాతరలు, ఉరేగింపులలో బహి రంగంగా వీధులలో ప్రదర్శిస్తారు. ఈ కోలాట నృత్యాన్ని కొందరు సభ్యులు బృందంగా ఏర్పడి, సంగీత, సాహిత్య సమ్మిళితంగా నృత్యప్రదర్శన చేస్తారు. ఈ కోలాటం గొప్ప వ్యాయామ సంబంధమైన నృత్య క్రీడ. నేటికీ ఈ

కోలాటాన్ని జాతరలు, ఉత్సవాలు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైన సందర్భాలలో ప్రదర్శిస్తున్నారు. అయితే నేడు ఈ కోలాటం నృత్య ప్రదర్శన స్థానంలో రికార్డుడ్యాన్సులు, స్టేజిషోలు మొదలైనవి రావడంతో, దీనికి ప్రజాదరణ తగ్గింది.

**ఉరుములు :**

అనంతపురము జిల్లాకు సంబంధించి ఒక ప్రత్యేకమైన జానపద కళారూపం ఉరుము నృత్యం. అదొక వీరనృత్యమనీ, ఆ నృత్యానికీ, పేరిణి నృత్యానికి చాలా పోలికలున్నాయని డా॥ చిగిచర్ల కృష్ణారెడ్డి గారు వారి 'జానపద నృత్య కళ'లో ఉదహరించారు. ఇది మాలకులం వారు ప్రదర్శించే ఒక కులపరమైన కళారూపం. విజయనగర సామ్రాజ్యంలో వీరు పాలకుల నుండి మాన్యాలు కూడా పొందినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ కులవృత్తిపై ఆధారపడ్డవారు కొన్ని పదుల సంఖ్యలో మాత్రమే ఉన్నట్లు, వారు వృత్తిపరంగా అత్యంత దయనీయస్థితిలో బ్రతుకు వెళ్ళదీస్తున్నట్లు తెలుస్తున్నది.

**బుడబుక్కలవారు :**

బుడబుక్కల వృత్తి చాలా ప్రాచీనమైనది. వారి ఆహార్యం చాలా గంభీరంగా ఉంటుంది. బుడబుక్కల వారు అర్థరాత్రి పూట గ్రామ విహారానికి తమ వేషధారణలో వెళ్తారు. ఆ సమయంలో వారు యాచించరు. వీరు ప్రతీ ఇంటి దగ్గరా ఢమరుకం వాయిస్తూ, జోస్యం చెప్పేవారు. వారు చెప్పే జోస్యం వినేవారికి చాలా ఆసక్తిగా ఉండేది. అలా వారు గ్రామ మంతా పదిరోజులు అలానే తిరిగి, ఉదయం పూట ప్రతి ఇంటికీ వెళ్ళి, ధాన్యం, డబ్బులు భిక్షంగా స్వీకరించేవారు. ఈ వృత్తివారు సంచార జీవనం సాగిస్తారు. అయితే ఈ వృత్తిలో కొనసాగే వారి సంఖ్య, వారికి లభించే ఆదరణ క్రమక్రమంగా తగ్గిపోతున్నది. పగటి వేషాలలో ఈ బుడబుక్కల వేషం వేసే వారి సంఖ్య తగ్గిపోయింది. 2017వ సంవత్సరం జనవరిలో హర్యానా రాష్ట్రంలోని రోహ్‌తక్‌లో జరిగిన జాతీయ యువజనోత్సవాలలో అనంతపురములోని యస్.యస్.బి.ఎన్. డిగ్రీ కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థుల బృందం 'బుడబుక్కల నృత్యం' ప్రదర్శించి, జాతీయ స్థాయిలో తృతీయ బహుమతిని హర్యానా ముఖ్యమంత్రి చేతులమీదుగా అందుకోవడం జరిగింది. వీరిని ఆదర్శంగా తీసుకొని ఈనాటి యువత ప్రాచీన జానపదకళలను ఆదరించవలసిన ఆవశ్యకత ఉంది.

**పగటి వేషాలు :**

పగటి వేషాలు విశిష్టమైన ప్రాచీన జానపద కళ. అన్ని వర్గాల వారికి, అన్ని ప్రాంతాల ప్రజలకు ఆదరణీయమైన కళ ఇది. అభినయ, గీత నృత్య ప్రదర్శానాత్మక అంశాలతో ఈ వేష ప్రదర్శన జరుగుతుంది. పగటి వేషాలు వేస్తూ, అదే వృత్తి ద్వారా కొందరు జీవిస్తారు. కళాకారులు ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతం సంచరిస్తూ, వేషాలాడుతూ పొట్టపోసుకుంటారు. జాతరల్లో, ఉత్సవాల్లో, పండగ సందర్భాల్లో ఆయా వేషాలు వేస్తుంటారు. పగటి వేషం అనేది కేవలం ఆహార్యం మీదే ఆధారపడి ఉంటుంది.

పగటి వేషాలలో ఆదిబైరాగివేషం, ఎరుకల సోదివేషం, అత్తరుసాయిబుల వేషం, ఫకీరు సాహేబుల వేషం, కోయవాళ్ళ వేషం, భట్రాజుల వేషం, వీరబాహువేషం, లంబాడీల వేషం, బుడబుక్కల వారి వేషం, పిట్టలదొర వేషం, కొమ్మదాసరి వేషం, హరిదాసు వేషం, జంగందేవర వేషం మొదలైనవి ఆంధ్రదేశంలో ప్రసిద్ధి చెందిన వేషాలు. గతంలో ఎందరో ఈ పగటి వేష ధారులు వంశ పారంపర్యంగా ఈ వేషాలను ప్రదర్శించి కీర్తి ప్రతిష్ఠలు పొందారు. అయితే నేడు ఈ పగటి వేష ధారులకు విలువ, ఆదరణ, ఉపాధి కరువైంది. ఇప్పుడు పగటి వేషాలు ధరించే వాళ్ళను సమాజంలో చులకనగా చూస్తున్నారు. ఈ వృత్తిలో కొనసాగే వారి సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోయింది. ప్రస్తుతం ఆంధ్రదేశంలో జాతరలు, ఉత్సవాలు మొదలైన సందర్భాలలో మాత్రమే అక్కడక్కడా ఈ పగటి వేషధారులు కనిపిస్తున్నారు.

**నాటకరంగం:**

ఆంధ్రదేశంలో నాటకరంగం ఎంతో పురోగతి సాధిం

చింది. మన ప్రాచీన కాలం నాటి యక్షగానాలు, వీధి నాటకాలు నాటకరంగానికి పునాది వంటివి. ఈ పునాదులపై విదేశి నాటకరంగ ప్రభావం కుదురుకొని కాలగతిలో మన నాటకరంగం పురోగతి చెందుతూ సమాజానికి ఒక మార్గ నిర్దేశకత్వాన్ని ఇచ్చింది. మానవు నికి వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తూ, ఆలోచనను రేకెత్తించే ఒక ఉత్తమ సాధనంగా నాటక కళ రూపుదిద్దు కుంది. 1870-80 ప్రాంతంలో మహారాష్ట్ర నుండి "ధార్వాడ నాటక సమాజం" వారు వచ్చి "జంఖండి" నాట కాల పేరుతో బళ్ళారి నుండి ప్రారంభించి, ఆంధ్రదేశ మంతటా ప్రదర్శించారు. శ్రీధర్మవరం రామకృష్ణమా చార్యులు 1885లో 'సరసవినోదినీ' నాటక సమాజాన్ని స్థాపించారు. ఇదే ఆంధ్రదేశంలో ప్రప్రథమ తెలుగునాటక సమాజం. రామకృష్ణమాచార్యులు గారు 28 తెలుగు నాటకాలను రచించి, "సరసవినోదినీ" నాటక సమాజం ద్వారా ప్రదర్శించారు. 1910లో గద్వాల మహారాజు గారు ధర్మవరం రామకృష్ణమాచుర్యులుని సాధరంగా ఆహ్వా నించి "ఆంధ్రనాటక పితామహ" అను బిరుదునిచ్చి, ఘనంగా సన్మానించారు. శ్రీబళ్ళారి రాఘవాచార్యుల వారు "తెలుగు, కన్నడ, తమిళ, హిందీ, ఆంగ్ల" భాషలలో సుమారు 60 పౌరాణిక, చారిత్రాత్మక, సాంఘిక నాటకా లను వందలసార్లు దేశవ్యాప్తంగా ప్రదర్శించి అజరామర మైన కీర్తి గడించారు.

తరువాత కాలంలో సురభి నాటక సమాజం మొదలైన అనేక నాటక సమాజాలు, వందల మంది నటులు ఆంధ్రనాటకరంగాన్ని ఎంతో పురోగతి చెందించారు. 1929లో తెనాలిలో "ఆంధ్రనాటక కళాపరిషత్"ను స్థాపించి, నాటక కళను అభివృద్ధి చేయడానికి కొత్త సంస్కరణలు ప్రవేశపెట్టడం జరిగింది. 1940వ దశకంలో ఆంధ్రదేశంలో "ప్రజానాట్యమండలి" ఏర్పడి సాహిత్య సాంస్కృతిక రంగాలను అభ్యుదయ దృక్పథం వైపు ఒక మలుపు తిప్పింది. స్వాతంత్ర్యానంతరం ఆంధ్రదేశంలో నాటకరంగం మరింత పురోగతి సాధించింది.

నేడు సమాజంపై సినిమాలు, సీరియళ్ళ ప్రభావం ఎక్కువ కావడంతో, నాటకరంగానికి ఆదరణ కరువైంది. నేటి తరానికి నాటకాలని ఆస్వాదించే రసాస్వాదన శక్తి లోపించింది. ఇప్పటికీ అక్కడక్కడా ప్రసిద్ధిచెందిన నాటక రంగ కళాకారులు ఉన్నప్పటికీ, వారికి సరైన ప్రోత్రాహం, అవకాశాలు లభించడం లేదు. నేడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతీ సంవత్సరం రాష్ట్రంలో ఏదో ఒక ప్రదేశంలో "నంది నాటకోత్సవాలు" పేరుతో నాటకరంగ పోటీలు నిర్వహించి, ప్రతిభావంతులైన కళాకారులకు 'నంది' బహుమతులను ప్రధానం చేసి, వారిని ప్రోత్స హించడం జరుగుతున్నది. సమాజంపై సినిమా, సీరి యళ్ళ ప్రభావం ఎంత ఉన్నప్పటికీ, నేటికీ విద్యా లయాలు, సంస్థలు మొదలైన వాటి వార్షికోత్సవాలలోను, ఉత్సవాలు, వేడుకలు మొదలైన సాంస్కృతిక కార్య క్రమాలలోను నాటకాలను ప్రదర్శించడం జరుగుతున్నది. ప్రభుత్వం, సంస్థలు, ఔత్సాహికులైన కళాభిమానులు నాటకరంగానికి తగిన ప్రోత్సాహం అందించి, పూర్వ వైభవం తీసుకువావలసిన అవసరం ఉంది.

## గొరవయ్య నృత్యం :

రాయలసీమలోని అతి ప్రాచీన జానపద కళారూపం గొరవయ్యల నృత్యం. అనంతపురము జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈ నృత్యరూపం కనిపిస్తుంది. గొరవయ్య నృత్యం కురుబ కులానికి చెందిన కులనృత్యం. తలపైన ఎలుగుబంటి చర్మంతో తయారు చేసిన కిరీటం, ఒక చేతిలో ఢమరుకం, మరొక చేతిలో త్రిశూలం, మెడలో తెల్లని గవ్వల హారం, నడుము చుట్టూ జింక చర్మంతో తయారుచేసిన సంచితో గొరవయ్యల ఆహార్యం విచిత్రంగా ఉంటుంది. ఒకప్పుడు కన్నడదేశ ప్రభావంతో శైవమత ప్రచారానికి ఆలవాలమైన కళారూపం, ఈనాడు భిక్షాటన కళారూపంగా మారిపోయింది. ఇది ఒక బృంద నృత్యం. నేడు ఈ గొరవయ్య నృత్యాలు కొన్ని ప్రత్యేకమైన జాతరలు, ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలలో మాత్రమే అరుదుగా కానవస్తున్నాయి. కుల సంబంధమైన ఈ జానపదనృత్యం అంతరించి పోకుండా చూడవలసిన అవసరం ఉంది.

### గంగిరెద్దులాట :

శ్రీనాథుడు తన 'పల్నాటివీర చరిత్ర' కావ్యంలో గంగిరెద్దుల వారిని గురించి ప్రస్తావించడం జరిగింది. దీన్ని బట్టి గంగిరెద్దులాట చాలా ప్రాచీనమైనదని తెలుస్తున్నది. గంగిరెద్దులాటను ఒకప్పుడు ఆంధ్రదేశమంతా విరివిగా ప్రదర్శించడం జరిగింది. ఈ గంగిరెద్దులాటను గ్రామాలలో రాత్రి భోజనానంతరం ప్రదర్శిస్తారు. ఈ వృత్తివారు కొందరు సమూహంగా ఏర్పడి, ఈ ఆటను ప్రదర్శిస్తారు. వీరు రెండు లేదా మూడు ఎద్దులు, ఆవులను పెంచి, వాటికి రాముడు, లక్ష్మణుడు, సీత అని పేర్లు పెట్టి, వాటికి తగిన శిక్షణ ఇస్తారు. వీరు తమ ప్రదర్శనలో పురాణ, ఇతిహాస సంబంధమైన కథలు చెబుతూ, మధ్యమధ్యలో హాస్యపూరితమైన పిట్టకథలు చెబుతూ, దానికి అనుగుణంగా ఈ గంగిరెద్దులతో అభినయం చేయిస్తారు. ప్రదర్శనను చూచి ముగ్ధులైన ప్రేక్షకుల నుంచి విరాళాలు సేకరిస్తారు. తరువాత మరుసటి రోజు ఉదయం ఆ గ్రామంలో ఇంటింటికీ తిరిగి ధాన్యమూ, బట్టలూ, డబ్బులు, ఎద్దులకు మేతా సేకరిస్తారు, ఇలా వీరు దేశసంచారం చేస్తూ జీవనం సాగిస్తారు. ఒకప్పుడు సంక్రాంతి పండుగ సందర్భంలో ప్రతీ గ్రామంలోను గంగిరెద్దుల ప్రదర్శన జరిగేది. నేడు గంగిరెద్దులాట సామూహిక ప్రదర్శన నశించింది. ఈ కళకు నేడు ఆదరణ లేదు. కొందరు అక్కడక్కడా పొట్టకూటి కోసం ఒక ఎద్దుకు అలంకరణ చేసి, ఊరూరా తిరుగతూ భిక్షమెత్తుకుంటున్నారు.

### ఇతర ప్రదర్శన కళలు :

పైన పేర్కొన్నవే కాకుండా ప్రాచీనకాలం నుండి విరివిగా ప్రదర్శింపబడి, ఎనలేని కీర్తి గడించిన అనేక జానపదకళలునేడు ఆదరణ, ప్రోత్సాహం లేక అంతరించి పోయే దశలో ఉన్నాయి. కొరవంజి, బయలు నాటకాలు, బుడిగెజంగాలు, దేవదాసీ నృత్యాలు, చిందు భాగవతం, చిరుతల రామాయణం, జముకుల కథలు, ఒగ్గుకథలు, వీరశైవుల వీరభద్ర విన్యాసాలు, గిరిజన నృత్యాలు (కోయ నృత్యం, గుసాడీ నృత్యం, మయూర నృత్యం, థింసా నృత్యం), దొమ్మరాటలు, తప్పెటగుళ్ళు, కొమ్ముదాసరులు, పాములాటలు, పేరిణినృత్యం, లంబాడీ నృత్యం మొదలైన అనేక జానపద కళలు గతంలో గొప్ప ప్రజాదరణ పొంది, నేడు అంతరించి పోయే దశలో ఉన్నాయి.

### ముగింపు :

భారతదేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. వ్యవసాయక జీవనశైలి నుండే ఈ జానపద కళలు పుట్టుకొచ్చాయి. నేడు వ్యవసాయం గిట్టుబాటు గాక, రైతులు గ్రామాల నుండి పట్టణాలకు వలస వెళ్ళుతుండటంతో ఈ జానపద కళలను ఆదరించి, పోషించే వారు కరువైనారు. సమాజంలో ఇతర వర్గాలకు చెందిన ప్రజలు తమ పిల్లల్ని కలెక్టర్లూ, డాక్టర్లూ, ఇంజనీర్లు కావాలని ఆశిస్తూ జానపద కళల్ని పోషిస్తున్న ఈ ఆశ్రిత కులాల వారు మాత్రం తమ పిల్లలకు, వారి వారసత్వ సంపదైన జానపద కళారూపాల వృత్తినే కొనసాగించాలని కోరుకోవడం అనేది నేటి సమాజంలోని ఒక విపరీతపు పోకడ. అయితే నేడు ఈ జానపద కళలకు సరైన ఆదరణ, ప్రోత్సాహం, ఆదాయం లేకపోవటం వలన ఈ కళాకారుల వారసులు తమ వృత్తిని వదులుకుంటున్నారు. తమ వృత్తి మీద అభిమానంతో, ఆ వృత్తికే అంకితమైన వారు మాత్రం పేదరికంలో మగ్గుతూ, భారంగా బ్రతుకీడుస్తున్నారు. ఆధునిక సాంకేతిక కాలంలో అందుబాటులోకి వచ్చిన ఇతర వినోద సాధనాలు, మారిన ప్రజల జీవనశైలి కూడా ఈ జానపద కళలు అంతరించిపోవడానికి ఒక ప్రధాన కారణం. కానీ ఆధునిక వినోద సాధనాల వల్ల సమాజానికి జరిగే మేలు కంటే కీడే ఎక్కువ. జానపద కళల ప్రాధాన్యాన్ని, ఆవశ్యకతను నేటి తరానికి తెలియజేసి, వీటికి సరియైన ప్రోత్సాహక సౌకర్యాలను కల్పించి, ఈ జానపద కళలను పునరుద్ధరించే బృహత్తర బాధ్యతను ప్రభుత్వాలు, సమాజం, కళాభిమానులు అంకిత భావంతో చేపట్టవలసిన అవసరం ఉంది. అప్పుడే ఈ జానపద కళలు పూర్వవైభవాన్ని సంతరించుకోగలవు.

# సంపాదకుడు - సంపాదకీయం

– కె. జనార్దన్, పరిశోధక విద్యార్థి, తెలుగు భాష & అనువాద అధ్యయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

## సంపాదకుడు :

పత్రికకు పూర్తి బాధ్యత వహించి దాన్ని తీర్చిదిద్దేవాడు సంపాదకుడు. 1867లో వెలువడిన ''Press and Registration of Books Act'' సంపాదకుడంటే 'పత్రికలో ప్రచురితమయ్యే సమాచారం ఎంపికను నియంత్రణ చేసే వ్యక్తి' అని నిర్వచించింది.

తన అభిరుచిననుసరించి ప్రజానురంజకత్వం ఎలా సాధ్యపడుతుందో ఆలోచించి ఎన్నుకున్న విషయాన్ని, వార్తను లేదా కళాఖండాన్ని ముద్రించేముందు క్రమ పద్ధతిలో అమరించే వాడు ఎడిటర్.

సంపాదకుడు (ఎడిటర్) అనగా పత్రికలోని వార్తల ముద్రణ, నిర్వహణలో ప్రధాన బాధ్యత వహించే వ్యక్తి. సంపాదకీయం రాయడం ఈయన ముఖ్యమైన పని. మొత్తంమీద సంపాదకుడు పత్రికలో ప్రచురించే అంశాలకు బాధ్యుడై, పత్రిక పాలసీకి కట్టుబడి, ప్రజా సమస్యల పట్ల తక్షణమే స్పందిస్తూ, ప్రజాభిప్రాయాలకు విలువనిస్తూ, వారికి సమాచారాన్ని, విజ్ఞానాన్ని అందిస్తూ, ప్రాపంచిక దృక్పథాన్ని ఏర్పరుస్తూ, వారిని స్వతంత్రంగా ఆలోచించే దిశలో రాతలురాస్తూ, వారిని చైతన్యవంతులను చేస్తూ పత్రికను తీర్చిదిద్దేవాడుగా ఉంటాడని చెప్పవచ్చు.

పత్రికాసంపాదకులు చాలా క్లిష్టమైన విధులు, బాధ్యతాయుతమైన కార్యక్రమాలు నిర్వర్తించవలసి ఉంటుంది. బూదరాజు రాధాకృష్ణ చెప్పినట్లు 'వార్తా సేకరణ, కథన రచన, కూర్పు, ముద్రణ వగైరా సమస్త విషయాలను విద్యావిషయకంగానూ, పరిపాలనా దృష్టితోనూ పర్యవేక్షించేది సంపాదకుడే. పత్రికా విధాన నిర్ణయాలకూ, రూపకల్పనకూ, చివరకి విక్రయాది వ్యవహారాలకు అతడే బాధ్యుడు.

'ABC of Mass Media' అనే పుస్తకంలో సంపాదకుడు వార్తాపత్రికలో 'కీమ్యాన్ (Key Man) అని చెప్పడం జరిగింది.

సంపాదకుడు ఒక వ్యక్తిగానే కాకుండా ఒక సమిష్టి శక్తిగా పత్రికపట్ల పూర్తి బాధ్యత వహిస్తూ దాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దగలగాలి. అతడు పాఠకులచేత తన పత్రికను చదివించుకోగలగాలి. పాఠకులను తృప్తిపరిచే సమాచారాన్ని ప్రతి విషయంలోనూ ప్రజాభిరుచిని ముందుంచాలి. అప్పుడే ఏ సంపాదకుడైనా మంచి సంపాదకుడిగా గుర్తింపు పొందగలుగుతాడు. సంపాదకుడికి తన తెలివి తేటలపట్ల విశ్వాసముండాలి. అప్పుడే తాను చెప్పదలుచుకున్న విషయాన్ని నిర్భయంగా, ఎలాంటి జంకూ లేకుండా చెప్పగలుగుతాడు.

సంపాదకుడు పత్రికకోసం నిరంతరాయంగా నిర్విరామంగా కృషి చేస్తూనే ఉంటాడు. ఎప్పుడూ పత్రికతో అవినాభావ సంబంధం కలిగి ఉంటాడు. దాదాపు సంపాదకులందరిదీ అవిశ్రాంత జీవితమనే చెప్పవచ్చు. పత్రిక పేరు గుర్తింపు ఆ పత్రికా సంపాదకుడిపైనే ఆధారపడి ఉంటుంది. పత్రికాసంస్థలో జరిగే మొత్తం పనికి, పత్రికలో ప్రచురితమయ్యే ప్రతివార్తకు సంపాదకుడే బాధ్యుడు.

సంపాదకుడికి ప్రతిరోజూ ఎన్నో సమస్యలు, ఒత్తిడులు ఎదురవుతుంటాయి. కానీ అతడు ఎప్పుడూ వాటికి లొంగకూడదు. ఎవరిపట్లా బిడియం చూపకూడదు. ఈ విషయాన్ని గూర్చి చెబుతూ నార్లవారు 'నవయుగాల బాట'లో

''ఎడిటరైనవాడు బిడియం చూపుచో
ధాటి తగ్గు వృత్తిధర్మమందు
కడుపుకూటి వ్రాత కక్కుర్తి వ్రాతరా!'' అన్నారు.

కాబట్టి "నిజాయితీతో కూడిన పదునైన రచన, భాషలో లోతైన పాండిత్యం, విషయవివేచనలో విజ్ఞత, అభివ్యక్తిలో

స్పష్టత, వాడి వేడి గలిగిన భావతీవ్రత, నిర్భయత్వం, దేశభక్తి, ప్రజాహితైక ధ్యేయం లక్షణాలుగా గలిగిన సంపాదకుడు. నిజంగా నాయకత్వ స్థానంలో నిలబడి పాఠకులకు మార్గదర్శకుడౌతాడు.

## సంపాదకీయపు పేజీ (Editorial Page) :

ఆధునిక మానవజీవితంలో ప్రముఖపాత్ర వహిస్తున్న ప్రతికల్లోని 'సంపాదకీయపు పేజీ' అన్నది పత్రికలోని ఇతర పేజీలకన్నా ప్రధానమైంది. వాకాటి పాండురంగారావు ఈ సంపాదకీయపు పేజీ గురించి చెబుతూ "దినపత్రికలోని సంపాదకీయపు పేజీ అన్నది తలలో నాలుక వంటిది. ఆనాటి లేదా ఆ వారపు వార్తలకు, సంఘటనలకు వ్యాఖ్యానం చెప్పగల వ్యాసపీఠం వంటిది సంపాదకీయపు పేజీ. ఆ పేజీలో సంపాదకుడు, పేరుపొందిన వ్యాస రచయితలు, పాఠకులు - వీరందరి అభిప్రాయాలు ఉంటాయి కనుక ఆ పేజీని 'అభిప్రాయాల పేజీ' అంటారని అభిప్రాయపడ్డారు."

## సంపాదకీయం (Editorial) :

సంపాదకీయపు పేజీలో 'సంపాదకీయమన్నది మరింత ముఖ్యమైనది. ఒక కీలకమైన అంశాన్ని తీసుకొని నిశితంగా పరిశీలించి వ్యాఖ్యానించి మంచి, చెడులను తేల్చి సమాజానికి మార్గాన్ని చూపగలిగేది సంపాదకీయం. పత్రికలో వెలువడే వార్తల ప్రధాన సారాంశం, పత్రిక ఉద్దేశం, విధానం లాంటివి సంపాదకీయంలో ప్రతిబింబిస్తాయి.

ప్రముఖ సంపాదకులు ఎ.బి.కె. ప్రసాద్ అభిప్రాయంలో 'అల్పాక్షరన్యాయంలో అనల్పార్థమైన ప్రయోజనాన్ని సాధించి పెట్టేది సంపాదకీయం. క్లుప్తంగానే కాకుండా అందంగా, సూటిగానే కాకుండా నవరస భరితంగా ఆ క్షణంలో అప్పటికప్పుడే ఆనాటి సంఘటనలపై పాఠకలోకాన్ని కదిలించే రచనే సంపాదకీయం.

సంపాదకీయం ఒక ముఖ్యమైన అంశాల్ని చర్చించాలి. చూడగానే ఇందులోని విషయమేంటో తెలుసుకోవాలనే కుతూహలం కలిగించేలా సంపాదకీయ శీర్షిక ఉండాలి. సంపాదకీయానికి చదివించే గుణముండాలి. సంపాదకీయం మంచి విషయాలను మెచ్చుకుంటూనే - ప్రోత్సహిస్తూనే; చెడు విషయాలను, సరిగాలేని విషయాలను విమర్శించాలి, తిరస్కరించాలి. అది ప్రజల కష్టనష్టాలను విశ్లేషించి చూపేదిగా, ప్రజల భావాలకు బలం చేకూర్చేదిగా ఉండాలి. సమస్యకు పరిష్కారమార్గాన్ని చూపాలి. సంపాదకీయంలో పక్షపాతం, రహస్యం ఉండకూడదు. సంపాదకీయం శాస్త్రీయంగా ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని కించపరిచే విధంగా ఉండకూడదు. సంపాదకీయం సామాన్యుడి భాషలో ఉండాలేకానీ లేనిపోని భాషా పరమైన ఆర్భాటాలతో గందరగోళం సృష్టించకూడదు. సంపాదకీయంలో భాష భావం ప్రవాహంలా సాగిపోవాలి. భావానికి మించిన భాష, భాషకు మించిన భావం ఉండాలి.

ఆచార్య కొలకలూరి ఇనాక్ "నేటి సంపాదకీయాలు యజమాని మనస్తత్వ ప్రతిబింబాలని, సంపాదకీయం ప్రతికాధిపతి అవసరంగా, సాంఘిక రాజకీయ ఆర్థిక సమస్యారచనంగా, పత్రికా జీవితప్రతిబింబంగా, సంపాదకుడి హృదయం తీసిన ఛాయాపటంగా ఉంటుందని" చెప్పారు.

"సంపాదకీయం ఉపాధ్యాయుడు పాఠం చెబుతున్నట్లుగా ఉండాలి. ప్రతిపక్షాలు ఖండిస్తున్నట్లుగా ఉండాలి. గిట్టనివారు విమర్శిస్తున్నట్లుగా ఉండాలి. బాగుపడని శిష్యునికి గురువు హితబోధ చేస్తున్నట్లుగా ఉండాలి. తప్పు చేసిన పిల్లాడిని దండించే ఉపాధ్యాయుడు నిలదీసినట్లుగా ఉండాలి. సరైన అంశాన్ని సిఫార్సు చేసినట్లుగా ఉండాలి. క్లుప్తంగా ఉండాలి" అని ఎడిటర్ అండ్ ఎడిటోరియల్స్ అనే అమెరికన్ పుస్తక రచయిత వివరించారు.

సంపాదకీయంలో సభ్యత, సంస్కారం ఉండాలి. అందులో సంపాదకుని నీతి, నిజాయితి, ప్రతిభ, విషయావగాహన, లోకానుభవం, సమయస్ఫూర్తి స్పష్టంగా వ్యక్తం కావాలి. అప్పుడే సంపాదకునిపట్ల పాఠకునికి గౌరవం కలిగే అవకాశముంటుంది. అసలు సంపాదకీయం విమర్శనాత్మకంగా ఉండవచ్చుగానీ ద్వేషపూరి

తంగా ఉండకూడదు. సంపాదకీయాలు వివరణాత్మకంగాను, విశ్లేషణాత్మకంగాను, ప్రబోధాత్మకంగాను, సమస్యాపరిష్కార రూపంగాను - ఇలా అనేకరకాలుగా ఉండవచ్చు.

నార్లవారు " దినపత్రికలోని సంపాదకీయం అప్పుడే వండి వార్చి వడ్డించిన అన్నం వంటిది. అప్పుడే వండి వార్చి వడ్డించిన అన్నం ఆవిరిలు కక్కుతూ నోరూరిస్తుంది. కానీ అదే మర్నాటికి చద్ది వాసన కొడుతుంది. అలాంటిదే సంపాదకీయం కూడాను" అంటారు. సంపాదకీయాలు రాసిన రోజు ఉన్నంత ప్రభావవంతంగా మరుసటిరోజు ఉండవు. సంపాదకీయాలు ప్రయోజనాల దృష్ట్యా శాశ్వత విలువలపై రాసిన సంపాదకీయాలు ఎన్నేళ్ళయినా ప్రభావవంతంగా ఉంటూ శాశ్వత ప్రయోజనాన్ని సాధిస్తాము.

సంపాదకీయం పత్రికకు గొంతు వంటిది. ఒక వ్యక్తి తన ఆలోచనలను, భావాలను వెల్లడించడానికి గొంతు ఎంత అవసరమో, ఒక పత్రిక తన అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి సంపాదకీయం అంత అవసరం. సంపాదకీయాలు ఆయా సంఘటనలపట్ల తన అభిప్రాయాలేంటో, తన దృష్టిలో వాటివల్ల సమాజానికి కలిగే మంచిచెడులేవో విశ్లేషించి చూపుతాయి. సమాజాన్ని జాగృతం చేస్తాయి. ప్రజలను విజ్ఞానవంతులను, ఉత్తేజవంతులను చేస్తాయి. వారి మానసిక వికాసానికి తోడ్పడుతాయి. సమస్యలను విశ్లేషించడమే కాక వాటికి పరిష్కారమార్గాలను కూడా చూపుతాయి.

తెలుగులో కొక్కండం వెంకటరత్నం పంతులు 'ఆంధ్రభాషాసంజీవని' అనే పత్రికలో తొలి సంపాదకీయం ప్రారంభమైనప్పటినుంచి కృష్ణా, ఆంధ్ర, గోలకొండ మొ॥న నాటిపత్రికలు, నేటి మాస, పక్ష, వార, దినపత్రికలు; రాజకీయ, సాంఘిక, సాహిత్య, మహజళావిద్యా, విజ్ఞాన శాస్త్ర పత్రికల్లాంటి పలు రకాల పత్రికలన్నీ తమ అభిప్రాయ ప్రకటనకోసం విధిగా సంపాదకీయాలు వెలువరిస్తున్నాయి.

ఒకప్పుడు ఎంతో ప్రభావవంతంగా ఉండి ప్రజలను బాగా ప్రభావితం చేసిన సంపాదకీయాలు ఈనాడు అంతగా ప్రభావం చూపలేదు. పైగా ఈనాటి సంపాదకీయ పాఠకుల సంఖ్యకూడా చాలా తక్కువగా ఉంది. ఈ యాంత్రిక యుగంలో అవిశ్రాంతంగా ఉంటూ తమ సమస్యలతోనే సతమతమవుతున్న మానవులకు సంపాదకీయాలు చదివి, ఆలోచించి, అందులోని మంచి చెడులను గ్రహించే ఓపిక, అవకాశం తగినంత లేకపోవడమని చెప్పవచ్చు.

"సంపాదకీయాలకు నా ముందు తరంలోగల ప్రాధాన్యం నా తరంలోనే తగ్గింది. ఇప్పుడు మరింత క్షీణించింది" - అంటూ తరుగుతున్న సంపాదకీయ ప్రాధాన్యం గురించి నార్ల వెంకటేశ్వరరావు గారు వాపోయారు.

ఈ విధంగా పలుకారణాలచేత ఈనాడు "సంపాదకుల సంపాదకీయాల ప్రాముఖ్యం తగ్గి ఉండవచ్చు. అయినప్పటికీ సంపాదకీయాలు చదివించేవిగా ఉంటే, భావములో నిజాయితీ, వాదనలో బలం, భాషలో పాఠవం ఉంటే పాఠకులు చదువుతారని, కొందరినైనా ప్రభావితం చేస్తాయని నా విశ్వాసం" - అంటూ పొత్తూరి వెంకటేశ్వరరావు ఎలాంటి సంపాదకీయాలు పాఠకులను ప్రభావితం చేస్తాయో చెప్పారు. కాబట్టి పై లక్షణాలుగల సంపాదకీయాలు ఎప్పుడైనా, ఎక్కడైనా పాఠకులను ప్రభావితం చేయగల్గుతాయన్నది వాస్తవం.

**ఆధారగ్రంథాలు :**

1. తెలుగు జర్నలిజం - రవిందర్. దుర్గం
2. జర్నలిజం చరిత్ర - ఆనందభాస్కర్ రాపోలు
3. జర్నలిజం అవగాహన ఆచరణ - రాధాకృష్ణ బూదరాజు
4. తెలుగు వ్యాసపరిణామం - ఇనాక్ కొలకలూరి
5. తెలుగు పత్రికల్లో కొత్త ప్రయోగాలు - పరిణామాలు - పాండురంగారావు వాకాటి
6. మూడు దశాబ్దాలు- వెంకటేశ్వరరావు నార్ల
7. తెలుగుపత్రికల సాహిత్యసేవ-రామచంద్ర తిరుమల

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# అన్నమయ్య, పురందరదాసు సంకీర్తనల్లో నైతిక విలువలు (నీతి)

– పి.ఆర్. ప్రకాష్‌బాబు, పరిశోధక విద్యార్థి, ద్రావిడ తులనాత్మక సాహిత్యం & తత్త్వశాస్త్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

అన్నమయ్య పురందరదాసులు తమ సంకీర్తన్నింటా భక్తి ప్రపత్తుల్ని, ఆధ్యాత్మికతతో ప్రధానంగా ప్రతి పాదించినా, సందర్భోచితంగా నీత్యోపదేశం చేయడంలో ఎంతో ప్రాముఖ్యం వహించినట్లు విదితమవుతుంది. వీరి పదరచనలలో, భాషలో, భావంలో ప్రముఖంగా వీళ్ళిద్దరూ ప్రజాకవులే. కనుకనే ప్రజాశ్రేయస్సు నుద్దేశించి నీతి ప్రతి పాది సంకీర్తనలతో ఆడిపాడినట్లు తెలుస్తున్నది. వీరి సంకీర్తనలు చదువుతున్నప్పుడు లోకన్యాయాన్ని గుర్తించి అందులోని సహజత్వాన్ని గమనించినప్పుడు ఇద్దరి సాహిత్యాల గొప్పతనం స్పష్టంగా తెలుస్తుంది. ఇద్దరి సంకీర్తనలోనూ నైతిక విలువలు మనోజ్ఞమై సందేశాత్మకమై ఉంటూన్నాయి. ఈ భక్తకవులిద్దరికీ కులం, మతం, వర్ణం, వర్గం, జాతి, భేదాలతో ప్రమేయం లేకుండా భక్తి, నీతి, ధర్మం మొదలైనవీ వీరికి ముఖ్యమైనవిగా చెప్పవచ్చును.

## అన్నమయ్య :

మానవులు చెడు త్రోవలో నడవటం చిత్తం పాప కృత్యాలవైపు పరుగులు తీయటం మానవుల స్వభావం. చెడునడత దుస్థితి తొలగటానికి భగవంతుని దయతప్ప వేరే మార్గం లేదు. అందుకై మనిషి ఎలా భగవంతున్ని ప్రార్థిస్తున్నాడో తెలియజేస్తు నీత్యోపదేశం చేస్తున్నాడు అన్నమయ్య.

"భారమైన వేఁపమాను పాలువొసి పెంచినాను
తీరని చేఁదేకాక తియ్యనుండీనా
పాయఁదీసి కుక్క తోఁక బద్దలు వెట్టి బిగిసి
చాయ కెంత గట్టినాను చక్క నుండీనా
కాయపు వికార మిది కలకాలముఁజెప్పినా
పోయిన పోకలేకాక బుద్ధి వినీనా"

(అ.అధ్యా.సం.1 సం.కీ 287, పుట.192)

పెద్ద వేపచెట్టుకు తియ్యని పాలు పోసి పెంచినా దాంట్లో తరగని చేదే వుంటుంది కాని తియ్యగా ఉండదు కదా! కుక్కతోక వంకరగా ఉండటం సహజం. దాని వంకరను తొలగించాలని వెదురుదెబ్బలతో బిగించి క్రిందికి కట్టినా అది చక్కగా రాదు. అలాగే ఈ శరీరానికి పెడత్రోవలో నడిచే స్వభావం ఉంది. దీనికెంతకాలం ఎన్ని విధాల బోధించినా అది దాని దారిలో పోతుంది. కానీ మనం చెప్పిన బుద్ధిమాట వినుదుకదా! గొడ్డలికి కఠినత్వం సహజం నీట్లో లోతైన చోట నానబెట్టిన అది మెత్తబడదు కదా! అట్లే ఈ మనస్సు పంచమహాపాతకాలకు అలవాటైంది. ఎంత నొక్కి చెప్పినా మనమాట విని అది మంచి దారికి రావటం లేదు. తేలును ప్రేమతో తెచ్చుకొని ఒళ్ళో పెట్టుకొంటే అది మాటిమాటికి కుడుతుందే కాని ఊరకుండదు కదా! కనుక మహిమ గల శ్రీవేంకటేశ్వరుని దయకై ఆశించడమే మేలని నీత్యోపదేశం చేస్తున్నాడు అన్నమయ్య.

## పురందరదాసు :

ఈ విషయాన్ని పురందరదాసులు బయటి ప్రయత్నాలచే జీర్ణించుకుపోయిన, ఆంతరిక స్వభావాలను వెకిలించలేమని, అది సాధ్యం కాదని, వేప చేదైనదే బెల్లం వేసిన తీపి కాదు అది చేదే. పాలు సాత్త్వికమైన ఆహారం, పాలు తాగిన పాము సాత్త్వికం కాదు కదాని తెలియ జేస్తున్నాడు.

"బేవు బెల్లదొళిడ లేను ఫల
హవిగె హాలెరెదేను ఫల
కుటిలవ బిడిహ మనుజరు మంత్రవ
పటనెయ మాడిదరేను ఫల
సటెయన్నాడువ మనుజరు సంతత
నట నెయ మాడిదరేను ఫల" ॥ బేవు ॥

(పురందరదాసుపదాలు పు.224)

సరియైన మార్గంతో చిత్తశుద్ధి చేసుకోలేనప్పుడు ఆడంబరంతో తాము యోగులమని జనులకు చూపించడానికి

పోతే అలాంటి వారికి ఏ ఫలం లేదు చిత్తశుద్ధి లేని ఆచారము ఎందుకని మనశుద్ధి లేని వాడు ఏ మంత్రం చదివి ఫలమేమి. చిత్తశుద్ధిలేని మనిషి జ్ఞాని కాడు అంటూన్నాడు.

వేపకాయలు తెచ్చి బెల్లంలో నానబెట్టినా దాని చేదు విడవదు అలాగే పాముకు పాలతో తలంటి పోసిన విషం పోదు. కుటిలతనం విడవకుండా ఏ మంత్రం పఠించి లేమి ఫలం. అబద్ధాలు చెబుతూ ధర్మనిష్టతో ఉన్నానని నటిస్తే అయ్యేదేమి. వంచనతో ప్రజలను హింసించి జపం చేసి లాభమేమి? కోపం విడువక ఉపవాస నియమాలు చేసి ప్రయోజనం ఏముంది?

తల్లిదండ్రులను పీడించి తీర్థయాత్రలు చేసి ఏమి ఫలం. పరులను హింసిస్తూ భగవద్గీతను ఎల్లప్పుడు పఠిస్తే పుణ్యం వస్తుందా. భర్తను సేవించక దూషిస్తూ వ్రతాలని ఉపవాసం చేస్తే దానితో ఫలమేమి. అతిథి అభాగ్యులకు భోజన సమయంలో ఆదరించక పంక్తి భేదం చేస్తే సద్గతి ఉంటుందా. నీచమైన గుణాలను వదలక గంగాస్నానము చేసిన ఫలమేమి. శ్రీ పురందర విఠలున్ని స్మరించక మౌనవ్రతం చేసిన పురుషార్థం లేదు. వైరాగ్యభావం వీడాలంటే విషయాలోచనలు మానాలని నీత్యోపదేశం చేస్తున్నారు పురందరదాసులవారు.

## సామ్యం :

ఇలా అన్నమయ్య పురందరదాసు లిద్దరు మనుష్యులకు పుట్టుకతో వచ్చిన స్వభావాలు మారవని, వాటిని మార్చేవాడు కేవలం ఆ పరమాత్ముడని చెప్పడంలో సామ్యం వ్యక్తమౌవుతుంది.

## భేదం :

అన్నమయ్య వేపమానుకు పాలు పోసిన వేపచేదు పోదని చెబితే, పురందరదాసు వేపగింజను బెల్లంలో నానబెట్టినా చేదు పోదు తీపిరాదు అని చెప్పడంలో భేదం వ్యక్తమవుతుంది.

## అన్నమయ్య :

నరుడెంత చదివినా, ఎంతవిన్నా, పాప పంకిలంలో పడిపోకుండా సచ్చీల సంపన్నుడైతే ఉన్నతుడవుతాడంటాడు అన్నమయ్య.

"ఎంత చదివిననేమి వినిన తన
చింత యేలమాను సిరులేల కలుగు"

(అ.అధ్యా.సం. 1-62)

నీత్యుపదేశానికి పరాకాష్టయే పై సంకీర్తన.

కులమత జాతి భేదాలను గురించి వివరిస్తూ జాతి భేదాలు కేవలం శరీరానికి సంబంధించినవి. శరీరంతో అవి అంతమౌతాయని ఆత్మకు ఏ దోషం అంటదని ప్రజలంతా కొలిచే దైవం ఒక్కడే. కులమతాలు అడ్డు గోడలుగా ఉండరాదనే నగ్న సత్యాన్ని తెలుపుతూ నీత్యోపదేశం చేస్తూన్నాడు అన్నమయ్య.

"ఏకులజుఁడేమి యెవ్వఁడైన నేమి
ఆకడ నాఁతడే హరి నెఱిఁగిన వాఁడు' ॥ పల్లవి ॥

(అ.అధ్యా.సం.1 సం.కీ.292)

కులం ప్రధానం కాదని గుణం ప్రధానమని తెలుపుతూ జాతి భేదాలు శరీరానికేనని పరిశుద్ధమైన ఆత్మకు ఏ దోషము అంటదని తెలుపుతున్నాడు అన్నమయ్య.

ఈ భూమిపై జాతికి విలువ నిచ్చినా, శ్రీహరి దృష్టిలో మానవులంతా సమానమే. ధర్మతత్పరత బుద్ధి జ్ఞానం కలిగి విష్ణునామాన్ని స్మరించి జాతిభేదాలకు స్వస్తివాచకం చెప్పవచ్చు. అలాగే నీత్యోపదేశం చేశాడు.

"ఎక్కువ కులజుడైన హీన కులజుడైన
నిక్క మెరిగిన మహానిత్యుఁడే ఘనుఁడు" ॥ పల్లవి ॥

(అ.అధ్యా.సం.సంపు. 1-318)

కులం ప్రధానంగాదు గుణమే ముఖ్యమని వేమన లాగానే మిక్కిలి చక్కగా వివరించారు. పై సంకీర్తనలో శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యదలోని మాలదాసరి కథ గుర్తుకు తెప్పించడమే కాకుండా ప్రజలకు నీత్యోపదేశం చేశాడు అన్నమయ్య.

"తందనాన ఆహి తందనాన పురె
తందనాన భలా తందనాన" ॥ పల్లవి ॥

(అ.అధ్యాసం. 2-385)

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


ఏకమే వాద్వితీయం బ్రహ్మ' అనే శ్రుతిని అనుసరించి ఉన్నది ఒకే పరబ్రహ్మ అనేదాన్ని మన నిత్యానుభవంతో పోల్చి నిరూపించారు అన్నమయ్య. భిన్నభిన్న స్వరూప స్వభావాలతో సదా పరిణామం చెందుతున్న ఈ విశ్వంలో ఎటువంటి మార్పులేకుండా శాశ్వతంగా ఉండేది బ్రహ్మ మొక్కటే. అంతా బ్రహ్మమైన ఈ సృష్టిలో తెగలు తెగలుగా విడదీసి చూపుట అనువైన హెచ్చుతక్కువ లెవ్విలేవు. అందరికీ అంతరాత్మ శ్రీహరియే. అందువల్ల జగత్తులో ప్రాణివర్గమంతా ఒకటెగానీ భేదం ఏమీ లేదు. జంతు జాలలన్నింటిలోనూ శ్రీహరి యొక్కడే అంతరాత్మగా వున్నాడు. ఒకరాజు హంసతూలికాతల్పంపై నిద్రిస్తాడు. ఆ పక్కనే భటుడు కటిక నేలపై నిద్రిస్తాడు. శయనంలో భేదము ఉంటే ఉండవచ్చుగానీ వాళ్ళిద్దరూ నిద్రలో మాత్రం ఎటువంటి వ్యత్యాసం లేదంటాడు. వేదశాస్త్ర పారంగతుడైన విప్రుడొకడు, చెప్పులు కుట్టుకుని జీవించే చండాలుడు ఒకడు. విద్యావృత్తులలో వాళ్ళిద్దరూ వ్యత్యాసాలున్నా నిలబడెందుకు ఆధారమైన నేలమాత్రం ఒక్కటే. బ్రహ్మండ పర్యంతమూ సర్వమూ బ్రహ్మమని వివరించాడు అన్నమయ్య. తద్వారా సర్వసమానత్వాన్ని స్పష్టం చేస్తున్నాడు. భగవంతుని సృష్టిలో హెచ్చుతక్కువలు లేవు. ఉంటే అవి మనం కల్పించుకొన్నవి మాత్రమేనని నీత్యోపదేశం చేస్తున్నాడు.

## పురందరదాసు :

పురందరదాసులవారు కులతత్వాన్ని తెలియజేస్తూ కులమత జాతులనేవి ముఖ్యంకాదంటూన్నాడు. భక్తి భావం, జ్ఞానం ఇవే ముఖ్యమైనవని అంటూన్నాడు. ఏ కులమైనా కానీ భక్తి జ్ఞానాలున్న వాళ్ళే గొప్పవాళ్ళు. భక్తి జ్ఞానాలకు కులంతో నిమిత్తం లేదు. విషయలోలత్వం లేకుండ గురుభక్తి కలిగి చెడ్డపనులను చేయకుండ ఉండటం ముఖ్యమంటూన్నాడు పురందరదాసులవారు.

"ఆవకులవాదరేను ఆవనాదరేను ఆత్మ
భావ వరితమేలె
హసికబ్బుడొకిరులు
అదర రసడొంకేనో
విషయా సెగళ బిట్టు
హసనాద గురుభక్తి మాడో"

(పురం. పుదాల. పుట:292)

చెరకుగడ వంకరగా ఉన్నంత మాత్రాన రసం తియ్యగా ఉండదా? ఆవుల్లో రకరకాల వర్ణనలున్నా పాలు తెలుపేకదా. జ్ఞానులకు కులమనేది లేదు. వరద పురందర విఠలుని పాదాలు చేరి ముక్తిని పొందు అని నీత్యోపదేశం చేస్తున్నారు పురందరదాసులు.

పై ఇద్దరి సంకీర్తనలను గమనిస్తే శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్తమాల్యద'లోని మాలదాసరి కథ గుర్తుకు రావడాన్ని గురించి ఈ సందర్భంగా చెప్పవచ్చును.

## సామ్యం :

ఇలా అన్నమయ్య పురందరదాసుల లిద్దరూ కులం కంటె గుణం ప్రధానమంటూన్నారు. శ్రీమన్నా రాయుణుని దృష్టిలో కులమత భేదాలు లేవని అందరూ సమానమేనని కులం కంటే గుణం మిన్న అని అంటు న్నందువల్ల సామ్యం వ్యక్తమౌతుంది.

## భేదం :

అన్నమయ్య మానవ ప్రకృతినైజాన్ని గురించి వివరిస్తే, పురందరదాసు ప్రకృతిలో లభించే చెఱకు గడను, ఆవుల్లో వుండే వర్ణాలు వేరైనా పాలు తెలుపేనని తెలపడంలో భేదం కన్పిస్తున్నది.

నీతిమార్గాలు, నీతి నియమాలు ముక్తి సాధనకు ఉపకరించే అంశాలే అయితే నీతి నియమాలు పాటించ బడే సందర్భాలు, విధానాలు వేరుగా ఉన్నప్పటికీ వీటి యొక్క పరమోద్దేశం మాత్రం ఒకటే అదే ముక్తి సాధన. అన్నమయ్య పురందరదాసులిద్దరూ హరిభక్తులే వీరి సంకీర్తనలన్నీ నీత్యోపదేశాలే అవుతాయి. పైకి భిన్నమని తోచినప్పటికీ వీటి అంతరార్థం ముక్తి పథ ప్రయాణమే అని చెప్పవచ్చు.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# అట్టడుగున పడి కనిపించని కథలు 'ఇప్పపూలు'

**- బానోతు వీరన్న,** తెలుగు లెక్చరర్, ఎస్.ఆర్. & బి.జి.యన్. ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, ఖమ్మం.

గిరిజన సాహిత్యం పై వచ్చిన కథల సంకలనం ఇప్ప పూలు. ఇందులో మొత్తం ఇరవై తొమ్మిది కథలు ఉన్నాయి. దాదాపు ఒక శతాబ్దపు గిరిజన జీవితాన్ని చిత్రించినట్లు కనిపిస్తాయి. వీటిని ప్రొ. జయధీర్ తిరుమలరావు, జీవన్ సంపాదకత్వంతో వెలువరించారు. ఇందులో కోయ, గోండు, బంజార, సవర, పరధాను, చెంచు, కోదు, మేరియా వంటి సంచార తెగల గురించి కథలు ఉన్నాయి. వీటిలో కొన్ని తెగలు అట్టడుగున పడి జీవనం కొనసాగిస్తున్నాయి. వీటన్నింటి గురించి కథలు వెలువడలేదు. గిరిజన సాహిత్యం తొలి దశలో ఉండడం వల్ల సాధ్యం కాలేదని చెప్పాలి.

ఇప్పపూలు కథల సంకలనంలో ఉన్న ఒక్కొక్క కథ ఒక్కొక్క సంచార జీవితాన్ని పరిచయం చేశాయి. నిజానికి జీవితంలో ఇన్ని రకాల కష్టాలు, బాధలు, వేధింపులు, అరాచాకాలు, వెట్టిచాకిరిలు, దౌర్జన్యాలు, దోపిడీలు, పోరాటాలు, తెగింపులు ఉంటాయా? అనే సందిగ్ధతను చదివే పాఠకుడికి ఎదురు ప్రశ్నిస్తాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు. అటువంటి రకమైన జీవితమే కొన్ని సార్లు పోరాట పటిమను నేర్పించి, అందులో నుండి చైతన్యాన్ని నింపిన సందర్భాలు కూడా కనిపిస్తాయి ఈ కథల్లో.

## ఇప్పపూల కథలు - విశ్లేషణ :

సామాజికంగా ఒక తెగ లేదా గుంపు సమూహం అనాగరికత నుండి నాగరిక జీవితానికి బయట రావటానికి ఎంతో కష్టపడాల్సి ఉంటుందో గిరిజన సమాజాన్ని అధ్యయనం చేస్తే తెలుస్తోంది. ప్రపంచం మీద ఇప్పటికే ఎన్నో సిద్ధాంతాలు వచ్చాయి. వాటి యొక్క సారమేమంట తమ దేశం ముందుకు ఎలా పోవాలో లేదా వేరే దేశాన్ని ఎలా లోబరుచుకోవాలో. ఈ విధానపు సిద్ధాంతాన్ని నాగరిక సమాజం గిరిజన సమాజం పై చూపించాయి. అందుకే 'చెంచి' కథలో రచయిత ఈ సారాన్ని ఇమిడించాడు.

ఈ కథ రచయిత గూడూరు రాజేంద్రరావు. 1932 సంవత్సరంలో ఈ కథ వెలువడింది. ఈ కథలో చెంచి, చెంచిగాడు ప్రధాన పాత్రలు. వీరిందరూ భార్యభర్తలు. రోజు వారి కూలీతో జీవనం సాగిస్తుంటారు. చెంచుగాడు పెండ్లి చేసుకునే సమయంలో 'కాబూలూడు' అనే వడ్డీ వ్యాపారి దగ్గర ఖర్చుల కోసం డబ్బులను వడీక్షి తీసుకుంటాడు. పెండ్లి తర్వాత భార్యభర్తలు కూలీ చేసి తీర్చవచ్చని అనుకుంటాడు. కానీ కూలీ దొరకలేదు. అప్పుతీర లేదు. కాబూలూడు మాత్రం అప్పును ఆసరాగా చేసుకొని చెంచిని లొంగదీసుకోవాలనుకుంటాడు. చెంచి అందమైన చెంచు గిరిజన స్త్రీ. చాలా చురుకుగా ఉంటుంది. ఎదుటి వ్యక్తి యొక్క స్వభావాన్ని అట్టే పట్టేసుకుంటుంది. అదే చెంచి ప్రాణానికి ముప్పు అని గ్రహించలేకపోయింది. చెంచి, చెంచిగాడు చిలుకాగోరింకలా ఉండడం కాబూలూడు సాహించలేకపోయాడు. అందుకే నిత్యం చెంచిని కనిపెడుతూ సమయం కోసం ఎదురు చూశాడు. ఆ రోజు రానే వచ్చింది. వడ్డీ డబ్బులు కట్టమని చెంచుగాడ్ని అడుగుతాడు. ఆ సమయంలో డబ్బులు లేకపోవడంతో కాబూలూడు ఇంట్లో పని చేయడానికి ఒప్పుకుంటాడు. చెంచుగాడు ఆ మరుసటి రోజు పనికి వెళ్ళిన సమయం చూసిన కాబూలూడు, ఆ మరుసటి క్షణమే చెంచుగాడి ఇంట్లో జొరబడ్డాడు. అప్పటికే కరణం పంతులు ఇంట్లో పని చేసి వచ్చినా చెంచి, కాబూలూడుని తమ గుడిసెలో చూసేసరికి పై ప్రాణం పైకి పోతుంది. వెంటనే చెంచి తన భర్త చెంచుగాడు అక్కడ లేడని తెలిసినా, పిలుస్తుంది. మెల్లగా అక్కడి నుండి ఏదో ఒక రకంగా తప్పించుకొని కరణం పంతులు ఇంటికి వెళ్ళిపోతుంది.

అలా కొన్ని రోజులు గడిసిన తర్వాత చెంచుగాడికి కడ్లు సరిగా కనిపించవు. పైగా కాబూలూడు ఇంట్లో వెట్టిచాకిరి చేసి చేసి శరీరంలో ఉన్న సత్తువ అంతా అయిపోతుంది. దాంతో పని చేయడానికి బయపడి

పోయాడు. అలా కావడానికి కొన్ని ప్రణాళికలు వేశాడు కాబూలూడు. చెంచుగాడు అలా అయిపోతే తమ ఇంట్లో చెంచి పనికి వస్తుందని భావించాడు. తద్వారా తను చెంచిని సాధించుకోవచ్చని అనుకుంటాడు కాబూలూడు. కానీ అలా జరగదు. చెంచి వడ్డీ డబ్బులు కట్టడం కోసం కన్న వారి ఇంటికి వెళ్ళి తీస్తానని అంటుంది. దానికి చెంచుగాడు మొదట ఒప్పుకున్న చివరికి వద్దని అంటాడు. ఒక రోజు రాత్రి తినడానికి ఇంట్లో ఏమీ ఉండదు. ఆ సమయంలో చెంచు జోల కట్టి ఊరు తిరిగి అడుక్కొవడం కోసం వెళ్ళి అనుకోకుండా కాబూలూడు ఇంటికి వెళ్ళు తుంది. అది కాబూలూడు ఇల్లు అని తెలియదు. చెంచిని చూసిన కాబూలూడు చెంచిని ఇంట్లో లాక్కెళ్తాడు. చెంచి ఏమి అనదు. ఒక దిక్కు ఆకలి, ఇంకో దిక్కు తన భర్త పరిస్థితి, మరొ దిక్కు సమాజం వెక్కిరింపు అన్ని కలగలిపి కాబూలూడు చేతిలో ఒదిగిపోయాలా చేసింది. కాబూలూడు మాత్రం తన కోరిక తీర్చుకుంటాడు. చెంచి మాత్రం ఊరి చెరువులో శవమై తెలుతుంది.

చెంచి చేసిన పాపం ఏమిటో తెలియదు. కానీ తన భర్తను ఒంటరి వాడ్ని చేసి వెళ్ళిపోయింది. చెంచి ఒక్కతే చనిపోయిందా! లేక ఎలాంటి దిక్కులేని స్త్రీలు రోజుకు వేలా మంది చనిపోతున్నారా! అనే భావన కల్గుతుంది. ఒక రకంగా గిరిజన స్త్రీలు గిరిజనేతరులకు, ధనవంతులకు ఎలా ఉచిత సరుకుగా మారిపోయింది అనే విషయాన్ని ఈ కథ ద్వారా రచయిత తెలియజేశాడు. గిరిజనులకు జరుగుతున్న మోసంలో ఇదోకోణం.

గిరిజనులు అనగానే ఇప్పపూలు, సారా, వేట, అడవి వస్తువులు మొదలైనవి పాఠకుడి మనసులో మొదలుతాయి. కానీ ప్రస్తుతం అవేమి గిరిజన గూడెంలో కనిపించటం లేదు. మనిషికి ఆశ ఉండడం సహజమే. అది ఏ రూపంలో ఉండవచ్చు. అడవుల్లో నివసించే గిరిజనులకు అడవి వస్తువుల పై ఆశ పుట్టితే అది తమ జీవితాన్నే ప్రశ్నించేస్థాయికి పోతుందని భూషణం రాసిన 'పులుసు' కథ తెలియజేసింది. చింతపండు పులుసు చేసుకొని తినాలనే కోరిక ఒక గిరిజన ముసలావిడకు కల్గుతుంది. దాంతో వెంటనే అంగడికి వెళ్ళి చింత పండును కొనుకోస్తుంటే, వాటిని అడవి నుండి దొంగతనం చేసి అమ్ముతున్నారని చిత్రహింసలు పెడతారు. సంగడి వెంటనే తేరుకొని తిరగబడడంతో అధికారులు పారి పోతారు. దాంతో కథ ముగుస్తుంది. అంగడి వస్తువులను డబ్బుపెట్టి కొనుకోవడం కూడా అధికారుల దృష్టిలో తప్పేనా? అందుకే సంగడు కథ చివర్లో తనకు తెలియ కుండానే విప్లవం వర్ధిల్లాలి అంటూ తన గూడెం ప్రజల్లో చైతన్యం తెప్పిస్తాడు.

అనాదిగా గిరిజనులు గిరిజనేతరుల చేతులలో దోపిడీకి గురయ్యారు. దీనిలో ఒక పార్శ్వం ఇది. గిరిజన ప్రాంతాలలోనికి చొచ్చుకువచ్చిన గిరిజనేతరులు వారి విద్యాధిక్యత, ధనబలంచేత అమాయకులైన గిరిజనులను మోసగించి, గిరిజనులకున్న ఒకే ఒక్క జీవనాధారమైన భూమిని గిరిజనేతరులు స్వంతం చేసుకోసాగారు. ఇటీవల సమాజంలో ప్రపంచీకరణ నేపథ్యంలో బినామీ పేర్లతో భూములను అన్యాక్రాంతం చేయడమనే నూతన విధానం వచ్చింది. అటువంటి నూతనమైన సరళి గిరిజనుల జీవితాలతో ఏ విధంగా ఆటాడుకుంటుందో, అది గిరిజనుల పాలిట ఏ విధంగా యమపాశంగా మారు తోందో 'కొండఫలం' కథ వివరించింది.

"గంగరాజు గిరిజనుడు కాదు. సీతాలుని ఉంచుకున్నాడు. సీతాలు గిరిజన స్త్రీ కాబట్టి ఆమె పేరుతో పట్టా సంపాదించాడు. గిరిజనుల పేరుతో గిరిజనేతరులు భూములు సంపాదించి, ఆక్రమించుకుని, సాగు చేసుకునే బినామీ పద్ధతన్నమాట." (పుట:153) అని బినామీ విధానాన్ని రచయిత్రి చెప్పూనే, ఆ క్రమంలో గిరిజన స్త్రీలను వివాహం చేసుకొని కొన్నాళ్ళ తరువాత వదలిపెట్టి అనేక బాధలకు గురి చేస్తున్నారనే అంశాన్ని అంతర్నిగూడంగా చిత్రించారు. ఏమైనప్పటికీ పెట్టుబడిదారీ అభివృద్ధి విధానం తీవ్రమైన కొద్దీ, గిరిజన భూములు అన్యాక్రాంతం అంతకంతకూ ఎక్కువయింది. చట్టాలు నిరార్థకమై పోయాయి. చట్టాన్ని తమకనుకూలంగా మార్చుకోవడం ద్వారానూ ఇతర మోసపూరితమైన పద్ధతులతోనూ

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



గిరిజనుల భూమి పెద్ద ఎత్తున గిరిజనేతరుల చేతుల్లోకి మారిపోతుందని ఈ కథ ద్వారా తెలుస్తుంది.

నాగరిక సమాజాన్ని ముక్కలు ముక్కలుగా చేసి చివరకు మన పక్కనున్న వాళ్ళు మనకళ్ళు ముందే మరణించినా పట్టించుకోనంతగా మన బూర్జువా సంస్కృతి నియమాలు ఉంటాయి. గిరిజనులు ప్రకృతిపైన విచిత్రమైన భ్రమలను ఏర్పరచుకుంటారు. ప్రతి వస్తువు లోనూ ప్రాణం ఉందని భావిస్తూ, గాలి, చెట్లు, వాగులు, వంకలు, నదులు, సముద్రాలు, భూమి మొదలైన వాటితో మంచిగా ఉండటం అవసరమనుకుంటారు. గిరిజనుల జీవిత విధానమంతా అనేక విశ్వాసాలతో నిండి పోయి ఉంటుంది. జంగుబాయి కథలో గోపి భాగ్యలక్ష్మీ గోండుల జీవితాల్లో ఉండే ఆచారాలను వెలికితీశారు. ప్రతి సమాజంలో ఆచారాలు ఉంటాయి. వాటి పై వ్యవస్థ ప్రభావం అధికంగా ఉంటుందని భావించాలి. వ్యవస్థ ఆచారాలను ప్రోత్సాహించకపోతే వాటికి ఈ దేశంలో స్థానం లేదు. నేటికి అవి ప్రజల్లో ఇంకా ప్రబలంగా ఉం డటానికి కారణం అదే. ఆచారా సంప్రదాయాల వల్ల గిరి జనులు ఎలా అజ్ఞానంలో నెట్టబడుతున్నారో జంగుబాయి కథ వివరించింది.

గిరిజనుల జీవన ప్రవంతిలో, దినచర్యలో ఇప్పపూలు ప్రాధానమైనది. ఇప్పపూలు అనగానే గుర్తుకు వచ్చేది గిరిజనులే. పొద్దుపొడవక ముందే అడవి జంతువులతో, క్రూరమృగాలతో పోరాడి ఇప్పపూలనే తెచ్చుకుంటారు. కొన్ని సందర్భాల్లో క్రూరమృగాల దాడిలో ప్రాణాలు కోల్పో తుంటారు. తినడానికి ఏమీ లేనప్పుడు ఇప్పపూలనే ఎండ బెట్టుకొని తిట్టారు.వ్యాపారం పరంగా దీని ద్వారా సారాయి తయారవుతుంది. సారాయి వల్ల గిరిజనుల జీవి తాలు బలైపోతున్నాయి. అయినా ఆ విధానాన్ని విడు వడం లేదు. ఎందుకంటే కొన్ని గిరిజన కులాలకు ఇప్ప సారాయే ప్రధాన జీవనాధారం. అటు డబ్బు పరంగా, ఇటు తమ అవసరాలను తీర్చేవిధంగా ఉపయోగపడు తుందనుకుంటున్నారు. అలా తయారు చేసుకోవడానికి, కనీసం తినడానికైనా దాన్ని ఇంటికి చేర్చడానికి ఎదురయ్యే సమస్యలను బోయి జంగయ్య 'ఇప్పపూలు' కథ ద్వారా వివరించారు.

ఆధునిక కాలంలో ప్రభుత్వం గిరిజనుల పట్ల కొంత మేరకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఆదివాసులకే కొన్ని ప్రత్యేక పథకాలను ముందుకు తెచ్చింది. వాటిలో 'ఇందిరమ్మ పథకం' కామధేనువు పథకం' లాంటివి కొన్ని ఉన్నాయి. వీటిని గిరిజనులు పూర్తిస్థాయిలో ఉప యోగించుకోవాలంటే మొదట వాటి పై ఒక అవగాహన కావాలి. ఎందుకంటే వాటి ద్వారా ఎలాంటి ప్రయోజనం ఉంది! అందులో లోటుపాట్లేమిటి? అనేవి అర్థమవ్వాలి. కానీ ప్రస్తుత తరుణంలో అలాంటివేమీ జరగడం లేదు. అప్పల్నాయుడు రాసిన 'అరణ్యపర్వం' కథలో అధికారులు కామధేనువు పథకం పాలిచ్చే గేదెలను పొందవచ్చని చెప్పి, బ్యాంకులో ఒక్కొక్క గిరిజను కుటుంబం పై కొంత అప్పు చేయించి డబ్బులను తీసుకుంటారు. కానీ, వారు చెప్పిన గేదెలు రావు, చివరికి బ్యాంకులో చెసిన అప్పు ద్వారా కోర్టుకు వెళ్ళడం జరుగుతుంది.

కొండవీటి సత్యవతి రాసిన 'గూడు' కథలో ఇందిరమ్మ పథకం పరిస్థితి గురించి వివరించారు. నిజానికి నేటికి చాలా ప్రాంతాలల్లో గిరిజనులు కనీస గూడు లేకుండా, చాలీచాలనీ గుడిసెలలో జీవితం గడుపుతున్నారని చెప్పవచ్చు. ఈ పథకం ద్వారా కొంత సహాయం ప్రభుత్వం చేస్తుంది. తద్వారా ఇండ్లను నిర్మించుకోవచ్చని ఈ పథకం యొక్క లక్ష్యం. కానీ,పథకం ద్వారా లబ్దిపొందాలంటే వాళ్ళే ఇంటిని ప్రారంభించాల్సి ఉంటుంది. గిరిజనులకు కనీసం ఇండ్లను కట్టుకొనే ఆర్థికస్థోమత కూడా లేదని చెప్పనే, గిరిజనుల పట్ల అధికారులు నిర్లక్ష్యాన్ని తెలియ జేసింది కథ.

శ్రీరాంసాగర్ 'కలలోని వ్యక్తి' కథలో గిరిజనుల్లో ఎంతో కొంత చదువుకొని,లేక రాజకీయ పలుకుబడి ద్వారా గూడెంకు నాయకుడై, మంచి చేయాల్సిందిపోయి తన స్వార్థంకోసం గిరిజనులను గిరిజనుడే ఏ విధంగా మోసం చేస్తాడో ఈ కథ తెలియజేసింది. రోజు రోజుకు ప్రపంచం మారిపోతుంది. మానవ విలువలు మారిపోతున్నాయి.

పూర్వకాలంలో ఉన్న మానవీయ విలువలు నేడు మచ్చుకైనా కానరావడం లేదు. తన,మన అనే భేదం లేకుండా మోసాలను చేయడంలో ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. తద్వారా జీవన విధానమే కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని 'దారి' కథ చెప్తోంది. ఇటీవల ప్రభుత్వం ప్రాజెక్టులని చెప్పి గిరిజనులను నిర్వాసితులను చేస్తోంది. ప్రాజెక్టులను కట్టడం మంచిదే. కానీ, నష్టపోయే వారికి ప్రత్యామ్నాయాన్ని చూపాల్సిన అవసరం ఉంది. అలా కాకుండా ఏదో ఒకటిగా చెవిటోడి ముందు శంఖం ఊది నట్టుగా తుతుమంత్రంగా మాటలు చెప్పి గిరిజనులను మోసం చేస్తున్నారని 'పోటెత్తిన జనసంద్రం' కథలో జీవన్ తెలియజేశాడు.

భూక్యా తిరుపతి రాసిన 'కాక్లా' కథలో లంబాడీల సంస్కృతిలో ఒక భాగాన్ని వింగడించాడు. లంబాడీల ఆచారా సంప్రదాయాలు చాలా కట్టుబడి నియమాలకు లోబడి ఉంటాయి. లంబాడీ సమాజం ఏర్పరచుకున్న విధానాన్ని జవదాటకూడదనే నియమాన్ని పాటిస్తుంటారు. కాకి ఎవరినెత్తి మీద వచ్చి వాలినా, లేదా, కొట్టెసిపోయినా ఆవ్యక్తి చనిపోయాడనే బంధువర్గానికి తెలియజేస్తారు. చనిపోయినప్పుడు ఎటువంటి కార్యక్రమాలు చేస్తారో, ఇక్కడ కూడా అలాంటి కార్యక్రమాలు చేస్తారు. అన్ని అయిపోయాక అందరూ చనిపోయాడనుకున్న వ్యక్తి ఇంటిముందు వచ్చి కూర్చుంటారు. అప్పుడు ఆ వ్యక్తి ఇంట్లోంచి నవ్వుతూ బయటికి వస్తాడు. ఇలా చేయకపోతే ఆ వ్యక్తి అతి తొందర్లో చనిపోతాడనే నమ్మకం లంబాడీల్లో ఉంది. ఈ విషయాన్ని 'కాక్లా' కథ నిరూపించింది.

**ముగింపు :**

గిరిజనుడు ప్రకృతి పై ఆధారపడి సులభ జీవితానికి అలవాటు పడిన విషయం గమనించదగినది. అరణ్యంలో పండ్లు, ఫలాలు, కందమూలాలు, అడవి జంతువులను వేటాడుకుని తింటూ, సెలయేళ్లలోని నీళ్లు తాగుతూ స్వేచ్ఛా వాయువులనాస్వాధీస్తూ జీవనాన్ని సాగించటం జరిగేది. కావలసినవన్నీ కష్టించకుండా ప్రకృతిపరంగా లభ్యమవుతూ వుంటాయి. ఎవరితోను అవసరం లేక పోయింది. పూర్వపు అడవులు, ఆ వాతావరణం ఇప్పుడు లేవు. జీవించటం కష్టమైంది. గిరిజనుల్లో చలనం వచ్చింది. ఇతర తెలివిగల మానవజాతి తమను అణచివేస్తారని లేదా చంపేస్తారనే భావంతో ఆధునిక ప్రపంచానికి దూరంగా వుండటానికే ఇష్టపడి, అడవిలోనికి చొచ్చుకపోయాడే తప్ప, బయటపడటానికి చొరవ చూపలేదు. దీనికి ఇంకొక కారణం ఏమంటే భాష, వేషంతో పాటు ఆచారం, ఆహారపు అలవాట్లు కూడా ఆధునిక ప్రపంచానికి దూరంగా వుండటానికి కారణాలయ్యాయి. ఆధునిక మానవుడు స్వార్థపూరిత చింతనలతో అనేక సార్లు గిరిజనులను మోసం చేస్తూనే ఉన్నాడని ఇరవై తొమ్మిది కథలు ఒక్కొక్క పార్శ్వాలను చిత్రించింది. గిరిజన జీవితాలు దాచేస్తే దాగని సత్యాలని, అట్టడుగున పడిన జీవిత సారాలు వెలికితీయాల్సిన తరుణం ఆసన్నమైందని 'ఇప్పపూలు' కథల సంపుటి సాహితీ లోకాన్ని ప్రశ్నించింది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తిరుమల్‌రావు, జయధీర్, జీవన్ (సం). 2009. ఇప్పపూలు గిరిజన సంచారతెగలు కథలు. ప్రతిభా ప్రచురణలు : ఖమ్మం.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# శ్రీ శివభారతము పాత్రచిత్రణ

- కె. లలిత
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ,
రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు జిల్లా.

- డా.యన్ నరసింహులు
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు జిల్లా.

శ్రీ గడియారం వేంకటశేష శాస్త్రి గారు రచించిన "శ్రీ శివభారతము" చారిత్రక పద్యకావ్యాలలో శిరోమణిగా పేర్కొనదగినది. కావ్య నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ వహించ వలసిన వాటిలో పాత్రచిత్రణ ప్రముఖమైంది. అందు లోనూ చారిత్రక ప్రసిద్ధి వహించిన పాత్రలను మల చడంలో కవి చాల జాగ్రత్త వహించవలసి ఉంటుంది. చారిత్రక ప్రసక్తి లేని పాత్రల్ని చిత్రించడంలో కవికి చాలా వరకూ స్వాతంత్ర్యముంటుంది. చారిత్రక పాత్రలు పాఠకులపై గాఢముద్ర వేసి ఉండటం జగమెరిగిన సత్యం. అయిన ఇది కత్తి పై సాములాంటిది. శ్రీ శివభారతము చారిత్రక కావ్యం ఇందులోని పాత్రలన్ని చరిత్ర ప్రసిద్ధాలు. చరిత్రలోని ఘట్టాలను యధాతథంగా వర్ణిస్తే అది కేవలం చరిత్రే అవుతుంది. దానికి కావ్య లక్షణలను అన్వయించి అటు చారిత్రకులతో, ఇటు కావ్యజ్ఞులతో మెప్పు పొందడం కష్టసాధ్యమైన విషయం. అలాంటి కార్యంలో కృతకృత్యులయ్యారు శివభారత కృతికర్త గడియారం వేంకటశేషశాస్త్రి గారు.

## ప్రధాన పురుష పాత్రలు :

**శివాజీ :** ఈ కావ్యంలో కథా నాయకుడు శికాజీ. ఈ పాత్ర ప్రశస్తి కావ్యమంతా విస్తరించి ఉంది. ఇతడిని ధీరోదాత్త నాయకునిగా పేర్కొనవచ్చు. భారతీయులకు శివాజీ ఆదర్శమూర్తి షాజీ, జిజియాబాయిల పుత్రుడు. శివాజీ జన్మించక ముందు మహారాష్ట్ర మహమ్మదీయుల పాలనలో అస్తవ్యస్తంగా ఉండేది.ఆ పరిస్థితులను చక్క బెట్టి మహారాష్ట్ర ప్రజల్లో నూతన చైతన్యాన్ని కలిగించిన గొప్ప వ్యక్తియే శివాజీ. శివాజీ దైవాంశ సంభూతుడని అను చరులు, ప్రజల ప్రగాఢ విశ్వాసం. దీనికి గ్రంథస్థ ఆధా రాలు :

తే "ఆర్యమతముల(బరులు ఊపాడునా(డు
శంకరాచార్యు( గన్న వైశాఖ పంచ......" (1-142)

ఇక్కడ శివాజీని ఆదిశంకరులతో పొల్చడం జరిగింది. శివాజీ దైవంశ సంభూతుడు కాబట్టే పరరాజుల్ని శిక్షించి, స్వమత రక్షణ చేసి స్వాతంత్ర్యానికి గట్టి పునాదా రాయి వేశాడు. శివాజీ భౌతిక రూపాన్ని కవి కావ్యంలా ఇలా పేర్కొనడం జరిగింది.

"ధీరాగ్రేసర మూర్తి, హైందవ ధరిత్రీ భాగ్య సత్యాపన
ప్రారంభుండు ,దయాగుణాంబుధి.................."
(ప్రస్తావన )

చ. "మెణపుల వంటి చూపు, నులిమేపల.......
....................మహరథు ధర్మరక్షణా "
తురతకు బూర్వరంగమగు త్రోవలు పెక్కులున్
దోచె నీగతిన్ (2-46 )

పైన పేర్కోన్న విధంగా శివాజీ సర్వగుణ శోభితుడై ధీరోదాత్త నాయకునిగా విరాజిలుతున్నాడు.ఇతని పాత్ర చిత్రణలో కవి చూపిన శ్రద్ధ అసమానమై శోభిల్లుతోంది.

**షాజీ :** శివాజీ తండ్రి షాజీ, దృఢనిశ్చయం, స్వాతంత్ర్య ప్రియత్వం, బంధుప్రీతి, ప్రతీకరాం, పరదాస్య విముఖత్వం, హిందూ ధర్మ రక్షణ, మహపరాక్రమ వంతుడు మొదలైనవి షాజీలో కనబడే ముఖ్య లక్షణాలు. మాతృదేశమైన నిజాం రాజ్యంలో అరాచకం తలెత్తడంతో షాజీకి, అతని మామ లుకజీ అల్లుడిని తనతో మొగల్ చక్రవర్తుల వద్దకు రమ్మని కోరాడు కానీ, షాజీ ఆదరించిన నవాబులను వదిలి రావడానికి ఇష్టపడలేదు ఇక్కడ షాజీ దృఢనిశ్చయం కనిపిస్తుంది.కష్టకాలంలో దేశ స్వాతంత్ర్యా నికి పాటుపడడం లేదని షాజీ విచారించాడు.

చ. "మదవ........దేశమాత పదపూజ యొనర్పగ
నేరమైతి....." ( 1-44 )

ఇలా అనడంలో షాజీ స్వాతంత్ర్యకాంక్ష తేటతెల్ల మౌతోంది. రాజకీయ కారణాలవల్ల నిజం నవాబు నిండు సభలో లుకజీని సకుటుంబంగా హత్య చేశాడు. ఆ సమయంలో షాజీ యుద్ధం చేసి శత్రువులను చెండాడాలి గాని అన్యాయంగా హత్య చేయకూగదని మామను హత్య చేసిన వాళ్ళపై పగ సాధిస్తానని ప్రతిన పుని దానిని నేనవెర్చడంలో కృతకృత్యుడయ్యాడు.

ఉ. "మామను జంపనైన కసిమాసె, నిజాము
నవాబు పోయె, చే" (1-212)

పై పద్యంలో షాజీని సంగ్రామ కిరీటిలో పోల్చడం జరిగింది. షాజీ శత్రువులను చీల్చి చెండాడె నైపుణ్యం కలవాడని మహవీరుడని స్పష్టమవుతుంది. షాజీలో ప్రారంభమైన స్వాతంత్ర్యకాంక్ష శివాజీలో విస్తరించిందని షాజీ ధర్మప్రయత్నాన్ని చాటుతోంది. శాస్త్రి గారు చక్కగా ఈ పాత్రను చిత్రీకరించారు.

**దాదోజీ ఖాండదేవుడు** : దాదోజీ షాజీ జాగీరుకు మంత్రి. వీరి కుటుంబానికి ఆప్తుడు.శివాజీ బాల్యమంతా దాదాజి దగ్గర గడిచింది. ఆపదల్లో ఆదుకుని ఉత్తమ మైన సలహలను ఇచ్చే అనుభవశాలి, విశ్వాసపాత్రుడు. శివాజీకి విద్య, రాజనీతి, యుద్ధనైపుణ్యం, ధర్మసూక్ష్మాలు మొదలైనవి దాదోజి నేర్పాడు.. శివాజీని స్వాతంత్ర్య వీరునిగా తీర్చిదిద్దిన ఘనత దాదోజికి దక్కింది. షాజీ జీజియాబాయిని దాదోజీ దగ్గర వదలి వెళ్ళడంలో దాదోజి వ్యక్తిత్వం తెలుస్తుంది.

తే. "జీజియాబాయి నోమ దాదోజి గల(డు
భయములేదని తలపోసి............" (1-131)

పైపద్యం వలన దాదోజి విశ్వాసపాత్రుడని తెలుస్తుంది.

శివాజీకి దాదోజి పట్ల పూజ్యభావముంది.చరమదశలో ఉన్న దాదోజిని చూసి శివాజీ ఇలా బాధ పడ్డాడు.

శా. "దాదోజి! శరతల్ప శాంతనవు చందంబైతవే! త్రాణయే
లేదే! యేదయినన్ జికిత్స.............................."
(3-44)

ఇక్కడ దాదోజిని శాంతనవుడైన భీష్మునితో పోల్చడం, పాండవులకు భీష్మాచార్యుడు ఎంతటి ఆప్తుడో భోన్సలే వంశానికి దాదోజి అంతటివాడని కవి ఈ పాత్రను చక్కగా చిత్రీకరించారు.

**సమర్థరామదాసుస్వామి** : శివాజీకి ధర్మప్రబోధక గరువు. శివాజీ తండ్రికి దూరమై తండ్రిలాంటి దాదోజి మరణించగా పెద్దల అండలేక పరితపించే సమయంలో రామదాసు వంటి మహాత్ముడు శివాజీకి తారసపడ్డాడు.ఆ సమయంలో శివాజి రాజకీయాలతోను,యుద్ధాలతోను విసుగు చెందాడు. అలాంటి క్లిష్టసమయంలో శివాజీకి మన:శాంతిని చేకూర్చి, స్వాతంత్ర్యసమరాన్ని కొనసాగించాల్సిన అవసరాన్ని గుర్తు చేసిన దేశభక్తి తత్పరుడు రామదాసు. రామదాసుని బోధనలు శివాజిని జాగృతం చేశాయి. వాటితో శివాజి భావి కర్తవ్యాన్ని నిశ్చయించుకున్నాడు.

చ. "అఱమది మాని ధర్మ విజయధ్వజమెత్తి,
పరాధికార...." (3-239)

తే. "వేసముల మాఱు ధర్మజిజ్ఞాస నీకు
వలదు వలదు పుణ్యపాపముల గొడవ
రాచబిడ్డవు, ధర్మశాస్త్రమున దున్ని
పంట గొలుపుమీ యిహపర భాగ్యలక్ష్మి"
(3-242)

ఇలా సంశయాన్ని వీడి ధర్మవిజయ ధ్వజమెత్తి దేశాన్ని, మతాన్ని రక్షించమని.రాచబిడ్డకు వేశాలు మారే ధర్మజిజ్ఞాస వలదని, పాప పుణ్యముల గొడవ వదలి ధర్మశాస్త్రంతొ దున్ని ఇహపర భాగ్యలక్ష్మిని పండించుమని కర్తవ్యోపదేశాన్ని చేసిన ఉత్తమ గురువుగా కవి చక్కగా వర్ణించి చిత్రీకరించాడు.

**తానాజీ** : శివాజీ సరదారులలొ ప్రముఖుడు మావళాధిపతి, దేశభక్తుడు,స్వామిభక్తి గలవాడు కవి ఇలా వర్ణించాడు.

శా. "అజిస్ఫితుడు, మావళాధిపతి, సహ్యారణ్య

సింహంబు తా

నాజీమాలసురే " శివప్రభునియండన్ గళ్లమున్
బట్టి...." (3-247)

సింహగడాన్ని స్వాధిన పరచుకోవడానికి తనను సేనానిగా పంపమని తానాజి శివాజీని కోరుతాడు.కవి తానాజీ వీరరసాత్మకమైన రూపును వర్ణించారు.

చ. "అనవిని తానాజీ వలుదలౌ భుజమూలములుబ్బ
లేచి ,యొ
త్తు నెఱయ గండుమీసముల దువ్వుచు,వల్పలి
వీర కంకణం
బును నెగదోపి,కుంకుమపు బొట్టున మూడవ
కన్నుగూడ.. " (7-183)

కుమారుని వివాహన్ని సైతం లెక్కించకుండా తుది శ్వాస వరకు శివాజికి అంగరక్షకుడుగా ఉండి అతడిని కాపాడిన త్యాగధనుడు 'స్వర్గానికి ఈ సామ్రాజ్యం సాటియా ' అనడంలో స్వర్గంకన్నా పరమ పవిత్రమైన ఈ భారతవానిపై గల దేశాభిమానం తెలుస్తోంది.తానాజీ దేశం కోసం ప్రాణాలను సంతోషంగా అర్పించిన త్యాగజీవి ఇలా అనేక కోణాలలో కవి చక్కగా చిత్రీకరించినాడు.

**బాజీప్రభువు** : శివాజీ సేనాపతులలో పేర్కొనదగిన వాడు. చిన్న వయస్సులో శౌర్యపరాక్రమాలలో మిన్న స్వామిభక్తి పరాయణుడు.బీజాపూర్ సైన్యంతో పోరు సంధర్భంలో బాజీప్రభువు వీరసంగా పలికిన పలుకులు భావి వీరలోకానికి మార్గదర్శకాలు.కర్తవ్యనిర్వహణలో తానాజీ వలె ప్రాణాలు అర్పించాదు. "మనకు రణ రంగములు పెండ్లిమంటపములు" అంటూ ధైర్య వచనాలతో మహారాష్ట్ర వీరులను యుద్ధభూమికి ఆహ్వానించాడు.

బీజాపుర్ సైన్యంతో బాజీ యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఇక్కడ బాజీ ప్రభువు పరాక్రమం అనితర సాధ్యం.

సీ. " ద్వంద్వ యుద్ధ ప్రౌఢి( దారసిల్లిన వారి
నెదిరించి కుత్తుకల్ చిదిమి వైచి "

తే. రాహు దంష్ట్రా .....................
.............తఱమె బాజీ ప్రభుండు
(5-238)

బాజీ ద్వంద్వయుద్ధం చేసి కొందరిని హతమార్చాడు. తనపైకి వచ్చే వారి కాళ్లు చేతులు నరికాడు. గుంపుగా ఉన్న వాళ్ళను సామూహికంగా చంపాడు.

బాజీ ప్రభువు మరణవార్త విన్న శివాజి పరిస్థితి వర్ణనాతీతం. శివాజి మాటల్లో బాజీ వ్యక్తిత్వం.

తే. "స్వామి భక్తితో శౌర్యాగ్ని సంస్కరించి
రణ మహయజ్ఞవేది......ధర్మవీరమూర్తి ! "
(5-272)

ఈ విధంగా ప్రభువు మన్ననలు పొంది బాజీ చరితార్థుడయ్యాడు. శౌర్యపరాక్రమాలలో బాజీ ప్రభువు పాత్రలో తానాజీ కంటే ఎక్కువగా కవి చిత్రీకరించడానికి చరిత్ర కూడా సహాయపడింది.

**సూర్యాజీ** : ఇతను తానాజీకి సహెూదరుడు.శివాజీ అంగరక్షకులలో ఒకడు.

"సూర్యాజీ తానాజీ యనుశూరవరుల
జంటంబాయని యంగరక్షకులంజేసి" (3-114)

వీరి అండతో శివాజీ విజయుడైనాడు. తానాజీ మరణ వార్త విన్న మవాళ భటులు యుద్ధం నుండి వెను తిరుగుచుండగ వాళ్ళను యుద్ధోన్ముఖులుగా చేశాడు.

ఉ. "అచ్చపు మావళాకులమునందు జనించిన
వీరు( డెవ్వ( డున్
జిచ్చును మ్రింగి శాత్రవుల( జీల్చును
గాక................"

సూర్యాజీని అరివీర భయంకరుడైన వీరునిగా కవి చిత్రీకరించాడు.

## ప్రతినాయకులు :

**అఫజల్ ఖాన్** : ఇతడు బీజాపుర్ నవాబు వద్ద సేనా నాయకుడు. ఇతన్ని కలియుగ రావణాసురునిగా పేర్కొంటారు. హిందుమతద్వేషి శివాజీని కొండ ఎలుక అని నిండుసభలో హేళన చేసినవాడు. శివాజీని మోసంతో అంతమొందిచడానికి వచ్చి చివరకు తానే హత మయ్యాడు. ఇతడు హిందుమత ద్వేషి అనడానికి ఆధారాలున్నాయి.

శా. అమున ఖాను( డే( చెడు నపాయమలన్ బడి, 'పండరీ' పుర
స్వామి యదృశ్యు(డయ్యె, 'దులజాపురి'లోని భవాని విగ్రహ (5-32)

పై పద్యంను బట్టి స్వమతం పై గల అభిమానం, పరమతాలపై దురభిమానానికి హిందూ దేవాలయాలు స్త్రీలు,సాధువులు, మరెందరో బలి అయ్యారు.ఇంత పరాక్రమం గల అఫజల్ ఖాన్ శివాజీని యుద్ధంలో ఎదిరించి జయించలేనని మోసంతో జయించాలని అనుకున్నాడు. చివరికి శివాజీ చేతిలో మరణించాడు. ఈ వార్త విన్న బీజాపుర్ రాజమాత ఆశ్చర్యంతో.

మ. "వినుచున్నారు గదా!....గొండంత సర్దారు న ట్లనుపన్ గాలికి దూలిపోయె,నవురౌరా ఖాన్ డట్లౌనె! నే
మన నేమున్నది సింగమున్ దునిమెగాదా నేడు సారంగముల్" (5-170)

**చంద్రరావు మోరే** : ఇతడు మహారాష్ట్ర వీరుడు. బీజాపుర్ నవాబుకు సామంత రాజుగా ఉండేవాడు. ఇంతటి వీరుడు ఉంటే స్వాతంత్ర్యోద్యమానికి బలం చేకూరుతుందని భావించి శివాజీ రఘునాధపంతును రాయబారిగా పంపాడు. శివాజీ మాటలు విన్న మోరే.

ఉ. "పెద్దఱికమ్ము వేసికొని పిల్వని పేరట మేలరా(గ?...
.........యంచకూనకున్ గ్రద్దకు జోడె? ..........."
(4-197)

పై విధంగా శివాజిని తులనాడాడు. మోరే శివాజి స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రోత్సహింపకపోగా అపహస్య మాడాడు. ఇలాంటి వారు ఉండడం వల్ల మనదేశం శత్రురాజుల వశమైంది.

## స్త్రీ పాత్రలు :

**జీజియాబాయి** : ఈ కావ్యంలో శివాజీపాత్ర తరువాత ప్రధానమైన పాత్ర జీజియాబాయి. శివాజీ వంటి దేశ భక్తునికి జన్మనిచ్చిన మాతృమూర్తి స్వాతంత్ర్యవీరునిగా తీర్చిదిద్దిన వీరమాత. భర్తకు అండగా నిలవడంలో జీజియాను సత్యభామతో పోల్చవచ్చు భర్తకు ధైర్యాన్ని నూరిపోసింది.

చ. 'త్వరపడనేల? కాల పరిపాకము సర్వము నిర్వహించు .....'! (1-84)

శివాజీతో ఉన్న జీజియా మొగల్ సైన్యం చుట్టు ముట్టారు. అప్పుడు జీజియా సమయస్ఫూర్తితో ఇలా పలికింది.

శా. "ఏమీ! మోగలుపాదుషా ప్రభుతయిట్లే? శూరధర్మంబు కాం
తామర్యాదకు భంగమున్ దలచు టానా?................" (1-223)

అని వీరులను సూటిగా ప్రశ్నించింది. వాళ్ళు లొంగ లేదు. అప్పుడు జీజియా కాళికావతారమెత్తి.

ఉ. తోడఱియున్ననన్ను విడద్రోయుచు నాసుతు బట్టనుంటిరే
......గాళికా క్రీడనముల్ వెలార్చి విహరించెద: నడ్డముదా(కి చూడు( డీ (1-225)

అని శత్రువులను ఎదిరించి శివాజీని రక్షించుకున్న వీరవనిత జీజియా. ఇలా జీజియాబాయి కుమారునిపై ప్రేమ, భర్తపై ఆత్మీయత, ఆదరణ, పుట్టింటి,మెట్టింటిపై గౌరవ ఆత్మీయానురాగాలు, దేశభక్తిపైఅభిమానం ఇవి చూసిన షాజీ "నీకు భరతోర్వి ఋణపడింది" అని జీజియాను గురించి పలికిన పలుకులు నిత్యసత్యాలు. ఈమెను సంపూర్ణమైన గొప్పవ్యక్తిత్వం గల భారత నారీమణిగా తీర్చిదిద్దడంలో కవి చిత్రీకరించడంలో కృత కృత్యుడైనాడు.

**సయీబాయి** : ఈమె శివాజీ భార్య శివభారతంలో ఈమె ప్రస్తావన అంతగా కనిపించదు.తన తండ్రి అయిన షాజీని జీజాపుర్ నవాబులు బంధింపగా శివాజీ సయీబాయి సలహాను అడిగాడు. అపుడు సయీబాయి పలికిన పలుకులు ఆమె వ్యక్తిత్వాన్ని చాటుతున్నాయి. భర్తపైన, అత్తమామలపైన ఎనలేని గౌరవం ఉందనడానికి ఈ క్రింది పద్యం తార్కాణం.

ఉ. "అత్తకు మామకున్ గుఱుచలాడిన పాపము సేయ: వారునా

యుత్త మదైవ దైవతము : లూర్జిత
శక్తి(గడంగివారి........." (4-83)

ఇలా అత్తమామలపై గౌరవాన్ని చూపి, శివాజీ తండ్రిని గురించి భాదకులోనుకాగా అతనికి ధైద్యం చెప్పి వీరసతి అనిపించుకున్నది.

ఈ విధంగా శివభారతంలోని ప్రదాన పాత్రల చిత్రణను కవి నిర్వహించిన తీరును వివరించడం జరిగింది. ఏ పాత్రకాపాత్రను వేర్వేరు రూపాలతో ప్రశంసించుట, పాత్రల ప్రవర్తనలను పాఠకుల కనుల ముందు చూపిన తీరు కవి చేసిన పాత్రచిత్రణ ప్రశంసనీయమైనది.

**ఆధార గ్రంధాలు :**

1. "శ్రీ శివభారతము" - గడియారం వెంకటశేష శాస్త్రి
2. "చత్రపతి శివాజి" - జాగృతి ప్రచురణ
3. "చత్రపతి శివాజి" - పి.రాజగోపాల నాయుడు

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# మట్టివాసన కవిత సంపుటి – పరిశీలన

– యం. మునే నాయక్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

సాహితీ ప్రక్రియలలో ప్రధానమైనవిగా పేరు పొందిన కథను, కవిత్వాన్ని, తన రెండు కళ్ళుగా సాహితీ సృజన చేస్తున్న, అభ్యుదయ కవిగా, ప్రసిద్ధ కథ రచయితగా వేంపల్లి రెడ్డి నాగరాజును పేర్కొనవచ్చును. తన 14వ ఏటనే కవితారచనకు శ్రీకారం చుట్టిన ఈయన దాదాపు మూడు దశాబ్దాల కాలంగా సాహితీపరంగా అటు పాఠ కుల్నీ విశేషంగా అలరించడంతోపాటు ఇటు సాహితీ విమర్శకుల ప్రశంసల్నీ అందుకున్నారు. కవిగా ఈయన రాసిన కవితల్ని పరిశీలిస్తే సాహితీ ప్రపంచంలోని పాఠక లోకంలో ఈయన తనదంటు వేసుకున్న ప్రత్యేకమైన ముద్ర ఏపాటిదో చెప్పకనే అర్థమవుతుంది. రెడ్డి నాగ రాజును సామాజిక బాధ్యతతో కవిత్వం రాస్తున్న కవి. ఈయన రచనలలో భిన్న, సామాజిక అంశాల పట్ల తన వేదన ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సమకాలీన సమాజంలో నాడు కనిపిస్తున్న దురాగతాలు, అమానత్వాలు, సత్వం, దోపిడి, యాంత్రిక జీవనం, అసమానత్వాలు ఈయన కవిత్వములో ఎక్కువుగా కనిపిస్తాయి. ఈయన కవిత్వం చదివిన పాఠకులు పదాలు, అక్షరాలతో కాక నిప్పు కణికులతో కూడ కవిత్వం రాయవచ్చనే అనే అభిప్రాయా నికి రాక తప్పదు. ఈయన పదిహేను ఏళ్ళ క్రితం "మట్టి వాసన" పేరిట తన తొలి కవిత సంపుటి ఆవిష్కరించారు. ఈయన కవిత్వంలో స్త్రీవాదాన్ని బలంగా వినిపించడం జరిగింది.

**ఉదా** : ఆడవాళ్ళు ప్రతినిత్యం ఎదుర్కొంటున్న అనేక సమస్యల నేపథ్యంలో

"నా దేశంలో జీవ నదులు ఏడెనని - ఏ మేధావి సెలవిచ్చాడో

గుర్తించలేదు కాబోలు - నిరంతరం నీళ్ళురే కోట్లాది ఆడవాళ్ళు కళ్ళని" అంటూ మహిళలు పట్ల వకాల్త పుచ్చుకుంటాడు.

స్త్రీని తన లైంగిక అవసరాల కోసం వయోబేధం కూడ చూడకుండా తన పరతారత్యం భావించకుండా లైంగిక దాడులకు పాల్పడే పురుషుడు గురించి మరో కవితలో క్రింది విధంగా అంటాడు.

"మగాడు పదంలోనే కొమ్ముంది - పశువుల ప్రవర్తించడే మరి" అంటూ ముగిస్తాడు.

"స్త్రీకి ఇస్త్రీకి పెద్దగా తేడా లేదు - స్త్రీ మెట్టినింట్లో అణచివేయబడును. ఇస్త్రీ పెట్టేకింద అణగదీయ బడుతుంది" అంటాడు. మరో కవితలో "మేఘాలు ఆకాశంలోనే కాదు ఇపుడు ఆడవాళ్ళ ముఖాల్లోను కాకుంటే కాస్తంతరూపం మారి కళ్ళుగా అని ప్రవచిస్తాడు". మరో కవితలో రెడ్డి నాగరాజు సమాజాన్ని తన కవిత్వంలో ఆవిష్కరిస్తాడు. ఈయన కవిత్వంలో ధిక్కార స్వరం కనిపిస్తుంది. కొన్ని కవితలు కఠిన సత్యాన్ని ఆవిష్కరిస్తూ చెర్నకోలుతో బాధినట్లనిపిస్తుంది. ఈయన నేటి ప్రజా స్వామ్య భారతంలో వేళ్ళూనుకున్న అవినీతి రాజకీయాల్ని తనదైన శైలిలో ఎండగడుతాడు. క్రింద కవితను పరిశీలిస్తే.

"పశువులు పాలిస్తాయి గడ్డితిని - నాయకులు పాలిస్తారు నానా గడ్డి తిని" అంటూ నేతలు స్వార్థాన్ని, అవినీతిని మూడే మూడు ముక్కలలో విశదపరుస్తాడు. తన స్వార్థం కోసం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా మరచిన నేటి పాలకుల తీరు తెన్నులను వేంపల్లి రెడ్డి నాగరాజు నిర్మోహమాటంగా చెబుతాడు. అది ఎలాగంటే.

"రాబందులు వినయంగా వేడుకుంటున్నాయి.

చచ్చిన శవాలను మాత్రమే తినే తమను

బ్రతికిన జనాన్ని చంపుకుతినే నాయకులతో పోల్చవద్దు" అంటూ ముగిస్తాడు.

వేంపల్లి రెడ్డి నాగరాజు గారి కవిత్వంలో మనకు క్లుప్తత, స్పష్టత ప్రధానాంగాలుగా కనిపిస్తాయి. ఈ కవితలు చదివిన పాఠకుడిలో ఆలోచనలు రేకెత్తిస్తాయి. కొన్ని

సందర్భాలలో నిలువెత్తు ప్రశ్నలుగా మారి సమాజాన్ని నిలదీసేదిగా అనిపిస్తాయి. భారతదేశంలో ప్రధాన జీవికైన వ్యవసాయం రైతాంగం పట్ల ఈయన కవితల్లో వాళ్ళకు తన మద్దతు బాగా కనిపిస్తుంది. తాను నివసిస్తున్న కరువు సీమలో సీమ రైతు దుస్థితిని ఇలా వివరిస్తాడు.

"నా సీమరైతుకు పెళ్ళాం మీద ఎంత ప్రేమో
బరువు మోయలేదని కాబోలు పెళ్ళాం పుస్తెల్ని"
మార్వాడి కొట్టులో తాకట్టు పెట్టాడు మరి" ఘనంగా బతికి దీనస్థితికి దిగజారిన రైతన్న వేదనలను అక్షరీక రిస్తాడు.

మానవ సంబంధాలపై ఈయన కవితలు దారితప్పిన సమాజాన్ని అద్దంలో చూపుతాయి. కొన్ని సందర్భాలలో ఈయన కవితంలో ఆలోచనలు సుళ్ళు ఆందోళనల సగళ్ళు ధ్వనిస్తాయి.

ఉదా : 'రెక్కలు వచ్చేది పక్షులకే కాదు
మీసాలు వచ్చిన మగాళ్ళకి కూడా అంటూ వృద్ధాప్యంలో తల్లిదండ్రులను వదిలి వేసే ప్రబుద్ధులు గురించి రెడ్డి నాగరాజు కవిత్వంలో గాడి తప్పిన వ్యవస్థను సక్రమ మార్గంలో పెట్టాలనే ఆరాటం కనిపిస్తుంది. అవస్థలమయమైన వ్యవస్థలను పూర్వస్థితికి తీసుకు రావాలనే ఆక్రోశం బహిర్గతమవుతుంది.

విశృంఖలమవుతున్న నేటి సినిమా హీరోయిన్ల ఆశ్లీలతను ప్రదర్శించే నగ్నత్వాన్ని గురించి ఈయన ఇలా అంటాడు.

నా దేశంలో కడుపు నింపుకునే కూటికే కాదు
కట్టుకునే గుడ్డకు కరువు వచ్చినట్లుంది
అందుకే నేటి హీరోయిన్లు అందరికి చాలదని కాబోలు
అరమీటరు గుడ్డ పీలికలోనే అడ్జస్ట్ అయిపోతున్నారు.
మంది మీద ఎంత ఔదార్యం పాపం" అంటూ చురకలు అంటిస్తారు.

ఇతన కవిత్వం చదివినప్పుడు రెడ్డి నాగరాజు తన కాలాన్ని కత్తిలా చేసుకున్నాడనే భావన పాఠకుడిలో స్థిరాభిప్రాయం కలిగిస్తుంది. అధిక్షేపత వ్యంగ్యాత్మకత ఎక్కువగా కనిపించే ఈ కవి యొక్క కవితలు విన్నవారి గుండెలోకి సూటిగా గుచ్చుకునే బాణాలవుతాయి. వర్ణములు ఉపన్యాసాలు ఉపోద్ఘాతాలు అలంకారాలు ఈయన కవిత్వంలో భూతద్దం పెట్టి వెతికిన కనిపించవు యాసిడ్ దాడుల నేపథ్యంలో యువతులకు బాసటగా నిలిచే రకంగా ఈయన రాసిన కవిత.

"అమ్మ కడుపులో ఆడపిండమ అనాకారిగానే పుట్టు
అందగత్తె అయితే మాత్రం ప్రేమించని నేరానికి
యాసిడ్ దాడి ఘటనలోను పదునెక్కిన చురకత్తితోను
పాశవికంగా హత్య చేయబడుతావు తస్మాత్ జాగ్రత్త"
అంటూ చిన్న చిన్న పదాలతోనే పచ్చి నిజాలాను పలుకు తాయి. శైలిపరంగా ఎంతో సులభంగా ఉండటం వలన ఈయన కవితలు చదువురికి ఒక్కసారి చదవగానే సులభంగా గ్రహింపు అవుతాయి.

వేంపల్లి రెడ్డి నాగరాజు సుకవి. మంచి తరపున వకల్తా పుచ్చుకొని, చెడపై కలం అనే ఆయుధంతో తిరగ బడుతాడు. కవికి ఆవేశం, ఆవేదన వుండాలి. ఇవేవి లేని వాడు కవి కాలేడు. సమాజానికి స్వచ్ఛమైన ప్రతినిధి కవి. సమాజంలోని మంచి చెడులు, న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలన్నింటిని అందరికంటే ముందుగా కవి గ్రహిస్తాడు. జనంలో భావాల విత్తులను చల్లి, ఫలాల ఫలితం పదిమందికి చెందాలని కోరుకుంటాడు. సమా జాన్ని యధాతథంగా గ్రహిస్తూ, తన ఆవేశాలను, భావా లను కవిత్వకరించే నైపుణ్యం నాగరాజుకి వుంది. అందుకే మట్టివాసన కవితలో పల్లెతల్లిని తడుముకుంటాడు. బాల్యపు అనుభూతులన్నీ ఈ కవితలో నెమరేసు కుంటాడు. అయ్యవారి బెత్తం దెబ్బలు, కాగితపు పడవలు, పిల్లకాలువలు, సర్కార్ బడిలోని లాంగ్‌బెల్ ఇవన్నీ గుర్తు చేసుకుంటాడు. మనకెంత వయసొచ్చినా బాల్యపు మట్టివాసన వదలడు. అదే దాని గొప్పతనం తీపిదనం. ఇతనిలో ఒక మానవీయవాది వున్నాడు. కవితల్లో కానీ, కథల్లో కానీ ఇది ప్రస్ఫుటమవుతుంది. సమాజాన్ని ప్రేమించటం, ఎగుడు దిగుళ్ళని చూసి బాధ పడ్డం కవి ప్రాథమిక బాధ్యత. ఈ సామాజిక బాధ్యతను నాగరాజు చక్కగా నిర్వర్తించి ఇంకా బాగా ఎదుగుతారనే నమ్మకం నాకుంది.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# 'హ్యారీపోటర్ - పరుసవేది' నవల విమర్శనాత్మక పరిశీలన

- ఎవివికె. చైతన్య పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

## సంక్షిప్తి:

ప్రస్తుత పత్రం 'హ్యారీపోటర్ - పరుసవేది' నవలను తెలుగులోకి అనువదించిన తీరును నవల లక్షణాల సమన్వయంతో పరిశీలిస్తుంది. వస్తువు, ఇతివృత్తం, పాత్రచిత్రణ, శైలి, వాతావరణం, ప్రయోజనం అన్న అంశాలలో హ్యారీపోటర్ తెలుగు అనువాదం మూలానికి ఎంత దగ్గరగా ఉంది అన్న అంశాన్ని పరిశీలించడమైంది. తెలుగు పాఠకులకు నవలా ప్రక్రియ కొత్తది కాకపోయినా హ్యారీపోటర్ నవలలోని వస్తువు, ఇతివృత్తం, సంస్కృతులు తెలుగువారికి కొత్తవి. ఇటువంటి నవలల అనువాదంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, అనువాద విధానాలను గురించి చర్చించడమైంది. హ్యారీపోటర్ ప్రధానంగా బాల సాహిత్య వర్గానికి చెందుతుంది. అంటే పిల్లలకు అర్థ మయ్యే శైలి ఉండాలి. శైలి విషయంలో తెలుగు సహజత్వానికి ముఖ్యంగా పిల్లలకు అర్థమయ్యే సరళ శైలిని అనువాదం ఎంతమేరకు అనుసరించిందో వివరించడమైంది. మొత్తంగా మూల రచయిత్రి ఆశించిన లక్ష్యాన్ని అనువాద నవల ఏ మేరకు అందుకుందో పరిశీలించడమైంది.

## పరిచయం :

'హ్యారీపోటర్' నవలను ఇంగ్లీషులో బ్రిటిష్ రచయిత్రి జె. కె. రౌలింగ్ రచించారు. "Harry Potter and the Philosopher`s Stone" అన్నది ఏడు భాగాల సిరీస్‌లో మొదటి నవల. తెలుగులో 'హ్యారీ పోటర్ - పరుసవేది' పేరుతో ఎం.ఎస్.బి.పి.ఎన్.వి. రమాసుందరి గారు అనువదించారు. ఈ రచనతో రౌలింగ్ ప్రపంచ ప్రఖ్యాతి చెందడమేగాక, అత్యధిక సంపాదనగల రచయిత్రిగా కూడా రికార్డులకెక్కారు. ఇది ప్రధానంగా చిన్నపిల్లలను ఉద్దేశించిన నవల. కానీ పెద్దవారిని కూడా అంతేస్థాయిలో ఆకర్షించడం విశేషం. ఈ నవలలో రౌలింగ్ ఒక మాయా లోకాన్ని చిత్రించారు. చందమామ కథల్లో కనిపించే మాదిరి మాయా ప్రపంచంతోపాటుగా, మంత్రాలు, తంత్రాలు, సస్పెన్స్ వంటి వాటితో నవల పాఠకులను ఆకర్షిస్తుంది. ముఖ్యంగా టెలివిజన్, కంప్యూటర్ వంటి ఎలక్ట్రానిక్ సాధనాలకు పరిమితమైన ఈ తరం పిల్లలను పుస్తక పఠనం వైపు మళ్ళించిన రచనగా హ్యారీపోటర్‌ను చెప్పాలి. వ్యాపార నవల కోవలోకే వచ్చినా హ్యారీపోటర్ నవల ప్రపంచ వ్యాప్త పాఠకాదరణ వల్ల సాహిత్య గౌరవాన్ని అందుకుంది. మొదటి భాగం బాగా ఆదరణ పొంది కోట్ల కాపీలు అమ్ముడుపోవడంతో రచయిత్రి కథను పొడిగిస్తూ మరో ఆరు భాగాలు రాసి సిరీస్‌ను ముగించారు. సమకాలీనంగా పాఠకాదరణ పొందిన పిల్లల నవల అయిన 'హ్యారీ పోటర్ - పరుసవేది' అనువాదాన్ని నవలా లక్షణాల పరంగా పరిశీలించడం ఈ పత్ర ప్రధానోద్దేశం.

## వస్తువు :

హ్యారీపోటర్ నవలా ప్రక్రియకు చెందిన సాహిత్యం అన్నది దానిలోని లక్షణాలను బట్టి తెలుస్తుంది. అయితే నవలల్లోని ఏ ఉప విభాగానికి చెందినది? అన్నది వస్తువును బట్టే అంచనా వేయగలం. హ్యారీపోటర్ నవలలోని వస్తువును అనుసరించి చెప్పవలసి వస్తే ఈ నవల కల్పిత(ఫాంటసీ)నవల, చిన్నపిల్లల నవల, అపరాధ పరిశోధక నవల అన్న ఉపవర్గాలలోకి చేరుతుంది. తల్లిదండ్రులను కోల్పోయిన హ్యారీ పోటర్ తన పిన్ని, బాబాయిల ఇంట్లో పెరుగుతాడు. వారు అతణ్ణి సరిగా చూడకపోవడంతో ఎన్నో కష్టాలను అనుభవిస్తాడు. ఇది రచయిత కల్పించిన వస్తువు. అందులోను వాస్తవ ప్రపంచానికి దూరంగా ఉండేది, పైగా పిల్లలకు సంబంధించినది. ఇటువంటి నవలలకు ఉద్దేశిత పాఠకులు ప్రధానంగా పిల్లలనే విషయం గుర్తించాలి. హాగ్వర్ట్స్ మంత్ర పాఠశాల నుండి ఆహ్వానం అందుతుంది. ఇంట్లో వారికి

ఇష్టం లేకపోయినా హ్యారీ మాంత్రికబడిలో చేరతాడు. అక్కడ నుండి అతని జీవిత ప్రయాణం ప్రారంభం అవుతుంది. స్కూల్లో వింత అనుభావాలు, స్నేహితులు, శత్రువులు, మంత్ర తంత్రాల మధ్య హ్యారీ ఎదుర్కొన్న సవాళ్ళేమిటి? వాటిని ఎలా పరిష్కరించుకున్నాడు? అన్న అంశాలు నవలలో ప్రధానం. చివరకు హ్యారీ, అతని స్నేహితులతో కలసి ఒక మిస్టరీని ఛేదిస్తాడు. హ్యారీ ఏడు సంవత్సరాల మాంత్రికుడి కోర్సులో మొదటి సంవత్సరం పూర్తి చేస్తాడు. ఇక్కడితో మొదటి నవల ముగుస్తుంది. ఇటువంటి వస్తువు పాఠకుడికే కాదు, అనువాదకుడికి కూడా కొత్తగానే ఉంటుంది. మూల రచయిత్రి రౌలింగ్ పాఠకులు పాశ్చాత్య ప్రపంచానికి చెందిన పిల్లలు. వారికి ఈ నవలలోని వస్తువుతో కొంత పరిచయం ఉంది. ముఖ్యంగా నేపథ్యం విషయంలో. తెలుగు పాఠకులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠకులకు ఇటువంటి నవలలు, కథలు వింతగా అనిపించడం సహజం.

ఒక విధంగా రాక్షసులు అనే అభిప్రాయాన్ని కలిగిస్తారు. అటువంటి మంత్రగాళ్ళకు ఒక బడి ఉండటం, అక్కడ మంత్రాలు నేర్చుకోవడం అనే వస్తువు తెలుగు పాఠకులకు కొత్త. కల్పితం గనుక పాఠకులు నవలను చదువుతూ వస్తువును అర్థం చేసుకోగలరు. అయితే నవలకు ప్రధాన పాఠకులు పిల్లలు. పిల్లలకుండే లౌకిక పరిజ్ఞానం తక్కువ. ఇది రచయితకు ఒక పరిమితిని విధిస్తుంది. అంటే చారిత్రక, పౌరాణిక, ఇతిహాస సంబంధ విషయాల ప్రస్తావన లేకుండా రాయవలసి వస్తుంది. ఒకవేళ అటువంటి అంశాలను ప్రస్తావిస్తే పిల్లలకు అర్థమయ్యేలా తక్కువ సమాచారంతో చెప్పవలసి వస్తుంది. హ్యారీపోటర్ నవలలో వస్తుపరంగా ఇటువంటి అంశాలేవీ లేవు. పౌరాణిక లేదా చారిత్రక వస్తువులా ముందే పాఠకుడికి కొంత విషయ పరిజ్ఞానం కలిగించ వలసిన అవసరం హ్యారీపోటర్ నవల విషయంలో అనువాదకుడికి లేదు. బహుశా ఈ కారణంగానే రమా సుందరిగారు ఏ విధమైన వస్తు పరిచయం లేకుండానే అనువాదాన్ని ప్రారంభించారు.

**ఇతివృత్తం :**

నవల పేరును బట్టే 'హ్యారీపోటర్' నవలలోని ఇతివృత్తం పాత్ర ప్రధానమైనది (Plots of Character) అని అర్థం అవుతుంది. ప్రధాన పాత్ర అయిన హ్యారీ చుట్టూ కథ నడుస్తుంది. హ్యారీ తల్లిదండ్రులను వోల్డమోర్ట్ అనే దుష్టమాంత్రికుడు చంపడం వల్ల అనాథ అయిన హ్యారీని డంబెల్ డోర్ హ్యారీ తల్లికి తోబుట్టువైన పెటూనియా ఇంటికి చేరుస్తాడు. పెటూనియా ఆమె భర్త వెర్నాన్, వారి కొడుకు డడ్లీ హ్యారీని హింసించి, ఏడిపించి ఆనందిస్తుంటారు. హ్యారీకి ఎనిమిదేళ్ళు వచ్చేసరికి అతనికి హాగ్వర్ట్స్ మాంత్రిక బడి నుండి ఆహ్వానం వస్తుంది. హ్యారీ అప్పటికే మాంత్రిక లోకంలో ప్రసిద్ధి చెందిన వ్యక్తి అన్న విషయం అతనికి, ఆ లోకంలోకి ప్రవేశించాకనే అర్థం అవుతుంది. దీనికి కారణం. తన తల్లిదండ్రులను చంపిన వోల్డమోర్ట్, చిన్న పిల్లవాడైన తనను చంపలేకపోవడమే అని తెలుసుకుంటాడు. . రచయిత్రి దీనికి గల కారణాన్ని సిరీస్ చివరి వరకు కొనసాగించి పాఠకులలో ఉత్సుకతను పెంచారు. మాంత్రిక బడిలో హ్యారీ విభిన్న మనస్తత్వాలుగల వ్యక్తులను కలుస్తాడు. వీరిలో అతని స్నేహితులు హెర్మాయినీ, రాన్‌లు ముఖ్యమైనవారు. బడిలోనే హ్యారీలో దాగి ఉన్న లక్షణాలన్నీ ఒకటొకటే బయటకు వస్తాయి. ఇలా నవలలోని ఇతివృత్తాన్ని రచయిత్రి ఒక దొంతరలా పేర్చుకుంటూ వెళ్ళారు. దొంతరలోని ఒక్కో పొరలో పాఠకుడికి ఒక్కో విషయం తెలుస్తుంటుంది. నవలలోని ప్రతీ చిన్న విషయం మరొక విషయానికి లేదా పెద్ద ప్రమాదానికి సూచికగా మారడం అనేది రౌలింగ్ ఇతివృత్త రచనలోని ఒక కోణం. ఉదా: "నాకు డ్రాగన్ అంటే చాలా ఇష్టం. దాన్ని పెంచాలని నాకు ఎప్పటి నుంచో కోరిక అన్నాడు హ్యాగ్రిడ్" (రమాసుందరి, ఎమ్.ఎస్.బి.పి.ఎన్.వి. 2014: 71). నవల మొదట్లో చెప్పిన ఈ వాక్యాలకు అంతగా ప్రాధాన్యం కనిపించదు. ఒక పెద్ద మలుపుకు ఇవే వాక్యాలు కారణం అవుతాయన్న విషయం నవల చివరకు తెలుస్తుంది. హ్యారీపోటర్ - పరుసవేది నవలలో రచయిత్రి అపరాధ పరిశోధక నవలల్లో

వాడే టెక్నిక్‌ను ప్రయోగించారు. రచన అంతా అను మానాస్పదంగా కనిపించే వ్యక్తి మంచివాడిగా బయటపడి, చివరన ఏ ప్రాధాన్యమూ లేని, లేక అప్పటి వరకూ మంచిగా కనిపించే వ్యక్తి అసలు నేరస్థుడిగా బయట పడతాడు. హ్యారీ పోటర్ సిరీస్‌లోని మొదటి నాల్గు భాగాలలోను ఈ విధమైన ఇతివృత్తం, ప్రధాన ఇతి వృత్తంలో భాగంగా కొనసాగుతూంటుంది. హ్యారీపోటర్ నవలలన్నింటిలోనూ సాధారణంగా కనిపించే ఇతివృత్త నిర్మాణం హ్యారీ ఏదో ఒక సమస్యలో చిక్కుకోవడం, ఆ సమస్య నుండి బయట పడడానికి స్నేహితులు సాయం చేయడం, ఆ సమస్యకు కారణం వోల్డమోర్ట్ అని తెలుసు కోవడం. చివరకు సమస్యనుండి బయటపడి వోల్డమోర్ట్ ను ఓడించడం ద్వారా ప్రపంచాన్ని రక్షించడం. ఈ క్రమంలో కొత్త కొత్త మంత్రాల గురించి, మాంత్రిక వస్తువుల గురించి తెలుసుకోవడం జరుగుతుంది. సిరీస్‌లోని నవల కనుక కొన్ని ప్రశ్నలకు సమాధానాలు ముందు భాగాలలో తెలుసుకోవలసి ఉంటుంది. పిల్లల సాహిత్యం కావడం వల్ల ఇతివృత్తం ప్రధానపాత్ర లేదా కథకు మంచి జరగడంతో ముగుస్తుంది.

పెద్దల సాహిత్యం మాదిరి జీవిత వాస్తవికతతో నవలను ముగించడం బాలసాహిత్యంలో కుదరదు. అలాగే దుష్టపాత్రను శిక్షించకుండా వదిలేయడం, క్షమిం చడం వంటివి బాల సాహిత్యానికి పాఠకులైన పిల్లలను ఆకర్షించవు. ''For children are innocent and love justice while most of us are wicked and naturally prefer mercy" ''(Nicholas Tucker . 1976 : 20). హ్యారీపోటర్ నవలలోని ఇతివృత్తం దొంతరలుగా ఉన్నా సంక్లిష్టంగా మాత్రం కనిపించదు. వస్తువులాగే ఇతివృత్తాని గురించి అనువాదకుడు వివరించవలసిన అవసరం లేదు. అయితే ప్రతి సన్నివేశంలోను ఏదో ఒక రహస్యం లేదా కొత్త విషయం బయటపడే ఇటువంటి ఇతివృత్తాన్ని అను వాదకుడు పూర్తిగా అర్థం చేసుకున్న తరువాతనే అను వాదానికి పూనుకోవాలి.

**పాత్ర చిత్రణ :**

హ్యారీపోటర్ నవలలోని పాత్రలన్నింటినీ క్లిష్టత కలిగిన పాత్రలుగానే చెప్పవచ్చు. డంబుల్ డోర్, హ్యాగ్రిడ్, డర్లీ కుటుంబం పాత్రలు మాత్రమే క్లిష్టత లేనివిగా కని పిస్తాయి. అంటే అవి మంచికో, చెడుకో ప్రతినిధులుగా ఉంటాయి. మన జానపద కథల మాదిరే ఇందులో చిన్న చిన్న పాత్రలు అనేకం కనిపిస్తాయి. ఇవి ఇతర పాత్రలకో, సన్నివేశాలకో, సంఘటనలకో సహాయకారి అవుతాయి. అలా చూసినపుడు నవలలోని పాత్రలను మూడు ప్రధాన వర్గాలుగా విభజించవచ్చు.

**ప్రధాన పాత్రలు :** హ్యారీపోటర్. హెర్మాయినీ గ్రేంజర్, రాన్ వీస్లీ.

**సహాయ పాత్రలు :** డంబుల్ డోర్, హ్యాగ్రిడ్, ప్రొఫెసర్ స్నేప్, ప్రొఫెసర్ మెక్‌గోనీగాల్, నెవిల్, స్ప్రౌట్, మేడమ్ హూచ్.

**దుష్టపాత్రలు :** వోల్డెమోర్ట్, ప్రొఫెసర్ క్విరల్, డ్రాకో మాల్ఫోయ్, డర్లీ కుటుంబం.

ఇక్కడ మరొక విభజన కూడా చేయవచ్చు. అది పిల్లలు, పెద్దలు అన్న విభజన. ప్రధాన పాత్రలుగా పిల్లలే కనిపిస్తారు. పెద్దలు సహాయ పాత్రలుగా పిల్లలకు సూచనలు, సలహాలు ఇవ్వడం, క్లిష్ట పరిస్థితులలో ఉన్నపుడు సహాయం చేయడం వంటివి చేస్తుంటారు. పెద్దలు ఇలా కేవలం సహాయ పాత్రల స్థాయిలో ఉం డడం బాల సాహిత్యానికి చెందిన ప్రధాన లక్షణం. పెద్దలు ప్రధాన పాత్రలుగా కలిగిన బాల సాహిత్యం పిల్లలను అంతగా ఆకర్షించలేకపోవచ్చు. పిల్లవాడైన హ్యారీ ప్రధానపాత్ర కావడం వల్ల ఉద్దేశిత పాఠకులైన పిల్లలు తమను తాము హ్యారీలో చూసుకొని ఆనందించ గలుగు తారు. దుష్టపాత్రలు ప్రధాన పాత్రను కష్టపెట్టడమో లేక అతని పనికి అవరోధాలు కల్పించడమో చేస్తుంటాయి. నవలలో కనిపించకుండా కేవలం పేర్ల ద్వారానే పరిచయ మయ్యే పాత్రలు హ్యారీ తల్లిదండ్రులు లిల్లీ, జేమ్స్ పోటర్‌లు, నికోలస్ ఫ్లమేల్. పాత్ర ప్రధానమైన ఇతివృత్తం కనుక ప్రతి పాత్ర కూడా హ్యారీ జీవితం చుట్టూ తిరుగు తుంటుంది. ఆ క్రమంలో వివిధ పాత్రలకు చెందిన స్వభావాలు, అభిరుచులు, అభిప్రాయాలు బయటకు

వస్తాయి. ఇతర పాత్రల గురించి చెప్పేటప్పుడు కూడా రచయిత్రి నేరుగా వర్ణనలు చేయకుండా సహాయ పాత్రల ద్వారా ఇతరుల గుణ గణాలు తెలిసేలా చెప్పించారు. నవల మొదట్లో డంబుల్ డోర్ కనిపించినా ఆయన గురించిన విషయాలు రైలులో రాన్ చెబితేనే హ్యారీకి తెలుస్తాయి. అలాగే తను మాంత్రిక లోకంలో ప్రసిద్ధుడన్న విషయం హ్యాగ్రిడ్ ద్వారానే తెలుసుకుంటాడు. హ్యారీ పాత్ర క్రమంగా పరిణామం పొందే కొద్దీ మిగిలిన పాత్రల స్వభావాలు బయటపడతాయి. పిల్లలందరితో కఠినంగా ఉండే ప్రొఫెసర్ మెక్‌గోన్‌గాల్ హ్యారీకి కొత్త బ్రూమ్‌స్టిక్‌ను బహూకరించి క్విడిచ్ ఆట ఆడడానికి ప్రోత్సహించడం ద్వారా తన క్లాసు పిల్లలపట్ల ఆమెకుండే ప్రేమ వెల్లడి అవుతుంది. అదే సమయంలో హ్యారీ రాత్రిళ్ళు స్కూలు బయట తిరుగుతున్నాడని తెలిసి, అతనిని శిక్షించడం ద్వారా నియమాల పట్ల ఆమెకుండే కఠిన వైఖరి స్పష్ట మవుతుంది. హ్యారీని అన్ని సందర్భాలలోనూ ద్వేషించే ప్రొఫెసర్ స్నేప్ హ్యారీని కాపాడడం ద్వారా తన మంచి తనాన్ని చాటుకున్నాడు. దీనితో ఈ పాత్ర క్లిష్టతలేని పాత్ర నుండి క్లిష్టత కలిగిన పాత్రగా పరిణామం చెందింది. హ్యారీని ఇబ్బందుల పాలు చేసిన మాల్ఫోయ్ పాఠకులకు దుష్టపాత్రగా కనిపిస్తాడు. ఇలా నవలలోని ప్రతీ పాత్ర హ్యారీ చూట్టూనే తిరుగుతూ ఉంటుంది. అయితే ఈ పాత్రలకు ప్రత్యేక వ్యక్తిత్వాలు లేవని కాదు, అవి కేవలం ప్రధాన పాత్రతో తమకున్న సంబంధాల వల్ల, ప్రధాన పాత్రతో ఏర్పడిన సంఘటనల వల్ల ఆవిష్కృతం అయి నాయి. కనుక ప్రధాన పాత్ర అయిన హ్యారీ పాత్ర పరి ణామం నవలలో కీలకమైనదని చెప్పవచ్చు. ముందే చెప్పినట్టు జానపద కథా నిర్మాణాన్ని హ్యారీ పోటర్ నవల అనుసరించడం వల్లనే ఇటువంటి పాత్ర చిత్రణ ఏర్పడింది. పాత్రచిత్రణకు నవలలో ప్రాధాన్యం ఉన్న ప్పటికీ కల్పిత పాత్రలుగల నవలను అనువదించడానికి అనువాదకులు ప్రాధాన్యం ఇవ్వనవసరం లేదు. అయితే హ్యారీపోటర్ నవలలో పాత్రచిత్రణ వెనుక పాశ్చాత్య సాంస్కృతిక, సామాజిక కారణాలు, ఆర్థిక విధానాల ప్రభావం కనిపిస్తుంది.

**శైలి :**

హ్యారీ పోటర్ నవలా రచయిత్రి జె. కె. రౌలింగ్ ఇంగ్లీషు నవలలో వాడిన శైలి సరళంగా ఉంటుంది. స్కూలు పిల్లలే ప్రధాన పాత్రధారులు కనుక వ్యావహారిక బ్రిటిష్ ఇంగ్లీషును ఆమె నవలలో వాడారు. అయితే కొన్ని నూతన ప్రయోగాలు కూడా చేశారు. ఉదా: The boy who lived, He who must not be named- ఈ రెండు వాక్యాంశాలను రచయిత్రి కథకు అనుగుణంగా తయారు చేశారు. వోల్డెమోర్ట్ నుండి శాపం పొంది కూడా బతికాడు కనుక హ్యారీ పోటర్‌కు మొదటి పేరు వచ్చింది. వోల్డెమోర్ట్ వంటి దుర్మార్గుడి పేరు తలుచుకోవడానికి కూడా ప్రజలు భయపడతారనే విషయాన్ని చెప్పడానికి రచయిత్రి రెండవ మాటను వాడుకున్నారు. Merlin`s beard అన్న ప్రయోగాన్ని 'అయ్యో దేవుడా!' అన్న అర్థంలో రచయిత్రి వాడారు. సాధారణంగా ఇటువంటి అభివ్యక్తికోసం ఇంగ్లీషులో Good Lord వంటి మాటలున్నాయి. అయితే హ్యారీ మంత్ర విద్య నేర్చుకుంటున్నవాడు కనుక మెర్లిన్ అన్న మాంత్రికుడి పేరును చేర్చారు. మెర్లిన్ అతి పెద్ద మంత్రవేత్త అని పాశ్చాత్య సాహిత్యంలో పేర్కొంటారు. వాక్య నిర్మాణాన్ని చూసినపుడు ఎక్కువగా కర్తరీ వాక్యాలు (Active Voice), Compound Complex వాక్యాలు కనిపిస్తాయి. ఉదా: "When he had been younger, Harry had dreamed and dreamed of some unknown relation coming to take him away, but it had never happened" (31). అనువాదకురాలు ఇటు వంటి వాక్యాలను చిన్న చిన్న సామాన్య, సంశ్లిష్ట వాక్యా లుగా అనువదించారు. ఉదాహరణకు పై ఇంగ్లీషు వాక్యానికి తెలుగు అనువాదం: ''బాగా పసితనంలో హ్యారీకి తరచుగా ఒక కల వచ్చేది. ఆ కలలో ఎవరో ఒక అపరిచిత బంధువు తన దగ్గరకు వచ్చి ఎక్కడికో తీసికెళ్ళే వాడు! కానీ ఇప్పటిదాకా నిజం కాలేదు''(36). రౌలింగ్ వాడిన క్రియలు కూడా చాలా సరళమైనవి. అందువల్ల ఇంగ్లీషు మాతృభాషగా గల పిల్లలకు కొంత రాయగల, చదివగల సామర్థ్యం వస్తే, నవలను చదవగల విధంగా సరళమైన శైలిలో రచయిత్రి మూలాన్ని రచించారు.

ఉదా: "Harry couldn`t eat. He had seen his parents and would be seeing them again tonight. He had almost forgotten about Flamel"(225). దీని తెలుగు అనువాదం కూడా అంతే సులభంగా కనిపిస్తుంది. "హ్యారీ ఏమీ తినలేకపోయాడు. తను ఇన్నాళ్ళకి అమ్మానాన్నలని చూశాడు. మళ్ళీ ఈ రాత్రికి కూడా చూస్తాడు. వాడు ఫ్లెమల్ గురించి దాదాపుగా మరిచిపోయాడు"(216). చాలా వరకూ అనువాదకురాలైన రమాసుందరిగారు నేటి వ్యావహారిక తెలుగులోకే నవలను అనువదించినా అక్కడక్కడా మూలంలోని పదాలను వాక్యాలను అలాగే ఉంచారు. ఉదా: మొదటి సారిగా రేసింగ్ బైక్ నడపబోతూ క్రచెస్ సాయంతో ప్రైవేట్ డ్రైవ్ రోడ్డు దాటబోతున్న పెద్దావిడ మిసెస్ ఫిగ్‌ని ఢీకొట్టడం..(37)- ఇది డడ్లీ అనే పదేళ్ళ పిల్లవాడి గురించి చెప్పిన సందర్భంలోనిది. పిల్లవాడు బైక్ నడపడం తెలుగు పాఠకుడికి వింతగా అనిపిస్తుంది. కానీ పాశ్చాత్యులు సైకిల్‌ను కూడా బైక్ అనే అంటారని తెలుసుకుంటే ఇక్కడి సందర్భం ఏమిటో స్పష్టమవుతుంది. తెలుగు వారికి బైక్ అంటే మోటార్ బైక్ అనే. అనువాదకురాలు సైకిల్ అని అనువదిస్తే సరిపోయేది.

ఇదే వాక్యంలో క్రచెస్ అనే పదం వచ్చింది. దీనికి తెలుగు లేదు. కర్ర సాయంతో నడుస్తున్న అనో లేదా నాలుగు కాళ్ళ ఇనుప కుర్చీలాంటి క్రచెస్ అనో అర్థ వివరణతో అనువదిస్తే పిల్లలకు సులభంగా అర్థం అవుతుంది. బాన్‌ఫైర్ నైట్(13), పేవ్‌మెంట్(15), మాంటిల్ పీస్(24), స్మెల్టింగ్స్ స్టిక్(39), బ్రూమ్‌స్టిక్(73), సెల్ఫ్ స్టిరింగ్, కౌలాప్సుబుల్(76). పదాలనే కాదు కొన్ని వాక్యాలను, అభివ్యక్తులను కూడా మూలం నుండి లిప్యంతరీకరణ చేశారు. ఉదా: బ్లెస్ మై సోల్, గుడ్ లార్డ్ (74), డోర్మెటరీ, సార్టింగ్ సెర్మనీ(121), హాలోవిన్(170) వంటి పదాలను మూలం నుండి తెలుగులోకి లిప్యం తరీకరణ చేశారు. కొన్ని చోట్ల అనువాదకురాలు ఇంగ్లీషు పదాలకు వివరణలు కూడా ఇచ్చారు. ఉదా: టేపెస్ట్రీ- చిత్ర యవనిక(135), రిమెంబ్రల్ - మరచిపోకు(152). ఇంగ్లీషులో మంత్రాలను రౌలింగ్ చాలా వరకు అర్థ మయ్యే భాషలోనే రచించారు. ఉదా : "Sunshine, daisies, butter mellow, Turn this stupid, fat rat yellow"(112). దీనిని తెలుగులో లిప్యంతరీకరణ చేశారు. అలాకాక సూర్యుడు, చామంతి, వెన్న రంగులా, ఈ తెలివి లేని ఎలుకను పసుపుగా మార్చు" వంటి పదాలతో తెలుగు చేసి ఉంటే తెలుగు పాఠకులకు సులభంగా అర్థం అయ్యేది. అలాగే Petrificus Totalus (292) - దీనిని "మొత్తంగా/పూర్తిగా కొయ్యబారిపో" అని అనువదిస్తే సరిపోయేది. కొన్ని చోట్ల మంత్రాలను తెలుగు చేశారు. అయితే వీటికి ఎక్కువగా గ్రాంథిక భాషను వాడారు. ఉదా : Curse of Bogies(168) - శైత్యశాపం(164), Devil's Snare(305) - మృత్యుపాశం(290). మూలంలో రౌలింగ్ ఒక్క హ్యాగ్రిడ్ పాత్రకు మాత్రమే మాండలికం (Dialect)ను వాడారు. హ్యాగ్రిడ్ చిన్నప్పుడే స్కూలు నుండి బహిష్కరణకు గురైయ్యాడు. ఎందుకు అన్నది రెండవ భాగంలో కాని తెలియదు. అయితే స్కూలు చదువు లేకపోవడం వల్ల అతని భాషలో కొంత నిరక్షరాస్యుల మాండలికాన్ని ప్రవేశపెట్టారు రౌలింగ్. Lily an'James dead(49) అన్నచోట అండ్‌లోని 'd-శబ్దాన్ని వదిలేయడం, ..., or he just liked killin` by then అన్న చోట 'ఇంగ్' శబ్దాన్ని వదిలేయడం హ్యాగ్రిడ్ మాండలిక ఉచ్చారణకి ఉదాహరణలు. you పదాన్ని yehగా, to పదాన్ని terగా, for పదాన్ని ferగా పలకడం కూడా మాండలిక ఉచ్చారణకు సంబంధించినదే. సర్వనామాలను మార్చి పలకడం కూడా హ్యాగ్రిడ్ సంభాషణల్లో కనిపిస్తుంది. ఉదా: "True, I haven't introduced meself"(52). ఇక్కడ myself సర్వనామం meselfగా మారింది. హ్యాగ్రిడ్ మాండలికం ఇంగ్లండు పశ్చిమ ప్రాంతానికి చెందినది. Youకు బదులు Yehను వాడడం ఇంగ్లండు పశ్చిమ ప్రాంతంలోనే ఎక్కువగా కనిపిస్తుంది. రౌలింగ్ కూడా 2001లో BBC రేడియోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హ్యాగ్రిడ్ మాండలికం ఇంగ్లండు పశ్చిమ ప్రాంతానికి చెందినది అని చెప్పారు. అయితే తెలుగులో రమాసుందరిగారు మాండలికాను వాదానికి పూనుకోలేదు. మిగిలిన పాత్రల భాష మాదిరే హ్యాగ్రిడ్ సంభాషణలను అనువదించారు.

హ్యారీపోటర్ నవలలో వ్యంగ్య సంభాషణలు చాలా ఎక్కువగా కనిపిస్తాయి. డ్రాకో మెల్ఫోయ్ హ్యారీ, రోన్‌లతో మాట్లాడే సందర్భాలు అన్నింటిలోనూ వ్యంగ్యంగానే సంభాషిస్తాడు. హ్యారీని రైలుస్టేషనులో దింపడానికి వచ్చిన వెర్నాన్ కూడా వ్యంగ్య సంభాషణలు చేస్తాడు. ఉదా : "Your platform should be somewhere in the middle, but they don`t seem to have built it yet, do they?"(97). హ్యారీ రైలు టికెట్టు మీద ప్లాట్‌ఫామ్ నెంబరు 9 1/3 అని ఉండడం వల్ల అటువంటి ప్లాట్ ఫామ్ లేదని తెలిసి వెర్నాన్ అన్న మాటలివి. ఈ మాటల్లో వ్యంగ్యమే కాదు, పాఠకుడికి ఒక ఉత్సుకత కూడా అందుతుంది. మంత్ర ప్రపంచంలో ప్రతీ పనీ మాజిక్ ద్వారా జరుగుతుందని పాఠకుడికి అప్పటికే అర్థం అయి ఉంటుంది కనుక, ఇప్పుడు ఏ మాజిక్‌తో హ్యారీ తన ప్లాట్‌ఫామ్ చేరుకుంటాడా? అని పాఠకుడిలో ఒక ఉత్సుకతను కలిగించడానికి పై వాక్యాలను రచయిత్రి ఉపయోగించారు. అదే సందర్భంలో వెర్నాన్ పాత్ర మానసిక స్థితి కూడా అర్థం అవుతుంది. బాలసాహిత్యానికి సరళమైన శైలి, పదజాలం అవసరం. పంచతంత్రం బాల సాహిత్యంగానే పరిగణింపబడినా తెలుగు అనువాదాలలో ఎక్కువగా గ్రాంథిక భాష కనిపిస్తుంది. ఒకవేళ కొత్త కొత్త పదాలు, కఠినమైన పదాలను వాడాలని అనుకొంటే రచయిత లేదా అనువాదకుడు ఒక పరిమితికి మించి వాడకూడదు. అప్పుడే ఆ పదాలు పిల్లల భాషా జ్ఞానాన్ని పెంచేందుకు ఉపయోగపడతాయి. వ్యంగ్యం, ఎత్తి పొడుపు వంటివి బాలసాహిత్య శైలికి ఎక్కువగా పనికి రాదనే చెప్పాలి.

**వాతావరణం :**

హ్యారీపోటర్ నవలలోని వాతావరణం చాలా వరకూ కల్పితమైనదే అయినా కొంత వాస్తవికత కనిపిస్తుంది. మాయలు మంత్రాలను మినహాయిస్తే బోర్డింగ్ స్కూళ్ళలో లేదా విశ్వవిద్యాలయాల స్థాయిలో హాస్టళ్ళలో ఉండి చదువుకొనే విద్యార్థులు నవలలోని స్కూలు వాతావరణాన్ని కొంత అనుభూతి చెందగలరు. అయితే నవలకు ప్రధాన ఆకర్షణ మాయలు, మంత్రాలే కనుక వాతావరణంలో వాటిని కూడా చర్చించవలసి ఉంటుంది. మొదటగా రచయిత్రి మాంత్రిక బడి ప్రపంచానికి, మామూలు మనుషుల ప్రపంచానికి ఏ విధమైన విభజన రేఖలు చూపలేదు. అయితే నవలలో కొన్ని చోట్ల మాంత్రిక ప్రపంచం అన్నారు. ఇక్కడ కొంత అస్పష్టత ఉంది. లండన్ వంటి నగరంలో అక్కడి ప్రజలకు తెలియకుండా ఒక మాంత్రిక ప్రపంచమే ఉందని తెలుస్తుంది. అంటే ఇతర ప్రపంచంతో కలిసి ఉంటూనే వీలైనంత గోప్యంగా ఉంటూ మాంత్రిక ప్రపంచ జీవులు జీవిస్తున్నారని చెప్పుకోవాలి. హాగ్వర్ట్స్ బడికి వెళ్ళిన తరువాత హ్యారీ పోటర్ చూసిన, అనుభవించిన ఆశ్చర్యాలు, అనుభూతులు ప్రతీ పాఠకుడు పొందుతాడు. కారణం రచయిత్రి సృష్టించిన వాతావరణం. ఇందుకు పాశ్చాత్య ఇతిహాసాలలోను, జానపద కథలలోను కనిపించే వాంపైర్‌లు (మనిషి రక్తం తాగే జీవులు), ట్రోల్‌లు (ఒంటికన్ను రాక్షసులు), సెంటార్‌లు(మనిషి మొండెం, గుర్రం కాళ్ళుగల జీవులు), డ్రాగన్‌లు, బ్రూమ్‌స్టిక్‌లు (ఎగిరే బూజుకర్రలు) వంటి వాటిని రచయిత్రి వాడుకున్నారు. అందువల్ల పాశ్చాత్య పాఠకులు నవల వాతావరణంతో పరిచయం కలిగి ఉన్నారని చెప్పవచ్చు. అనువాదకురాలు ఈ పేర్లను మూలంలో ఉన్నవి ఉన్నట్టు తెలుగు చేశారు. అందువల్ల అనువాద నవల చదువుతున్న భావన పాఠకుడికి కలిగినా కొత్తగా కనిపించే ఇతర విషయాలలో ఇవి కూడా చేరిపోయాయి. పాఠకుడికి ఒక అంశం పట్ల ఆసక్తిని పెంచాలనుకున్న ప్రతీ సందర్భంలోనూ రచయిత్రి ఆ ప్రదేశాన్ని మాయమంత్రాలను చేర్చి అద్భుతంగా వర్ణించారు. ఉదా: "తదేకంగా చూస్తున్న పిల్లల చూపుల నుండి తప్పించుకోవడానికి హ్యారీ సీలింగ్ వైపు చూశాడు. నక్షత్రాలతో పొదగబడి నల్లటి కాంతితో మెరుస్తున్న ఆకాశం కనిపించింది. హెర్మాయినీ మెల్లగా అంది. ఇది బయట కనిపించే అచ్చమైన ఆకాశంలా ఉండేందుకు దీనిపై మాయాజాలం ప్రయోగించబడింది"(123). హాగ్వర్ట్స్ లోకి

మొదటి సారిగా పిల్లలు, పాఠకులు అడుగు పెడుతున్న సందర్భం ఇది. ఆ స్కూలు గొప్పతనాన్ని తెలియజేయ డానికి రచయిత్రి ఇటువంటి వర్ణనలు చాలా చేశారు. కదిలే మెట్లు, మాట్లాడుతూ కదిలే ఫోటోలు, అక్కడక్కడా కనిపించే అల్లరి దయ్యాలు, మంత్రించగానే అందరి ముందుకూ ఆహర పదార్థాలు ప్రత్యక్షం కావడం వంటివి పాఠకులను ఆకర్షించడానికి చేసిన ప్రయత్నాలే. రచయిత్రి చేసిన మరొక ప్రయత్నం క్విడిచ్ ఆట. పాశ్చాత్య దేశాలలో బాగా ప్రాచుర్యంలో ఉన్న బాస్కెట్‌బాల్ ఆటను పోలి ఉండేట్టు క్విడిచ్ అన్న ఆటను నవలలో ప్రవేశ పెట్టి హ్యారీ అందులో విజేత అయేట్టుగా రచించారు. మొదటి నవలలో రచయిత్రి అందించిన పేర్లు, వస్తువులు, ప్రాంతాలు తర్వాతి నవలల్లో కొనసాగడమే కాదు, కొన్ని ముఖ్య పాత్ర వహిస్తాయి కూడా. అందువల్ల ఈ నవల సిరీస్‌లోని మిగిలిన నవలలకు నేపథ్యం వంటిదని చెప్పవచ్చు. అదే విధంగా చదరంగం ఆటను మంత్రాలతో చేయడం,రెక్కలున్న తాళం చెవులు, కోరుకున్నవి చూపించే అద్దం వంటివి పాఠకులను మరో లోకంలోకి తీసుకు వెళతాయి. ఒక పక్క విద్యార్థులు, టీచర్లు, స్కూలు వాతావరణం అంటూనే మరొక పక్క ఇటువంటి మంత్ర తంత్రాల గురించి చెప్పడం వల్ల పాఠకుడికి వాస్తవికంగా అనిపించే ఒక ఊహాలోకం కళ్లముందు ప్రత్యక్షం అవు తుంది.

## సంస్కృతి :

ముందే చెప్పుకున్నట్టు హ్యారీపోటర్ నవలలో చిత్రిం చిన మాయా వస్తువులు, జంతువులకు మాతృక పాశ్చాత్య సాహిత్యం. ముఖ్యంగా వారి ఇతిహాసాలు, జానపద కథలు. ఫీనిక్స్ ఈక గురించి ఈ నవలలో కొంత ప్రస్తావన కనిపిస్తుంది. ఫీనిక్స్ అనేది గ్రీకు ఇతిహాసాలలో కనిపించే కల్పిత పక్షి. ఎక్కువ కాలం జీవించడం, చనిపోయే సమయం దగ్గర పడినపుడు తనకు తానే మంటల్లో కాలి బూడిదయిపోవడం, ఆ బూడిద నుండి తిరిగి జన్మిం చడం ఈ పక్షి లక్షణాలుగా గ్రీకు ఇతిహాసాలు పేర్కొం టున్నాయి.

అలాగే యూనికార్న్ అంటే ఒంటికొమ్ము గుర్రాలు సింధు నాగరికతలోను, గ్రీకు సాహిత్యంలోను, బైబిల్ లోను కనిపిస్తాయి. యూనికార్న్ కొమ్మును విషానికి విరుగుడుగా, ఎన్నో మందులకు ఔషధంగా భావించే వారు. ఇది కూడా కల్పిత జంతువే. ఇక డ్రాగన్ చాలా సంస్కృతులలో కనిపిస్తుంది. చైనాలో ఇప్పటికీ డ్రాగన్ పేరుతో ఒక సంవత్సరం ఉండడం విశేషం. గ్రీకు, రోమన్ జానపద సాహిత్యంలో వాంపైర్‌ల గురించి, తోడేలు మనుషుల (వేర్‌వుల్ఫ్) గురించిన కథలు ప్రచారంలో ఉన్నాయి. తరువాతి కాలంలో వీటి గురించిన కథలు యూరపు అంతా ప్రచారం కావడం జరిగింది. ఈ నవల ప్రత్యేకంగా మంత్రగాళ్ళు/మంత్రగత్తెల గురించి వారు మంత్రాలు నేర్చుకోవడం గురించి చెబుతుంది. మధ్య యుగాలలో యూరపు, అమెరికాలలో కూడా విచ్/విజార్డ్ (Witch/Wizard) పేరుతో మంత్రగాళ్ళనే పదం ప్రచారం లోకి వచ్చింది. ఎక్కువగా స్త్రీలనే విచ్ పేరుతో హింసించే వారు. విచ్ పేరుతో యూరపు, అమెరికా దేశాలలో కొన్ని వేల మంది స్త్రీలను హత్య చేసిన సంఘటనలు చరిత్రలో నిలిచిపోయాయి. బూజుకర్రను ఆధారం చేసుకొని ఎగరటం, కంచు గిన్నెల్లో రసాయనాలు తయారు చేయటం, మంత్రాలు వేసి ఎదుటి వ్యక్తిని శపించడం ఇవన్నీ విచ్‌క్రాఫ్ట్(మంత్రజాలం)లో భాగంగానే చెప్పు కొనేవారు. ఆధునిక కాలంలో వీటి పట్ల ప్రజలకున్న మూఢనమ్మకాలు చాలా వరకు తగ్గిపోయాయి. అయితే ఇప్పటికీ మంత్రగత్తెలు, మంత్రాల సంస్కృతికి గుర్తుగా 'హాలోవీన్' పండగను పాశ్చాత్య దేశాలలో జరుపు కుంటున్నారు. రౌలింగ్ పాశ్చాత్య సమాజానికి సంస్కృతి పట్ల అక్కడి పాఠకులకు ఉన్న అవగాహనను తన నవల నేపథ్యానికి ఉపయోగించుకొన్నారు. అందువల్ల పాశ్చాత్య సంస్కృతితో పరిచయం ఉన్న వారికి ఈ నవల కొంత సులభంగానే అర్థం అవుతుంది. ఎటచ్చీ భారతదేశం వంటి పాశ్చాత్య సాహిత్యంతో సంబంధించినది. కింది తరగతి విద్యార్థులను క్రమశిక్షణతో ఉంచడానికి పై తరగతి విద్యార్థులను ప్రిఫెక్టులుగా నియమించే పద్ధతి బ్రిటీషు

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

స్కూళ్ళలో కనిపిస్తుంది. దీనినే రచయిత్రి నవలలో చిత్రించారు.

పరిచయం లేని వారికి నవలలోని అంశాలు చాలా వరకూ కొత్తగా కనిపిస్తాయి. నవలలో వాడిన తినుబండారాలు (స్టీక్, లాంబ్ చాప్స్, బేకన్, పోర్క్ చాప్స్), దుస్తులు (రోబ్, గ్లోవ్స్, ప్లెయిన్ పాయింటెడ్ హాట్)లకు అనువాదంలో నేరుగా ఆంగ్ల పదాలని ఇచ్చారు. ఇది వారి సంస్కృతిని తెలుసుకోవడానికి ఉపయోగపడినా వీటిని కొంత తెలుగు చేస్తే బాగుండేది.

**ప్రయోజనం :**

హ్యారీపోటర్ సిరీస్‌లోని మొదటి నవలను రౌలింగ్ 1997లో ముద్రించారు. 1998లో ఈ నవల అమెరికాలో కూడా ముద్రణ పొంది ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందింది. మొదటి నవల అయిన Harry Potter and the Philosopher's Stoneను ప్రచురించడానికి రౌలింగ్ చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దాదాపు పదిహేను ప్రచురణ సంస్థలు నవలను ప్రచురించడానికి నిరాకరించాయి. చివరకు బ్లూమ్స్ బరీ ప్రచురణ సంస్థ దీనిని ప్రచురించింది. మొదటి నవలను రాసే సమయంలో రౌలింగ్ చిన్నపిల్లల కోసం, ఒక అద్భుత అనుభూతిని అందించే (Fairy Tale వంటి) నవలను రాయాలని అనుకొన్నారు. చిన్నతనం నుండి అనేక రచనలను చదవడం, తాను రచయిత్రిగా మారడానికి సహకరించిందనేది రౌలింగ్ ఉద్దేశం. అలాగే కొత్త కొత్త పేర్లను సేకరించే అలవాటు ఉండడం వల్ల వాటిని తన పాత్రలకు వాడుకునే అవకాశం కలిగిందని రౌలింగ్ చెబుతారు. చాలా వరకూ మాంత్రిక జీవుల పేర్లను యూరోపియన్ జానపద కథల నుండి తీసుకున్నారు. కనుకనే పిల్లలను హ్యారీపోటర్ నవల బాగా ఆకర్షించింది. రచయిత్రిగా తనను తాను నిరూపించుకోవడానికి రౌలింగ్ హ్యారీపోటర్ నవలలను రాయడం మొదలుపెట్టారు. ఇతర సాహిత్యం మాదిరి సమాజంలోని అన్ని వర్గాల పాఠకుల కోసం కాక రౌలింగ్ పిల్లలను దృష్టిలో ఉంచుకొని నవలను రాశారు. అంటే రౌలింగ్ తన రచనకు ఉద్దేశిత పాఠకుల (Target Readers)ను ముందుగానే నిర్ణయించుకున్నారు. అయితే హ్యారీపోటర్ నవల పెద్దవారిని కూడా ఆకర్షించడం విశేషం. "On the other hand, no story lives unless someone is prepared to listen. As a writer, your highest aspiration is to touch people, to connect, to amuse or console(Rowling, JK. 2018). హారీపోటర్ నవల ఆదరణ పొందటానికి ప్రధాన కారణాలు, రచయిత్రి వాడిన సరళమైన శైలి, వ్యంగ్యం, దొంతరలుగా సాగే ఇతివృత్తం(Layered Plot), చిన్నపిల్లలను ఆకర్షించే మాయలు, మంత్రాలు. తెలుగు అనువాదం మూలంలోని ఈ లక్షణాలను ఏ మేరకు అనుసరించింది? మూలం అందించే అనుభూతిని ఏ మేరకు అందిస్తుంది? అన్నది పరిశీలిస్తే ఆంగ్ల నవల సాధించిన ప్రయోజనం తెలుగు అనువాదం ఎంతమేరకు సాధించిందో చెప్పవచ్చు. ఆంగ్ల నవలలోని సరళమైన శైలినే అనువాదకురాలు తెలుగు చేయడానికి ప్రయత్నించారు. నవలను అనువాదకురాలు మూలాన్ని అనుసరించి అనువదించినా చాలా పేర్లు మూలంలో ఉన్నవి ఉన్నట్టు అనువదించారు. అలాగే గ్రాంథిక భాషను వాడడం, మూలంలోని ఆంగ్ల పదాలను లిప్యంతరీకరణ(Trans literation) వంటివి చేశారు. దీని వల్ల అనువాద ప్రయోజనం దెబ్బతినే అవకాశం ఉంది.

**ముగింపు :**

హ్యారీపోటర్ నవలకు ఉద్దేశిత పాఠకులు పిల్లలు. మరీ చిన్నపిల్లలు కాకపోయినా పది నుండి పదహారు సంవత్సరాల వయసు కలిగిన పిల్లలు ఆంగ్ల నవలకు ఉద్దేశిత పాఠకులు. తెలుగులో చుదువుకుంటున్న ఈ వయసు పిల్లలను ప్రధానంగా రెండు వర్గాలుగా విభజించవచ్చు. ఒకరు పల్లె ప్రాంతాలకు చెందినవారు, రెండవ వర్గం పట్టణాలలో చదువుకునే పిల్లలు. తెలుగు రాష్ట్రాలలో పల్లె ప్రాంతాలలో చదువుకొనే పిల్లలకు ఇంగ్లీషు సామర్థ్యం తక్కువ. కనుక నవలలోని ఇంగ్లీషు పదాలు వారి పఠనీయత(Readability)కి ఇబ్బంది కలిగిస్తాయి. అలాగే పట్టణ ప్రాంతాలలోని పిల్లలకు తెలుగుపై అవగాహన తక్కువ. అందులోనూ వారు ఇంగ్లీషు మీడియంలో చదువుతారు కనుక నేరుగా ఆంగ్ల నవలనే

చదవగలరు. ఒకవేళ తెలుగు నవలను చదవాలనుకుంటే అనువాదంలోని గ్రాంథిక పదాలు ఇబ్బంది పెడతాయి. లిప్యంతరీకరణ పదాలు, గ్రాంథిక పదాలకు వివరణలు, వ్యాఖ్యానాలు పిల్లల పుస్తకాలు/సాహిత్యంలో ఒక పరిమితికి మించి ఇవ్వడం కుదరదు. ఇచ్చినా వాటిని చూసుకొంటూ చదివే ఓపిక పిల్లలకు తక్కువ. "A child's book is one a child can enter and needs no other guide than the author" (Myless Mc Dowell. 1973: 56). ఇక్కడ మరొక సమస్య కూడా ఉంది. ఆంగ్ల పాఠకులకు హ్యారీపోటర్ మొదటి నవల అందేనాటికి దాని గురించి వారికి ఏమీ తెలియదు. కానీ తెలుగు పట్టణ ప్రాంతాలలోని పిల్లలకు హ్యారీపోటర్ నవల అనువాదం వచ్చేనాటికి సినిమా ద్వారా హ్యారీపోటర్ కథ తెలుసు. సినిమా చూసిన పిల్లలు అనువాదాన్ని చదవడానికి ఆసక్తి చూపించకపోవచ్చు. ఈ సందర్భంలో అనువాద నవల వారిని ఆకర్షించడానికి వస్తువు, ఇతివృత్తం కంటే శైలే ప్రధాన పాత్ర వహిస్తుంది. కనుక తెలుగులో బాలసాహిత్యం అనుసరించిన శైలిని కొంత పరిశీలించి రమాసుందరిగారు హ్యారీపోటర్ అనువాదాన్ని చేపట్టి ఉండవలసింది. తెలుగులోకి అనువాదం అయిన రష్యన్ బాల సాహిత్యం, టామ్ సాయర్, హకెల్ బెరిఫీన్, చందమామ, బొమ్మరిల్లు వంటి బాల సాహిత్య పరిశీలన ఇందుకు ఉపయోగపడుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. భీంసేన్, నిర్మల్. 2000. అనువాదశాస్త్రం. హైదరాబాదు : తెలుగు అకాడమి ప్రచురణ.
2. రౌలింగ్, జె. కె., రమాసుందరి, ఎం. ఎస్. బి. పి. ఎన్. వి. (అనువాదకురాలు). 2014. హ్యారీ పోటర్ 'పరుసవేది. భోపాల్: మంజుల్ పబ్లిషింగ్ హౌస్.
3. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 1994. నవలా శిల్పం. హైదరాబాదు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. Myless Mc Dowell. 1973. Fiction for Children and Adults: Some Essential Differences. Children's Literature in Education. Vol. 10, 50-63.
5. Nicholas Tucker. 1976. Suitable for Children. California: University of California Press.
6. Rowling J.K. 2014. Harry Potter. New Delhi: Bloomsbury Publishing.
7. Susan, Bassnett, Andre Lefevere. 2005. Constructing Cultures: Essays on Literary Translation. Shanghai: Shanghai Foreign Language Education Press.
8. https://www.jkrowling.com/opinions/answers-to-questions/

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ప్రకృతి ఒడిలోకి 'ఒంటరి' పయనం

– డా॥ యస్. విజాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్, డి.కె. ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం).

ప్రపంచీకరణ, పరాయీకరణను తెచ్చిపెట్టింది. ప్రతి అంశం విషయం వ్యాపారమయమయ్యాయి. చివరకు ప్రకృతి ప్రసాదించిన తినే ఆహారం, పీల్చే గాలి, తాగే నీరు కూడా పూర్తిగా వాణిజ్య మయం కావడం బాధాకరం. ఇది ఆలోచింపజేసే విషయం

మంచి అహారపు అలవాట్లే మనిషి ఆరోగ్య రహస్యం, ఎన్నో పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలను ప్రజలు మరిచిపోయారు. పర్యావసానం ఎన్నో ఆరోగ్య సమస్యలు, ఎక్కువ కాలం బ్రతకడం కన్నా, ఎక్కువ ఆరోగ్యంతో బ్రతకడం ముఖ్యం మంచి ఆహారం, అంతకు మించిన ఆరోగ్యకరమైన ఆహారం దొరకడం చాలా కష్టమైపోతుంది. సమాజానికి ఆరోగ్య భద్రతతోపాటు, రైతుకు ఆర్థిక భద్రతనందించడంలో చిరుధాన్యాల పాత్ర గణనీయ మైనది. ప్రభుత్వ సహకారం తోడైతే రైతాంగం 60 ఏళ్ళ నాటి వ్యవసాయ పద్ధతులను తిరిగి ఆచరిస్తారు. ప్రజలకు విషాహారం తినవలసిన అగత్యం తప్పుతుంది. ఈ విషయాన్ని ఆధారంగా చేసుకొని కొంత సాహిత్యం కూడా వెలువడింది. ఇంకా ఎంతో రావాల్సిన ఆవశ్యకతఉంది.

పర్యావరణ పరిరక్షణ నేపథ్యంలో సాగిన అతి తక్కువ నవలల్లో ప్రత్యేకమైంది 'ఒంటరి' నవల మాయమవుతున్న పల్లె జీవితంపై పట్టణ ప్రభావ నేపథ్యంలో సాగిన నవల ఒంటరి. రచయిత రైతు జీవితాలను దగ్గరగా చూసిన రైతునేస్తం, ప్రకృతి ప్రేమికులు సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి గారు, వీరు మట్టిని మొక్కల్ని, పశుపక్ష్యాదుల్ని, ప్రకృతి శక్తుల్ని, వాటితో అనుబంధాన్ని కలిగివున్న మానవ జీవిన గమనాలను అర్థం చేసుకునే నేర్పరులు. అందుకే వీరి నవలల్లో దృగ్గోచరమవుతుంది. అందుకే తానా TANA - Telugu Association of North America) వారి ఉత్తమ బహుమతినీ స్వంతం చేసుకుంది వీరి ఒంటరి నవల.

రాయలసీమ పలుకుబళ్ళు, జాతీయాలు, సామెతలలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది నవల. పాఠకులు రాఘవలోనికి పరకాయ ప్రవేశమూ చేస్తారు, నర్సయ్యను ఆసక్తిగా, వింతగా ఆశ్చర్యంగా గమనిస్తూ వుంటారు.

జంతువుల అరుపుల్ని వాటి భాషగా ఆర్థం చేసుకోలేక మొక్కల స్పర్శను వాటి పలుకులుగా అనువదించుకోలేక, పక్షుల కిలకిలా రావాల్ని వాటి మాటలుగా గ్రహించలేక, వాటితో చెలిమి చేయలేక వాటిని దూరంగా తరిమి నేలను సొంతం చేసుకోవాలని ప్రయత్నించే మనిషికి మన చుట్టూ వున్న పర్యావరణాన్ని కొంతైన అధ్యయనం చేయించే ఒక చిన్న ప్రయత్నమే ఈ ఒంటరి నవల. అంటూ రచయిత నా మాటగా చెప్పుకున్నారు. అలాగే ఈ నవలలో కనిపించే డాక్టర్ రాఘవనూ నేనే, రైతు నర్సయ్యనూ నేను అంటారు.

బీడు భూముల్ని సాగుభూములుగా మార్చే క్రమంలో జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని,రైతుల మార్థత్వాన్ని, సాంప్రదాయక విత్తనాలను, తృణధాన్యాలను విధ్వంసం చేసిన బహుళజాతి సంస్థలవంగడాలను, పల్లెతన స్వరూపాన్ని కోల్పోతున్న దుస్థితిని రచయిత ఈ నవల్లో హృద్యంగా చెప్పారు.

నీలి విప్లవం పేరుతో పంటభూముల్ని చేపలచెరువులు చేసారు. జీవావరణ వ్యవస్థల్ని కాపాడటం అంటే అభివృద్ధికి అవరోధం కలిగించడమే ననుకునే వ్యక్తులు మన పాలకులు. వేలాది ఎకరాల పంటభూముల్ని అడవుల్ని నిర్మూలించి, ఒక మహానగరాన్ని నిర్మిస్తున్నా మంటే నిశ్శబ్దంగా వింటున్న ఘనత మనది. రైతు మనకు ఆహారాన్ని అందించే ఓ యంత్రంకాదు, మన సంస్కృతీ సాంప్రదాయాల్ని పరిరక్షింటి భూమికి వలె తరువాత తరాలకు అందించే ఓ సాధకుడు, సంస్కృతి పరిరక్షకుడు వారసత్వ సంపదలకు కాపలాదారుడు. పర్యావరణ పరిరక్షకుడు, సాధు జంతువుల పాలిటి సంరక్షకుడు.

ఈ నవలలో నాయకులు ఇద్దరు, ఒకరు గుండెలు మార్చగల మహామేధావియైన డాక్టరు పైసా పైసా వెనకేసి కోటీశ్వరుడయ్యాడు. అలాగే జబ్బులూ పోగేసుకున్నాడు దాబు దర్పాలకు ఆధునిక జీవన శైలికి ప్రతీక ఐతే మరొకరు ఇతిహాస పురాణాలను ఔపోసన పట్టి జీవితాన్ని కాచివడబోసిన జ్ఞాని ప్రకృతి పరిరక్షకుడు, డబ్బంటే లెక్కేలేదు. జీవుల్ని అమితంగా ప్రేమిస్తాడు.

శరీరాన్ని పటించుకోకుండా, శరీరంలో పరుగెత్తే రక్తపు వేగాన్ని పట్టించుకోకుండా, శ్వాసగసమాన్ని పట్టించుకోకుండా కేవలం రూపాయి రాకను మాత్రమే కనిపెట్టి ప్రయాణించిన ఒక డబ్బు యంత్రంగా డాక్టర్ రాఘవ తనకుతానే పరిచయం చేసుకుంటాడు.

అతడు ఆధునిక యుగ జబ్బులైన షుగరు, వెన్నెముక నొప్పి, గుండెల్లో అదురు, మనసులో అలజడి కొద్దిపాటి సమస్యకే ఆందోళన చెందే మనస్సు, బానెడిపొట్ట వంగని శరీరంతో ఈ బ్రతుకు బండి నీడుస్తున్నాయి. దేవుడి మీద నమ్మకం లేనివాడు. ఇప్పుడు గుళ్ళు గోపురాలు పట్టుకొని తిరగుతున్నాడు. తన ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం, అడవుల బాట పట్టాడు. సాధువులకు తన సమస్యలు సూచించి పరిష్కార మార్గాలు అడిగాడు తలకాడు ప్రాంతంలో పరిచయమైన ఓ సాధువు బొడ్డు చుట్టూ రాఘవ పొడుచుకునే ఇంజక్షను చూసి

"అరికల భోజనం - ఆకునీడల్లో నివాసం
పొలం మట్టిలో నడక - పచ్చని గరికపై విశ్రాంతి
సెలయేటితో సావాసం - నీటిగుంటలతో సాయంత్రం
కొండకోనల్లో విహారం - కోమ్మల్లోని ఫలాల ఆహారం

తీసుకోవాలి అంటారు, ఆ "అరికెల' కోసం అతని ప్రస్థానం పూనా నుండి మొదలయి, కడపలోని బ్రహ్మంగారి మఠం వద్ద నుండి, జ్యోతిక్షేత్రంలోని కాశీనాయన ఆశ్రమం నుండి ఒంటికొట్టం వైపుసాగింది.

ఆకలి అంటే ఏమిటో తెలియకపోవడం ఆధునిక మానవుడి సమస్య. శ్రమజీవికి సహజసిద్ధమైన ఈ లక్షణం నాగరికుడికి అందని ద్రాక్షలుగా మారడం విచారకరం.

అరికెలు, కొర్రలు సామలు, ఊదలు, అండుకొర్రలు చిరుధాన్యాలు, ఆరోగ్యాన్నిచ్చే సిరిధాన్యాలు, వరి గోధుమల్లాకాక వీటి ఉత్పత్తికి అతికొద్ది నీరు అవసరం. చిరుధాన్యపంటలను వివిధ పర్యావరణ పరిస్థితులలో 15 సెం.మీ లోతుకి తక్కువగా ఉన్న భూములలో సాగు చేయవచ్చు. వీటి సాగుకి సారవంతమైన భూములు అవసరం లేదు. విస్తారంగా ఉన్న మెట్ట భూముల్లో సిరులు కురిపిస్తాయి. వీటిని సంవత్సరం పొడుగునా సాగు చేయవచ్చు. ఇంతటి మహత్తర పంటలు అదృశ్యమవడానికి కారణం పారిశ్రామికీకరణ.

ఒకప్పుడు వరిగోదుమలు ధనవంతుల ఆహారం, చిరుధాన్యాలు పేవారి ఆకలిని చల్లార్చేవి. ప్రుసుత్తం ధనవంతుల అనారోగ్యాలకు ఉపశమనంగా మారాయి సిరిధాన్యాలు, అందుకే డాక్టర్ రాఘవ అరికెలను అన్వేషిస్తూ ప్రకృతి ఒడిలో సేదదీరడానికై ప్రయాణం మొదలు పెట్టాడు. అలా అలా వెదుకుతూ కడపలోని బ్రహ్మంగారి మఠానికి, అక్కడి నుండి జ్యోతిక్షేత్రంలో ఉన్న కాశీనయన ఆశ్రమానికి చేరుకున్నాడు. ఆశగా, అరికెలు, పండించే వ్యక్తిని వెతుక్కుంటూ 'ఒంటరి'గా అక్కడ విశిష్ట రైతు నర్సయ్యను రెప్పపాటులో మిస్అయ్యాడు. అతన్ని వెతుక్కుంటూ ఒంటకొట్టం వైపు వెళ్ళాడు.

ప్రకృతి ఒడిలో జీవించాలంటే దాన్నుంచి మనం పొందడమే కాదు. మన నుంచి దానికోసం కోల్పోవడం కూడా ఒక ధర్మమే అన్నది నర్సయ్య ఫిలాసఫి రాఘవ నర్సయ్య గురించి ఆరాతీసినప్పుడు పల్లెవాసులు అతని గురించి అవుకాడ ఆవంత, దూడకడ దూడంత అంటూ, అతని వ్యక్తిత్వాన్ని చెబుతూనే 'అది పిట్ట, ఏ పొదల్లో దూరుంటాదో, ఏ కొమ్మమీద కూకొనుంటాదో అంటూ అతని ప్రకృతి ప్రయత్నాన్ని వెల్లడిస్తారు పల్లెవాసులు.

"గుండెను పీకి వేరే గుండెల్ని తగిలించేంత వైద్యులంటారట. కనకుండానే పిల్లల్ని పుట్టించేంత వైద్యముందట కదా! ఇదేంది సారూ, గడ్డివాములో సూదిని వెదికినట్టు వంకల్లో, వాగుల్లో వైద్యాన్ని వెదుకుతున్నావు" అంటాడు నర్సయ్య. సాధువు చెప్పిన వాతావరణ

పరిస్థితులు కూడా నర్సయ్య కొట్టం దగ్గర అతనికి కనపించాయి. అటమీది సొరకాయ బుర్రలోంచి మూడేళ్ళ క్రిందట అరికల విత్తనాల్ని నర్సయ్య అపురూపంగా తీస్తుంటే రాఘవ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అక్కడే అరికల పంట చేతికొచ్చే ఆరు నెలలూ ఉండి పోవాలని నిర్ణయించుకుంటాడు. తగిన ఏర్పాట్లు నర్సయ్య ద్వారే చేయించుకుంటాడు.

అరికపంట ద్వారా తన జబ్బుల్ని తగ్గించుకోవాలని రాఘవ ఆలోచిస్తే, అంతరించిన అరికెల జాతిని భూమ్మీద నిలబెట్టాలని, అరికెల వంశం నాశనం కాకుండా చూడా లని నర్సయ్య తపనపడుతున్నాడు. ఆ ఇద్దరి ఆలోచన లకు ఎంత తేడా? ఒకరిది స్వార్థం, మరొకరిది లోక కళ్యాణం ఏదేమైనా, ఈ భూమ్మీదనుండి ఒక జాతి అంత రించిపోవడం అత్యంత విషాదకరం. అంతరించకుండా నిలబెట్టాలనుకోవడం సంతోషకరం.

నా చేయి కిందుంటే నేను తట్టుకోలేను, యాడా చెయ్యి చాపి దేహీ అని అడుక్కున్నోన్ని కాను. ఉంటే తింటా, లేకుంటే నీళ్ళు తాగి పానాలు పట్టుకొని బతికుంటా ........ అన్న ధీమా అతనిది ఆ ఆత్మస్థైర్యానికి రాఘవ ఎప్పటి కప్పుడూ కుంచించుకు పోతూనే, స్ఫూర్తి పొందుతున్నాడు.

ఆ వూర్లోని కష్టజీవులు, పొలాన్ని లొంగదీసుకునేందుకే ప్రయత్నిస్తున్నారు తప్ప, పరిస్థితుల నుండి పారిపోవడం లేదు. విశ్రాంతిగా కూర్చోవడమంటే, పనీపాటా లేకుండా వుండటం, అది తమవల్ల కాదన్నారా కష్టజీవులు, ఎన్ని సమస్యలొచ్చినా, నిలదొక్కుకొని ఉండగలిగే గుండె నిబ్బరం ఈ పల్లెవాసుల స్వంతం మనుషులతో మనం మాట్లాడినట్లు వారు పశువులతో మాట్లాడటం వింతగా వుందతనికి.

అరికపంటకు అయ్యే ఖర్చు భరిస్తానని రాఘవ అన్న ప్పుడు " డబ్బుతో డబ్బు పండుతుంది గాని, పంటలు పండవులే సారూ, అంటాడు నర్సయ్య, అరికపైరు బ్రతకదేమోనని రాఘవ కృంగిపోతే బతికించేందుకు కొండంత ధైర్యంలో అతడు దారులు వెతుకుతున్నాడు. తన పైరుపట్లా, తన పొలం పట్లా, తను చేస్తున్న పనిపట్లా అతడు పెంచుకున్న మానసిక సంబంధాలను చూస్తే అద్భుతంగా అనపిస్తుంది. వాసననూ, శబ్దాన్ని గుర్తు పట్టడంలో సిద్దహస్తుడు నర్సయ్య.

రాఘవ కూడా, తాను డాక్టరుననే అహంకారాన్ని వదిలి, నర్సయ్య వద్ద మొక్కల్ని గుర్తుపట్టడం నేర్చుకున్నాడు. వాసనల్ని, శబ్దాల్ని పసిగట్టడం ఆ క్రమంలో జ్ఞానేంద్రియా లకు పనిచెబుతున్నాడు. ఆ క్రమంలో తమ విధుల్ని మరచిపోయిన అవయవాలకు తిరిగి పని కల్పిస్తున్నాడు.

సౌకర్యాలు లేకపోవడం వెనుకబాటు తనం కాదని, అవి లేకుండానే తాము బ్రతుకుతున్నామని, తమ బ్రతుక్కి ఆ చీడపీడలు అంటనందుకు సంతోషపడ్డాడు నర్సయ్య, తన కొడుకు చెట్లని అమ్మమన్నా, పిట్టల ఆవాసం కోసం చెట్లను కొట్టలేదు. కుందేళ్ళ నివాసం కోసం పొదలు ద్వంసం చేయలేదు., ఆ ప్రకృతి ప్రేమికుడు ఉన్న పొలాన్నే సాగుచేస్తున్నాడు. కొడుకును వదలు కున్నాడు. కాని, చెట్లను వదలుకోని సాహసి వాని ఒక్కని కోసం ఈ చోట్లను జీవుల్ని వదలుకాబుద్దికావడం లేదు, అంటాడు. చెట్ల కదలికల్నీ, శరీర స్పర్శనూ, సూచికలుగా ప్రకృతి మార్పుల్ని కనుక్కునే జ్ఞాని నర్సయ్య, పంటచేలును తీవ్రగాలి నష్టపరుస్తున్న సమయంలో ప్రకృతినే ఎదిరించి గద్దిస్తున్న పురాణకాలపు మహర్షి మనకు నర్సయ్యలో కనిపిస్తాడు. అపురూపంగా పెంచిన అరికచేనును గొర్రెలు మేస్తే, ఆ చేను మేసింది గొర్రెలు కాదు, కరువు అనగలిగిన ధీశాలి అతడు, నర్సయ్య ప్రతి కదలికా, ప్రతిమాట రాఘవకు స్ఫూర్తినిచ్చాయి. అందుకే అతడు పురాతన వృక్షాల్ని, తద్వారా అనేక పక్షిజాతుల్ని సంరక్షించే వ్యక్తిగా ఉద్యమంగా మారుతాడు. అరికలు తినకముందే తన శరీరం, మనస్సు తన స్వాధీనంలోకి రావడాన్ని, తనలోని రోగాలు మాయమైపోవడాన్ని గమనించాడు. పంట తీసుకొని ఇంటికి పోలేదు. జీవితాంతం అక్కడే ఉండాలని నిర్ణయం తీసుకున్నాడు. 'ఒంటరి'గా వచ్చిన వాడు ఎందరినో కూడగట్టుకున్నాడు. ఎందరికో స్ఫూర్తిదాయక మవుతున్నాడు. అభినందనీయమే కదా! ప్రకృతి ఒడిలోకి మనిషి పయనం.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# చింతామణి నాటకం - స్త్రీలోలత్వం

- డా॥ గరికపాటి హరిబాబు, తెలుగు లెక్చరర్, ఎస్.జి.వి.ఓరియంటల్ కళాశాల, తిమ్మసముద్రం, ప్రకాశం జిల్లా.

ప్రకృతిలో జీవించే జీవరాశుల్లో అత్యంత గొప్ప జీవరాశి మానవుడని, మానవులే నిర్ణయించుకొని జీవిస్తున్న సమాజం ఇది. ఈ మాట వాస్తవం, ఎందుకంటే మాన వుడికి ఉన్న మేథస్సు, జ్ఞాపకశక్తి మరియు మాట్లాడ గలగటం, ఇవే ప్రధాన కారణాలు. ఈ లక్షణాలు ఇతర జీవులకు లేకపోవటం వల్లనే మానవులు ఈ భూమి మీద గొప్పవాళ్ళు అయ్యారు. మానవుడు గొప్పవాడు ఎప్పుడు అవుతాడు అంటే! పై మూడు లక్షణాలు ఉన్నంత మాత్రాన గొప్పవాడు కాడు. మానవత్వం ఉన్నప్పుడు మాత్రమే గొప్పవాడు అవుతాడు. ఇతర "జీవరాశులకు హాని చేయకుండా జీవించటమే మానవత్వం". ఇది అసాధ్యం. ఇతర జీవులకు హాని చేయకుండా జీవించుట కష్టం! కాని, కనీసం మానవులకు హాని చేయకుండా జీవించటం కూడా మానవునికి సాధ్యపడుటలేదు. అందరం మానవులమే - మానవత్వం లేని మానవులం.

మానవులు అన్న పదంలో పురుషుల-స్త్రీలు ఇద్దరూ ఉన్నారు. మనుషుల్లో మానవత్వం నశించడానికి ఇద్దరూ కారకులే. మానవులు చనిపోయే వరకు అనేక విషయాలతో సంబంధం ఉంటుంది. అనేక విషయాల్లో "నీతి, నియ మాలు" పాటించక పోయినా, కనీసం "స్త్రీ, పురుష" సంబంధాల్లో అయినా 'నీతి నియమాలు' పాటించాలి. ఇది కూడా మానవత్వమే. స్త్రీ, పురుష బంధాలు - సత్సంబంధాలుగా లేనప్పుడు సమాజం నాశనం అవు తుంది. స్త్రీ, పురుషులిద్దరూ యుక్త వయుస్సుకి వచ్చి నప్పటి నుండి వారి ప్రవర్తనా నియమావళిని బట్టే సంఘ నిర్మాణం ఆధారపడి ఉంటుంది. స్త్రీ పురుషుల సంబంధా లను ఆశ్రయించుకుని కుటుంబ వ్యవస్థ బలోపేతం అవుతుంది. కుటుంబ వ్యవస్థ పవిత్రంగా ఉన్నప్పుడు మంచి సమాజం నిర్మితమవుతుంది. ఇది మానవ జీవనానికి శ్రేయస్కరం.

కుటుంబ వ్యవస్థ శిథిలమవ్వడానికి ప్రధాన కారణం, పురుషునిలో ఉండే "స్త్రీలోల త్వం". స్త్రీలోలత్వం వలన పురుషుడు ఎన్ని నీచమైన పనులు చేస్తాడో, ఏవిధంగా భ్రష్టుపట్టి పోతాడో! కుటుంబాలు ఏవిధంగా పతనమై పోతాయో అన్న విషయాన్ని **"కీ.శే. కాళ్ళకూరి నారా యణరావుగారు, చింతామణి నాటకం"** ద్వారా సమాజానికి కళ్ళకు కట్టినట్లుగా చూయిం చారు. చింతామణి నాటకంలో **"బిల్వమంగుళుడు, భవానిశంకరుడు, సుబ్బిశెట్టి, చింతామణి"** పాత్రలు ద్వారా స్త్రీలోలత్వం అంటే ఏమిటో దానివలన మనిషి కీర్తి ప్రతిష్టలు, పాండిత్యం, పరువు మర్యాదలు, ప్రేమానురాగాలు, సిరి సంపదలు, అంతరించి పోయి, కుటుంబ సంబంధాలు నాశనమై పోయి చివరకు ప్రాణాలు కూడా పణంగా పెట్టే సంద ర్భాన్ని దృశ్యరూపంగా 'కాళ్ళకూరి నారాయణరావుగారు ఈ సమాజానికి అందించారు.

ఈనాటకంలో వైశ్యకులానికి చెందిన సుబ్బిశెట్టి స్త్రీలోలుడై జీవిస్తాడు. వేశ్యల పట్ల వ్యామోహం పెంచుకుని, తండ్రి సంపాదించిన ఆస్తులను పోగొట్టు కుంటాడు. తను చేస్తున్న వ్యాపారాలు అన్నీ దివాళా తీస్తాయి. కిరాణా షాపులో ఉండే ఖరీదైన వస్తువుల్ని వేశ్యలకు పంపిస్తాడు. తండ్రి ఎంత చెప్పినా ఆలకింపడు. చూడడానికి నల్లగా, అందవికారంగా ఉంటాడు. చింతా మణి అనే వేశ్య రూపానికి రంభలా ఉండేసరికి, ఆమె స్పర్శతగిలితే చాలు జన్మ ధన్యం అవుతుందను కుంటాడు. చింతామణి అతన్ని కూర్చోండి కొంచెం అత్తరు రాస్తాను అని బుగ్గపట్టి లాగుతుంది.

**సుబ్బిశెట్టి :** "వహ్వా! వహ్వా! యేవి సుకం, యేమిసుకం, యిన్ని
సేతులు చూశానుకాని-యీపాటి సెయ్యి కాపణ్నేలేదు.

యెదవసొమ్ము యేంపోతే యేం లెక్క?
సచ్చినాయిలాంటో
ళ్ళ పాదాలకడ పడిసావాలి'' (పేజీ.19)

చింతామణి చెయ్యి ఒకసారి తాకేసరికి పారవశ్యానికి లోనై. వెధవ డబ్బు ఎంత పోతే మాత్రం ఏమి. ఇలాంటి స్త్రీల పాదాల దగ్గర ప్రాణం పోయినా జన్మధన్యం అవుతుందని, పుణ్యలోకాలకు పోయినంత అనుభూతికి లోనవుతాడు.

చింతామణి సుబ్బిశెట్టిని చేయిపట్టుకుని కుర్చీలో కూర్చోబెట్టే ప్రయత్నం చేస్తుంది.

**సుబ్బిశెట్టి** : ''అబ్బో! అబ్బో! యేవిసుకం, యేవిసుకం!
ఒళ్ళు తగిలేసరికి
తామర మీదుడకు నీళ్ళోసుకున్నట్లు కళ్ళు మూసుకు
పోతున్నాయి! ఓరయ్యల్లో యిది సుకాల పుట్టుగాని సామాన్నెం
సానిగాదర్రో'' (పేజీ.16)

ఏది నిజమైన సుఖమో యెరుగలేని అమాయకపు స్థితిలో సుబ్బిశెట్టి ఉన్నాడు. ఇది అతని తప్పుకాదని పిస్తోంది. వెలది అనే వ్యసనంలో ఉన్న ప్రభావంగా భావించవచ్చు.

చింతామణి సుబ్బిశెట్టిని, నీవు రంగనాయకి ఇంటికి వెళుచున్నావు. ఆమె చెడు బుద్ది కలిగినది, పైగా ఆమె రూపం చండాలంగా వుంటుంది. నీయంత అందగాడు అసలు ఆమె దగ్గరకు వెళ్ళటం ఏంటి! అని నిలదీస్తుంది.

**సుబ్బిశెట్టి** : ''ఇదిగో! యీ మాటినుండి యిహ దాని గుమ్మంతొక్కినట్టు తెలిస్తే - కాం(డించి కళాపులాగ మొహానుయ్యి! సరేనా''! (పేజీ నెం.14)

ఒక వేశ్య ఇంకొక వేశ్య ఇంటికి ఎందుకు వెళుతున్నావు అని నిలదీసినప్పుడు ఈసారి వెళ్ళను, వెళ్ళితే మొహాన ఉయ్యి అన్నాడు. ఇదే విషయమై ఇంట్లో పవిత్రంగా ఉండే భార్య భర్తను నిలదీసి, వేశ్యదగ్గరకు ఎందుకు వెళుతున్నావు అని ప్రశ్నిస్తే లాగి లెంపకాయ కొడతారు ఈ పురుషులు. స్త్రీలోలత్వం వల్ల మనిషి మానవత్వం కోల్పోతున్నాడు. సుబ్బిశెట్టి వ్యాపారాలు పోగొట్టుకుని, ఆస్తులు పోగొట్టుకుని, - చివరకు వీధులవెంట అట్లు అమ్ముకుని జీవిస్తాడు.

వేశ్యాలోలత్వం వల్ల భ్రష్టుపట్టిన మరొక వ్యక్తి భవానీ శంకరుడు. చిన్న వయస్సులోనే చదువు చాలించి, యుక్త వయస్సు వచ్చిన తరువాత వివాహం చేసుకుని తండ్రి తరపున మరియు అత్తమామలు తరపున వచ్చిన ఆస్తుల న్నింటిని చింతామణికి ధారపోస్తాడు. చింతామణి పట్ల పిచ్చివాడై తిరుగుతాడు. తన భార్య ఊర్వశి లాంటి అంద గత్తె. అయినా చింతామణి ఏది కోరితే అది అందిస్తాడు. చింతామణి అతని దగ్గర ఆస్తులన్నీ హరించిపోయే దాకా అతన్ని వలపిస్తుంది. ఆపై పొమ్మంటుంది. ఒకరోజు ఉత్త చేతులతో చింతామణి ఇంటికి వస్తే! చింతామణి, మాయమ్మ నిన్ను రానివ్వరాదని నన్ను నానాబాధలు పెట్టింది నేను ఆ బాధలు భరించలేను. ఇక నీదారి నీది! నా దారి నాది అంటుంది.

**భవానిశంకరుడు** : ''అమ్మయ్యో! అట్లయిన నిన్ను విడచి నేను బ్రతుకగలనా చింతామణి!

చ॥ విడిచితి బంధువర్గము - వీడితి బ్రాణములొగ్గు మిత్రులన్
విడిచితి నిల్లువాకిలియు - వీడితి భార్యను ప్రాత చెప్పుగా
విడిచితి నెగ్గు సిగ్గులర - విందదళేక్షణ! నీ నిమిత్తమై
విడువనె దేహ మీవు నను-వీడు నవస్థ తటస్థమైనచో!

బంధువులను ప్రాణమిత్రులను ఇల్లువికిళ్ళను సిగ్గుని బిడియాన్ని అన్నింటినీ నీకోసం వదిలేసాను. నాభార్యను కూడా పాతచెప్పులాగా భావించి వదిలేసాను! నీకోసం. నీవు లేకుంటే ఈజీవితం ఎందుకు, ఒక్క రోజైనా నిన్ను వదిలి బ్రతుకగలనా! నీవు నన్ను వదిలే పరిస్థితి కనుక సంభవిస్తే నాకు ఈ దేహం ఎందుకు చింతామణి అని దుఃఖిస్తాడు. అంతేగాక నాకు డబ్బు ఉన్నంత వరకు ఏమైనా తక్కువ చేసానా అంటాడు.

**భవానిశంకరుడు** : తాతల నాటి క్షేత్రము లెల్ల తెగనమ్మి
దోసిళ్ళతో దెచ్చి పోసినాను
తండ్రికట్టిన యిల్లు-దాయాదులకు విక్ర
యించి వస్తువులు చేయించినాను
అత్తవారిచ్చిన-అంటుమామిడితోట
నీవుకోరగ వ్రాసి - యిచ్చినాను
కులసతి మేని సొమ్ములు పుస్తెతో గూడ
గొనివచ్చి నీయింట గుప్పినాను
కులమువారెల్ల నీకిది కూడదన్న
భార్య నూతికి గోతికి బరుగులిడిన
లెక్కసేయక నీయిల్లు కుక్కవోలె
గాచికొని యిట్టులున్నాను కలికి నేను!

ఒక వేశ్యకోసం - తాతలనుండి, తండ్రి నుండి, అత్త మామల నుండి వచ్చిన ఆస్తులు ధారపోయడమే కాకుండా! భార్య మంగళసూత్రాలను కూడా తెచ్చి చింతామణికి ఇస్తాడు. సాటి కులస్తులు ఇది మంచిపని కాదన్నా లెక్కచేయకుండా అందరూ ఛీ కొట్టినా వెలయాలి ఇంటి ముందు కుక్కలాగా తిరుగుతాడు.

భవానిశంకరుడు చెడిపోయింది కాకుండా ఎంతో పవిత్రంగా జీవించే ప్రాణస్నేహితుడు బిల్వమంగళుడిని కూడా చింతామణి దగ్గరకు తెచ్చి పరిచయం చేసి! చెడిపోవడానికి కారకు డువుతాడు. బిల్వమంగళుడి గుణగణాల గురించి తానే కీర్తించి చింతామణికి ఈవిధంగా చెబుతాడు. చింతామణి ప్రశ్నిస్తూవుంటుంది.

“అతను మహా పండితుడు! వ్యాసుని కంటెనా? పరమ నైష్టికుడు! విశ్వామిత్రునికంటెనా? బహునీతిమంతుడు! విప్రనారాయణునికంటె నా? పరస్త్రీపరాన్ముఖుడు! ఋష్య శృంగునికంటెనా?”

**చింతామణి** : ఇంతులు తారసిల్లువఱ-కే పురుషాగ్రణు
లెంతలేసి సా
మంతయు లాడినం, బిగువు మాటలు
పల్కిన గామణీ మణీ
కాంత దృపంచలాగ్నికలి-కాలవ మించుక
పాటి సోకెనో
నెంతటి పండితుండయిన-నిట్టె కరుంగదె
వెన్న పోలికన్. (పేజి నెం.26)

ఎంతటి పండితుడయిన-పరాయి స్త్రీలు-అందునా అందగత్తె పాండిత్యం గలిగి, మాటకారితనంవుంటే ఎంతటి నిష్టాగరిష్టుడైనా ఆడగాలి సోకగానే పడిపోతా రని, వారిలోని స్త్రీలోలత్వం బయటపడుతుందని చింతా మణి గట్టి నమ్మకంతో చెబుతుంది.

అంతటి సంస్కార వంతడైన బిల్వమంగళుడు కూడా చింతామణి వలలో చిక్కుకుంటాడు. జ్ఞానహీనుడై పోతాడు, చింతామణే సర్వస్వం అనుకుంటాడు మహా పతివ్రత అయిన భార్యను చివరకు వదిలేస్తాడు. గాలివాన కురుస్తున్నప్పుడు-చింతామణికి గాలివానంటే భయమని తనను తలచుకుంటూ ఇంటినుండి బయలుదేరి వెళతాడు. తన భార్య గాలివానలో వెళ్ళవద్దని వారించినా పట్టించుకోకుండా వెళతాడు. మార్గమధ్యంలో కాలువ వస్తుంది. భర్తకోసం భార్య వెతుకుతూ వస్తూ కాలుజారి కాలువలో పడి మరణిస్తుంది. ఆశవాన్ని అరటి బొత్తగా భావించి దాని సహాయంతో కాలువను ఈది ఆవలికి చేరుకుంటాడు. ఆవలికి చేరుకున్న తరువాత అది శవమని గ్రహిస్తాడు. కాని అది తన భార్య శవమని గ్రహించలేకపోతాడు. భవానిశంకరుడు ఆస్థులు పోగొట్టు కుని చివరకు వీధుల వెంట మంచి నీళ్ళు అమ్ముకుని బ్రతుకుతాడు. సుబ్బిశెట్టి, భవానిశంకరుడు, బిల్వ మంగళుడు ముగ్గురూ స్త్రీలోలత్వం వల్ల బికారులవుతారు.

## ముగింపు :

మనుషులు మానవత్వం కోల్పోయి బ్రతుకుతున్నారు. మానవత్వం కోల్పోవడానికి అనేక కారణాల్లో స్త్రీలోలత్వం కూడా ఒకటి. ఇది ప్రతి పురుషునిలో ఉండి, అనేక రూపాలుగా బహిర్గతమవుతుంది. పురుషునిలో ఉండే ఈ స్త్రీలోలత్వం వల్ల అనేక మంది, పరాయి స్త్రీల పట్ల ఆకర్షితులయ్యి భార్యలను హింసిస్తున్నారు. ఇది మాన వత్వం కోల్పోవడమే అవుతుంది. ‘‘చాలామంది భార్యా

వ్యామోహంతో కన్న తల్లిదండ్రులను పట్టించుకోకుండా హింసిస్తారు''. ఇది కూడా వ్యామోహమే-స్త్రీలోలత్వమే. స్త్రీలోలత్వం వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబం కన్నతల్లి దండ్రులు, సమాజం-ఏవిధంగా విచ్ఛిన్నమవుతాయో నన్న విషయాలను కొన్ని తరాలపాటు సమాజానికి తెలియచేస్తూ మానవ సమాజ హితాన్ని కోరుకున్న కీ॥శే॥ కాళ్ళకూరి నారాయణ రావుగారు నిజంగా ధన్యజీవులు. మానవత్వం లేని మనిషి జీవితం వృథా. సప్త వ్యసనాల్లో ఒకటైన ''ఈ వెలది'' అనే వ్యసనాన్ని జయించి బ్రతకగలికిన వారే నిజమైన మనుషులు. స్త్రీలోలత్వంతో జీవితాలను నాశనం చేసుకొనే వారికి చింతామణి నాటకం కనువిప్పు కలిగిస్తుం దని ఆశించుదాం...

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ''చింతామణి నాటకం'', కీ॥శే॥ కాళ్ళకూరి నారాయణరావుగారు - మణికంఠ పబ్లికేషన్స్.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# జాషువా పిరదౌసి - స్త్రీ పాత్ర చిత్రణ

- డా॥ విస్సాలి శంకరరావు, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై,

నాకు గురువులు ఇద్దరు పేదరికం, కులమత భేదం. ఒకటి నాలో సహనం నేర్పితే, మరోకటి నాలో ఎదిరించే శక్తిని పెంచిందేగాని బానిసగా మార్చలేదని, ఆ స్ఫూర్తితో దారిద్ర్యాన్ని, కులమత భేదాన్ని చీల్చి చెండాడి నేను మనిషిగా నిరూపించుకుంటానని శబథం చేసిన నవయుగ కవి చక్రవర్తి, విశ్వనరుడు గుర్రం జాషువాగారు ఒక్కరే.

ఏ అంశాన్ని కావ్య ఇతివృత్తంగా ఎంచుకున్న తనదైన ప్రత్యేక ముద్రతో చైతన్య పరచగల శైలి జాషువాది. తెలుగు సాహిత్యంలో వారి రచనలు అన్నీ సాహితీ విస్ఫోట నాలే. జాషువా కావ్యాలలో అనేక ముద్రణలు పొంది విమర్శకుల చేత కూడా ప్రశంసింపబడిన విశిష్ట కావ్యం ' పిరదౌసి'.

## పిరదౌసి కావ్యరచనా నేపథ్యం :

ఈ కావ్య రచనానేపద్యంలోనే ఆ ప్రత్యేకత కనిపిస్తుంది. ఇది కేవలం కల్పిత కథ కాదు. ఇది ఒక చారిత్రక కథ. ఒక మాసపత్రికలో గజనీమహమ్మద్‌కు సంబంధించిన పిరదౌసి గురించి చదివి స్పందించిన జాషువ దానిని ఒక కావ్యంగా రాసి 1932లో తొలి సారిగా ముద్రింప జేశారు. దీనిని శ్రీసింగరాజు లక్ష్మీనారాయణ గారికి అంకితం ఇచ్చారు.

## పిరదౌసి - ప్రధాన కథ :

ఈ కావ్యంలోని కథ చాల చిన్నది. మెత్తం మూడు ఆశ్వాసాలతో నిండి ఉన్న కథ. గజనీ మహ్మద్ భారత దేశంపై 18సార్లు దండెత్తడం, తన వంశ చరిత్ర శాశ్వతంగా ఉండడానికి ఒక గ్రంథం రాయమని పిరదౌసిని కోరడం, ప్రతి ఫలంగా ఒక్కొక్క పద్యానికి ఒక్కొక్క బంగారు నాణెం ఇస్తానని వాగ్ధానం చేయడంతో మొత్తం 60వేల పద్యాలతో 'షాహనామా' అనే పేరుతో ఒక గ్రంధాన్ని రాసి 3నెలల పాటు గజనీ సభలో చదివి గజనీకి అంకితం ఇవ్వడం, రాజు ఆడిన మాట తప్పి బంగారు నాణెలకు బదులు వెండినాణెలు పంపడం, వాటిని పిరదౌసి నిరాకరించడం, రాజును నిందిస్తూ లేఖ రాయడం, రాజు ఆగ్రహించి కవిని వధించమని చెప్పడం. కవి తప్పించుకుపోవడం.

భార్య బిడ్డతో అడవిలో ప్రయాణం చేయడం, తన దురదృష్టానికి చింతించడం, ఆ అడవిలో ప్రకృతి సౌందర్యాన్ని చూసి పులకరించి పోవడం, ఈశ్వరుని స్తుతించడం, చివరకు భార్య బిడ్డతో అడవిలో చిక్కుకుపోవడం, ఆకలి దప్పికలతో అల్లాడిపోవడం, బోయవాని సూచనలతో తూసు నగరానికి చేరడం, తనకు జరిగిన ఆవమానానికి కృంగిపోవడం. రాజు తన తప్పు తెలుసుకుని బంగారు నాణెలు పంపడం, అదే సమయంలో పిరదౌసి కవి చనిపోయి వారికి ఎదురు పడడం, పిరదౌసి కూతురు కూడా ఆ బంగారు నాణెలను తిరస్కరించడం పశ్చాత్తపంతో రాజు తన తప్పును గుర్తుగా ఆ కవి పేరుతో ఒక సత్రం నిర్మించడం ఇది సంక్షిప్తంగా ఈ కావ్య కథ.

## పిరదౌసి - స్త్రీ పాత్రల చిత్రణ :

ఈ కావ్యంలో స్త్రీల వ్యక్తిత్వం పట్ల జాషువా ముద్ర ఎలా ఉందో పరిశీలించాలంటే ఆ రచన నైపుణ్యం, కధాకథనం, వర్ణనలు, శిల్ప సౌందర్యంతో పాటు విశిష్టమైన పాత్ర చిత్రణను కూడా పరిశీలిస్తే ఈ కావ్యం గొప్పతనం తెలుస్తుంది. ఈ పాత్ర చిత్రణలో కూడా స్త్రీ పాత్రలు చిత్రణ ఈ కావ్యానికే వన్నె తెచ్చె విధంగా తీర్చిదిద్దారు. ఈ పాత్రలను పరిశీలిస్తే జాషువా వ్యక్తిత్వంతో పాటు స్త్రీలపట్ల వారికి గల గౌరవం, అభిమానం ఎలాంటిదో స్పష్టంగా తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ఈ పిరదౌసి కావ్యంలో స్త్రీ పాత్రల చిత్రణ తీరుతెన్నులను పరిశీలిద్దాం.

## పిరదౌసి - స్త్రీ పాత్ర చిత్రణ :

ఈ పిరదౌసి కావ్యంలో ప్రధానం రెండు స్త్రీ పాత్రలు దర్శనమిస్తాయి. అవి ఒకటి ''షాహనామా'' రచనా క్రమంలో పిరదౌసికి ఒక రోజు కలలో వచ్చిన స్త్రీ, రెండవది

పిరదౌసి కుమార్తె. ఈ రెండు పాత్రలు ఈ కావ్యానికి ఎంతో వైవిద్యాన్ని, విశిష్టతను సతరించి పెట్టాయి. రెండు పాత్రలు కూడా భిన్నమైన పాత్రలు. ఈ రెండు పాత్రల ప్రవేశం కూడా కీలకమై ఘట్టాలే. ఆ సందర్భాలలో ఈ పాత్రలు లేకపోతే కావ్యానికి ఎంతో లోటు ఏర్పడుతుంది. అంతెందుకు అసులు కథే ముందుకు సాగదు, పిరదౌసి షాహనామా గ్రంథ రచనలో ఎంత ఏకగ్రతతో ఉన్నారో ఈ పద్యం ద్వారా తెలుస్తుంది.

**తే.గీ.** వసుధ శాసింపగల సార్వభౌముడగును
ధీరుడగు, భిక్షకుం డగు, దీనుడగును
దు:ఖితుం డగు నిత్యసంతోషి యగును
సత్కవి ధరింపరాని వేషముల గలవె?

**చం.** తెలుగుగవిత్వపుంజిగి, విదేశపుగైతలచెన్ను, ద్రావిడే
యుల కవనంబులోని పసయుం బొసగన్ రచి
యించుచుండె గే
వలరసబంధురం బగు ప్రబంధము, సర్వపదార్థ
ధర్మముల్
దెలియ దదంతరాంతరవిలీనత గొండొకపిచ్చి
వానిగన్

పిరదౌసి అత్యున్నతమైన గ్రంథరచనకు శ్రీకారం చుట్టి పారసిక గ్రంథాలను పరిశీలించి తీయినైనా పదాలను సమకూర్చుకుని, చక్కని అలంకారలను ఎంపిక చేసుకుని, శాసనాలను అన్ని కదిలించి ఆ రాజు చరిత్రలోనే సత్యాన్ని జారనీక.... ఒకసారి సార్వభౌముని గాను, ఒకసారి ధీరుడు గాను, మరోసారి బిక్షగానిగాను, అలాగే దీనుడుగాని రకరకాలు పాత్రలో పరకాయ ప్రవేశం చేసి అత్యుతమైన గ్రంథ రచనను ఏకాగ్రతతో రచిస్తూ ముందు సాగు తున్నాడు. ఇక్కడ విషయం గమనించాలి. ఈ పద్యాన్ని పరిశీలిస్తే ఒక గొప్పరచన చేయలనేకునే వారి లక్షణాలు ఎలా ఉండాలో బోదిస్తుంది. ఇటువంటి సమయంలో జరిగిన ఒకనొక విశిష్ట సంధర్భం. అదే స్వప్న వృత్తాంతం.

## పారసిక స్త్రీ పాత్ర :

పిరదౌసి కావ్యాన్ని కమనీయంగా రసవంతంగా రాస్తున్న రోజుల్లో ఒక రోజు రాత్రి ముసురుకొని వచ్చే తలపుల రసావేశాన్ని కలుపుకొని పూల పాన్పుపై హాయిగా పడు కొన్నాడు. ఆ సమయంలో ఒక అద్భుత కల వస్తుంది. ఆ కలలో ఒక పారశీక స్త్రీ పిరదౌసి చెంతకువచ్చి ఓ... కవి వరేణ్యా! నా కోరిక తీరుతుందా! నా రూపం నీకు నచ్చిందా! నీకు భార్యనవుతాను, నీ కవితకు తల్లినవుతాను! అని ఆమె సౌందర్యాన్ని గురించి ఇలా చెబుతుంది.

**చం॥** చెలువము సౌరభంబు వెదచిమ్మెడు లేత
గులాబిమొగ్గకున్
దుల యగు నాదుజవ్వనము దోసిట బట్టి భవత్ప
దాంబుజం
బులకిడ నిల్పితిం బ్రణయపూజకు వేళ యతి
క్రమించె నీ
కులసతి నయ్యెదం గవితకున్ జిరకాలము తల్లి
నయ్యెదన్

**ఆ.వె॥** ముద్దరాల, నంతిపురుల నుండెడుదాన
దెగువ బూని, సిగ్గుతెరలు చీల్చి
బయలుపడిన నాదు పావన స్నేహంబు
జెప్ప నేల పారసీక కవికి?

సాధారణంగా మనలో కలలపట్ల ప్రజలలో రెండు విధాలైన అభిప్రాయాలు వినిపిస్తాయి. "కలలో జరిగింది ఇలలో జరగదని" అంటారు. అదే సమయంలో మరి కొంతమంది నాకు రాత్రి కలలో ఇలా జరిగింది, అది ఇలా నిజమైందని. ఇంకా కొన్నిసార్లు ఆ కలలో వచ్చింది నిజం అవుతుందేమో అని ఆందోళన కూడా కనిపిస్తుంది. జాషువా తెల్పిన ఈ స్వప్న వృత్తాంతం ఈ కావ్యంలో రెండవ విభాగంలో వస్తుంది.

ఎది ఏ మైన ఈ పిరదౌసి ఇతివృత్తంలో ఇది ఒక అద్భుతమైన, రసవంతమైన శృంగారభరిత ఘట్టం. అయితే జాషువా ఈ స్వప్న వృత్తాంతాన్ని ఈ సంధర్భంలో ప్రవేశపెట్టడంలోగాని, ప్రవేశపెట్టినదానికి సమార్థవంతంగా ప్రధాన ఇతివృత్త వైశిష్ట్యాన్ని మరింత పెంచే విధంగా తీర్చిదిద్దారు. ఆ పారశిక స్త్రీ కలలో పిరదౌసితో ఇలా అంటుంది.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


లేత గులాబి పరిమళాలను వెదజిమ్మే... నా సౌంద ర్యాన్ని, యవ్వనాన్ని దొసిట పట్టి మీ పాదాలచెంత ఉం చాను. ప్రణయ పూజకు వేళ మించిపోతుంది నీకు భార్యనవుతాను, నీ కవితకు తల్లినవుతాను.

ఇలా అంటున్నానని చులకనగా చూస్తావేమో. నేను ముద్దారాలిని అందులోను అంత:పురంలో ఉండే దానను. నా సిగ్గు తెరలను చీల్చి మీ పైగల నా పవిత్ర స్నేహన్ని తెలియజేస్తున్నాను. ఓ పారసిక కవి అంటూ పిరదౌసి చెంతకు చేరుతుంది. ఆమె మాటలకు తను వెల్ల పుల కించిన పిరదౌసి రెట్టింపు అయిన ఉత్సాహంతో ఆమె చేయి పట్టుకుని దగ్గరకు తీసుకున్న వెంటనే పిరదౌసిలో కలిగిన మార్పులు ఎంతో చిత్రంగా ఉంటాయి అది ఎలా ఉందంటే ....

ఆ కలలో ఆ స్త్రీని పరిదౌసి కౌగలించుకుంటే ఇలా అయిందంట! "గఱుకుబాణం బొండు డెందాన గ్రుచ్చిన యట్లయ్యే" వెంటనే కవి తుళ్ళిపడి లేస్తాడు. కవి మనసు "కాలికెదురు గట్టు కాచగోళం బయ్యె" ఆ దు:ఖంలోనే ఆలోచిస్తూ కాలగమనంలో ఎన్నెన్ని చిత్రాలు గలవో అనుకుంటూ ఆ రాత్రి గడుపుతాడు. నిజానికి ఇది ఒక స్వప్నమే అయినా ఆ స్త్రీ వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, స్పష్టత, సూటిదనం పాఠకులను మైమరిపింపజేస్తుంది.

వాస్తవానికి ఈ ఇది ఒక అద్భుతమైన శృంగార వర్ణనకు ప్రాధాన్యమున్న సన్నివేశం. ఇటువంటి అరుదైన సన్ని వేశాలను చిత్రించడం అనేది ఆ కవుల వ్యక్తిత్వం ఆధారంగా అవి రూపు దిద్దుకుంటాయి. ఇక్కడ జాషువా గారికి స్త్రీల పట్ల ఉన్న భావన ఎలాంటిదో తెలుస్తుంది. ఈ సంధర్భం ఎలాంటి శృంగార వర్ణన చేసినా సమాం జసంగా ఉంటుంది. అటువంటి శృంగారం రాయలేని నైపుణ్యం జాషువా గారికి లేకకాదు. స్త్రీ పట్ల తనకున్న భావాలకు తగినట్లు ఎలాంటి అసభ్య శృంగారం జోలికి పోకుండా చక్కని పదజాలంతో, పదునైనా భావాలతో, ఎంతో శక్తివంతంగా ఆ సంధర్భానికి ఎంత భావన అవ సరమో, అంతకు ఏ మాత్రం తగ్గకుండా అత్యంత సౌందర్యవంతంగా ఆ భావాన్ని వ్యక్తికరింపజేశాడు. కాని ఈ పారశిక స్త్రీ తన భావాలను వ్యక్తికరిండంలో ఎలాంటి అస్పష్టత లేకుండా సూటిగానే తన ఉద్దేశాన్ని తెలిపింది. నిజానికి ఈ స్త్రీ పలుకులు గమనిస్తే ఎంత ప్రేమ, మాధుర్యం, లాలిత్యం గోచరిస్తున్నదో తెలుస్తుంది. తన అందాన్ని చెప్పడంలో కూడా లేతగులాబి మొగ్గతో సమానమైన నిండు యవ్వనాన్ని దొసిటిముట్టి నీ పాదాల చెంత నిలిపాను అనడంలో గల భావ వ్యక్తీకరణ అద్భుతం. అలాగే అంతపురంలో ఉండేదానను, నా పవిత్ర స్నేహన్ని ఎలా చెప్పాలి అని పలకడం ఆమె వ్యక్తిత్వం, తన భావంలోని పవిత్రను తెల్పడం విశేషం. ఇలా ఒక్క పద్యంలో అమితమైన ప్రేమను, నిండైన భావనతో కూడిన అనురాగం వ్యక్తీకరించడం జాషువా గారి ప్రతిభకు, స్త్రీపట్ల తనకున్న గౌరవానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

## పిరదౌసి కూతురు పాత్ర :

జాషువా 'పిరదౌసి' కావ్యంలో కనిపించే మరోక విశిష్ట స్త్రీ పాత్ర పిరదౌసి కూతురు. ఈ పాత్ర కావ్యానికి విశేషమైన గౌరవాన్ని కలిగించే పాత్ర. అంతేకాదు కథాగమనంలో కూడా కీలకమైనది. ఇక ఈ పాత్ర ప్రాధాన్యాన్ని పరిశీ లిద్దాం. పిరదౌసి గజనీ మహమ్మద్ జీవితచరిత్రను ఏకా గ్రతలో రాస్తున్న సమయంలో పిరదౌసి మొదటి సంతానం పోవడంతో షాహనామా గ్రంథ రచనకు ఆటంకం ఏర్పడు తుంది. ఆ తర్వాత కొంతకాలానికి ఆడబిడ్డ జన్మిం చడంతో మరల పిరదౌసి ఆగిన తన రచనను కొనసాగించి. దాని ని పూర్తిచేసి గజినీ నిండుసభలో సమర్పిస్తాడు. పిరదౌసి ఆ రచన చేయడానికి ఎంత శ్రమించాడో ఆ ఆడబిడ్డకు తెలుసు.

కావ్యాన్ని అంకితం తీసుకున్న తరువాత గజినీ తను ఆడిన మాటను తప్పి బంగారు నాణెలకు బదులు వెండి నాణెలు పంపినప్పుడు ఆ పిరదౌసి కవిహృదయం ఎలా రోదించిందో ఆ ప్రక్కనే ఉన్న తన కూతురు ప్రత్యక్షంగా చూసింది. అంతేకాక ఆడినమాట తప్పడమేకాక పిరదౌసి నిందిస్తూ రాసిన పద్యాన్ని చూసి పిరదౌసి చంపివేయ వలసిందిగా ఆజ్ఞాపించినప్పుడు పిరదౌసి తప్పించుకుని

తన కూతురితో పయనమైన విధానం, ఆ మార్గంలో వారు ఎదుర్కోన్న కష్టాలు, పిరదౌసితో పాటు ప్రత్యక్షంగా కూడా ఆ ఆడబిడ్డకు అనుభవం ఉంది. తండ్రిని అలా చూసిన ఆ ఆడబిడ్డ హృదయం చలించిపోతుంది. పిరదౌసి హృదయం ఎంత క్షోభించిందో, పిరదౌసి కూతురు కూడా అంతే నరకాన్ని అనుభవించింది. తన తండ్రికి జరిగిన అవమానాలకు తల్లడిల్లింది. చివరికి పిరదౌసి ఆ అవ మానాలు, మనోవ్యథతోనే తుదిశ్వాస విడిచాడు. పిరదౌసి అనుభవించిన కష్టాలకు, అవమానాలకు ప్రత్యక్షసాక్షి పిరదౌసి కూతురు. దీనిని బట్టి ఆ ఆడబిడ్డ మనసు ఎలా ఉంటుందో అర్థంచేసుకోవచ్చు.

ఇక గజనీ మహామ్మద్ పిరదౌసికి చేసిన అన్యాయాన్ని తెలుసుకుని తన తప్పుకు ప్రాయచిత్తంగా చెప్పినట్లుగానే 60వేల బంగారు నాణెలను బస్తాలకు ఎక్కించి పిరదౌసి అందించవలసిందగా తన పరివారంతో చెబుతాడు. వారు ఆ ధనంతో తూసునగరంలో ఉన్న పిరదౌసి ఇంటికి వెళ్లగా అప్పటికే పిరదౌసి అసువులు బాయగా పిరదౌసి భౌతిక కాయం భటులకు ఎదురుపడుతుంది. జరిగిన దాన్ని తెలుసుకుని ఎంతో చింతించి ఆ తెచ్చిన బంగారు నాణె లను పిరదౌసి కూతురును స్వీకరించమని కోరుతారు. ఆ క్షణంలో ఆమె వ్యక్తం చేసిన భావాలు స్త్రీ జాతి వ్యక్తిత్వా నికి చక్కని నిదర్శనంగా దర్శనమిస్తాయి. ఆ సంపదను తీసుకొమన్న ఆ భటులతో పిరదౌసి కూతురు ఇలా అంటుంది.

మ॥ ఇది నా తండ్రికి కష్ట పెట్టిన శరం, బీ స్వాపతే యంబు ము
ట్టుదునా, నాజనకుండు కంటదడి బెట్టున్ స్వర్గమందుండి, నా
ముదితండ్రిన్ దయతోడ నేలిన నవాబుండైన మీ స్వామికిన్
బదివే లంజలు లంచు బల్కుడని బాష్పస్విన్న దు:ఖాస్యయై

ఈ సంపద కోసం నా తండ్రి ఎంత శ్రమించాడో ప్రత్యక్షంగా చూశాను. అలాగే ఇది నా తండ్రికి ఎంత దు:ఖాన్ని కలిగించిందో కూడా ప్రత్యక్షంగా చూశాను. మాకు ఇన్ని కష్టాలు రావడానికి కారణమైన ఈ సంపదను నేను ముట్టుకుంటానా.... అలా స్వీకరించినా, స్వర్గంలో ఉన్న నా తండ్రి కంటతడి పెడతాడుకదా.. . మా పట్ల ఇంత అభిమానలు ప్రకటించిన మీ స్వామికి (రాజుకు) పదివేల వందనాలు చెబుతున్నాను అని దు:ఖంతో ఆ ధనాన్ని తిప్పిపంపుతుంది.

ఇక ఈ సంధర్భంలో ఈ స్త్రీ పాత్ర పలికిన పలుకులు పలువురి హృదయాలను కదిలించి వేస్తాయి. ఈ పాత్ర చిన్నదైన ఎంతో ఆత్మభిమానం కలిగిన పాత్రగా జాషువ తీర్చిదిద్దాడు. దీనిని బట్టి స్త్రీ పట్ల జాషువాకు ఎలాంటి గౌరవం ఉందో కూడా పరోక్షంగా చెప్పకనే చెప్పినట్లు అవుతుంది. కాబట్టి ఈ పాత్రను ఎంతో అభిమాన పాత్ర మైన వ్యక్తిత్వం కలదిగా తీర్చిదిద్దాడు.

సాధారణంగా దారిద్ర్యంలో ఉన్నప్పుడు కొంత సంపద వారి చెంతకు వస్తే, అందులోను అది వారి తండ్రి కష్టార్జితం అయితే తప్పక స్వీకరిస్తారు. ఇది సర్వ సాధారణం, ఈ లక్షణాలకు భిన్నమైనా పాత్ర పిరదౌసి కూతురి పాత్ర. తన ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా ఆత్మభి మానానికి ప్రాధాన్యతనిస్తుంది. తన తండ్రిపట్ల, ఆ తండ్రి ఆశయాలపట్ల, కుటుంబ మర్యాదలపై అపారమైన విశ్వాసం కలిగి ఉంటుంది. కనుకనే రాజు పంపిన బంగారు నాణెలను నిరాకరించి తిప్పి ఆ రాజుకే పంపి స్తుంది. అంతేకాదు స్త్రీలో మహోన్నతమైన వ్యక్తిత్వాన్ని ఆదర్శంగా నిలుస్తుంది. తన తండ్రి కష్టాన్ని గుర్తు చేసుకుంటూ ఎంతో హూందాతనంతో నర్మగర్భాఖ్యలతో దూషిస్తుంది. ఈ సంపదను నేను ముట్టినతో స్వర్గంలో ఉన్న తన తండ్రి కంటతడిపెడతాడు. తన తండ్రిని కష్టపెట్టినది ఎద్దైన ఎంతైనా నాకు అవసరంలేదని స్పష్టం చేస్తుంది. ఇక్కడ ఆమె పలుకులు స్త్రీ లోనికే ఆదర్శం. అంతే కాదు విలువలకు స్త్రీలు ఇచ్చే ప్రాధాన్యతకు ఈ సన్నివేశం చక్కని ఉదాహరణ.

ఇందులో ఆమె బాధ పడుతూ తన ముసలి తండ్రిని దయతోడ నేలిన నవాంబుడైనా మీ స్వామి అని వచ్చిన

వారితో పలకడం వ్యంగ్యాన్ని స్ఫురింపజేస్తుంది. దయతో నేలిన అనడంలో వెటకారం ఉంది. నవాంబుడైన మీస్వామి అనడం ఆయన మీకే రాజు అనే దూషణ ఉంది. ఆయనకు పది వేల లంజలలు అనడంలో నింద ఉంది. ఇలా ఈ పద్యమంత స్త్రీ మూర్తి వ్యక్తిత్వం ఆవిష్కరించబడింది.

ఇలా జాషువ తన పిరదౌసి కావ్యంలో సందర్భోచితంగా ప్రవేశపెట్టి స్త్రీ పాత్రలు స్త్రీల ఆత్మభిమానికి, విలువలకు, కుటుంబ గౌరవలకు ఆదర్శనీయంగా నిలిచినట్లు జాషువా ఆవిష్కరించారు. ఇలా జాషువా సృష్టించిన ఈ స్త్రీ పాత్రలు ఈ కావ్యనికే వన్నె తెచ్చాయనడంలో సందేహం లేదు.

**ఆధార గ్రంథం :**

1. జాషువ సర్వలభ్యరచనల సంకలనము - మనసు ఫౌండేషన్, బెంగుళూరు.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# సంస్కృత రూపకాల ఆవిర్భావం - పరిశీలన

- **బత్తుల లింగారెడ్డి**, పరిశోధక విద్యార్థి,తెలుగు విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

"కావ్యేషు నాటకం రమ్యం" - ఇది అనాదిగా భారతీయ సాహిత్య లాక్షణికులచే పేర్కొనే ఆర్యోక్తి. అంతేగాక "నాటకాంతం హి సాహిత్యం" అని మరో నానుడి. అంటే నాటక రచన ప్రక్రియకు పరిపూర్ణమయిన సాహిత్య పరిజ్ఞానం తప్పని సరిగా కావాలన్న విషయాన్ని ఇది ధృవపరుస్తోంది. ముఖ్యంగా సాహిత్యాన్ని అధ్యయనం చేసే విద్యార్థులు చివరి అంశంగా నాటకాన్ని అధ్యయనం చేసేవారు. అనగా నాటక రచనమన్నది మామూలు విషయం కాదన్న భావన ఇందులో కనిపిస్తోంది.

భారతీయ వాఙ్మయంలో, కళా ప్రపంచంలో నాటకానికి అతి విశిష్టమయిన స్థానం వుంది. నాటకంలో జీవితం ప్రతిబింబిస్తుందన్న భావన ప్రచారంలో ఉంది. భాసుడు, శుద్రకుడు, విశాఖదత్తుడు, కాళిదాసు ఈ విషయాన్ని నిర్ధారించేలా అనేక నాటకాలు వ్రాశారు. భారతీయ నాటకరంగం సంపూర్ణంగా స్వతః సిద్ధమయిన లక్షణ యుతమయినప్పటికీ దీనిపై గ్రీకు నాటక సంప్రదాయ ప్రభావం ప్రస్ఫుటంగా వ్యక్తమవుతుంది. "ఏ దేశ సంస్కృతి అయినా సరే కాదొక స్థిరబిందువు. అది అనేక నదీనదాల అదృశ్యంగా కలిపిన అంతస్సింధువు" అన్నారు దేవరకొండ బాలగంగాధర తిలక్. ఇది మన నాటక రంగానికీ వర్తిస్తుంది.

సంస్కృత సాహిత్య చరిత్రలో రూపక సాహిత్యం ప్రధానాంగరూపమైంది. ప్రపంచ సాహిత్యాన్ని పరిశీలించి నట్లైతే సంస్కృత రూపకాలు ఒక విశిష్ట పరంపర కలిగినటు వంటివి. రూపకాలనే నాటకాలుగా వ్యవహరిస్తారు. దర్శన, శ్రవణ గుణాలచేత రూపకాలు లేదా నాటకాలు పండిత పామరులను సమానంగా ఆకర్షించి సామాజికుల మీద ఇతర కావ్యాల ప్రక్రియల ప్రభావం కన్న అధికమైంది. సర్వకళల సమాహారం కావటం చేత రూపకాలు కేవలం ఆనంద ప్రదాయకమైనవే కాక విజ్ఞాన దాయకమైనవి కూడా. ఇటువంటి విశిష్టమైన రూపక ప్రక్రియ ఎప్పుడు ఎట్లా ప్రాదుర్భవించినవనే విషయంలో ఆధునిక విమర్శకులు చాలా పరిశీలనలు చేశారు.

డా॥ రిజ్వే సంస్కృత రూపాకాలు ప్రాచీన "వీరపూజ" కార్యకలాపాల నుంచి పుట్టి వికసించినవని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. రాముని, కృష్ణుని లీలలను నాటకాలుగా ప్రదర్శించడం అతడు ఊహగానం చేశాడు. ప్రకృతిలో కనిపించే పరివర్తనలనే ప్రాచీన భారతీయులు మూర్త పరంగా ప్రదర్శించారు. అదే నాటకాల ఆరంభమని డా॥ కీథ్ అభిప్రాయం. మహాభాష్యంలో ఉల్లేఖించిన విజయాన్ని సాధించడం చిత్రీకరించబడిందని కీథ్ అంటారు.

సంస్కృత రూపకాలు బొమ్మలాటలనుంచి ఉద్భవించాయని డా॥ పిశెల్ విశ్వసించాడు. బొమ్మలకు దారాలను కట్టి ఆ దారాలను ఒక వ్యక్తి పట్టుకుని నేపథ్యంలో వుండి బొమ్మలను ఆడిస్తుంటాడు. దారాలను పట్టుకుని ఆడించే వ్యక్తిని అందుకే సూత్రధారుడు పేరు వచ్చిందని తర్వాత నాటకాలలో ప్రధాన సూత్రధారుడికి నాటక సమాజ నాయకునికి ఇదే పేరు స్థిరపడిందని, ఇవే బొమ్మలాటలనుంచి నాటకాలు పుట్టినవని హులేట్స్ వంటి విమర్శకుల అభిప్రాయం. పశ్చిమదేశాల్లో ప్రచలితమైన మేపోల్ నృత్యం వంటిదే భారతదేశంలో "ఇంద్రధ్వజోత్సవం" మేపోల్ నృత్యం నుండే సంస్కృత నాటకాలు పుట్టినవని కొందరు పాశ్చాత్య విమర్శకులు తలంచారు. డా॥వేబర్ డా॥ విండీష్‌లు సంస్కృత రూపకాలు గ్రీకు రూపకాల ప్రభావంచేత ఆవిర్భవించాయని అభిప్రాయం వెలిబుచ్చారు. క్రీ.శ. ప్రథమ, ద్వితీయ శతాబ్దాలలో రోమన్లతో భారతీయులకు వ్యాపార సంబంధాలుండేవని అట్లా భారతీయులకు గ్రీకు నాటకాలతో పరిచయం ఏర్పడిందని తత్ఫలితంగా సంస్కృతంలో నాటకాలు వ్రాయబడినవని వీరు ఊహగానం చేశారు. సంస్కృత నాటకాలల్లో ప్రయోగిఃచే 'జవనిక' లేదా

"యవనిక" గ్రీకు ప్రభావాన్ని చెప్తున్నదని వీరు అన్నారు. కాని సంస్కృత నాటకాల చరిత్ర క్రీ.శ. ప్రథమ ద్వితీయ శతాబ్దాలకన్న అతి ప్రాచీనమైనదని ఆధారాలు లభిస్తున్నవి. పాణిని పేర్కొన్న నటసూత్రాలు, భరతుని నాట్య శాస్త్రం, ఇవన్నీ సంస్కృతనాటకాలు క్రీ.పూ. 500 కన్న ప్రాచీనమైనదని చాటుతున్నప్పుడు పై వాదం విశ్వాస యోగ్యంగా లేదు. క్రీ.శ. 500 కన్నముందు గ్రీకు భాషలో నాటకాలు లేవు. ఉన్నా ఏ రూపంలో ఉన్నాయో తెలీదు. అలాంటప్పుడు గ్రీకు నాటకాల ప్రభావంతో సంస్కృత నాటక రచన ఆరంభమైనదని అనటం అంగీకార యోగ్యంగా లేనే లేదు. సంస్కృత నాటకాలలో రంగస్థలం మీద నేపథ్యంగా వాడే తెరకు "జవనిక" లేక "యవనిక" అని పేరు. "యవనిక"కు యవనదేశం అంటే గ్రీకు దేశం నుంచి వచ్చిందని లేక గ్రీకు దేశ సంబంధమైనదని అర్థం చెప్పడం సరిగా లేదు. యవనిక దాసీలు రంగస్థలం మీద నేపథ్యరూపమైన తెరను పట్టుకుని నిల్చునేవారేమో, సస్కృత నాటకాలు దేవతల, మానవుల ఆదర్శ జీవితాన్ని చిత్రించేవి. వ్యక్తిలో వుండే బలహీనతలను విధి చేతిలో అతడు కీలుబొమ్మ కావటం, దేవతల మానవుల జీవితంలో ఆడుకోవడం మొదలైన వాటిని గ్రీకు నాటకాలల్లో వలె సంస్కృత నాటకాలు చిత్రీకరించబడలేదు. సంస్కృత నాటకాల్లో నాయకుడు ధీరోదాత్తుడు, సర్వగుణ సంపన్నుడు, తన ఆదర్శం కొరకు దేవతలనైన ఎదిరించగల సాహసం గలవాడు. సత్యానికి, ధర్మానికి, న్యాయానికి, దైవత్వానికి విజయం కలిగినట్లుగా సంస్కృత నాటకకారులు రచించారు. మానవునికి విధికి నడుమ జరిగే ఘర్షణను గ్రీకులు చిత్రిస్తే, మంచికి చెడుకు ఘర్షణను భారతీయులు చిత్రించారు. మంచికి విజయాన్ని కలిగించే మానవుని ఆశా పక్షాన్ని చిత్రించేవి సంస్కృత నాటకాలు. గ్రీకు నాటకాలు నిరాశపక్షాన్ని చిత్రించేవి. గ్రీకు నాటకాలలో ఒకొక్కసారి పాత్రలన్నీ మరణంతో కథ ముగుస్తుంది. గ్రీకు నాటకాలు వ్యక్తుల ఆదర్శ జీవితాన్ని చిత్రించేవీకావు మానవుని సహజ దుర్గుణాలు, బలహీనతలు గ్రీకు పాత్రలలో కనిపిస్తుంది. గ్రీకు నాటకాలల్లో ప్రసిద్ధమైనవి చాలా మట్టుకు ఈ విధంగా పాత్రల వినాశంతో ముగిసేవి. ఇట్లా ముగిసే నాటకాలను విషాదాంత నాటకాలని అభిజ్ఞాన శాకుంతలం, నాదానందం వంటి నాటకాల్లో ఇటువంటి విషాదాన్ని మనం చూస్తాము.

సంస్కృత విషాద నాటకాలకు, గ్రీకు విషాదాంత నాటకాలకు ఎక్కడ పోలికలేదు. గ్రీకు నాటకాలు పౌరులకు ఆనందాన్ని కలిగించటమే కాక శత్రువులను ఎదిరించటానికి పురికొల్పేవిగా వుండేవి. భారతీయ సంస్కృత నాటకాలు ప్రేక్షకులను ధార్మికంగా, నైతికంగా ఉన్నతులను చేసి ధర్మార్థ కామ మోక్షాలను సమానంగా సాధించేటట్లుగా ఉపయోగపడేవి. సంస్కృత నాటకాల ప్రధానాశయం ప్రేక్షకులను ఆదర్శకార్యోన్ముఖులుగా చేయటమే. ఇదే రసానంద వాదంగా పరిణామం చెందింది. వాస్తవిక చిత్రణ సంస్కృత నాటకాల ప్రధానోద్దేశం కాదు. సంస్కృత నాటకాలు గ్రీకు నాటకాల కన్నా సంగీత ప్రభానమైనవి. గ్రీకు నాటకాలలో "కోరస్" గీతాలుండేవి. కాని సంస్కృత నాటకాలలోని పదాయస్లవలె అవి సంగీతభావాత్మకంగా కాక కథాత్మకంగా వుండేవి. చుట్టూ వున్న ప్రకృతి చేత గ్రీకు నాటకకారుని హృదయం స్పందించలేదు. సంస్కృత నాటకాలలో మరొక విశేషం భాషా ప్రయోగం. పాత్రలచేత భేదాన్ని బట్టి భాష మారుతుంది. అంటే సంఘంలోని ఆయా తరగతికి చెందిన వ్యక్తులు ఏ భాషను మాట్లాడుతారో, వాస్తవికతకు లోపం రాకుండా సంస్కృత నాటక కారులు ఆ భాషను ప్రయోగించారు. అట్లా సంస్కృతం, శౌరసేని, మాగధి, పైశాచి మొదలగు ప్రాకృత భేదాలను సంస్కృత నాటక కారులకు ప్రయోగించారు.

గ్రీకు నాటకాలలో యూనిటి ఆఫ్ యాక్షన్, యూనిటి ఆఫ్ ప్లేస్, యూనిటీ ఆఫ్ టైం, ఈ మూడు బాగా పాటింపబడినవి. కాని సంస్కృత నాటకాలలో యూనీటి ఆఫ్ టైం, యూనిటీ ఆఫ్ ప్లేస్ లు విశేషంగా పాటింపబడలేదు. గ్రీకు శిల్పకళా ప్రభావం భారతీయ శిల్పకళమీద వున్నట్లుగానే కొంత గ్రీకు నాటకాల ప్రభావం సంస్కృత నాటకాల మీద ఏమైె పడివుండవచ్చు. గ్రీకు సంస్కృత

నాటకాలు భిన్న ప్రదేశాల్లో పుట్టి వికసించేవిగా పరస్పర ప్రభావం కనబడనని వింటర్ నిట్స్ అభిప్రాయం. గ్రీకు, భారత ప్రదేశాల్లో స్వతంత్రంగా దాదాపు ఒకే కాలంలోనే నాటకకళ పుట్టి వికసించిందని ఆయన అంటాడు.

ప్రొఫెసర్ లెవీ నాటకకళ శక్తులతో కుషాణుల కాలంలో భారతదేశంలో ప్రవేశించిందని అభిప్రాయ పడినాడు. అంతకు ముందు ప్రాకృత భాషలో నాటకాలుండేవని కుషాణుల సంస్కృతాదరణలో సంస్కృత నాటకాలు మొదటిసారిగా వ్రాయబడినవని అతని అభిప్రాయం. కుషాణరాజులకు చాలా పూర్వమే పాణిని నటసూత్రాలును పేర్కొన్నాడు. భరతుని నాట్యశాస్త్రం రచించబడింది. అర్థశాస్త్రకారుడు నటులను గూర్చి ప్రసంగించాడు. మహాభాష్యకారుడు నాటకాలను పేర్కొన్నాడు. కుషాణులకు పూర్వమే భాస సౌమిల్లాదులు, కాళిదాసాది కవులు నాటకాలను వ్రాశారు.

భరతుడు తన నాట్య శాస్త్రంలో నాట్యోత్పత్తిని గూర్చి చర్చించాడు. అతడు చెప్పిన నాట్యోత్పత్తి వృత్తాంతమిది త్రేతాయుగలో దేవతలు బ్రహ్మ దగ్గరికి పోయి శూద్రులకు ఉపయోగపడే వేదరచన చేయమని ప్రార్థించారు. అప్పుడు బ్రహ్మ ఋగ్వేదం నుంచి పాఠ్యాన్ని, సామవేదం నుంచి గానాన్ని, యజుర్వేదం నుండి అభినయాన్ని, అదర్వణవేదం నుండి రసాన్ని తీసికొని పంచమవేదంగా నాట్యవేదాన్ని సృష్టించాడు. బ్రహ్మ ఆజ్ఞమీద విశ్వకర్మ నాట్య గృహాన్ని నిర్మించాడు. భూలోకంలో నాట్యకళ ప్రచారానికి భరతమునిని నియోగింపబడినాడు. ఇంద ధ్వజోత్సవ సమయాలలో మొదటిసారిగా భరతుడు తన శిక్షితులైన పుత్రులద్వార నాట్యాన్ని ప్రదర్శింపజేశాడు. శూద్రులకు ధర్మజ్ఞాన బోధ చేయటానికి సృష్టించబడిందని తెలుస్తుంది. వేదపఠనాదికారం లేని జనులు నాటక దర్శనం ద్వార ధర్మజ్ఞానాలను సంపాదించే వారన్నమాట. ఇంకా నాట్యం దుఃఖార్తులకు, శ్రీమూర్తులకు, తపస్విజనులకు విశ్రాంతి కలిగించి, శాంతిని కలిగిస్తుందని భరతుడంటాడు.

దుఃకార్తానాం శ్రీ మార్తానాం శోకార్తానం తపస్వినామ్
విశ్రాంతి జననం కాలె నాట్యమెతల్ మయాకృతమ్

భరతుని నాటకోత్పత్తి కథను బట్టి నాటక బీజాలు వేదాల్లోనే వున్నవని వేదకాలంలోని గానం, సంగీతం, వుండేవని సంగీతానికి అనుగూనంగా నాట్యం చేయటం వుండేదని తెలుస్తుంది. మాక్స్ ముల్లర్, ఓల్డెన్ బర్గ్, దాస్‌గుప్త వంటి విమర్శకులు భారతీయ నాట్యకళ వైదికయుగం నుంచి క్రమంగా వికసించిందనే విశ్వసించారు. రామాయణకాలంలో అయోధ్య నగరంలో నాటక మండలున్నట్లు తెలుస్తుంది. అయోధ్యకాండంలో నర్తకుల గోష్ఠిని ప్రసక్తి వున్నది. " నా రాజ కీ జనపదే ప్రహృష్టనట నర్తకా" ఆరాజకమైన జనపదంలో నటులు, నర్తకులు సంతోషంగా వుండరు అన్న వాల్మీకీ మాటలను బట్టి ఆకాలంలో నటులకు, నర్తకులకు సంఘంలో ఉన్నత స్థాయి ఉండేది. హరివంశంలో రామాయణ కథ మీద ఆధారపడిన నాటక ప్రదర్శన ప్రసక్తి కూడా వున్నది. పురుష, స్త్రీ పాత్రలను, పురుషులే ధరించే వారని అటువంటి నటులను "భూకుంశులని" పిలిచేవారని హరివంశాన్ని బట్టి తెలుస్తున్నది. వినయ పీఠకానికి సంబందించిన "చల్లవగ్గ" లోని ఒక కథలో "అశ్వజత్ పునర్వసు" అనే భిక్షువులు కేటుగిరిలోని నాటకశాలలో అభినయం చూచి తర్వాత ఆ నర్తకితో ప్రేమ కలాపాలు సాగించారని తెలిసి మహాస్తవిరుడు వారిని విహారం నుంచి బహిష్కరించాడని వున్నది. మౌర్యుల కాలంలో వ్రాయబడిన అర్ధశాస్త్రంలో లలితకళలు, వాటిని అభ్యసించే వారికి ప్రభుత్వం ఇచ్చే రక్షణల గురించి చెప్పబడింది. క్రీ.శ. ప్రథమ శతాబ్ది వాడైన వాత్స్యాయనుడు తన కామసూత్రగ్రంథంలో నాగరికుల కనోరంజనానికై కుశలవుల నాటకాన్ని ప్రదర్శించటాన్ని పేర్కొన్నాడు.

ఈ ఆధారాలను బట్టి భారతదేశంలో నాటకకళ స్వతంత్రంగా వైదిక కాలంలోనే పుట్టి క్రమక్రమంగా వికసించి భరతుని నాటికి సంపూర్ణ రూపురేఖలతో స్థిరపడి క్రీ.పూ. ప్రథమ శతాబ్ధినాటికి భాస సౌమిల్ల కాళిదాసుల్లో

ఉన్నత శిఖరాలను అందుకొన్నది. భరతుడు చెప్పిన దశవిధరూపకాలను ఈ విధంగా విభజించవచ్చు. బాణం, విధి, వ్యాయోగం, ఈహమృగం, నాటకం, ప్రకరణం, ప్రహసనం, సమవకారం, డిమం, అంకం - మొదలగు విభిన్న రూపంలో పాత్రలు, సమయంను బట్టి సంస్కృత నాటకాలు ప్రదర్శితమైనవి.

**ఆధార గ్రంధాలు :**

1. సంస్కృత వాఙ్మయ చరిత్ర - మల్లాది సూర్యనారాయణ శాస్త్రి
2. సంస్కృత సాహిత్య చరిత్ర - డా॥ ముదిగంటి గోపాల్‌రెడ్డి, డా॥ ముదిగంటి సుజాతారెడ్డి
3. ఎ హిస్టరి ఆఫ్ శాన్‌స్క్రిట్ లిటరేచర్ - ఎ.మెకడొనెల్, మున్షిరియామ్ మనోహర్‌లాల్
4. హిస్టారికల్ మహ కావ్యాస్ ఇన్ శాన్‌స్క్రిట్ - చంద్ర ప్రభ, భారత్ భారతి.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# దూరపు కొండలు నునుపు - ఎండమావులు నాటిక

- మూడే నాగేంద్ర నాయక్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ ప్రెసిడెన్సీ కళాశాల (రాజధాని), చెన్నై.

'ఎండమావులు' అంటే మిట్ట మధ్యాహ్నవేళ, బయళ్ళ యందు నీటివలె కనిపించే సూర్యకిరణాల గుంపు. దీన్నే మృగతృష్ణ అని కూడా అంటారు. ఈ నాటికలో అమెరికా సంబంధం చేసుకుంటే తమ జీవితం బాగుంటుందనే తపనతో, ఒక గ్రామీణ కుటుంబం తపిస్తుంది. బంధుత్వం కూడా మరో కారణం కావచ్చు. కాని బాగా ఉన్నట్టు కనిపించే అమెరికా జీవితాలు, ఎండమావుల లాంటివి. బాగా ఉన్నట్టు వుంటాయి కాని అందులో ఆప్యాయతలు అనుబంధాలుండవు. కాబట్టి వాటితో పెనవేసుకోవటానికి ఇష్టపడవద్దు అన్న సందేశంతో రాసినదే ఎండమావులు నాటిక.

**కథాసంగ్రహం :**

శంకర్రావుది రేపల్లె. మధ్యతరగతి కుటుంబం. ఆయన భార్య శకుంతల. చదువుకున్న గృహిణి సాంప్ర దాయ నమ్మకాల మీద నమ్మకమెక్కువ. కాకి ఇంటిపై వాలి అరిస్తే, యింటికి చుట్టాలోస్తారనే నమ్మకాన్ని అడపా దడపా నిజం చేస్తూ ఆ యింటిపై కూర్చొని కాకి అరవడం, చుట్టాలు రావడం జరుగుతూంటుంది. వచ్చిన చుట్టాలకు డబ్బు తగలేసి బట్టలు పెట్టడం అనే సాంప్రదాయం పాటించే ఆ యింటి యిల్లాలు శకుంతలతో విసిగిపోయి ఉన్నాడు శంకర్రావు. వారికొక కొడుకు సురేష్ ఎమ్.ఎస్‌సి పాసయి యింటి దగ్గరే ఉన్నాడు.

శకుంతల అన్నయ్య సుదర్శన్ అమెరికాలో చాలా కాలం నుండి ఉంటున్నాడు. పాతికేళ్ళకు గానీ ఇండియాకు రావడానికి కుదరలేదు. ఇన్నేండ్ల తరువాత ఇండియా కొస్తున్నట్లు శకుంతలకు టెలిగ్రాము ముందుగా యిచ్చి ఆ యింటికి వచ్చినాడు. అన్నయ్య వచ్చినాడని శకుంతలకు, బావ వచ్చినాడని శంకర్రావుకు మహా ఆనం దంగా ఉంది. ఎందుకంటే సుదర్శన్‌కు పెళ్ళీడు కొచ్చిన కొడుకూ, కూతురూ ఉన్నారు. కూతురుకు పద్దెనిమి దేళ్ళుంటాయి. తమ కుమారుడు సురేష్‌కు ఆ అమ్మాయిని చేసుకుంటే తాము కూడా అమెరికాకు పోతూ వస్తు ఉండవచ్చు. అమ్మాయిని యిస్తాడో లేదో అవతలి విషయం. ఆశ మాత్రం బాగా ఉంది. అన్ని మర్యాదలూ చేస్తూ పిల్లల్ని, వదిననీ తీసుకొని వచ్చుంటే చాలా సంతోషపడేవాళ్ళ మంటూ శకుంతల తన అభిమానాన్ని చాటుకుంది. వదిన చనిపోయి సంవత్సరమైందని, ఆ పరిస్థితుల్లో అంత దూరం వెంటనే ఎవరూ రాలేరు గనుక, ఎవరికీ చెప్పకుండా అంత్యక్రియలు చేసేశామని, సుదర్శనం చెప్పుతూ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.

సుదర్శన్‌కు ఒక గది కేటాయించి విశ్రాంతి తీసుకో మన్నారు. సుదర్శన్ కులాసాగా ఉంటే అమ్మాయి ప్రస్తా వన తెద్దామనుకున్నారు గానీ, ఇప్పుడేం మాట్లాడుకుండ డమే మంచిదనుకున్నారు శంకర్రావు దంపతులు. ఒకవేళ అమ్మాయి విషయమై ఆ ఉద్దేశం ఆయనకే ఉంటే, ఆయనే చెబుతాడు లెమ్మనుకున్నారు. అమెరికా నుండి సుదర్శనం వచ్చినాడని తెలిసి వీరయ్య, వెంకయ్య, దేవదానం లాంటి వారెందరో ఆ యింటిచుట్టూ మూగి నారు. వీరంతా పల్లెటూరి రైతులు. చాలా కాలమయింది శంకర్రావును చూచి. పలుకరిస్తామని వచ్చినారు. ఆ సమ యానికి సుదర్శనం బయటికెళ్లినాడు. సుదర్శనంకు పెళ్ళీడుకొచ్చిన కూతురుందని, తప్పకుండా చెల్లెలి కొడుక్కే యిస్తాడని, వారందరి మనస్సులో ఉంది. సంబంధం గురించి మాట్లాడ్డానికే వచ్చి ఉంటాడని అను కొని, ఏం మాట్లాడినారమ్మా అని శకుంతలను కదిపినారు. అన్నయ్య వచ్చినపుట్నుంచి ముభావంగా ఉంటున్నాడని, సరిగ్గా మాట్లాడ్డం లేదని, దినచర్యలతో దినం గడిపేస్తు న్నాడేగాని వారం రోజులయినా తమతో కలిసి సంతోషంగా మాట్లాడ లేదని వారికి చెప్పి శకుంతల బాధపడింది. వదిన పోయిన సంగతి చెప్పింది, అయ్యో పాపం అన్నారు

వారు. సుదర్శనం వచ్చిందాకా ఆగి పరామర్శించి పోవా లనుకున్నారు.

సుదర్శనం వచ్చినాడు. అందర్నీ గుర్తుపడుతూ పేరు పేరునా పలకరించాడు. తన భార్య అరుణమ్మ చనిపోయి నప్పుడు వీరందరికీ తెలుపలేక పోయినందుకు తన దురదృష్టాన్ని తరువాత చెప్తానని, అర్జెంటుగా పాండిచ్చేరి వెళ్ళాల్సుందనీ, వారం రోజుల్లో తిరిగివస్తానని, వచ్చినాకా కలుద్దామని చెప్పి శెలుపు తీసుకున్నాడు.

బస్టాండు కెల్లి సుదర్శనాన్ని బస్సెక్కించడానికి సురేష్ తోడుగా వెళ్లినాడు. దారిలో ఏదో వంకతో మాటలు మొదలెట్టి అమ్మాయి పెళ్ళి ప్రస్తావన తెమ్మని శకుంతల చెప్పింది కొడుకుతో. అమెరికాలోనే ఉండిపోయి పిహెచ్.డి. చేసింతర్వాతనే చెప్పినాడు సురేష్. అమెరికా యోగం నీకులేదని, నన్ను ఇరిటేట్ చెయ్యకుండా ఉంటే మంచిదని మాత్రం మాట్లాడి సురేష్ చేతిలోని బ్యాగ్ లాక్కొని గబగబా బస్సులో కెల్లిపోయినాడు సుదర్శనం. సురేష్ నిశ్చేష్టుడై నిలబడిపోయినాడు. జరిగిన సంగతి యింటి కొచ్చి చెప్పినాడు తల్లితో ఎమ్.ఎస్.సీలో డిస్టింక్షన్‌లో పాసయిన తన కొడుకును వద్దనుకోవడంలో ఏదో మతలబు ఉందని, అన్నయ్య రాగానే గట్టిగా అడిగి తేల్చుకుంటానని శకుంతల నిర్ణయించుకుంది.

సుదర్శనం తిరిగి రావటానికి ఒక రోజు ముందుగానే వీరయ్య, దేవదానం శకుంతల యింటికి చేరి పలుకరించారు. "సుదర్శనంకు యిష్టమైన ముంజలు, చిట్టీత పండ్లూ తెచ్చిస్తాము. తింటుంటే హాయిగా అన్ని మాట్లాడుకోవచ్చు" అంటారు. అవేవీ వద్దంటుంది శకుంతల. శకుంతల తన అన్నపై నుండే అక్కసు వెళ్ళగక్కింది. ఆయన మారిపోయినాడని, పల్లెటూరి తిళ్ళన్నీ తినడనీ, బాగా గర్వం ముదిరిపోయిందనీ అనింది. "మనోడికి వాళ్ళ అమ్మాయి నిచ్చి చేసి అమెరికాలోనే ఉంచుకొని, ఏదో వాడికి తగిన ఉద్యోగం యిస్తాడని మనమనుకుంటుంటే, అది జరగదు, అమెరికా వచ్చే యోగం మనవాడికి లేదని అన్నగారే మనవాడితో తెగేసి చెప్పినాడట. ఇంతకంటే అవమానం మాకు మరొకటుందా" అని వాపోయింది. రాగానే అందరి ముందు అడిగేసి కడిగిపారేస్తానని కసిగా మాట్లాడింది. సుదర్శనం మనస్సు భార్య పోయి బాగాలేదని, తొందర పడొద్దని, మేమంతా మాట్లాడి కుదిరిస్తామని శకుంతలను శాంతపరిచినారు.

ఏరకంగానయినా నచ్చజెప్పి ఒప్పిస్తామనే నమ్మకం వారి కుంది గాబట్టి పత్రిక రాయడానికి పురోహితుడ్ని కూడా పిలిపించుకున్నారు సుదర్శనం. ముందు రోజే వచ్చినాడు గానీ ముభావంగానే ఉంటున్నాడు. అయినా తేల్చేయాలనుకున్నది శకుంతల. వీరయ్య, వెంకయ్య దేవదానంలకు పిలిపించుకుంది. శంకర్రావును నీటుగా తయారు చేసింది. ధైర్యంగా కాలరెత్తుకుని నిలబడి అడిగ యెయ్యమని" అన్నయ్య అమెరికాలో కోటీశ్వరుడు అలాంటి సంబంధం ఎట్లా వదులుకుంటా అని శకుంతల మనసులో మెదుల్తూవుంది. ఊరి పెద్దలంతా శంకర్రావును బలపరచినారు. సుదర్శన్ చిన్ననాటి స్నేహితుడు సీతారామయ్య కూడా వచ్చి కలిసినాడు పాతమిత్రులంతా వచ్చి కలిసేటప్పటికి సుదర్శన్‌లో కొంచెం ఉల్లాసం కనిపించింది. అందర్నీ తమ చిన్నప్పుడు పిలుచుకున్న పొట్టి పేర్లతో పిలుస్తూ అందరి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నాడు అడగడానికి యిదే మంచి సమయం అనుకున్నారందరు. అందరికీ అమెరికా సంబంధం మంటే తెగ మోజుగా ఉంది. మాట్లాడ్డానికే సంబరంగా ఉంది. అంతలో రాముడు, సుదర్శన్ యింకో స్నేహితుడు వచ్చి సుదర్శన్‌కు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. సుదర్శన్ దయ వల్లే తన కొడుక్కు అమెరికాలో ఉద్యోగంలో చేరిపోయినాడని, ఆనంద పడడమే గాని, ఆ తర్వాత అయిదేళ్ళు గడిచినా అమెరికా నుండి మాటా మంచీ లేదని, అక్కడనే ఒక తెల్లమ్మాయిని కట్టుకున్నాడని, ఇంత వరకు మేలు చేసిన సుదర్శనం గాని, తమను గాని చేరి పలుకరించలేదని చెప్పి వాపోయినాడు రాముడు. "అమెరికా అంటే అంతేమరి" అన్నాడు సుదర్శనం. వీరయ్య మంచి మాటకారి, సమయస్ఫూర్తిగా తన తెలివిని ఉపయోగించుకునే మనిషి. మొదలు పెట్టినాడు "చూడు సుదర్శన్ నువ్వేమో ఆకాశంలోకి విసిరేసిన చుక్క లాగా, మమ్మల్ని

వదిలి అమెరికా వెళ్ళి పాతికేళ్ళయింది. ఇక్కడేమో మేము, నీతోడుబుట్టిన చెల్లి, నీ స్నేహితులము శ్రేయోభిలాషులమూ ఉంటూ నీకు దూరమై పోయినాము. పోయిన సంవత్సరం నీ భార్య కాలం చేస్తే కూడా సమాచారం లేదు. దేవుని దయ వల్ల మరలా మా మధ్యకు వచ్చినావు, నిన్ను వదులుకోకూడదని, నీతో సంబంధం కలుపుకొని మళ్ళీ బంధుత్వాన్ని పెనవేసుకుంటే అప్పుడప్పుడు మనం కలుసుకుంటుంటాము. నీ చెల్లెలి కోరిక, మీ బావ అభిలాష అదే ఏమంటావు'' అని సుదర్శనం వైపుగానే చూస్తున్నాడు వీరయ్య. సుదర్శనం వీరయ్య వైపే చూస్తూ మనసులో దాచుకున్న గాయం కట్లు విప్పి చూపట్టే ప్రయత్నం చేస్తున్నాడు. మాటలు పెగలడం లేదు. వచ్చిన వారంత ఆ శంకరయ్య సంబంధాన్ని గూర్చి, సురేష్ గొప్పతనాన్ని గురించి శకుంతల శాంత స్వభావాన్ని గూర్చి పొగిడెస్తూ, యింత కంటే మంచి సంబంధం వెతికినా చిక్కదంటున్నారు. మనసులో ఏముందో చెప్పమంటున్నారు. సుదర్శన్ మాట మెదిపినాడు.

''నా చెల్లెలి సంబంధమంటే నాకు సంతోషమే కానీ ఒక విషయం మాత్రం మీకందరికీ చెప్పాలి. ఆపైన మీయిష్టం వచ్చినట్లు నిర్ణయం తీసుకోండి.'' అంటూ మొదలు పెట్టినాడు. ''నేను దేశం వదలి వెల్లి పాతికేళ్ళయింది. ఇంటా బయటా ఎన్నో మార్పులొచ్చినాయి మా అమెరికా జీవన విధానం గురించి రెండు ముక్కలు మనవి చేసుకుంటాను. మా పిల్లలిద్దరూ అమెరికాలో పుట్టినారు కొడుకు ఇంజనీరింగ్, కూతురు మెడిసిన్ చదువుతున్నారు. అక్కడ ప్రతివారం వీకెండ్సుకి ఫామిలీస్‌తో ఎక్కడికయినా వెళ్ళుతుంటారు. మేమూ అంటే మా భోజనపు అలవాట్లు మారినాయి. సొసైటిని బట్టి వైను, బీరు, బ్రాంది, విస్కీ వంటివి తీసుకోవటం తప్పని సరైంది. చిన్నా, పెద్దా తేడా లేదు. పిల్లలు కూడా మాతో బాటే తీసుకుంటారు. ఇది తప్పని గాని, చెయ్యి చేసుకోవడం గాని చేస్తే అది నేరం అక్కడ. పిల్లలే పోలీసులకి ఫోన్ చేసి పిలిపించి అరెస్టు చేయిస్తారు. వయసు వచ్చింతర్వాత పిల్లలిద్దరూ వాళ్ళ వాళ్ళ ఫ్రెండ్సుతోటి వెళ్ళడం మొదలు పెట్టినారు. పబ్‌లకి, క్లబ్‌లకీ వెళ్తుంటారు. రమ్యకి చీరకట్టడం అసలే తెలీదు. తెలుగురాదు, నేర్చుకోమంటే యిష్టం లేదంటుంది. ఇద్దరూ యిష్టంగా సిగరెట్లు తాగుతారు. దేవుడికి అగరొత్తులు వెలిగించరు. మన దేముళ్ళను వేళాకోళాలాడుతారు. అక్కడి పిల్లలకి స్వేచ్ఛ ఎక్కువ, ఫ్రెండ్స్‌తో డేటింగ్ చేసుకొని, రాత్రంతా క్లబ్బులో గడిపేస్తారు. నచ్చితే పెళ్ళి, లేదంటే అబార్షన్, మళ్ళీ యింకొకరితో డేటింగ్. ఇది అమెరికాలో ఉండే పద్ధతి. మన జీవన విధానం దానికి విరుద్ధం, మనకు శీలం ముఖ్యం, అక్కడ సుఖాలే ముఖ్యం, మా పిల్లలు కూడా అవే అనుభవిస్తున్నారు. వాటికి అలవాటు పడి ఎంత తీరిక లేకుండా ఉన్నారంటే, వాళ్ళ అమ్మ అంటే నా భార్య అరుణ నేను పనిమీద లాస్ ఏంజిల్స్ వెళ్ళినప్పుడు గుండెపోటుకు గురై హాస్పిటలులో చేరింది. చేరిన అరగంటకే కన్నుమూసింది. ఆ సంగతి హాస్పిటల్ వాళ్ళు నాకు, అబ్బాయికీ ఫోన్ చేసినారట. నేనేమో మీటింగ్‌లో ఉండి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినాను. వాడేమో వీకెండ్ ఎంగేజిమెంటులో ఉన్నాను. రెండ్రోజుల తర్వాత వచ్చి తల్లి శరీరాన్ని తీసుకెళ్తానని చెప్పినాడట. కన్నతల్లి చనిపోతే వాడికి షాక్ రాలేదు. అదే భారతీయుడైతే అలా విడిచిపెట్టి కులాసాలకు పోతాడా? చెప్పండి. వెంటనే నేను వచ్చి, నా భార్య శరీరానికి దహన సంస్కారము చేసేశాను. బిడ్డల ఆఖరి చూపుకూడా పడనివ్వలేదు. తర్వాత వచ్చి ఏడుస్తున్న నన్ను ఓదార్చడమే గాక, ధైర్యం చెప్పి నన్ను మళ్ళీ పెళ్లి చేసుకొమ్మన్నారు నా బిడ్డలు. ఇంతకంటే దౌర్భాగ్యం ఉంటుందా చెప్పండి. మీకిదంతా చెప్పదలచ్చుకోలేదు. బలవంతంగా నాచేత చెప్పించారు. ఇక మీ యిష్టం. ఇంకా కావాలనుకుంటే ఆ సంబంధం కలుపుకొండి. కానీ వారు నావారు కారు. వాళ్ళ ముఖం కూడా చూడకూడదనుకొని వచ్చేశాను. ఆస్తులన్నీ చెరి సగం పంచేసి, లక్ష డాలర్ల ట్రావెల్స్ చెక్కులు మాత్రం తెచ్చుకున్నాను. ఇకనే వెళ్ళను. ఇప్పుడు నాకు బంధాలు లేవు. నా శేష జీవితం పాండిచ్చేరి ఆశ్రమంలో గడుపుతాను. వారికి యాభైవేల డాలర్లు డొనేషన్‌గా ఇచ్చాను.

మిగతా యాభైవేల డాలర్లు నా చెల్లెలైన శకుంతలకిస్తాను. దయచేసి ఏ అమెరికా సంబంధం గురించి ఆలోచించ కండి. భారతీయలందరికి నా జీవితమే ప్రమాణము, ఉదాహరణ" అటూ విలపిస్తాడు. సుదర్శన్ అందరి హృద యాలు బరవెక్కినాయి. ఒక్కొక్కరుగా సారీ చెప్పి, ఆ సంబంధం వద్దని చెప్పి వెళ్ళిపోయినారు. శకుంతల శంక ర్రావు యిద్దరూ కూడా సుదర్శన్‌ను యింతగా బాధ పెట్టినందుకు క్షమాపణ కోరి, శంకర్రావును తమతోనే ఉండిపొమ్మని వేడుకున్నారు.

**పాత్రచిత్రణ :**

**సుదర్శనం :**

సుదర్శనం అమెరికన్ సైంటిస్టు. పాతికేళ్ళ తరువాత ఇండియా గుర్తొచ్చింది ఆయనకు. అమెరికా జీవన విధానం మీద ముఖం మొత్తి అవ్వాల్సిన వన్నీ అయి పోయాక, జీవితాన్ని నష్టపోయి, మనశ్శాంతి కోసం చివరి మజిలో కోసం చెల్లెలు దగ్గరకు ఇండియా చేరుకున్నాడు.

అమెరికాలో ఆయన కొడుకూ కూతురు అక్కడే ఉండిపోయినారు. ఈయనే వారిని వద్దకుకుని వదిలేసి వచ్చేసినాడు. తన తప్పు కూడా ఉంది. ఏంచేయలేని పరిస్థితి. అక్కడి అలవాట్లకు తాను, తన పిల్లలూ అల వాటు పడిపోయినారు. ఇంతై అంతై పిల్లలిద్దరూ పెళ్ళీడు కొచ్చినా వారిని కంట్రోలు చేయలేకపోయినాడు. ఆ సొసైటీలోని తినడం, త్రాగడం, తిరగడం, విచ్చలవిడి తనం, లాంటి అలవాట్లు వారిని ముంచెత్తినాయి. సుఖాలే ముఖ్యంగా అనుకుంటున్న తన బిడ్డలు తల్లిదండ్రులను లెక్కచేయకుండా వచ్చినారు. సుదర్శనం భార్య శకుంతల గుండెనొప్పి వచ్చి హాస్పిటలు పాలయి చచ్చిపోయినా, పిల్లలు పట్టించుకోకుండా దహన సంస్కారాలకు కూడా రాలేదు. వీకెండ్ ఎంజాయ్‌మెంటులో ఉండిపోయినారు. ఈ దౌర్భాగ్య జీవితం ఇక వద్దనుకున్నాడు సుదర్శనం.

శేషజీవితం ఇండియా వచ్చి పాండిచ్చేరి వృద్ధా శ్రమంలో గడిపెయ్యాలనుకున్నాడు. పిల్లలకు అన్యాయం చెయ్యకుండా ఆస్తిపాస్తులమ్మేసి చెరిసగం యిచ్చేసి, తన ఖర్చులకు మాత్రముంచుకొని వచ్చేసినాడు. చెల్లెలి మీద అభిమానంతో యాభైవేల డాలర్లు దానంగా యిచ్చినాడు. ఇండియాలో ఇన్నేండ్ల తర్వాత మొదట తన చెల్లెలి యింటికి వచ్చి తన దుస్థితి చెప్పుకోవడానికి మనసు మూగబోయింది. తన కూతుర్ని కోడలిగా చేసుకోవడానికి చెల్లెలు శకుంతల ఆరాటపడుతుంటే చెప్పక తప్పింది కాదు. అప్పటి పరిస్థితుల్లో తన భార్య చనిపోయింది కూడా తెలియజేయలేదు, చెల్లెలికి సుదర్శనం ఇప్పుడు చెప్పడం తప్పలేదు.

అమెరికాకు పంపిస్తే, అక్కడి సొసైటీకి అలవాట్లకు లోబడిపోయి అందరి పిల్లలూ అట్లనే తయారయి పోతారని, ఎవ్వరూ పంపించవద్దనీ తన పాతమిత్రు లందరికీ చెప్పి, మధనపడిపోయినాడు సుదర్శనం.

**శకుంతల :**

శంకర్రావు భార్య చదువుకున్న గృహిణి. పాత నమ్మ కాలను పదిలంగా పట్టుకున్న సాంప్రదాయ పరురాలు. ఇంటికి వచ్చిన చుట్టాలందరికి బట్టలు పెట్టి పంపించే మంచి సాంప్రదాయం ఆమెది. అమెరికాలో ఉంటున్న అన్నయ్య అంటే ఎంతో అభిమానం ఆమెకు. అన్నయ్య కూతుర్ని తన కోడలుగా చేసుకుని సంబంధం కొనసాగిం చాలనే తాపత్రయం గలది. పాతికేళ్ళ తర్వాత అన్నయ్య సుదర్శనం ఇండియాకు వచ్చి మొదటగా తనింటికే వచ్చినందుకు చాలా సంతోషపడింది శకుంతల. వదిన సంవత్సరం క్రితమే చనిపోయిందని అన్న చెప్పగా అవాక్కయిపోయింది. వచ్చిం దగ్గర్నుండి అన్నయ్య ముభా వంగా ఉంటుండడం గమనించి శకుంతల పెళ్ళి ప్రస్తా వన తేలేదు. నిదానంగా, కొన్ని రోజులు గడిచింతర్వాత ఊరి వారిచే అందునా సుదర్శనం చిన్ననాటి స్నేహితులతో అడిగించింది. అన్న చెప్పిన అమెరికా సంగతంతా విని ఎంతో బాధపడింది. ఎందుకు సుదర్శనం దిగులుగా ఉన్నాడో తెలుసుకోకుండా, పెళ్ళి ప్రస్తావన తన కొడుకుతో అడిగించినందుకు శకుంతల చాలా మనస్తాపం చెందింది. అన్నయ్య దీన పరిస్థితిని చూచి, అతన్ని తన దగ్గరనే ఉంచుకోవాలని నిర్ణయిం చుకునిందా ఉదార

పరురాలు. వదిన చనిపోయినప్పుడు తెలియజెయ్యకుండా, ఎనకాముందు పుట్టిన వారందర్ని మరచిపోయినాడని అనుకుంది గాని, అన్న దుస్థితి తెలిసింతర్వాతా మనసు కరిగిపోయింది శకుంతలకు. ఇంతగా అన్న చెప్పింతర్వాత అనిష్టమైన అమెరికాకు తన కొడుకును పిహెచ్.డి చెయ్యడానిక్కూడా పంపించకూడదని నిర్ణయించుకునింది. ఇండియాలోనే ఏదో మంచి సంబంధం చూచి కొడుక్కు పెళ్ళి చేయాలను కునింది.

**శంకర్రావు :**

మధ్యతరగతి కుటుంబీకుడు శకుంతల భర్త. సుదర్శనానికి బావ, అమెరికాలో ఉండే బావంటే ఎంతో అభిమానం. అమెరికాలో బాగా డబ్బు కూడా బెట్టింటాడు గాబట్టి. బావ కూతుర్ని తన కొడుక్కి చేసుకోవాలనుకున్నాడు. శంకర్రావు కొంచెం పిసినారి. ఇంటింటికి వచ్చిన చుట్టాలందరికీ భార్య శకుంతల చీరసారెలు పెట్టి పంపిస్తుంటే సహించేవాడు కాడు. డబ్బు తగలేసి బట్టలు పెట్టడం మానుకొమ్మన్నాడు. ఉపయోగపడతాడు గాబట్టి బావంటే యిష్టమే ఆయనతో సంబంధం కలుపుకుంటే అమెరికాకు పోతూ వస్తుండ వచ్చుననే స్వార్థం కూడా ఉంది. ఆయన్ను మంచి చేసుకొమ్మని కొడుకును కూడా పురమాయించాడు. సినిమా హీరోలాంటి ఛాన్స్ వచ్చిందని, మరి సాధించాలని ఎగదోసినాడు. అయిన సంబంధం గాబట్టి, బావ కూతురితోబాటు బావ ఆస్థిపాస్తులను కూడా కలుపుకోవచ్చునని ఆశపడినాడు. అంతకు మించి మరీ దుర్మార్గుడేం కాదు శంకర్రావు. సుదర్శనం తన కుటుంబంలోని విచ్చల విడితనాన్ని వివరించిం తర్వాత శంకర్రావు బావని తన యింటిలోనే ఉండిపొమ్మని తనకేమీ బరువు కాదని ప్రాధేయపడినాడు కూడా. తామేదయినా ఆయన మనసుకు కష్టం కలిగించి ఉంటే క్షమించమని వేడుకున్నాడు. సుదర్శనం చెప్పిందాన్ని బట్టి బుద్ధుంటే తన కొడుకును అమెరికా పంపకూడదని నిర్ణయించుకున్నాడు.

**సందేశం :**

అమెరికా జీవన విధానం వేరు. ఇండియా జీవన విధానం వేరు. అక్కడి క్రమశిక్షణ వేరు ఇక్కడి క్రమశిక్షణ వేరు. అక్కడి ఆహారపు అలవాట్లు వేరు, ఇక్కడి ఆహారపు అలవాట్లు వేరు అమెరికా వెళ్ళింతర్వాత ఎలాంటి వారయినా అక్కడి సొసైటితో, వారి అలవాట్లతో మమేకం కావాల్సిందే. అలా అయితేనే మనకక్కడ గౌరవమిస్తారు. లేకుంటే తక్కువగా, అనాగరికంగా అనుకుంటారు. అలా అనుకునే సుదర్శనం కుటుంబం క్కూడా అమెరికా అలవాట్లకు లోనయిపోయినాడు. తన పిల్లలు కూడా విచ్చల విడితనానికి అలవాటు పడిపోయి తల్లిదండ్రులనే పట్టించుకోకుండా ఎదిగి పోయినారు. ఏమీ చేయలేని స్థితి. చివరకు బిడ్డలనే వదలి పెట్టి వద్దనుకొని ఇండియాకు తిరిగి వచ్చేసిన దుస్థితిని తెచ్చుకున్నాడు. ఇండియా వదలి అమెరికా పంపించే తల్లిదండ్రులకు యిలాంటి పరిస్థితే ఎదురవుతుందని సుదర్శనం ద్వారా అందిన సందేశం.

**ముగింపు :**

ఈ నాటిక 'దూరపు కొండలు నునుపు" అన్న సామెతకి అతికినట్టుగా కచ్చితంగా సరిపోతుంది. భారతీయులు అమెరికా సంబంధాల పట్ల జాగ్రత్త పడాల్సిన వైనాన్ని కంటికి చిత్రించింది. బాధ్యత గల తల్లిదండ్రులు అమెరికా వెళ్ళినా కూడా సుదర్శనం లాగా పిల్లలను విడిచి పెట్టకుండా ఓ కంటితో కనిపెట్టి, మన సంప్రదాయాలు, ఆచారాలు వ్యవహారాలు తెలిసేటట్టుగా పెంచాల్సిన అవసరం ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. అంతరంగాలు (రసరమ్య - నాటక ప్రక్రియలు) - ప్రణవి

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలుగు కథా సాహిత్యం-గిరిజన ఉద్యమ కథలు

- డా॥ ముడావత్ వెంకటేష్

ఆధునిక సాహిత్య ప్రక్రియలలో కథా ప్రక్రియ విశిష్ట మైనది. ఏ ప్రక్రియలో అయినా వస్తువుకి, రూపానికి సమ ప్రాధాన్యం అవసరం, రచన ఏ ప్రక్రియలో ఉన్నా ఆ ప్రక్రియకు నిర్దిష్ట పద్ధతులు ఉంటాయి. రచనా వస్తువు ఎంతో గొప్పదైనా, సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తూ సరైన ప్రక్రియా రూపంలో లేనప్పుడు అది సాహిత్య తత్వాన్ని కోల్పోతుంది. అందువలన రచన ప్రక్రియ రూపం చాలా ముఖ్యం. కథ నిడివి ప్రకారం చాలా చిన్నది. విపుల మైన సన్నివేశాలు, వర్ణనలు, సంఘటనలు కథలో వీలు కాదు అందువల్ల కథా ప్రక్రియ రూపపరంగా క్లిష్టతతో కూడుకున్నది. అయినా కథకు నిర్దిష్టమైన నిర్మాణ పద్ధతులు ఉన్నాయి. కథా నిర్మాణంలో ఖచ్చితమైన భాగాలు ఉన్నాయి. వాటి మధ్య సమన్వయ పద్ధతులు ఉన్నాయి. ఇవన్నీ ఒక క్రమపద్ధతిలో ఉన్నప్పుడే వస్తువుకు గుర్తింపు కలుగుతుంది.'సంసార విషవృక్షమునకు రెండు ఫలములమృత తుల్యములు. ఒకటి సత్సాంగత్యం మరొకటి సత్సాహిత్యం'. చిన్నయసూరి, నీతిచంద్రిక.

మనిషి తన భావనా ప్రపంచంలోని ఊహలను, కల్పనలను అనుభవాలన్నింటికి సాహిత్యరూపం కల్పించాడు. ఇలాంటి రూపం అనేక విధాలుగా కనిపిస్తుంది. అవి పురాణం, ఇతిహాసం, కావ్యం, వచన కావ్యం మరియు ఆధునిక రూపాలైన నవల, కథ మొదలైనవి. వీటిని ప్రక్రియలుగా పేర్కొనవచ్చు. వీటిలో ఛందోబద్ధ కవిత్వానికే మొదటి స్థానం, తర్వాతి స్థానం మాత్రం కథకే దక్కుతుంది. "వారసత్వంగానూ, అభ్యాసంగానూ జాతికి సంక్రమించిన నైతిక సంపద, విజ్ఞాన గరిమ, భావనా పటిమ, మానవశ్రేయోకాంక్ష సాహిత్య ప్రక్రియ స్థాయిని నిర్ధారిస్తాయి"నారాయణ, సింగమనేని

## గిరిజన కథ :

గిరిజనులది ఒక ప్రత్యేకమైన జీవిత విధానం, దాని నుండే వాళ్ళ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు పుట్టుకొచ్చాయి. వేల ఏండ్ల సంస్కృతి ప్రపంచీకరణ ఫలితంగా కనుమరుగైపోతుంది. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లో ఉన్న 35 రకాల తెగల గిరిజనులు ఉన్నారు. ఈ తెగలలో కొన్ని తెగలు మైదాన ప్రాంతాలకు వలస వచ్చి అక్కడున్న సంస్కృతి సంప్రదాయాలను, చదువు సంధ్యలను అలవర్చుకున్నాయి. వారిలో ఎరుకలు, యానాది, బంజారా,మన మధ్యనే నివసిస్తున్నారు. ప్రతి భాషకు సాహిత్యం ఉన్నట్లే గిరిజన తెగకు కూడా ఏ తెగకు ఆ తెగ, సామెతలు, పొడుపు కథలు, నీతి వాక్యాల్లో కూడా సాహిత్యం ఉంది. కాని అది మౌఖికమే తప్ప లిఖితం కాదు. పాటలున్నాయి, కథలున్నాయి, పుక్కిటి పురాణాలు జానపద సాహిత్యంలో ఉన్న మాదిరిగానే ఉన్నాయి. ఇవి ఒకరి నుండి మరొకరికి నోటి నుండి చెవికి ఇలా ప్రయాణం చేస్తూ చిరస్థాయిగా ఉన్నాయి. విటిని సేకరించి కొందరు వివిధ భాషల్లోకి అనువదించారు. మరికొందరూ యాథాతథంగా పొందుపర్చుకున్నారు. మైదానాలకు దూరంగా, కొండకోనల్లో జీవించేవారు గిరిజనులు. నాగరికతకు దూరంగా నివసించే వీరి సంస్కృతి, జీవన సరళి అత్యంత ఆసక్తిని గొలుపుతాయి. అడవి ఉత్పత్తులను తింటూ, పోడు వ్యవసాయం చేస్తూ బతికే గిరిజన జీవితం అమాయకంగా, అత్యంత సహజంగా ఉంటుంది. అడవిలో మైదాన ప్రాంతాల వారి ప్రవేశం వల్ల గిరిజనుల జీవితాల్లో ఆటంకాలు మొదలయ్యాయి. వీటికి తోడు తమ ఆచార వ్యవహారాల వల్ల కూడా గిరిజనులు దుర్భర జీవితాన్ని వెళ్ళదీస్తుంటారు. వీటన్నింటిని రచయితలు కథ, నవలల రూపంలో చిత్రించడానికి ప్రయత్నం చేశారు. తెలుగు సాహిత్యంలో ప్రవేశిస్తున్న జీవితాలు ఎన్నెన్నో గిరిజన జీవితం అందులో ఒకటి. తెలుగు కథ గిరిజన జీవితాన్ని సమస్యలతో ముడిపడి

ఉన్న వారి మమతను చాటుతూ ఉంది. నేడు ఈ కోణం పూర్వం కంటే కొంత ఎక్కువగానే ఉంది. వల్లంపాటి వెంకటసుబ్బయ్య ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ "తెలుగు కథా సాహిత్యంలో మొట్టమొదటి సారిగా గిరిజనుల్ని గురించీ, సంచార జీవనుల గురించీ కథలు రాసిన వాడు చింతా దీక్షితులు. అతడు రాసిన 'సుగాలీ కుటుంబము' 'దాసరిపాట', 'చెంచురాణి" గిరిజన కథలేనని అభిప్రాయ పడ్డారు. ఇతని సుగాలీ కుటుంబము కథ తెలుగులో వచ్చిన మొట్టమొదటి గిరిజన కథే కాకుండా మొట్టమొదటి కరువు కథ కూడా. ఈ కథ 1920లో సాహతీ పత్రికలో ప్రచురణ పొందిందని ఆరుద్ర తమ సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో పేర్కొన్నాడు. మైదాన ప్రాంతాలలో నివసిస్తూ అడవి మీద ఆధారపడి జీవించే సుగాలీ కుటుంబ జీవితం ఈ కథలో చిత్రించబడింది. గిరిజన కథల సంపుటాలు వచ్చాయి. వీటితోపాటు పత్రికలలో కూడా అనేక కథలు వెలువడ్డాయి. 'అడవిలోవెన్నెల' 'అడివంటు కుంది' ఫణికుమార్ గోదావరి గాథలు. 'ఇప్పపూలు' 'పోడుపోరు డా. దిలావర్. కొండాకోనల్లో ఆదివాసీ కథలు. ఉమాదేవి, నమ్మెట. రేల పూలు కథలు. గాయం కొండ కథలు, మన్నెం కతలు, మొదలైనవి. జయధీర్ తిరుమల రావు, జీవన్ సంపాదకత్వంలో 'ఇప్పపూలు' అనే గిరిజన కథల సంపుటి వచ్చింది. అందులో 29 కథలున్నాయి. టీ తోటల ఆదివాసులు చెప్పిన కథలు - సామాన్య ఈ కథలు చిత్రించడం జరిగింది. బంజార మౌఖిక కథలు (తెలంగాణలో సేకరించిన నోటి కథలు) సంపాదకుడు: డా. జె. రాజారాం: ప్రధాన సంపాదకులు: ప్రొఫెసర్ జయ ధీర్ తిరుమలరావు ఈ కథలు చిత్రించడం జరిగింది. మహాశ్వేతాదేవి బెంగాలీలో ఆమె రాసిన కథలు కూడా తెలుగులోకి అనువదించబడ్డాయి.'జీవితఖైదీ', 'దొంగ తనం', 'ప్రాథమిక హక్కులే హక్కులు', 'మకర సవర', 'ఉప్పు', 'శనీచరీ', 'రుదాలి' వంటి కథలు వెలువడినాయి. ఈ కథలు కూడా ఒక్కొక్క సందర్భంలో గిరిజనులు పడే బాధలను, నిరక్షరాస్యతను, అంధకార జీవితాన్ని చిత్రించి చూపినాయి.

## గిరిజన ఉద్యమ కథలు :

గిరిజనుల జీవన విధానంలో ఈ ఉద్యమాల్ని గమనిం చినట్లైతే గిరిజనులు సంస్కృతిని, భూమిని రక్షించు కుంటూ తమ ఆధిపత్యంలోనే ఉండాలని, తమకంటూ ఒక రాజ్యం ఉండాలని అనుకున్నారు. దానికోసం ఎవరి మీదకి యుద్ధానికి వెళ్ళలేదు. ఎవరిని యాచించలేదు. బ్రిటిషు ప్రభుత్వం రాజ్యకాంక్ష, భూస్వాముల దోపిడి పరిపాలనను వారిపై రుద్దింది. వాటినుండి విముక్తులవ డానికి ఎంతో మంది గిరిజనులు మట్టికరిచారు. 1981 సంవత్సరం ఇంద్రవెల్లి మారణహోమం తర్వాత ఏప్రిల్ 20 గిరిజన రైతు కూలి సంఘం మహాసభ ఏర్పాటు చేసింది. గిరిజన, పేద గిరిజనేతరుల మధ్య ఐక్యత సాధించడం, గిరిజనేతర భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేయడం అనే కార్యక్రమం రూపొందించారు. పోలీసులు జరిపిన దాడిలో మరణించిన గిరిజనులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని రైతు కూలి సంఘం డిమాండ్ చేసింది. పోడు-పోరు కథను అట్టాడ అప్పల్నా యుడు రాశారు. షావుకార్ల మీద తిరగబడి పోరాటం చేసిన తెగింపు. కష్ట ఫలితాన్ని అనుభవించలేక, షావుకార్ల దోపిడితోను, పోలీసుల లాఠీ దెబ్బలతోను సతమత మౌతున్న వారందరూ కలిసి పోలీసులు మీద దాడి చేసే విధానాన్ని ఈ కథలో గమనించవచ్చు. అలాగే కొమరం భీము కథ ఒక గిరిజన వీరుని యదార్థ జీవితగాథ. కొమరం భీము కథా రచయిత భూపాల్. ఆదిలాబాద్ అడవుల్లో కష్టజీవుల కష్టాన్ని అప్పటి నవాబులు, షావుకార్లు, ఫారెస్టు పోలీసులు లాక్కునేవాళ్లు. వాళ్లకు ఎదురు తిరిగిన వారు అక్కడి గోండులు, కొలామ్‌లు. అంతేగాక నీళ్లలో నుండి చేపల్ని తీసి ఒడ్డున పారేస్తే బతుకుతాయా? బతకవు కదా! అలాగే అడవిలో నుండి అడవిలో బతికే వాళ్లను తీసేస్తామంటే వాళ్లు మనుషులం వాళ్లు మనుషులం కనుక 'మేం అడవిని వదలం' అన్నారు. ఇలాంటి ఎన్నో కారణాలతో వాళ్లు బతుకుతెరువు కోసం తలెత్తుకొని నిలబడ్డారు. అడవిలో ఆహారం కోసం పోరాటం చేశారు. అలా పోరాటం చేసిన గిరిజనుల

నాయకుడు కొమురం భీము. అతన్ని నైజాం పోలీసులు 1941లో దొంగచాటుగా కాల్చి చంపేశారు. కొండ పంది కొక్కు కథా రచయిత వంగపండు. ఈ కథలో అమాయ కత్వం, నిరక్షరాస్యతవల్ల గిరిజనులు ఎదుటివాళ్ళు చేసే మోసాన్ని గ్రహించలేక శ్రమదోపిడికి గురై, ఋణభారం పెరిగిన గిరిజనులు రైతు కూలీ సంఘం అండతో తిరిగి కష్టార్జితాన్ని దక్కించుకోవడం ఈ కథలో పరిశీలించదగ్గ విషయంగా చెప్పచ్చు. అదే విధంగా ఇదేదారి కథలో ఋణగ్రస్తులుగా చేసి, వారి భూమిని కష్టాన్ని దోపిడి చేసిన షావుకార్లపై గిరిజనుల పోరాటాన్ని, ఏజన్సీ ప్రాంతంలోనే కాక మైదాన ప్రాంతంకు విస్తరింపజేయడం ఇదేదారి కథా రచయిత భూషణం. అడవిలో వెన్నెల అనే కథలో గిరిజనులు షావుకార్ల, ఫారెస్టు ఆఫీసర్ల మోసానికి గురికావడం, తమ భూములు, ఉత్పత్తులు తమవి కాకుండా పోవడం, గిరిజనుల్లో దాగివున్న పోలీసు భయాన్ని పోగొట్టడానికి నక్సలైట్స్ రావడం కథలో కనిపించే ప్రధాన ఇతివృత్తం. బి.ఎస్. రాములు ఈ కథను చిత్రిం చారు. అలాగే సావుకర్చు కథలో శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం జరిగిన తర్వాత గిరిజన గూడేలకు జరిగిన అభివృద్ధి పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన వారి ఫలితమే ఈ కథ. అన్నలొచ్చిన్రు అనే కథను ఫణికుమార్ రాశారు. గిరిజనేతరులు ఆక్రమించిన గిరిజనుల భూమిని వారికి ఇచ్చేయమని కోర్టు తీర్పు ఇచ్చినా ఆచరణలో అమలుకాని విధానాన్ని రచయిత తెలియజేయడమే ఈ కథ. బాబ్జీపేటలో మడావి జంగు, భార్య లచ్చిమి, తమ్ముడు సోము ఉన్నారు. బాబ్జీపేటవాసుల భూ సమస్యలు, రుణ సమస్యలు అన్నలు వస్తే విన్నవిస్తారు. వాళ్లు కొన్ని కేసులు పరిష్కరిస్తారు. లచ్చిమి అన్నలు చేస్తున్న పని తీరుని చూస్తుంది. భూస్వామి మాధవరావు తమ భూమిని ఆక్రమిస్తాడు. అన్నలు అయితే తమ భూమిని తమకు ఇప్పిస్తారనుకొంటుంది. ఈమె భర్త జంగుకి అన్నలు ఈ పని చేస్తారన్న నమ్మకం తక్కువ. జంగు కోర్టులో జరిగిన సంగతులు అందరికి చెప్పి తనకు న్యాయంగా తీర్పు నిచ్చినట్లు ఆధారంగా ఉన్న కాగితాన్ని తీసుకొని భూమి దగ్గరకు వెళతాడు. మాధవరావుకు కాగితాన్ని చూపిస్తాడు. మాధవరావు ఆ కాగితాన్ని చింపేస్తాడు. మాధవరావు కాగితాన్ని చింపాడన్న కోపంతో జంగు మాధవరావుపై తిరగబడతాడు. మాధవరావు మనుషులు జంగుని చితక్కొడతారు. జంగుకు తీవ్ర గాయాలవుతాయి. జంగుని ఇంటికి తీసుకెళతారు. అన్నలను పిలిపించి వైద్యం చేయిస్తారు. అన్నలు జంగుకు భూమిని తిరిగి సంపా దించుకోవచ్చని ధైర్యాన్నిస్తారు. జంగు భూమిని జంగుకి తిరిగిప్పించడానికి చట్టాలు ఏమాత్రం సహకరించలేదు. తుడుం కథలో గిరిజనులు శత్రుసైన్యాన్ని సరిహద్దు దాటేంత వరకు తరిమిన విధానాన్ని రచయిత అల్లం రాజయ్య చిత్రించారు గిరిజనులు పండుగ సమయంలో లేదా గిరిజనేతరులు గూడెం సరిహద్దులను దాటివచ్చే సందర్భంలో తుడుం మోగిస్తుంటారు. తమ గూడెంలో శత్రు సైన్యం గిరిజనులను నాశనం చేయడానికి వస్తుం దన్న సంగతి తెలియజేయడానికి తుడుం కొడతారు.

**ముగింపు :**

తెలుగు సాహిత్యంలో ప్రవేశిస్తున్న జీవితాలు ఎన్నెన్నో. అందులో ఒకటి గిరిజన జీవితం. తెలుగు కథ గిరిజన జీవితాన్ని సమస్యలతో ముడిపడి ఉన్న వారి మమతను చాటుతూ ఉంది. గిరిజనుల జీవన విధానంలో ఈ ఉద్యమాల్ని గమనించినట్లైతే.ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ ప్రభావ మూలంగా గిరిజనుల సంస్కృతి. జీవితం విధ్వం సానికి గురైనట్లుగా చాలా స్పష్టంగా కనిపిస్తుంది. నేడు ఈ కోణం. పూర్వం కంటే కొంత ఎక్కువగానే ఉంది. పోడు వ్యవసాయం చేస్తూ బతికే గిరిజన జీవితం అమా యకంగా, అత్యంత సహజంగా ఉంటుంది. గిరిజనుల జీవితాన్ని భిన్న కోణాల్లో చిత్రించారు గిరిజన కథ రచ యితలు. గిరిజనుల జీవితాన్ని, వారి సంస్కృతిని అక్షర బద్ధం చేశారు. వారి సమస్యలు కథలను.నాగరిక సమాజం ద ృష్టికి తెచ్చారు. ఇప్పటివరకు దాదాపు 9 గిరిజన కథ సంపుటాలు వచ్చాయి.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 

# సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి కథలు – మానవతా విలువలు

– డా॥ పి.వి. రమణారెడ్డి, ఆంధ్రోపన్యాసకులు, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, విశాఖపట్నం.

తెలుగు కథని సుసంపన్నం చేసిన అనేకమంది యువ కథా రచయితల్లో సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి ముందు వరుసలో నిలుస్తారు. అచ్చమైన, అరుదైన, నికార్సయిన గ్రామీణ కథకుడు యితడు. తనకు తెలిసిన జీవితంలోని అంత స్సంఘర్షణల్ని కథాసాహిత్యంలో సృజిస్తున్నారు. వాస్తవిక జీవిత చిత్రణ, వైవిధ్యం యితని కథల్లో కన బడుతుంది. ఏ కథ తీసుకున్నా దేనికదే ఓ అపురూప అక్షర శిల్పం. ప్రతి ఘటనలో, ప్రతికథలో కథకుడు లీనమై వ్రాసిన కథలివి. మనిషి మేధస్సుకు పదును పెడుతూ, ఎన్ని కోణాల్లోనో ప్రతిఫలించే ఈ కథలు చదివి తీరడమేకాక కలకాలం పదిలంగా దాచుకోదగ్గవి.

సన్నపురెడ్డి కథల్లో మానవతా విలువలు కలిగిన పాత్రలు ఎన్నో కనబడతాయి. "'చనుబాలు' వినూత్నమైన, వైవిధ్యభరితమైన గొప్ప దళిత కథ ఇందులో "పొట్టక్క" అనే స్త్రీ త్యాగం నిరుపమానమైనది. తన కొడుకును ఎండగట్టి తన స్నేహుతురాలి కొడుక్కి చనుబాలు యిచ్చి ఆదుకుంటుంది. ఎండిపోతున్న గుండెల్ని మన కళ్ళ ముందు పెట్టి, ప్రతిగా మన గుండెలు చెమ్మగిల్లేలా చేశారు రచయిత. ఈ కథలో గొప్ప మానవతావాదిగా పొట్టక్క కనబడుతుంది. ఇలాంటి పాత్రలు చాలా అరుదుగా కనబడతాయి.

'చనుబాలు' కథానాయకుడు ఒక గ్రామానికి సర్పంచ్. భూస్వామిగా స్థితిమంతుడు. పొట్టక్క, సర్పంచ్ తల్లి చెన్నమ్మ బాల్య స్నేహితురాండ్రు. చిన్ననాటి నుండి పొట్టక్కకు, సర్పంచ్ కుటుంబంతో ఆత్మీయ బంధం ఉ ంది. ఈ ఆత్మీయ భావంతోనే ఆమె మన కథానాయకుడికి స్తన్యమిచ్చింది. ఈ పని చేసేందుకు ఆమె చేసిన త్యాగం సామాన్యమైంది కాదు. అప్పటికి పొట్టక్క కూడా బాలింత రాలు. తన స్నేహితురాలు చెన్నమ్మ సర్పంచ్‌ని అదే సమయంలో కంటుంది. అప్పుడు చెన్నమ్మ దగ్గర పాలు లేక, పశువుల పాలుపడక బిడ్డ ఏడుస్తుండగా, భర్త ఆమెపై కోపగించుకుంటాడు. అప్పుడు తన కొడుకును ఎండగట్టి స్నేహితురాలి కొడుక్కి తన పాలు యిచ్చి ఆదుకుంటుంది. ఇది కథానాయకుడి తల్లినే కాకుండా, ఇంట్లోవాళ్ళ నందర్ని కదిలిస్తుంది. ఆనాటి నుండి పొట్టమ్మ ఆయింట్లో మనిషిగా మారిపోయింది.

సర్పంచ్ రాజకీయ ప్రత్యర్థులు దళిత స్త్రీ పాలు తాగాడని అతడ్ని కించపరిచేవారు. ఆమెకు కొంత ధన సహాయం చేసి, ఇంటివైపు రాకుండా చేయాలని భావించి పొట్టక్క యింటికి వెళతాడు. పొట్టక్క యింకొక స్త్రీతో చెప్పుతున్న మాటలు సర్పంచ్ చెవిలో పడతాయి. తన కొడుకు ఏసేబు చిన్నప్పుడు ఆకలితో ఏడుస్తున్నా వాడిని ఎండగట్టి సర్పంచ్‌కి పాలిచ్చి అతని ప్రాణాలు నిలబెట్టి తన స్నేహితురాలు చెన్నమ్మ సంసారాన్ని నిలబెట్టి నట్లు చెపుతుంది. తన కొడుకు అందువల్లనే అనారోగ్యానికి గురయ్యాడని అంటుంది. ఆ మాటలు విన్న సర్పంచ్ జ్ఞానోదయమవుతుంది.

"దళిత సమస్యను పోరాట దృక్పథంలోంచి కాకుండా, అంతరంగపు లోతుల్లోంచి ఆవిష్కరించగలగడం" ఈ కథలోని ప్రత్యేకత.

'కొత్తదుప్పటి' కథలో మనుషుల మధ్య అనుబంధాలు ఏ విధంగా స్వార్థాన్ని నింపుకుంటాయో రచయిత చక్కగా వ్యక్తం చేశాడు.

రామయ్యతాత తన ఏకైక కూతుర్ని దూరపు చుట్టమైన ఓబన్నకు యిచ్చి పెళ్ళి చేసి ఆస్తినంతట్ని అతనికి కట్ట బెడతాడు. రాత్రివేళ రామయ్యతాత కళ్ళంలో ధాన్యానికి కాపలా కాస్తూ వీర బ్రహ్మంగారి తత్త్వాలు పాడుకుంటూ, చలికి వణుకుతూ, దగ్గుతూ ఉంటాడు. తన పెద్ద మనుమడు ఆర్మీలో పనిచేస్తూ ఉంటాడు. తాతకోసం కొత్త దుప్పటి పంపించి ఉంటాడు. అయితే మనుమడు పంపిన దుప్పటిని ఓబన్న వాడుకుంటూ ఉంటాడు.

రామయ్య తాత మంచం దగ్గరికి రాగా, అతని కంటపడ కుండా దుప్పటిని మంచం కిందికి జారవిడుస్తాడు ఓబన్న.

ఓబన్న తన కూతుర్ని యింటి దగ్గర పడుకోబెట్టి కళ్ళం దగ్గరికి వస్తాడు. అక్కడ చలి మంట అతనికి కనిపించదు. చినిగిపోయిన దుప్పటి ముసుగేసుకొని బూడిద కుప్పలో నిప్పురవ్వల్ని కెలుకుతూ ఉంటాడు రామయ్యతాత. పక్కన కొన్ని పుల్లలు మిగిలి ఉండడం ఓబన్న చూస్తాడు. పెద్దోడు మిలిట్రీ నుండి కొత్త బొచ్చు దుప్పటి పంపేంతవరకు ఈ కష్టాలు తప్పవని అంటాడు. తన దగ్గరున్న 'కొత్త దుప్పటి' గురిచి ముసిలోడికి తెలిసిందేమోనని అను మానిస్తాడు ఓబన్న. పుల్లలుండి కూడా మంట వేసు కోలేదంటే కళ్ళారా అతని అవస్థను తాను గమనించాలని అనుకుంటూ ఉన్నాడేమోనని అతను భావిస్తాడు. నీ కోసమే పుల్లలు మిగిల్చాను, మంట వేసుకుందాం రమ్మని అల్లుడ్ని కూర్చోమంటాడు.

ఓబన్నకు క్షణకాలం శరీరమంతా జలదరిస్తుంది. అతర్కుంఖంగా ముసుగేసుకొన్న కొత్తదుప్పటి ఒకటి అప్రయత్నంగానే కుప్పలా జారిపడుతుంది. రామయ్య తాత గీసిన అగ్గిపుల్లమంట ఎండు చితుకులతోపాటు, మరేదో అంటుకున్నట్లుగా అనిపిస్తుంది. ఓబయ్యకు కనువిప్పు కలుగుతుంది. ఇందులో రామయ్యతాత వ్యక్తితత్త్వం, మానవత్వం పట్ల గల ఉదాత్తమైన భావన మనకు తెలుస్తాయి. ఆ పాత్రపట్ల సానుభూతి పాఠకుడికి కలుగుతుంది.

'తడి' కథలో అక్క, తన కొడుకుల మధ్య ఏర్పడిన వివాదాన్ని నైపుణ్యంతో పరిష్కరిస్తుంది చెన్నమ్మ. రెండు కుటుంబాల బాగుకోసం ఆమె ఎంత తపిస్తుందో యిందులో తెలుస్తుంది.

మడుగులోని నీటికోసం తన కొడుకు సుబ్బన్నకు, అక్క కొడుకు రంగన్నకు ఘర్షణ ఏర్పడుతుంది. సుబ్బన్నపై రంగన్న దాడి చేయగా, దెబ్బలకు సుబ్బన్న స్పృహతప్పి కిందపడి పోతాడు. ఈ విషయం తెలుసుకొన్న సుబ్బన్న కొడుకు శీను రంగన్ననూ, అతని కొడుకునూ తలలు పగిలేటట్లూ కొడతాడు. ఇద్దరు ఆసుపత్రి పాలవుతారు. గ్రామ నాయకుడు ఇద్దర్ని రెచ్చగొట్టి కేసులు పెట్టుకునేటట్లు చేస్తాడు.

ఇద్దరు కోర్టుల చుట్టూ తిరుగుతూ లాయర్ల ఫీజుకోసం ఆస్తులమ్మకుంటారు. చివరకు తన కొడుకు సుబ్బన్న కేసు గెలవడానికి కడియాలిమ్మని చెన్నమ్మను అడుగు తాడు. చెన్నమ్మ మౌనందాలుస్తుంది. తల్లి ఉద్దేశాన్ని గ్రహించిన సుబ్బన్న యింటికి వెళతాడు. చెన్నమ్మ గతాన్ని నెమరు వేసుకుంటుంది. మొదటిసారి అక్కా, తను ఆసుపత్రి వరండాలో కూర్చొని తెల్లార్లూ ఏడుస్తూ గడపటం గుర్తుకొస్తుంది. ఈ సమస్యను తాను పరిష్క రించాలనుకొంటుంది. తన చేతి కడియాలను మూటలో గట్టుకొని ఒక రాత్రివేళ అక్కయింటికి వెళుతుంది చెన్నమ్మ. మంచంలో నిద్రపోతున్న అక్కను లేపి, యింట్లోకి తీసుకొని వెళుతుంది. వారి గుసగుసల సవ్వడికి రంగన్నకు మెలకువ వస్తుంది. ఇంట్లోకి వెళుతున్న తల్లులిద్దర్ని చూసి ఆశ్చర్య పోతాడు. వాకిలి దగ్గర నిలబడి యిద్దర్ని గమనిస్తాడు.

చెన్నమ్మ తన చేతి కడియాలు అక్క చేతిలో బెట్టి రంగన్నకు యివియిచ్చి కేసు కొట్టించి వేయమని చెపు తుంది. అక్క నిలువునా కరిగిపోతుంది. చెల్లెల్ని వాటేసుకొని బావురమంటుంది. ఆసన్నివేశాన్ని చూసిన రంగన్న గుండె చెమ్మగిల్లుతుంది. ఎండిపోతున్న తమ బతుకుల మీదికి చివరి తడిలా ఆమె వచ్చినట్లు అనిపిస్తుంది రంగన్నకు.

ఆ ఊరిపెద్దిరెడ్డి కుతంత్రాన్ని తెలుసుకొని తన బిడ్డల్ని కష్టాల నుండి బయటపడుటకు ఆమె చేసిన సాహసం నిరుపమానమైనది.

"అమ్మ" కథలో అమ్మదనాన్ని రచయిత చక్కగా వ్యక్తం చేస్తాడు. తల్లిహృదయం ఎల్లప్పుడు పిల్లలక్షేమాన్ని కోరుకుంటుంది. ప్రేమను సమానంగా పంచాలను కుంటుంది. ఎవరికి యిబ్బంది కలిగినా వెంటనే స్పంది స్తుంది. కొడుకుల్లో ఎవరో ఒకరి దగ్గర ఉండడం వల్ల యింకొకరికి సహాయం చేయలేని పరిస్థితి ఒక తల్లికి ఏర్పడుతుంది. దాని నుండి బయట పడటానికి ఆమె వేరు కాపురం పెట్టాలనుకొని ఒక్క అంకణం "చుట్టు గుడిసె" వేయించమంటుంది.

రెండురోజుల నుండి అన్న పానీయాలు ముట్టుకోకుండా తన కొడుకుల మీద నిరసన తెలుపుతుంది బాలమ్మ. ఊర్లోని పెద్దమనుషులు, చుట్టాలు, కూతురు వచ్చి చెప్పినా అన్నం ముట్టదు బాలమ్మ.

తన దగ్గర ఉండకపోవడానికి తానేమి తప్పు చేశానో చెప్పమని పెద్ద కొడుకు రమణయ్య నిలదీస్తాడామెను. అప్పుడామె "నీ దగ్గర వుండి, నీ తిండి తింటూ, నువ్విచ్చిన గుడ్డకడుతూ తమ్ముడికి సాయం చేస్తూ ఉంటే వానికి పనిచేయవద్దని నువు చెప్పలేదా!" అని అంటుంది. ఆ మాటలకు రమణయ్య నోరుమూత పడుతుంది. కారణం తెలుసుకున్న వారంతా నిట్టూర్చారు. చిన్న కొడుకు గోపాల్ దగ్గర ఉన్నప్పుడు, పెద్దకొడుకు భార్య ఊరు వెళ్ళగా అతని పనులు చేస్తుంటే నా తిండి తింటూ అన్నకు పనులు చేయడం ఒప్పుకోనని తల్లిని మందలించాడు. "ఇంత చిన్న వషయానికి నువ్వు అలిగావా!" అని పెద్దమనిషి రామయ్య తేలికగా తీసిపారేస్తాడు. "వారు ఆ విధంగా మారినా నాకు యిద్దరు సమానమే. వారిలో ఎవరు కష్టాల్లో వున్నా చూడలేనని నిట్టూరుస్తూ బాధ పడుతుంది. వేరుగా ఉన్నట్లయితే యిద్దరికి సహాయం చేయగలుగుతాను. కాబట్టి ఒక్క అంకణము గుడిసె వేయమని చెప్పండని అక్కడున్న వారితో వలవల ఏడుస్తూ" చెపుతుంది బాలమ్మ. నిశ్శబ్దవాతావరణం ఏర్పడుతుంది.

అమ్మదనపు భావన చనుబాలంత కమ్మదనంగా అక్కడున్నవారిని కమ్మేసి మైకంలో పడేసింది. 'ఊరి మిండి' కథలో లక్ష్మమ్మ కొడుకులు టౌనులో స్థిరపడడం వల్ల పల్లెలో ఒంటరి అవుతుంది. పండుగ రోజుల్లోనైనా కొడుకులు, వారి సంతానంతో యిల్లు సందడిగా ఉండాలనుకుంటుంది. కాని ఆమె ఆశ నిరాశగానే మిగిలిపోతుంది. చిన్నప్పుడు తన యింటి దగ్గర పెరిగి, చదువుకొని, సోములోరుగా మారిన 'బిత్తలోడి' కోసం ఎదురు చూస్తుంది. కిరాణా కొట్టు కెళ్ళి వేరుసెన పప్పు, చింతపండు తెచ్చి ఊరిమిండి సిద్ధం చేసింది. సోములోరు వచ్చిన ప్రతిసారి ఆమె ఊరిమిండి రుచి చూడకుండా వెళ్ళేవేడుకాదు. అలాగే యిప్పుడు కూడా ఎదురు చూసి, చూసి యిక రాడేమోనని ఏడు స్తుంది. కొడుకులు తనను ఒంటరిగా వదిలినప్పుడు కూడా రాని ఏడుపు అప్పుడు వస్తుంది. కాని సోములోరు వచ్చి ఆమెను ఓదార్చి ఆమె చేసిన ఊరిమిండి తింటాడు. తన కన్న కొడుకులకు తనచేతి ఊరిమిండి ఎందుకు రుచించలేదని సోములోరిని ప్రశ్నిస్తుంది. తల్లిప్రేమను సోములోరికి పంచుతుంది లక్ష్మమ్మ.

ఈనాడు తల్లిదండ్రులు కొడుకుల ప్రేమకు దూరమై ఏవిధంగా అనాదరణకు గురవుతున్నారో ఈ కథ ద్వారా తెలియజేశాడు రచయిత.

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి రాయలసీమ ప్రజల జీవన సరళిని, సామాజిక పరిస్థితుల్ని చరిత్రను కథల నిండా నిక్షిప్తం చేయడం జరిగింది. వాస్తవిక జీవణ చిత్రణని విడమరచి స్పష్టంగా అద్దంలో చూపించినట్టుగా కథను చెప్పడం సన్నపురెడ్డి ప్రత్యేకత. రాయలసీమ, అందులో కడప మాండలికంలో వారు సాహిత్య రచన సాగిస్తున్నారు.

**ఆధార గ్రంధాలు :**

1. "కొత్త దుప్పటి" కథల సంపుటి, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, విశాలాంధ్ర పబ్లికేషన్స్.
2. "బతుకు సేద్యం" కథల సంపుటి, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, విశాలాంధ్ర పబ్లికేషన్స్.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# బండి నారాయణ స్వామి చారిత్రక నవల శప్తభూమి - రాయలసీమ జీవితం

- పొదిలి నాగరాజు

2017లో బండి నారాయణ స్వామి రచించిన చారిత్రక నవల శప్తభూమి. రాయలసీమ జీవితాన్ని గత చరిత్రతో పోల్చి చిత్రించిన నవల ఇది. రాయలసీమ చితికిన జీవితాలను తన భుజాలపై వేసుకొని బతుకు బండిని భారంగా నడిపించిన కాలమే 18వ శతాబ్దం. ఈ శతాబ్దంలో సీమ సామాజిక, ఆర్థిక, మత, రాజకీయ, చారిత్రక పరంగా తన అస్థిత్వాన్ని పూర్తిగా చేజార్చుకుని పాలెగాళ్ళ పాలనా ఉక్కు పిడికిళ్ళలో ఊపిరాడక నలిగిపోయింది. "కంచే చేనును మేసిన" విధంగా అధికార యంత్రాంగం పన్నుల మోతతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంటే కళేబరాలతో కరువు తన కర్కశత్వాన్ని ఝుళిపించింది. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు రాయలసీమ గ్రామీణ ప్రాంతాలలో స్త్రీలపై చేసిన అత్యాచారాలు, మతం పేరుతో ప్రజలను దోచుకున్న స్వార్థపరులు, కులాచారాలతో దళితులపై చేసిన హింసాత్మక చర్యలు, ధనం, కులం ఆధారంగా అమలు చేసిన కుసంస్కారపు శిక్షలు నవలలో కుప్పలుగా పోసినట్లు కనిపిస్తాయి. ఇవన్నీ నవలా కాలం నాటికి అడ్డగోలుగా పెరిగిపోతున్నాయని తెలిసినా నాయకులు తమ కర్కశ పాలనతో రాయలసీమను అనాథగా మార్చి ఆర్తనాదాలతో అలమటించేలా చేశారు. ఇలాంటి చిత్రణలు నవలలో పాఠకుడి హృదయాన్ని కలిచివేస్తాయి. తాను కట్టుకున్న గూడులో తానే నరకయాతన అనుభవించే గొంగళి పురుగులాంటి రాయలసీమను చూసి, చలించిన రచయిత సీమ అనాధ చరిత్రకొక జ్ఞాపికలా శప్తభూమి నవలను చిత్రించాడు.

"సమైక్యాంధ్ర ఉద్యమంలో తన రాయలసీమ అస్థిత్వాన్ని దివాళా తీసుకుంటున్న సందర్భంలో ఈ రచయిత దిగులుపడినాడు, ఖేదపడినాడు, కోపగించుకున్నాడు. తెలంగాణ భాష, యాస, చరిత్ర, సంస్కృతి, సాహిత్యాలు పునరుజ్జీవనం పొందుతున్న సందర్భంలో రాయలసీమ ప్రాంతీయ అస్థిత్వం ప్రశ్నార్థకమయింది. ఈ క్రమంలోనే రాయలసీమ చారిత్రక నవల రాయటానికి బీజం పడింది" అన్న రచయిత మాటలే 'శప్తభూమి' నవలను రచించటానికి ప్రేరేపించిన మౌలిక సూత్రాలు. గత చరిత్ర ఆధారంగా వర్తమానాన్ని చిత్రించగలిగిన దానినే చారిత్రక నవలగా పేర్కొంటారు. అయితే తన ప్రాంతీయ గత చరిత్రకు చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, మత విషయాలలోని స్థితిగతులను వర్ణించే ప్రయత్నం చేయకుండా ఆ పరిస్థితులు ఏర్పడడానికి సరైన కారణాలను వివరించే నవలనే ఉత్తమ చారిత్రక నవల అంటారు. శప్తభూమి నవలలో స్వామి సీమ పరిస్థితులను వర్ణించకుండా ఆ పరిస్థితులు అలా ఎందుకు పుట్టుకొచ్చాయో, రాయలసీమ అనాథ భూమిగా మారి తన బతుకును ఎందుకిలా ఎల్లబోస్తుందో అన్నదానికి కారణాలను తెలియజేశాడు. ఈ రకంగా స్వామిని ఉత్తమ చారిత్రక నవలా రచయితగా స్వీకరించక తప్పదు.

క్రీ॥శ॥ 1675లో విజయనగర పాలకుడైన మూడవ శ్రీరంగరాయల పాలన అంతమైన తర్వాత రాయలసీమను క్రీ॥శ॥ 1800 వరకూ స్థానికులైన నవాబులు, పాలెగాళ్ళు పరిపాలించారు. పాలెగాళ్ళ విచ్చలవిడితనమే సీమ చరిత్రకు అంధకారయుగం అయింది. పాలెగాళ్ళు అవసరమైనపుడు రాజులకు సైన్యాన్ని సమకూరుస్తూ రాయలసీమ చుట్టూ మకుటంలేని మహారాజులుగా చెలామణి అయ్యారు. అళియరామరాయలకు కుడి భుజంగా ఉన్న హనుమప్ప నాయుడు రామరాయల అనంతరం అనంతపురానికి రాజు కావటంతో హండే వంశీయులు అనంతపురాన్ని పాలించటం మెదలవుతుంది. హండే వంశంలో చివరిరాజు సిద్ధరామప్ప నాయుడు. నవలా

కాలానికి సిద్ధరామప్ప అమరనాయకుల అండదండలతో అనంతపురాన్ని పాలిస్తుంటాడు. ఈ అమరనాయకులు అనుసరించిన విధానాల వల్ల సస్యశ్యామలమైన పల్లెగానీ, సుఖ సంతోషాలతో జీవించిన పాత్రగానీ నవలంతా వెతికినా కనిపించదు. ఒకవైపు పాలెగాళ్ళ పాలన, మరోవైపు కరువుదాడి సీమ ప్రజలను కన్నీళ్ళతో కుదిపేసి చీకటి కూపంలోకి నెట్టివేశాయి. 'శప్తభూమి'లో ఆకలి, ఆవేదన లతో తడిసిన జాడలే ఎగుడుదిగుడుగా కనిపిస్తాయి. సీమ వాస్తవిక జీవితాన్ని శప్తభూమే కాదు 18వ శతాబ్దం గురించి చెప్పిన ప్రతి తెలుగు చారిత్రక గ్రంథం సీమ దారిద్ర్యా వస్థను స్పృశించకుండా దాటలేకపోయాయంటే ఈ శతాబ్దం సీమను తనకాళ్ళకింద ఎంతలా నెరిపేసిందో తెలుస్తుంది. ఇది ఏ కాలంలో మొదలయిందో, దీనికి కారణమైన రాజులు, రాజ్యాలు ఏవో గానీ ఇప్పటికీ ఆ దారిద్ర్య అవస్థ వారసత్వంగా మిగిలేవుంది. దీనిని నిరూపించటానికి రచయిత చేసిన గొప్ప ప్రయత్నమే శప్తభూమి నవల.

రచయిత నవలకోసం ఎంచుకున్న చారిత్రక కాలం 18వ శతాబ్దం, అందులోనూ క్రీ॥శ॥ 1775వ సంవత్సరాన్ని ప్రధానంగా సూచించి, నవలను 1788 వరకూ నడిపించారు. చారిత్రకంగా చూసినప్పుడు 1775లో అనంతపురం, గుత్తి, బళ్ళారి ప్రాంతాలు మైసూరు పాలకుడైన హైదరాలీ వశమయ్యాయి. దీనిలో భాగంగా అనంతపురం హైద రాలీకి సంవత్సరానికొకసారి కప్పాన్ని చెల్లించాలి. ఈ కప్పం హైదరాలీ మరణం తర్వాత టిప్పుసుల్తాన్ కాలానికి నలభైవేల రూకలు అవుతుంది. కర్ణాటక యుద్ధాల ఫలితంగా టిప్పుసుల్తాన్ తనకు సామంతరాజ్యాలు కప్పాలు ఖచ్చితంగా చెల్లించాల్సిందేనని కఠినమైన ఆజ్ఞలు జారీ చేస్తాడు. ఇది కరువుతో అల్లాడిపోతున్న అనంతపుర సంస్థానాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఒక్కపూట తిండి తినటానికే దేవులాడుతున్న ప్రజలకు పన్నుభారం మోయ లేని మోతవుతుంది. హండేనాయకులు అనంతపురం బొక్కసం నింపడానికి అకారణంగానే యుద్ధాలు చేయడం అత్యవసరం అవుతుంది. దీనిని కారణంగా చేసుకొని అమరనాయకులు పల్లెలపై మెరుపు దాడులు చేస్తూ, కనిపించినదల్లా పట్టుకొనిపోయేవారు. స్త్రీలపట్ల అమానుషంగా ప్రవర్తించేవారు. పెచ్చు మీరిన కరువుతో, బహమనీ సుల్తానుల పాలనతో విసిగిపోయిన ప్రజలకు ఇదొక శాపంగా తయారవుతుంది. వానలు పడక, పంటలు పండక కుటుంబానికి ఒక్కపూట కూడు పెట్టుకోలేని స్థితిలో వున్న పల్లెలకు బతుకే భారంగా మారిపోతుంది. ప్రాణం తీపితో చావలేక, ఆకలి మంటతో బతకలేక ప్రజలు నరకయాతన అనుభవించారని ఇప్పటికీ చరిత్ర ఘోషిస్తూనే వుంది. అందుకే రచయిత ఈ కాలాన్ని నవలకు ఎంచుకొన్నారు. అందువల్లే రచయిత నవలలో ఏ ఒక్క పాత్రకూ ప్రాధాన్యత ఇవ్వలేదు. శప్తభూమిలో కదలాడుతున్న పాత్రలన్నీ ఏదో ఒక కారణంతో ప్రాణా లను పోగొట్టుకుంటూనే కనిపిస్తాయి. ఇది నవలగా గాక ఆర్తనాదాలతో, అనాథలుగా జీవించి గతించిన శాపగ్రస్త ప్రాంతంగా కనిపిస్తుంది. శప్తభూమి నవలను చదువు తుంటే ఎంత వద్దనుకుంటున్నా పాఠకుడి హృదయం మెలికలు తిరుగుతూ రాయలసీమ వాస్తవిక జీవితంలోకి నెట్టుకుంటూ వెళ్తుంది.

క్రీ॥శ॥ 1775తో నవల మొదలవుతుంది. అప్పటికే హండే వంశ చివరి రాజు సిద్ధరామప్ప నాయుడు అనంత పుర సంస్థానం చెయ్యిపట్టి ఇరవై రెండేండ్లు అయి వుంటుంది. హండే సంస్థానానికి దళవాయి సుబ్బ రాయుడు, అమరనాయకులు భిల్లే ఎల్లప్ప, నల్ల నాగిరెడ్డి, చిత్రలింగ నాయకుడు, పెమ్మసాని తిమ్మప్పనాయుడు అంగరక్షకులు. గ్రామ పాలనా వ్యవహారాలు, పన్ను వసూళ్ళు లాంటి ప్రధాన అధికారాలన్నీ అమరనాయకుల ఆధీనంలో వుండడం చేత గ్రామాలలో అమరనాయకులు చెప్పిందే శాస్త్రం, చేసేదే చట్టంగా వుండేది. ప్రభువుకు, ప్రజలకు మధ్య అవినాభావ సంబంధాలు దూరం కావడంతో ప్రజలు తమ బాధలను ప్రభువుకు నేరుగా విన్నవించుకొనే పరిస్థితి ఉండేదికాదు.ంబుక్కరాయ సముద్రం చెరువు నిండా నీళ్ళు వున్నంత కాలం అనంతపుర సంస్థానం హాయిగా ఉంటుంది. వర్షాలు పడక

బుక్కరాయ సముద్రం పూర్తిగా ఎండిపోయిన తరువాత కరువులతో ప్రజలు అల్లాడిపోతారు. ఈ సమయంలోనే మైసూరులో హైదరాలీ మరణించి టిప్పుసుల్తాన్ కొత్తగా రాజ్యానికొస్తాడు. సామంత ప్రభువులు చెల్లించాల్సిన పైకాన్ని ఖచ్చితంగా చెల్లించాల్సిందేనని పట్టుపడతాడు. అనంతపుర సంస్థానం టిప్పుసుల్తాన్‌కు 40వేలు ఖండినీ రూకలు చెల్లించాల్సి వస్తుంది. ఇందిలా వుండగా అమర నాయకులైన పెమ్మసాని తిమ్మప్ప నాయకునికి, చిత్ర లింగనాయకునికి అనవసర మనస్పర్థలు ఏర్పడి తిమ్మప్ప నాయుడు కుట్రచేసి చిత్రలింగనాయకుడిని చంపిస్తాడు. తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేని చిత్రలింగనాయకుని కూతురు హరియక్క తిమ్మప్పనాయుడిని ద్వంద్వ యుద్ధంలో ఓడించి చంపేస్తుంది. ఇద్దరి అమరనాయకుల మరణంతో అనంతపుర సంస్థానం కొంత ధైర్యాన్ని కోల్పో తుంది. టిప్పుసుల్తాన్ ఆదేశాల మేరకు గుత్తి సుబేదారు సిద్ధరామప్పను కలిసి పైకం చెల్లించమని బలవంతం చేస్తాడు. వానల్లేక, చెరువుల్లో నీళ్ళులేక, పంటలు పండక, రైతులు పన్నులు చెల్లించక అప్పటికే రెండు సంవత్సరాలై వుంటుంది. సిద్ధరామప్ప అనంతపుర సంస్థానం బొక్కసం నింపి పైకం చెల్లించాలనే ఉద్దేశంతో శత్రు సంస్థానమైన తాడిమర్రి సంస్థానంపైకి అమరనాయకులైన ఎల్లప్పజెట్టి, నల్లనాగిరెడ్డికి సైన్యమిచ్చి పంపిస్తాడు. ఈ యుద్ధంలో తాడిమర్రి వారు నల్లనాగిరెడ్డిని చంపేసి హండే సైన్యాన్ని బందీలుగా పట్టుకుంటారు. సైనికులను విడిపించటానికి సిద్ధరామప్పకు ధనం అదనంగా ఖర్చవుతుంది. మైసూరు ప్రభువుకు పైకం చెల్లించడంలో ఆలస్యమవడంతో గుత్తి సుబేదారు అనంతపుర సంస్థానంపై దాడిచేసి పైకం చెల్లించమంటాడు. సిద్ధరామప్ప సుంకం కింద చెరువు లోపల్లెను,10వేల రూకలను చెల్లిస్తానని సంధికి ఒప్పుకున్నా గుత్తిసుబేదారు అంగీకరించడు. చివరిగా మిగిలిన ఎల్లప్ప కూడా 'అనంతపురంపై వర్షం కురిసి బుక్కరాయసముద్రం నీటితో నిండిపోయి హండే సంస్థానం బాగుపడాలని' శ్రీశైలం వెళ్ళి వీరమంటపం ద్వారా ప్రాణత్యాగం చేస్తాడు. అయినప్పటికీ వానలు రావు. చెరువులు నిండవు. గుత్తి సుబేదారు సిద్ధరామప్పను బంధీని చేసి గుత్తికి తీసుకెళ్తాడు. పట్టపు రాణి మరణిస్తుంది. క్రీ॥శ॥ 1788లో సిద్ధరామప్ప మరణిస్తాడు. కొడుకుల మరణంతో హండే సంస్థానం అంతరించిపోతుంది. మిగిలిన రాచబంధువులు కాశీ విశ్వేశ్వరుని తోపులో ఉరి వేసుకొని చనిపోవడంతో నవల ముగుస్తుంది. రాయలసీమ చారిత్రక ఆధారాలతో నిర్మిం చిన శప్తభూమి నవలలో కథా సారాంశాన్ని వివరించడం వీలుకాదు. నవలాకాలం నాటి చారిత్రక పరిస్థితులతో చిత్రించిన సన్నివేశాలతోనే నవలను అధ్యయనం చేస్తూ సాగుదాం.

శప్తభూమి నవల బుక్కరాయసముద్రం వద్ద మొద లవుతుంది. క్రీ॥శ॥ 1364లో చిక్కప్ప వడయార్ దేవరకొండ వద్ద పాండునదికి ఆనకట్టలు కట్టించాడు. వీటిలో తూర్పు దిక్కున వున్న ఆనకట్టకు బుక్కరాయసముద్రం అని పేరు. ముసలమ్మ మరణం కథా చరిత్ర నడిచింది ఈ కట్టకాడ్నే. నవల మొదటి భాగంలో ఈ చెరువు నిండా నీళ్ళుంటాయి. హండేరాజుల చేనుమాన్యాలు, గుడిమాన్యాలు, రాచ భూములు ఈ కట్టకిందే వుంటాయి. చెరువులో నీళ్ళు పుష్కలంగా వున్నంతకాలం హండే సంస్థానం సిరిసంపద లతో సుఖంగా వుంటుంది. నవల చివరకల్లా వర్షాలు కురవక చెరువంతా ఎండిపోతుంది. అంతటితో అనంత పుర సంస్థానం, హండే ప్రభువుల చరిత్ర అర్థాంతరంగా ముగిసిపోతుంది. అనంతపురం చుట్టూ వున్న రాయల చెరువు, కొత్తపల్లి, ఎర్రకొండాపురం, జక్కులూరు, అగ్ర హారం మొదలైన గ్రామాలలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ, మత పరిస్థితుల సారాంశమే శప్తభూమి నవలా ఇతివృత్తం.

అగ్రవర్ణాల ఆధిపత్యం ఒకనాటిది కాదు. వర్ణ వ్యవస్థతోపాటే ఇదీ పురుడుపోసుకుంది. భారతదేశంలో మంచైనా, చెడైనా గత చరిత్రంతా అగ్రవర్ణాల భావ జాలాలతోనే నడిచింది. నవలాకాలంనాటికి అగ్రవర్ణానికి చెందిన వాళ్ళే రాయలసీమ చుట్టూ పెత్తందారులుగా కనిపిస్తారు. సామాన్య ప్రజలపై వీళ్ళు చేసే అఘాయిత్యా లకు మేర వుండదు. కుల సాంప్రదాయమని, ఊరి

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



కట్టుబాటని చెబుతూ ఇతరులను (కింది కులాల వారిని) అవమానపరుస్తూనే వచ్చారు. స్త్రీలపై జరిగిన అత్యాచారాలు, దళితులను బానిసలుగా మార్చిన విధానాలు నవలలో ప్రధానమైనంగా చిత్రింపబడ్డాయి. నవల మొదలు కావటానికి ముప్పై సంవత్సరాల క్రితం మూడో సిద్ధప్ప నాయుడు అనంతపుర సంస్థానాన్ని పాలించాడు. మూడో సిద్ధప్ప పచ్చితాగుబోతు, కామోద్రేకి. తన ఆధీనంలో ఉన్న వేశ్యలందరినీ ఒకేసారి అనుభవించాలనే విపరీతమైన కామవాంఛ గలిగినవాడు. ఇంతమంది వేశ్యలు చాలక సంసార స్త్రీలను కూడా చెరిచేవాడు. దసరా ఉత్సవాలలో భాగంగా కోటలో పేరంటానికి వచ్చిన ముగ్గురు స్త్రీలను అనుభవిస్తాడు. వారిలో ఇద్దరు సంసార స్త్రీలైతే, ఇంకొకరు పెళ్ళికాని అనంతయ్య శ్రేష్టి కూతురు లక్ష్మి. ఈ అమ్మాయి నెల గడిచిన తరువాత చిక్కిశల్యమై, మతిస్థిమితంలేని పరిస్థితుల్లో రాజసంస్థానం నుంచి ఇంటికి చేర్చబడుతుంది. ప్రజలను కన్నబిడ్డల్లా చూడాల్సిన రాజు మూడో సిద్ధప్ప కామవాంఛ ఏ స్థాయిలో వుందో ఈ సన్నివేశం ద్వారా తెలుస్తుంది. అలాగే అగ్రహార గ్రామానికి చెందిన నాగప్ప ప్రెగడ ఆరువేల నియోగి బ్రాహ్మణుడు. నవలలో ఇతడొక ధనాశాపరుడు, కాముకుడు. అగ్రహారంలో గులిగానప్ప దేవళం పక్కన నేలమాళిగలో భోగేశ్వరీమాత విగ్రహం వద్ద యువతులు మంచి భర్త కొరకు, ఇల్లాల్లు సంతానం కొరకు ఐదురోజులు ఆకు పూజలు నిర్వహిస్తారు. ఈ పూజలకు పురోహితుడు ఉన్నప్పటికీ కళ్ళకు బిగువుగా, పొంకంగా కనిపించే స్త్రీలకోసం నాగప్ప ప్రెగడ అప్పుడప్పుడూ రంగంలోకి దిగుతాడు. దీనిలో భాగంగానే నాగప్ప ప్రెగడ కాపు స్త్రీని, సాలె పడుచును మతిస్థిమితంలేని సమయంలో అనుభవిస్తాడు. తన కుటుంబంలో సొంత అన్న చనిపోతే ఆదుకోవాల్సిన వదినను బలవంతంగా లొంగదీసుకొని ఆమెతో పాటు ఆమె బంగారాన్నీ వశం చేసుకుంటాడు. అన్న బిడ్డ బంగారంపై కూడా ఆశపుట్టి చనిపోవటానికి సిద్ధంగా ఉన్న క్షయ రోగితో ఆ అమ్మాయికి బాల్యవివాహంచేసి, అల్లుడు చనిపోతే సతీసహగమనం ద్వారా బాల వితంతువును మంటల్లోకి విసిరేసి అతిదారుణంగా చంపేసి ఆభరణాలను చేజిక్కించుకుంటాడు. కామవాంఛ తీర్చుకునే వాడిగానే కాకుండా తన స్వప్రయోజనం కోసం ఎంతమందినైనా బలితీసుకునే స్వార్థపరుడిగా, కాముకుడుగా రచయిత నాగప్ప ప్రెగడ పాత్రను నవలలో చిత్రించాడు.

కామమనే నాణేనికి ఒకవైపు మూడో సిద్ధప్పనాయుడు, నాగప్ప ప్రెగడ కనిపిస్తే మరోవైపు వీరనారాయణరెడ్డి, ఎర్ర నాగిరెడ్డి, నల్ల నాగిరెడ్డి కన్పిస్తారు. వీర నారాయణరెడ్డి అప్పటికి ఇరవైయేండ్ల క్రిందట ఎర్రకొండాపురానికి అమరనాయకుడు. వీర నారాయణ రెడ్డి మొదటి కొడుకు నల్లనాగిరెడ్డి తనచుట్టూ పది గ్రామాలకు అమర నాయకుడు. రెండవ కొడుకు ఎర్రనాగిరెడ్డి. ఈ ముగ్గురికీ స్త్రీల మానాలంటే కరివేపాకుతో సమానం. వీర నారాయణ రెడ్డి అమరనాయకుడుగా వున్న కాలంలో శిస్తువసూలులో భాగంగా ధాన్య రూపంలో వచ్చిన బస్తాలన్నీ దేవిడీలో భద్రపరుస్తాడు. అక్కడ కూలీలుగా పనిచేసే రైతు భార్యలందరూ ఒకరి తర్వాత మరొకరు వీరనాయారణరెడ్డి కింద నలిగిపోతుంటారు. "ధాన్యపు గంపలు అందుకోగానే ముగ్గురు రైతు ఇలాల్లంద్రలో ఒక స్త్రీ మాయమవుతుంది. అప్పుడు ఇద్దరు రైతు స్త్రీల మధ్య గంపలు నడుస్తుంటాయి. అక్కడ ధాన్యం చెరిగే స్త్రీలకి, మోసే స్త్రీలకి ఆ అమాయక రైతు ఇల్లాలు ఎవరికింద నలిగిపోతుంటుందో తెలుసు ........... మీసాలు దువ్వుకుంటూ వీర నారాయణ రెడ్డి బయటపడతాడు". ఈ విషయం అక్కడున్న స్త్రీలందరికీ తెలిసినా ఎవరూ ఎవరికీ చెప్పుకోరు. ఇది తెలిసిన రైతు ఇల్లాల్లు కిక్కురు మనకుండా వుంటారు. ఎందుకంటే కరువు సీమలో బతుకు తెరువు చెడుతుందనీ, నవ్వులపాలు అవుతామనే భయంతో రైతు స్త్రీలంతా బెల్లంకొట్టిన రాయిలా ఉండేవారు. తండ్రి చేస్తున్న రతి కలాపాలను చిన్నప్పటినుంచి గాదెల వద్దే నిల్చుని చూస్తున్న ఎర్ర నాగిరెడ్డి తండ్రి దారిలోనే నడవటం అలవాటు చేసుకుంటాడు. ఎర్ర నాగిరెడ్డి కామవాంఛకు గొల్లపిల్ల, కంబళి శరభుడి భార్య బలౌతారు. "ఒక స్త్రీ

చుట్టూనే తండ్రీ కొడుకుల రతికలాపాలు'' సాగడం నవలలో కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అమర నాయకుడైన నల్ల నాగిరెడ్డి తాడిమర్రి సంస్థానంపై దాడి చేసిన సమయంలో ''ఇల్లు కొల్లగొట్టి, మనుషులను కొట్టి, ఆడవారిపై పడి నగలు ఒలుచుకుంటూనే, వారి రవికెలు చింపి లోపల తడుముతున్నాడు. ఓ స్త్రీని వాటేసుకుంటాడు. వదిలేసి ఇంకొక స్త్రీని చుట్టుకుంటాడు''. ఇలాంటి సన్నివేశాలు తెలుసుకున్నప్పుడు రాయలసీమలో స్త్రీల బతుకులు ఎలా చితికిపోయాయో తెలుస్తుంది. నవలలో నాగప్ప ప్రెగడ, వీరనారాయణరెడ్డి, రెడ్డి ఇద్దరు కొడుకులు, హండే ప్రభువు మూడో సిద్ధప్ప లాంటి అధికార యంత్రాంగంలోని అగ్రవర్ణ పెద్దమనుషులకు బలైన మానవతులు చరిత్రలో ఎంతోమంది వున్నారు. వారిలో కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడితే, అభంశుభం తెలియని కన్నె పిల్లలు పిచ్చిపట్టి ఊర్లు వదలి అడవులవైపు పరుగులు తీశారు. కుటుంబ పోషణకోసం బతుకును వెల్లబోస్తున్న స్త్రీలు మాత్రం నోళ్ళు పెగలనివ్వకుండా గుట్టుగా కాలాన్ని వెల్లబుచ్చారు. రాయలసీమలోని అగ్రవర్ణ పురుషాధిక్యం మితిమీరిన స్థాయిలో వుండేదనటానికి ఇవన్నీ సాక్షీభూతాలే. రాయలసీమ చరిత్రకు ఇదొక గ్రహణం. సీమచరిత్రలో మనకు తెలియకుండా శిధిలాల కింద పూడ్చబడిన స్త్రీల జీవితాలు లెక్కకు మించి వున్నాయి. వీటిలో కొంతమంది స్త్రీల గురించైనా వెలికితీసి భావి సమాజానికి అందించగల చారిత్రక నవల ఒకటి కూడా లేదనే వెలితిని పూడ్చిన నవల శప్తభూమి.

రాయలసీమ సామాజిక అవస్థల్లో అవమానం, అన్యాయం వల్ల బాధపడుతున్న వారికంటే అంటరానితనంతో అల్లాడిపోయిన జనం ప్రతి ఊరి చివర కన్పిస్తారు. సంఘు పెద్దల ఆగడాలు ఆడవాళ్ళతో ఆగిపోలేదు. దళిత జీవితాలనూ కొల్లగొట్టాయి. అయితే 18వ శతాబ్దంలో దళితులైనా, మరే ఇతర శూద్రకులాలకైనా జ్ఞాన సముపార్జన కోసం అగ్రకులాలవారిని ఆశ్రయించాల్సిందేనని గురవడు పాత్రతో అర్థమౌతుంది. కూలీ నాలీ చేసుకుంటూ బతికే పేదలు దళితులు. వీళ్ళంతా కోడి కూతతో బయలుదేరి కోళ్ళు ఉడిగే సమయానికి ఇంటికొస్తారు. శుచి, శుభ్రతకు వీరికి సమయం వుండదు. చదువు సంధ్యలు ఎవరూ చెప్పరు. సమాజం వీరిని అస్పృశ్యతతో బయటపడేసింది. ''వీరు వెట్టి చేయాలి. ఇదేమని అడగకుండా అందరి ఆజ్ఞలు పాటించాలి. చిన్న తప్పు చేసినా భయానక శిక్షలు విధిస్తారు. ఇతర కులాల వారి నీరు తోడకూడదు. ఇతర కులాల ఇళ్ళలో అడుగు పెట్టకూడదు. దేవాలయాలకు పోరాదు (ఆం.సా.చ.పు. 221)'' దళితుల పట్ల విధించిన అసమాన అవమాన కట్టుబాట్లు వారి జీవితాన్ని నీచంగానే కొనసాగించమని శాసించాయి. అయినా ఇంకా తనివితీరని దాహంతో అగ్రవర్ణ సమాజం యుగాల తరపడి దళితుల పట్ల కఠినంగానే ప్రవర్తిస్తూ వచ్చింది.

అగ్రహారంలోని మాదిగలు ''చెప్పులు కుడతారు, తాళ్ళు పేనుతారు, మోట గునలు తయారుచేస్తారు. వారు అగ్రకులాలకే కాదు, గ్రామానికే బానిసలు''. అగ్రహారంలో గులిగానప్ప పరస సందర్భంగా దళితులకు ఒక వింత ఆచారముంది. ''కొత్తగా పెళ్ళి చేసుకున్న మాదిగ జంటలు ఆ పరసలో గుండ్లు కొట్టించుకొని, గుండు చుట్టూ సున్నంబొట్లు పెట్టించుకొని, రెండు కాసులు అగ్రహారం స్వామికి అపరాధ సుంకం చెల్లించాలి''. స్వామి ఈ ఆచారం వెనుక ఉన్న కథను తెలియజేశారు.

ఒకానొకప్పుడు అగ్రహారంలో మాదిగ యువకుడు ఒక ఆంగ్ల అధికారి క్రాపును చూసి అదేవిధంగా క్రాపు చేయించుకుంటాడు. అందగాడైన ఆ యువకుడు క్రాపుతో మరింత అందంగా కనిపిస్తాడు. ఊళ్ళో ఆడవారంతా ఆ యువకుడ్నే చూడటం తప్పుగా భావించి అగ్రవర్ణాల పెద్దలు తెచ్చిపెట్టిన ఆచారం ఇది. కొత్తగా పెళ్లైన అక్కకు, బావకు గుండ్లు కొట్టించడం బాలుడిగా వున్న గురవడికి నచ్చక ఈ ఆచారానికి అడ్డుపడతాడు, ఎదురొచ్చిన తలారిని రాయితో కొట్టి భయంతో అగ్రహారం వదిలి పారిపోతాడు. తిరిగి నవల రెండవ భాగంలో యువకుడై దళితులను ఉద్ధరించటానికి నిడుమామిడి

స్వామిగా పేరు మార్చుకుని ప్రత్యక్షమౌతాడు. దళితులలో అభ్యుదయ భావాలను నెలకొల్పి, శుచి-శుభ్రతలకు అలవాటు చేస్తాడు. తన కులపోల్ల పిల్లలకు చదువు సంధ్యలు నేర్పి, గుడిలోకి వెళ్ళే అవకాశం కల్పించి దళితులందరికీ ఆదర్శవ్యక్తిగా నిలుస్తాడు. నవలలో దళితుల మార్పుకు దోహదం చేసిన ఋషి వంటి పాత్ర గురవడు. బాల్యంలో అగ్రకులాల వల్ల బాధపడిన గురవడు అగ్రకులానికి చెందిన గురువు వల్ల జ్ఞానవంతుడుగా తయారై అభ్యుదయ భావాలతో దళితులను ఉద్ధరించడానికి రావటం ఆలోచించదగిన అంశమే.

కంబళి శరభడు ఎర్రకొండాపురంలో నల్ల నాగిరెడ్డి వద్ద చాకిరి చేస్తున్న దళితుడు. ఇతడ్ని వాడలోని వారంతా బాలభీముడనీ, బాణపొట్టోడని అంటుంటారు. ఆ ఊళ్ళో చిన్నగుండు, నల్ల గుండు, గండశిల అనే మూడు ఎత్తుడు గుండ్లుంటాయి. ఎవరికీ తెలియని కాలంలో నల్ల గుండును ఎత్తేసిన మొనగాళ్ళు ఉండేవారని ఊరంతా చెప్పుకొనేది. దసరా పండుగ సందర్భంగా నల్ల నాగిరెడ్డి నల్లగుండును ఎత్తేస్తాడు. ఇది చూసిన ఊరంతా అతని బలాన్ని గురించి గొప్పలుచెబుతూ నాగిరెడ్డిని ఎత్తుకొని ఊరేగిస్తారు. ఇది చూసిన కంబళి శరభడికి నల్లగుండును ఎత్తాలనే కోరికకంటే గండశిలను ఎత్తాలనే కోరిక ఎక్కువవుతుంది. కానీ దళితులు దానిని ముట్టుకొంటే మరణశిక్షే. కానీ కంబళి శరభడి తిండిపుష్టి అతన్ని ఊరికే ఉండనీయక గండశిలను ఎత్తేలా చేస్తుంది. ఇది చూసిన తలారి ఊరి పెద్దలతో చెప్పి శరభడిని పంచాయితీకి లాగుతాడు. పంచాయితీలో గండశిలను ఎత్తడం ఎవరివల్లా కాదంటూ దళితుడైన కంబళి శరభడెలా ఎత్తగలడు. ఇదంతా అబద్ధమని పెద్దలు భావిస్తారు. కానీ శరభడు "గుండును ఇప్పుడు ఎత్తి చూపించమంటే ఇప్పుడే ఎత్తి చూపిస్తాను దేవరా! నన్ను కాపాడండి" అంటున్నా పెద్దలు "నీది మాల పుట్టుక. నువ్వు ఒకసారి ముట్టుకుంటే మైలపడిన గుండు రెండవసారి ముట్టుకుంటే ఇంకెంత మైలపడుతుందో కదరా!" అంటూ పెద్దలంతా శరభడిని శిక్షకు తయారు చేస్తారు. గండశిల అక్కడే వుంది. దాన్ని ఎత్తిన గురవడు అక్కడే వుండగా నిరూపణ చేయించడం వదిలేసి మూఢత్వంతో కాల్చిన గడ్డపారను చేతులతో పట్టిస్తారు. అది కాలుతుంది. శరభడు నాగిరెడ్డి వద్ద చాకిరి చేయటంతో మరణశిక్షనుండి మినహాయించి అతన్ని ఊరు, వాడ నుంచి వెలేస్తారు. కొత్తగా పెళ్ళైన శరభడు వుండలేక అర్ధరాత్రి భార్యను కలవటానికి వస్తే తన ఇంట్లోనుంచి ఎర్ర నాగిరెడ్డి బయటకు రావటం చూసిన శరభడు ఎర్రనాగిరెడ్డిని అసహ్యించుకొని ప్రతీకార జ్వాలను రగిలించుకొని పంతంతో థగ్గులలో కలసిపోతాడు. గండశిలను ఎత్తగల బలవంతుడు దళితులలో ఉండడం తెలిసి ఊరి పెద్దలు అతనిపై చేసిన కుట్రలే దళితుల అణచివేతకు ఋజువులు. నల్ల నాగిరెడ్డి తనకంటే శరభడు బలవంతుడని తెలిసి సభ్యసమాజం నుంచి తరిమేస్తే, ఎర్ర నాగిరెడ్డి తన భార్యను లొంగదీసుకొని తన జీవితాన్నే నాశనం చేయటంతో నిప్పుకణికల్లా రగిలిపోయిన కంబళి శరభడు నవల రెండవ భాగములో క్రూరుడుగా మారి ఎర్ర నాగిరెడ్డి భార్యను రాక్షసత్వంతో అనుభవిస్తాడు. రచయిత ఈ సన్నివేశాన్ని అత్యంత దారుణంగా చిత్రించడం వెనుక శరభుని పాత్ర గతంలో అన్నీ పోగొట్టుకొని ఒంటరిగా జీవిస్తూ రంపపుకోతతో నలిగిపోయిన ఆ వేదనలకు గుర్తుగా కనిపిస్తుంది. అయితే రచయిత నవలలో హింసకు ప్రతిహింస చేయించడ మనేది కొంత చర్చనీయాంశమే.

ఎర్ర కొండాపురంలోని మరో దళితుడు మాదిగ మారెప్ప. ఇతను గతంలో "దేవిడీ ముందునుండి పోతున్నాడు. దగ్గవచ్చింది. దగ్గినాడు. దగ్గితే నోటిలోకి గల్ల వచ్చింది, ఉమిసినాడు. దీనిని తప్పుగా భావించి వీర నారాయణరెడ్డి మారెప్పను చర్నాకోలతో చావబాది, కింద ఉమిసిన అదే గల్లను మారెప్పతో తినిపిస్తాడు. ఇది చాలదని పసిబిడ్డైన మారెప్ప కూతురు గంగమ్మను బసివినిగా చేస్తాడు. పెద్దమనిషి అయిన వారానికే ఆ పిల్లకు వీర నారాయణరెడ్డి కన్నెరికం చేస్తాడు. ఈ మూడు దళితపాత్రలు అభ్యుదయం, విప్లవం, బానిసబతుకు లాంటి పదాలకు రూపాలు. సభ్య సమాజం నీచంగా

చూడబడిన దళిత జీవితాలకు ప్రతిబింబాలు. దళితులను మారిస్తేనే దళిత జీవితాలు బాగుపడతాయన్న భావజాలానికి గురవడు ప్రతీకైతే, హింసకు ప్రతిహింస చేసి కక్ష్య సాధించడమే సరైన మార్గమనడానికి కంబళి శరభడు ప్రతీక. ఈ రెండు పాత్రలూ ఆధునిక భవజాలాలతో పురుడుపోసుకున్న దళిత పాత్రలు. మూడవది చేతిలో సంగటి ముద్దను పెట్టుకొని, నీళ్ళు దోసిళ్ళలో పోసుకుని తాగిన కాలంనాటి దళిత పాత్రగా చిత్రింబడింది. దళితులే కాదు అణగారిన కులాలలో చాలామంది ప్రజలు తమకన్నా పై కులాలవారిచేత హింసకు గురైన సనివేశాలెన్నో ఈ నవలలో చిత్రింపబడ్డాయి.

రాయలసీమను అత్యంత దీనస్థితికి చేర్చి చీల్చి చెండాడిన శూర్పనఖ కరువు. ఇది ఎన్నోసార్లు సీమను దారిద్ర్యంలోకి నెట్టేసింది. 18వ శతాబ్దంలో రాయలసీమ ప్రజలు కరువుతో పోరాడిన ఆకలి వెంపర్లాటలు కనిపిస్తాయి. "వానలు లేవు, పంటలు లేవు, తినేదానికి తిండిలేదు, గడ్డీగాదం లేదు, పశువుల డొక్కలు తెరుచుకొని చచ్చిపోతున్నాయి" ఇలాంటిచోట తిండికీ, తీర్థానికీ, ఒక రొట్టెకు, మూడు కాసులకు పిల్లలను అమ్ముకొన్న తల్లులున్నారు. కరువు కరాలతాండవం చేసే సీమ రంగస్థలం పైన కుభేరుడైనా కూలివాడు కావలసిందే. అందుకే ఇది శాపగ్రస్త ప్రాంతంగా వర్ణించబడింది. రచయిత బీరప్ప, ఉజ్జినమ్మ అనే దంపతులు ద్వారా కరువును వివరించాడు. "బీరప్ప, ఉజ్జనమ్మ ఎండిన డొక్కలతో నేలకు కరచుకొని పడుకున్నారు. పెదపాప ఇమ్మడమ్మ బువ్వమా! బువ్వా! అని మూలుగుతూ ఉంది. నెలలపాప తల్లి రొమ్మునుండి పాలురాక అట్లే చీకి చీకి ఏడ్చి సొమ్మసిల్లింది. ఉజ్జినమ్మ కళ్ళు గుంతలు పడి శూన్యంగా చూస్తున్నాయి". కసాయి కరువులో సీమ ప్రజలు ఇంటిల్లిపాదీ ఆకలికి తట్టుకోలేక ఆకులు, బెరడులు, చింతపిక్కలు లాంటి వాటిని ఉడకబెట్టుకొని తింటారు. అంతేకాక కుందేలు, జింక, ఉడుత, ఎలుకలు, ఎంటవలు (ముంగిసలు) మొదలైన వాటిని వేటాడి తెచ్చుకొని కాల్చుకొని తింటారు. ఇవేవీ దొరకకపోతే ఆకలితో రోదిస్తూ చిక్కిశల్యం కావటమే. బీరప్ప, ఉజ్జినమ్మలు తాము నివసిస్తున్న కొత్తపల్లి నుంచి నీళ్ళులేని కొండాపురం వెళ్తూ ఉంటే దారిలో అమితంగా శవాలను తిని పుష్టిగా బలిసిన రాబందులు శవాలచుట్టూ బరువు బరువుగా గెంటుతూ కనిపిస్తాయి. ఈ సన్నివేశాన్ని చూసిన బీరప్ప దంపతులు ఆవేదన చెందుతుంటే ఇంతకన్నా దారుణమైన దృశ్యం ఇంకొకటి చూస్తారు. "వారు చూస్తూ చూస్తూ ఒకచోట చప్పున ఆగిపోయినారు. దారి ప్రక్కన ఒక తల్లి చచ్చిపడి వుంది. ఆ తల్లి శవం రొమ్ముల్ని చీకుతూ వుంది శిశువు. ఆ తల్లి పిల్లకు పాలు కుడుపుతూ చనిపోయిందా? లేక చనిపోయిన తరువాత ఆ శవం రొమ్ముల్ని పసిపాప చీకుతూ వుందా?" అంటూ రచయిత హృదయాన్ని కరిగించే రాయలసీమ కరువు అస్థిత్వ వాస్తవికతను చిత్రించాడు. తల్లి తన బిడ్డకు పాలిస్తూ చనిపోయిందనుకుంటే, ఇంత దారుణమైన కరువులో కూడా బిడ్డ ప్రాణాలను కాపాడుకోవాలనే ఆ తల్లి తపనకు నమస్కరించవలసిందే. చనిపోయిన తల్లి రొమ్మును బిడ్డ చీకుతుందనుకొంటే తల్లి చనిపోయిందని తెలియని ఆ పసిపాప కరువులో కడుపు నింపుకోవటానికి చేసే ఆ అమాయకత్వపు పసితనం చూస్తే గుండె తరుక్కుపోతుంది. ఇంతకంటే సీమలో కరువు వాస్తవికతను ఇంకెలా చెప్పగలం. శప్తభూమి నవల చివరి వరకూ కూడా ఎక్కడా రచయిత వానను కురిపించడు. రాయలసీమ నుంచి వచ్చిన చాలా నవలల్లో, కథల్లో ముందుగా కరువు బాధలు చెప్పి చివరలో వర్షం కురిపిస్తుండటం చూసి ఉంటాం. ఈవిధంగా రాసిన ఏ రచనైనా కరవులో నుంచి వచ్చినవి కావు. అది కరువు రచనలు కావు. ఎందుకంటే రచనలో మొదటగానీ, చివరగానీ వానతో తడిసిన నేలలో కరువు ఎలా వుంటుంది? అది కరువు నవలనో, కరువు కథో అని చెప్పడం ఎలా సాధ్యమవుతుంది. స్వామి కరువు అనుభవాన్ని చవిచూసిన రచయిత. అందుకే కరువు చిత్రాన్ని సమర్థవంతంగా నడిపించారు. నవలలో వర్షాన్ని ఆహ్వానించటం కానీ, నేలను తడపటం కానీ చేయలేదు. వర్షం కోసం ప్రాణాలు పోయినా, తరాలు అంతరించినా,

రాజులు రాజ్యాలు కూలిపోయి నేలలో కలిసిపోతున్నా వర్షం మాత్రం కురవలేదు. సీమలో కరువు ఇలాగే వుంటుందనే వాస్తవికతకు అద్దం పట్టిన స్వామి కరువు చిత్రణ నమ్మదగినదేనని చెప్పాలి.

రాయలసీమ సాహిత్యంలో స్త్రీ జీవిత స్థితిగతులను ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సిన అవసరం వుందని 'శప్తభూమి' నవల గుర్తుచేస్తుంది. నవల మొదటినుంచి చివరివరకూ ఉన్న స్త్రీ పాత్రలన్నీ నిస్సహాయ స్థితిలో తమ మాన, ప్రాణాలను పోగొట్టుకుంటూనే వుంటాయి. అనంతపురంలో హండేరాజు మూడో సిద్ధప్ప రాజరికానికి బలైన స్త్రీలు ముగ్గురు. వారిలో మొదటి స్త్రీ భర్త వదిలివెడితే వేశ్యావాటికను ఆశ్రయిస్తుంది, రెండవ స్త్రీ ఆత్మహత్య చేసుకుంటుంది, మూడవ స్త్రీని రాజు నెల రోజులపాటు తమ కామవాంఛను తీర్చుకుని ఇంటికి చేరుస్తాడు. రాజు చేతిలో బలై పిచ్చిపట్టి ఇంటికి చేర్చబడిన కూతురును ఆదరించి కాపాడవలసిన తండ్రి ఏమాత్రం కనికరం లేకుండా పరువుకోసం 'అడవిలో ఒక చెట్టుకింద నిద్రలో వున్న తన కూతురుని పడుకోబెట్టి' అనంతయ్య శ్రేష్ఠి ఇంటికి వస్తాడు. జీవితాన్ని చెరిపినవాడు రాజు, పరువూ, ప్రతిష్ఠకోసం అడవిలో అనాథగా వదిలేసిన వాడు తండ్రి. ఇద్దరి పురుషుల వల్ల తన ప్రమేయం లేకపోయినా పిచ్చిదై అడవుల వెంట తిరుగుతూ జీవిస్తుంటుంది శ్రేష్ఠి కూతురు.

కొత్తపల్లిలో నాగప్ప ప్రెగడ స్వార్థానికి, కామవాంఛకు బలైన స్త్రీలు నాగప్ప అన్న భార్య, అన్న కూతురు, కాపుస్త్రీ, సాలె అమ్మాయి. కొండాపురంలో ఎర్ర నాగిరెడ్డి, వీర నారాయణరెడ్డి కామవాంఛలకు లొంగిపోయిన స్త్రీలంతా వారి వద్ద కూలీనాలీ చేసుకుంటున్న స్త్రీలే. ప్రేమ, పెళ్ళి అంటూ ఎర్ర నాగిరెడ్డి ఒక గొల్లపిల్లను ముందుగా అనుభవిస్తాడు. తన కొడుకు సొమ్ము అని తెలిసికూడా వీరనారాయణరెడ్డి అదే గొల్లపిల్లను బలవంతంగా అనుభవిస్తాడు. "తండ్రి తర్వాత కొడుకు, కొడుకు తర్వాత తండ్రీ వచ్చిపోతూనే వుంటారు. గొల్లపడుచు హృదయం ఒట్టిపోతుంది". గర్భవతైన గొల్లపిల్లకు తన బిడ్డకు ఇద్దరూ తండ్రులే అనుకుంటుంది. ఇలాంటి అమాయక స్త్రీలు జీవితంతో పోరాడలేక అన్యాయాన్ని చెప్పుకోను దారిలేక ఆత్మహత్యల పేరుతో కాటికి వలసలెల్లినవాళ్ళు సీమలో ఎంతోమంది వున్నారు.

తనకు ఇష్టం లేకుండా జరిగిన బలవంతపు పెళ్ళి వలన జీవితాన్నే కోల్పోయిన స్త్రీ ఇమ్మడమ్మ. తాను కోడెనీలడిని ప్రేమిస్తుంది. తల్లిదండ్రులు ఆమెను ఎల్లప్పకిచ్చి పెళ్ళి చేస్తారు. ఎల్లప్ప, కోడెనీలడు ఇమ్మడమ్మకు మేనత్త, మేనమామ కొడుకులు. ఇమ్మడమ్మకు తనతో పెళ్ళై కూడా పక్కను పంచుకోకపోవటానికి కారణం కోడెనీలడేనని తెలిసి భర్త ఎల్లప్ప కోడెనీలడ్ని చంపేస్తాడు. దీనితో ఇమ్మడమ్మ ఎల్లప్పకు శాశ్వతంగా దూరమౌతుంది. గొర్రెలు మేపుకుంటూ తల్లిదండ్రులతోపాటు ఊరు వదిలి వెళ్ళిపోతుంది. నవల రెండవ భాగంలో ఏడు మందిని పెళ్ళిచేసుకొని మద్యపానానికి అలవాటు పడి గౌడసానిగా మారి వీధుల వెంట చిందులేస్తూ కనిపిస్తుంది. తండ్రి, భర్త, ప్రియుడి లాంటి పురుష పాత్రల వల్ల ఆనందంగా పండాల్సిన ఇమ్మడమ్మ జీవితం అంధకారంలోకెళుతుంది. కరువులో కడుపుకూటికోసం తల్లిదండ్రులు చేసిన పని వల్ల యాదవ కులంలో పుట్టిన ఇమ్మడమ్మ చెల్లెలు సానిగా మారిపోతుంది. కంబళి శరభుడి భార్యను ఎర్ర నాగిరెడ్డి అనుభవిస్తాడు. ఇది తెలిసిన శరభడు అడివిలో దొరికిన ఎర్ర నాగిరెడ్డి భార్యను బలవంతంగా అనుభవిస్తాడు. రాయలసీమలో పగలు, పౌరుషాల మధ్య బలయ్యేది స్త్రీలేనని చెప్పటానికి ఇదొక ఉదాహరణ. నవలలో చిత్రమైన విశేషం ఏమిటంటే అగ్ర కులాల వల్ల బలైపోయిన స్త్రీలేకాకుండా దళితుడి వల్ల మోసపోయిన అగ్రకుల స్త్రీ ప్రస్తావన ఒకటి వుంది. మాదిగ గురవడు అగ్రహార గ్రామం నుంచి పారిపోయిన తర్వాత సిద్దేశ్వరమఠంలో ఒక బ్రాహ్మణుడి వద్ద ఏడేండ్లు విద్యనభ్యసించి గురువు కూతురినే పెళ్ళి చేసుకుంటాడు. నిడుమామిడి స్వామిగా పేరుమార్చుకొని అగ్రహార గ్రామానికి వచ్చి దళితోద్ధరణలో జీవితాన్ని ఎల్లబోస్తూ తాను వివాహమాడిన బ్రాహ్మణ స్త్రీని, పిల్లలను అజ్ఞాత

పరుస్తాడు. భర్తను వెతుకుతూ అగ్రహారానికి వచ్చిన ఆ బ్రాహ్మణయువతికి తన భర్త మాదిగకులానికి చెందిన వాడని తెలుస్తుంది. బ్రాహ్మణుడనని చెప్పి పెళ్ళి చేసుకొని తనను మోసం చేసినందుకు బాధతో, భర్తపైన కోపంతో పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకొంటుంది. మగపిల్లాడు బతుకుతాడు. తల్లి, బిడ్డ చనిపోతారు. వీరిద్దరూ స్త్రీలే. పరిస్థితులు, కారణాలు ఏవైనా ఇంతమంది స్త్రీల జీవితాలు అనామకంగా అన్యాయమై పోవడం గమనిస్తే సీమ చరిత్రలో స్త్రీల గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సివుందని అర్థమౌతుంది.

భారతదేశంలో సతీసహగమన ఆచారం ఎంతోమంది స్త్రీలను బలితీసుకుంది. ఇష్టపూర్వకంగా కొంతమందిని, బలవంతంగా కొంతమందిని కాల్చి బూడిదచేసింది. పై కులాలవారిలోనే ఈ దురాచారం ఎక్కువగా ఉన్నట్లు చరిత్ర చెబుతుంది. అచ్యుతరాయలు చనిపోతే ఆయన ఐదు వందలమంది భార్యలు సహగమనం చేసినట్లు పోర్చుగీసు యాత్రికుడైన ఫెర్‌నౌ నన్నీజు పేర్కొన్నాడు. తెలుగు సాహిత్య చరిత్రలో మాద్రి, రేణుకాదేవిల కథలున్నాయి. ఒకవేళ సహగమనం చేయని స్త్రీ బతుకు సభ్యసమాజంలో ఎలా ఉంటుందంటే ఎవరో ఒకరి పంచన చాకిరీ చేస్తూ బతకాలి లేదా కూలీనాలీ చేసు కొనన్నా బతకాలి, లేదంటే ఎవరికైనా ఉంపుడుగత్తెగా మారిపోవాలి. నవలలో నాగప్ప ప్రెగడ వదిన ఇలాగే కనిపిస్తుంది. భర్త చనిపోతే బిడ్డకోసమని సహగమనానికి పూనుకోదు. మాయమాటలు చెప్పి నాగప్ప ప్రెగడ ఆమెను వశపరుచు కుంటాడు. కూతురు కూడా చనిపోయిన తర్వాత ఆమె నాగప్ప ప్రెగడ నుంచి తప్పించుకొని అనంతపురం వెళ్ళిపోయి పూటకూళ్ళను నడుపుకుంటూ మగవాళ్ళకి ఆడవాళ్ళని తార్చుతూ జీవనాన్ని కొనసాగిస్తూ వుంటుంది. ఇదీ సహగమనం చేయని స్త్రీ దుస్థితి. అయితే నవలలో బలవంతంగా జరిగిన సహగమనాలు వున్నాయి. వాటిలో ఒకటి నాగప్ప ప్రెగడ అన్నకూతురిది అయితే మరొకటి నల్ల నాగిరెడ్డి భార్యది. నల్ల నాగిరెడ్డి భార్యను బలవంతంగా నిప్పుల్లోకి నెట్టేస్తున్న సమయంలో ఒక ముస్లిం అధికారి అడ్డుపడి సహగమనాన్ని తప్పించి ఆమెను పెళ్ళిచేసుకుంటానికి తీసుకపోతాడు. భర్త చనిపోతే తాను విధవనన్న విషయం కూడా తెలియని పసితనం నాగప్ప ప్రెగడ అన్న కూతురుది. అటువంటి పిల్లను చితివద్దకు తీసుకెళ్ళి "బాలికను ఒకసారి గాలిలో ఊపి, మంటల్లోకి విసిరివేసినారు. చితిచుట్టూ నిలబడిన ఎనిమిదిమంది మనుషులు చేతిలోని నూనెకట్టిలతో పాపను మూసివేసినారు". అన్నెం పున్నెం ఎరుగని ఎంతో మంది బాలవితంతువులను స్వార్థబుద్ధులు కొన్ని దుర్మార్గంగా బూడిదచేసిన సహగమనం సీమచుట్టూ కొన సాగినట్లు ఈ సన్నివేశం తెలియజేస్తుంది. ఇదే విషయాన్ని ఆంధ్రుల సంస్కృతి చరిత్ర పేర్కొంది. ఇదే సీమలో ఇష్ట పూర్వకంగా కొనసాగిన సహగమనాలలో మంగలి గౌరమ్మది ఒకటి. ఇదీ చరిత్ర చెబుతున్న వాస్తవ సంఘ టనే. క్రీ॥శ॥ 1623 - 24లో పీట్రో యాత్రికుడు దక్షిణ భారతదేశంలో జరిగిన సతీసహగమనాలను గురించి చెబుతూ ఈ మంగలి గౌరమ్మ గురించి తెలియజేశాడు. తక్కువ కులానికి చెందిన స్త్రీ సహగమనం చేయడం తాను చూసిన వాటిలో మొదటిదని తెలియజేసాడు. సహగమనం ఆపటానికి పిట్రో ఎంత ప్రయత్నించినా ఆమె తన ఇష్ట ప్రకారమే సహగమనం చేస్తున్నాననీ పైగా తన సహగమనానికి ఒక విదేశీయుడు రావటం తనకెంతో గర్వకారణంగావుందని చెబుతుంది. ఎందుకంటే తన సహగమన ఆచారాన్ని విదేశీయుడు పీట్రో తన స్వదేశం వెళ్ళినప్పుడు తన సహగమన ఆచారం గురించి అక్కడి వాళ్ళకు చెబుతాడని ఆమె సగర్వంగా చెప్పటం పీట్రోకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించినట్టు చెప్పాడు. వాస్తవానికి భారతదేశమంతటా సతీసహగమనాలు నవలా కాలానికి కొనసాగుతూనే వుండేవి. ఇందులో ఇష్టమైనవి కొన్నైతే, బలవంతంగా జరిగినవి కొన్ని. సహగమనానికి పూనుకోని స్త్రీలను సాటి స్త్రీలు ఆమెను నీచ సంస్కృతికి చెందినదిగా భావించేవాళ్ళు. వీళ్ళు ఏది చేసినా సభ్యసమాజానికి చెందిన స్త్రీలు అసహ్యించుకొనేవారు. రాయలసీమలో కూడా ఈ ఆచారం ఎక్కువగా అగ్రకులాలలోనే ఉండేది.

తక్కువ కులాలలో చాలా అరుదుగా ఉన్నట్లు నవల ద్వారా తెలుస్తుంది. చరిత్ర కూడా ఇదే చెబుతుంది.

జానపదుల ఆచారాలైన సిడిమాను, రణం కుడుపు, వీరమంటపం లాంటివి రాయలసీమలో ఒకప్పుడు వుండేవని శప్తభూమి ద్వారా తెలుస్తుంది. ఈ మూడు సాంఘిక ఆచారాలు ఆంధ్ర దేశంలో రెడ్డి రాజుల కాలం నుంచి కొనసాగినట్లు ఆంధ్రుల సాంఘిక చరిత్రలో సురవరం ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. రణం కుడుపు ఒక భయంకరమైన ఆచారం. యుద్ధంలో పట్టుబడిన శత్రు రాజును చంపి గానుగలో ఆడించి వారి రక్తాన్ని పడతారు. ఈ రక్తాన్ని వారి కపాలలోనే ఎసరుగా పెట్టి అన్నం వండుతారు. అర్ధరాత్రివేళ దిగంబరులై వళ్ళంతా విభూతి పూసుకుని జుట్టు విరబోసుకుని నెత్తిమీద రణం కూడును పెట్టుకొని భూతబలి మంత్రాలు చదువుతూ ఊరు చుట్టూ తిరుగి వస్తారు. ఇదే రణం కుడుపు. నవలలో హరియక్క పెమ్మసాని తిమ్మప్ప నాయుడిని చంపి ఈ రణం కుడుపు ఆచారాన్ని చేస్తుంది. సిడిమాను ఆచారం కూడా దారుణమైనదే. ఒక స్తంభాన్ని పాతి, దాని కొన భాగాన ఒక గుండ్రని రాతికి రంధ్రం చేసి దానిపై సన్నని దూలం అమర్చుతారు. ఆ స్తంభానికి గిరికతోటి కొండిని తగిలిస్తారు. ఆ కొండికి మనిషిని వ్రేలాడదీసి ఆ దూలాన్ని గుండ్రంగా తిప్పుతారు. ఈ ఆచారాన్ని కూడా హరియక్కే చేస్తుంది. రణం కుడుపు, సిడిమాను ఆచారాలను ఒక స్త్రీ చేయటం నవల చదివే పాఠకుడికి అద్భుతాన్నే తలపిస్తుంది. నవలలో హరియక్క పాత్ర రుద్రమదేవిని పోలి వుంటుంది. మగవాడిని జయించి, దిగంబరిగా మారి రణం కుడుపు చేస్తుంది. తన భర్త కోడెనీలడు బాగుండాలని సిడిమానుకు వ్రేలాడుతుంది. సాహసోపేతమైన ఈ రెండు ఆచారాలకు రచయిత ఒక స్త్రీని వినియోగించటం తిరుగులేని ప్రగతిశీలాంశం. సీమ స్త్రీల ధైర్య సాహసాలకు హరియక్క ప్రతీకగా కనిపిస్తుంది. భిల్లే ఎల్లప్ప పాత్ర ద్వారా రచయిత వీరమండపమనే ఆచారాన్ని పరిచయం చేశారు. ఇది శ్రీశైల మల్లిఖార్జున స్వామి ఆలయం వెలుపల నంది మండపానికి సమీపంలో వీరులు మహాసాహస కృత్యాలతో తలలు, నాలుకలు వంటి తమ శరీర భాగాలను ఒక్కొక్కటిగా గండ కత్తెరలతో కత్తిరించుకొని ఆత్మత్యాగం చేసేవారని (ఆంధ్రుల సాంఘిక చరిత్ర పు. 59) చరిత్ర తెలుపుతుంది. భిల్లే ఎల్లప్ప గొల్లవాడు. బుక్కరాయసముద్రాన్ని నాశనం చేయాలని వచ్చిన తాడిమర్రి సైనికులను ఎదుర్కొని, సాహసంతో పట్టుకుంటాడు. తమ సంస్థానానికి ఆధారమైన చెరువును కాపాడిన గొల్ల ఎల్లప్పను హండే ప్రభువు ఎల్లప్ప జెట్టిని చేస్తాడు. ఎల్లప్పజెట్టి తన ధైర్యసాహసాలతో అమరనాయకుడౌతాడు. తన జీవితానికి ఉన్నత స్థానాన్ని కల్పించిన బుక్కరాయసముద్రం ఎండిపోయి పడివుండడం చూసి జీర్ణించులోకోలేక "అనంతపురం మీద వానలు పడవలె, చెరువులు నిండవలె, పంటలు పండవలె" అంటూ ఎల్లప్ప బుక్కరాయసముద్రం నిండాలనే సంకల్పంతో శ్రీశైలంలో వీర మండపం ద్వారా ప్రాణాలు అర్పిస్తాడు. రణం కుడుపు, వీరమండపం, సిడిమాను లాంటి ప్రాచీన ఆచారాలు సీమలో వుండేవని శప్తభూమి ద్వారా స్వామి పాఠకులకు పరిచయం చేయటం సీమ సాహిత్యంలో మరోకొత్త కోణానికి మార్గమేసినట్లు తెలుస్తుంది.

తమ ప్రభువుల కోసం ప్రాణత్యాగాలు చేసిన సాహసవంతులూ సీమలో వున్నారు. రాయలసీమలో అక్కడక్కడ వీరి సాహసాలకు గుర్తుగా వీరగల్లులు కూడా వున్నాయి. వారిలో ఒకరు భిల్లే ఎల్లప్ప, మరొకరు మంగలి గంగన్న. మంగలి గంగన్నది అగ్రహార గ్రామం. మంగలి పన్ను కట్టలేదని నాగప్ప ప్రెగడ గంగన్నకు సంకెళ్ళు తగిలించి నల్లగుండును భుజంపైకి ఎత్తి సాయంత్రం వరకూ మండుటెండలో నిలబెడతాడు. అప్పుడు పద్మసాని గంగన్నను ఆదుకొంటుంది. అప్పటినుండి గంగన్న కుటుంబంతో సహా అగ్రహారం వదిలేసి పద్మసాని నిర్మించిన జక్కులూరికి వెళ్ళిపోతాడు. ఒకరోజు అర్ధరాత్రి తాడిమర్రి సైన్యం జక్కలూరిపై దాడి చేస్తుంది. దీనిని ముందే పసిగట్టిన గంగన్న జక్కలూరిని కాపాడి పద్మసాని చేసిన మేలుకు కృతజ్ఞతను తీర్చుకోవటానికి దొంగలతో ఒంటరిగానే పోరాడి, తాడిమర్రి వారిని తరిమి కొడతాడు.

వీరపోరాటంలో గాయపడి మరణిస్తాడు. ఈ సాహసానికి గుర్తుగా పద్మసాని ఊరి మధ్యలో మంగలి గంగన్నకు వీరగల్లును ప్రతిష్టింప చేస్తుంది. ఇలాంటి వీరగల్లులు రాయలసీమ చుట్టూ కనిపిస్తాయి. సీమ వ్యక్తుల ధైర్య సాహసాలకు ఇవి ప్రతీకలు. రాయలసీమ చుట్టూ వున్న ప్రతి వీరగల్లుకు ఇలాంటి కథలున్నాయి. రచయిత వీర గల్లుకు చెందిన కథలు పరిచయం చేయడం సీమ ప్రాంతీయ అస్థిత్వానికి మరో అతుకుని తగిలించాడని తెలుసుకోవాలి.

1757లో సమాజంలోకి కొత్తగా అడుగిడుతున్న ఆధునికి పరిణామ ఛాయలు నవలలో కనిపిస్తాయి. ఆంగ్ల విద్య, క్రైస్తవ మత ప్రచారంతో కొట్టుకొస్తున్న ఆధునిక భావాజాలాల పరంపరలు కనిపిస్తాయి. మన్నారుదాసు నాగసాని కొడుకు. సాని కొడుకైన కారణంతో మన్నారు దాసును తన చుట్టూ వున్న సమాజం గౌరవించకపోగా అవమానిస్తుంది. దీనితో మన్నారుదాసు నాటి హిందూ సాంఘిక వ్యవస్థను ఏవగించుకొని మద్రాసు వెళ్ళి ఆంగ్లేయ విద్యనభ్యసించి పాశ్చాత్య భావాలను అంది పుచ్చుకొంటాడు. క్రైస్తవ మతాన్నీ స్వీకరిస్తాడు. జక్కలూరికి వచ్చిన ప్రతీసారి మన్నారుదాసు తల్లితో హిందూ మతంపై, హిందూ దేవుళ్ళపై విమర్శనాస్త్రాలను సంధిస్తుంటాడు. నవలలో మన్నారుదాసే కాకుండా నాగప్ప ప్రెగడ అన్యాయానికి గురైన సాలె అమ్మాయి కూడా క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తుంది. తనకు జరిగిన అన్యాయాన్ని ఎవరికీ చెప్పుకోలేక, అన్యాయం చేసిన పెద్దమనిషిని నిలదీసే శక్తిలేక హిందూ సమాజంలోని సూటిపోటి మాటలకు దూరంగా వుండాలని మద్రాసువెళ్ళి క్రైస్తవ మతంలో చేరిపోతుంది. సమకాలీన సమాజంచేత అవమానాలకు గురైన మన్నారుదాసును, సంఘ పెద్ద అన్యాయానికి బలైన సాలె అమ్మాయిని రచయిత ఒకటి చేశాడు. సమాజంలో స్వార్థపూరిత ఆచార వ్యవహారాలవల్ల అసహ్యం కలిగిన వాళ్ళు, అవమానింపబడిన వాళ్ళు క్రైస్తవ మతాన్ని స్వీకరించాల్సిన గత్యంతరం ఏర్పడిందని నిరూపించ టానికి రచయిత చేసిన ప్రయత్నమిది. వీరిద్దరితోపాటు మాడల కందప్ప, విలియం బ్రౌను లాంటి పాత్రలను కూడా రచయిత నవలలో ప్రవేశపెట్టాడు. ఈ పాత్రలన్నీ ఆధునిక భావజాలాలకు ప్రతిబింబాలుగా కనిపిస్తాయి.

నవలలో కొన్ని అనామక పాత్రలున్నాయి. కోడెనీలడు, ఇమ్మడమ్మ, తిక్కస్వామి, పద్మసాని, నాగసాని లాంటి పాత్రలు నవలను నడిపించడంలో ఉపయోగపడ్డాయి. వేమన భావజాలాలు తిక్కస్వామిలో కనిపిస్తాయి. అయితే తిక్కస్వామి ద్వారా చూపించిన మంత్రాలు, వింతలు నవలకు అంత అవసరం లేదనిపిస్తుంది. వీటికి నవలలో ఎటువంటి ప్రాధాన్యతా లేదు. తిక్కస్వామి పాత్ర లేక పోయినా నవలకు గొప్పతనం చెడిపోదు. అంతేగాక కోడెనీలడు పాత్రను మొదలుపెట్టినంత గొప్పగా సుఖాంతం చేయలేదు. అత్యంత ధైర్యసాహసాలు కలిగిన హరియక్క జీవితం ఎలా ముగుస్తుందో వివరించలేదు. ఈ అంశాలన్నీ శప్తభూమి నవలా సమగ్రతకు, సమర్థతకు సూర్యుని ముందు దివిటీలు మాత్రమేనని చెప్పాలి. శప్తభూమి నవల ఒక చారిత్రక సత్యాన్ని చాటిన వాస్తవిక జీవిత చిత్రణ. రాయలసీమ అస్థిత్వాన్ని ఇంత గొప్పగా చిత్రించిన శప్తభూమి నవలకు నాసా సంస్థవారు ప్రథమ బహుమతిని అందించడం సీమ వారితోపాటు తెలుగు వారంతా గర్వించవలసిన అంశమే.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# విశ్వనాథవారి ధర్మచక్రం- రాజకీయ, సాంఘిక, మత పరిస్థితులు

- డా. సింగుపురం నారాయణరావు & డా. సుసర్ల ఇందిర

ఆంధ్ర సాహితీలోకాన్ని షష్ఠిహాయనాలు పాలించిన కళాప్రపూర్ణ, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, డాక్టర్. విశ్వనాథ సత్యనారాయణ శతాధిక గ్రంథాలకి సహస్రానేక పాత్రలకి సృష్టికర్త. వీరు రచించిన అఱువై నవలల్లో ముప్పైకి పైగా చారిత్రకాలే. వీటిలో ఆంధ్రత్వాన్ని, త్ర్యాశస్త్యాన్ని వెల్లడించే నవలల్లో "ధర్మచక్రం" ఒకటి.

క్రీ.శ. మూడవ శతాబ్ది మొదటి సగభాగంలో తీరాంధ్ర దేశాన్ని పరిపాలించిన మొట్టమొదటి రాజవంశం శాత వాహనవంశం. కడపటి శాతవాహన రాజైన యజ్ఞశ్రీ శాతకర్ణిని ఓడించి ఇక్ష్వాకువంశస్థుడైన ఛాంతమాలుడు తీరాంధ్రదేశాన్ని ఆక్రమించాడు. ఈవంశస్థుల రాజ్య పాలనా కాలం ఏభైఏళ్ళే అయినా బౌద్ధ వైదిక మతాలకి వారు చేసిన సేవ అపారం. నాగార్జున కొండ దగ్గర ఉన్న విజయపురి వీరి రాజధాని అని చరిత్ర చెబుతోంది.

"శాతకర్ణి పోషణలో విజయపురి బౌద్ధనగరంగా అవతరించింది. కాని అచిరకాలంలోనే ఇక్ష్వాకువంశాధీశు డైన శ్రీఛాంతమూలుడు శాతవాహన వంశాన్ని నిర్మూలించి ఇక్ష్వాకు స్వాతంత్ర్య పతాకతో బాటు విజయపురిలో వైదికమత విజయపతాకను కూడ ప్రతిష్టించినాడు. గోశతసహస్ర హల శతసహస్రములను దానం చేసి విజయ పురి ఐశ్వర్య వైభవాలకి దోహదం చేసినాడు."

అమరావతీ శిల్పాలలో బుద్ధుని జీవిత విశేషాలతో పాటు, పరిపాలించిన రాజుల జీవితచిత్రాలు కూడా చెక్కబడి ఉన్నట్లు ఏటుకూరి, మల్లంపల్లి, ఖండవిల్లి ప్రభృతులు తమతమ ఆంధ్రుల చరిత్ర సంబంధి గ్రంథాలలో తెల్పారు. "నాగార్జునకొండ వద్దనున్న ఒక స్థంభంపై బుద్ధుడు స్వర్గం నుంచి క్రిందకు దిగుతూ ఉంటాడు. రాజు బుద్ధుని వద్దకు పోతూవుంటాడు. రాణులు అతనిని వారిస్తూ వుంటారు. తరవాతి చిత్రంలో రాణుల ఆటంకాలని నిర్లక్ష్యం చేసి, రాజు బుద్ధుని వద్ద సాష్టాంగ ప్రమాణం చేస్తాడు. మూడవ చిత్రంలో రాజు తన కాలితో శివలింగాన్ని తోసివేస్తూ వుంటాడు. శివలింగం చుట్టూ బ్రహ్మాండమైన నాగుపాము వుంటుంది. మరొక శిల్పంలో రాజు సాధారణ వస్త్రాలను ధరించి, ఎనిమిది మంది అనుచరులతో సన్న్యాసాశ్రమానికి వెళ్తూ వుంటాడు." ప్రస్తుత నవలలో కథానాయకుడు వీరపురుష దత్తుడు. ఈ నవలా ఇతివృత్తానికి స్ఫూర్తిని పైన చెప్పిన శిల్పాలనుంచే గ్రహించినట్లుగా రచయిత నవలా పీఠికలో తెల్పారు.

ఒక మహారాజు శివలింగాన్ని తన కాలితో తన్ను తున్నట్లుండే శిల్పమొకటి నాగార్జునలోయలో బయల్ప డినా ఆ మహారాజెవరో, అట్లా శివలింగాన్ని తన్నటానికి కారణమేమిటో ఇదమిత్థంగా చెప్పగల ఆధారాలు ఆ శిల్పం పైగాని, ఆ సన్నివేశాన్ని గూర్చిన వివరాలు గాని మరి ఏ ఇతర గ్రంథాల్లోనూ లేవు. పై శిల్పమొక్కటే ఆధారంగా, శిల్పాన్ని తన్నుతున్న రాజుని వీరపురుష దత్తుడిగా భావించి, విశ్వనాథ సత్యనారాయణగారు 'ధర్మచక్రం' అనే ఈ నవలకి శ్రీకారం చుట్టేరు.

శాతవాహనులని జయించి, రాజ్యానికి వచ్చిన ఇక్ష్వాకు వంశపురాజైన శాంతమూలుడు సనాతన ధర్మావలంబి. అందుకే కుమారుడైన వీరపురుషదత్తుని పుత్రోత్సవం వైదికమతానుసారంగా చేసేడు. కుమారుని ఐదవయేట అగ్నిష్టోమ యాగాన్ని, ఎనిమిదవ యేట అశ్వమేధ యాగాన్నిచేసి, యువు వెంట వీరపురుషుణ్ణి సేనా నాయకునిగా పంపేడట! శాంతమూలుడు బ్రాహ్మణ మతావలంబియై, బౌద్ధమతం పట్ల ఆదరణ లేనివాడే అయినా, ఆతడి కుటుంబ సభ్యులు బౌద్ధమతాచారా లను పాటిం చేవారని, బౌద్ధశ్రమణులను ఆదరించేవారని చరిత్ర నవల రెండూ చెబుతున్నాయి. ఈ కారణంగా వీరపురుషుడు హైందవ, బౌద్ధమతాల మధ్య ఊగిస

లాడుతూ పెరిగాడు. అంతేకాదు, అసలు వీరపురుష దత్తుడి జన్మ విషయంలోనే ఒక అనుమానం, వదంతి ప్రచారంలో ఉన్నాయి.

"శాంతమూలుడు చిరకాలము అనపత్యుడైయున్న కారణముగ, రాజసోదరియైన శాంతిశ్రీ బ్రాహ్మణుడైన శాతవాహనునకు, ఒక క్షత్రియ కన్యకు కల్గిన ఒక బాలుని అంతఃపురమునకు అతి రహస్యముగ చేర్పించి శాంత మూలుని కుమారునిగా ప్రకటించింది." ఈ విషయం ఎంత రహస్యంగా ఉంచినా ఒకానొక చిరు సందేహం ప్రజలలో ప్రబలింది. ఈ చిరు సందేహమే వీరపురుషుని చెవిన కూడా పడి, ఆ అనుమానం శాఖోపశాఖలై విస్త రిల్లింది. తల్లితండ్రులెవరో తెలియని కారణంగా ఆతడి మనస్సులో ఒక విచిత్రమైన మనోవ్యాకులత ఏర్పడి, అది తీర్పరాని పగగా పరిణమించింది.

వీరపురుషదత్తుని తల్లిదండ్రులైన గోముఖశాతకర్ణి, కాళిందులు ఆత్మనఃప్రేమికులే. కాని వారి సమాగమం మరియొకరి ప్రోద్బలంతో, ప్రయోజనాపేక్షతో జరిగింది. ఈ కారణంగా గోముఖశాతకర్ణి మనసులో ధర్మాధర్మ విచికిత్స బయల్దేరింది. సమాజపరంగా తాను చేస్తున్నది అధర్మమన్న భావన ఆతణ్ణి వీడ లేకపోయింది. దంపతు లైన స్త్రీ పురుషులు ఒకరి పట్ల ఒకరు ఆరాధనా భావంతో ఆత్మీయతాన్యోన్యతలతో జీవిస్తున్నపుడు వారిని ఒక దివ్య తేజస్సు ఆవరించి వుంటుంది. ఇన్నీ వున్నా వారి మనసుల్లో విచికిత్స, ద్వైదీభావాలు గాని ఉంటే అవి పుట్టిన బిడ్డ మీద తమ ప్రభావాన్ని చూపక మానవు. పై కారణాలల్లే వారికి పుట్టిన బిడ్డ వీరపురుషదత్తుడు జనకంటకుడిగా తయారయేడు.

స్త్రీ పురుష సంగమం కేవలమొక దైహిక క్రియ మాత్రమే కాదు. ఒక విశిష్ట మానసిక స్పందన కూడా అన్నది జగమెరిగిన సత్యం. జన్మించే శిశువు కేవల శరీరమాత్రుడే కాదు, మనసున్న ఒక విశిష్ట ప్రాణి కూడా. ఒక్క సంగమ సమయంలోనే కాదు, ఆ తరువాత కూడా స్త్రీ పురుషుల్లో కలిగే తీవ్ర మానసిక వికారాలన్నీ గర్భస్థ శిశువుపై తమ ప్రభావాన్ని చూపక మానవు. వ్యాసుని వికృతరూపం చూసి అంబిక కన్నులు మూసికొన్న కార ణంగా ధృతరాష్ట్రునికి అంధత్వం, అంబాలిక వెలవెల బోయిన కారణంగా పాండురాజుకి పాండుత్వం సంభ వించినట్లు భారతం చెబుతోంది కదా? ఈ విషయాన్నే నవలలో కాళిందీ, శాతకర్ణుల సంభాషణా రూపంలో రచయిత ఇలా అన్వయిస్తున్నారు.

"స్వామీ! నీ ఈ వైముఖ్యము వలన నేమి విపరీత శిశువు జనియించునో? చక్రవర్తుల రక్తము నీ నాడులలో ప్రవహించుచున్నది. అందుచేత బుట్టెడు బిడ్డ చక్రవర్తి కాక తప్పదు. గాని నీ ఈ వైముఖ్యము వలన వాడు సన్న్యాసి యగునేమో? నా యీ సంతాన భిక్షాభిలాష చేత వాడు భిక్షువగునేమో?"యని. అప్పుడు చక్రవర్తి ఇట్లనెను. "అది కాదమ్మా! మన సంయోగము ధర్మ మైనదీ కాదు. అధర్మ మైనదీ కాదు. ధర్మా ధర్మములు కాని ఒక విచిత్ర ధర్మపరిపోషకమైన బుద్ధితో నా శిశువు జనియించునను కొందును. నిజముగా మనము చేయుచున్నది జార త్వము. ఇది తల్లిదండ్రుల అంగీకారముతో చేయు చుంటిమి. తన తండ్రి ఎవరో తెలియని సంతానము, తన తల్లి రహస్యముగా కన్న సంతానమెన్ని పోకిళ్ళయన బోవును. సర్వధర్మ విచ్ఛేదనకారి యగును. సంప్రదాయ నిర్మూలన హేతువగును. తల్లి దండ్రుల రహస్య కామమంతయు వానియందొక విచిత్రమైన మనో వ్యాకు లత్వ మేర్పరచి, యా వ్యాకులత యెవరిమీదనో, యెందుకోతీర్పరాని పగగా పరిణమించును. అతని వలన లోకమెంతయైనను విక్షోభము పొందును." అని జరుగ బోయే అనర్థాన్ని రచయిత ముందే సూచిస్తున్నారు.

అధర్మ మైనది కాదంటూనే జారత్వమంటున్నారు రచయిత పై సంభాషణలో. అంటే తమ పెద్దల దృష్ట్యా ధర్మమే అయినా శాతకర్ణుడి మనస్సు దృష్ట్యా అది జార త్వమే. కారణం వీరి కలయికకి వారి పెద్దల అనుమత యితే వుంది కాని, తత్ఫలమైన సంతానానికి తామే తల్లి దండ్రులమని తెలియజెప్పే అధికారం మాత్రం లేదు. ఇటువంటి విచిత్రమైన పరిస్థితే మనకి భారతంలో కూడా కనబడుతోంది. ఏ విధంగా కాళిందీ శాతకర్ణుల కలయికకి

పెద్దల అనుమతి వుందో, అదే విధంగా వ్యాసాంబికా, వ్యాసంబాలికల సంయోగానికి కూడా పెద్దల అనుమతి ఉంది. వ్యష్టి సమష్టి సంఘర్షణ నవలలో స్త్రీ పురుష లిద్దరిలోనూ, ప్రత్యేకించి పురుషుడిలో ఉద్ధోలంగా కన బడుతూండగా, కారణమేదయినా భారతంలో సంఘర్షణ మాత్రం స్త్రీలది.

వ్యాసంబికా, వ్యాసంబాలికా, వ్యాస దాసీల సంప ర్కాన్ని విశ్లేషిస్తే ఆసక్తికరమైన విషయాలు తెలుస్తున్నాయి. వ్యాసంబికల సంయోగంలో అంబిక తమ సంయోగం మీది అయిష్టతతోటీ, భయంతోటీ కళ్ళు మూసికొంది. కానీ పరిస్థితుల ప్రాబల్యానికి తలొగ్గింది. మనసు ఎదిరిస్తూ ఆక్రోశిస్తున్నా యాంత్రికంగా పుత్రోత్పత్తి కోసం శరీరాన్ని సాధనం చేసింది. ఫలితం పుట్టుగుడ్డివాడైన ధృతరాష్ట్రుడు. ధృతరాష్ట్రుడి ప్రకృతి - కొడుకు చేస్తున్నది అధర్మమని తెలిసినా, మనసు ఒక పక్క ఆక్రోసిస్తున్నా పైకి ఎదిరించలేని స్థితి. ఆతడి జీవితం ఆ విధంగానే గడిచిపోయింది. అంబాలికా వ్యాసుల సమాగమ సమ యంలో అంబాలిక మనసు స్థాణువై ఒక జడత్వ స్థితిని పొందింది. ఇక్కడ మనస్సుకీ, దేహానికీ రెంటికీ సంఘర్షణ లేదు. తత్కారణంగా ఆకారమాత్రం చేత పాండువైనా, శక్తి సామర్థ్యాలు గల పాండురాజు జన్మించేడు. రాజ్య రక్షణసమర్థుడు కాగలిగాడు.

ఇక దాసీ విషయానికి వచ్చేసరికి ఆమె వ్యాసునికి తన సర్వస్వం స్వచ్ఛందంగా సమర్పించుకొంది. మరి ఈ దాసీ వివాహిత కాదా? ఆమె భర్తకీ విషయం తెలియదా? ఇత్యాది ప్రశ్నలకి భారతంలో సమాధానాలు లేకపోయినా ఆమె తన హావభావ విలాసాలతో ముని నలరించిన విషయం మాత్రం విదితమవుతోంది. ఈ సంయోగంలో వాచ్యంగా ఎక్కడా చెప్పకపోయినా వ్యాస దాసీలిద్దలూ సంతుష్టాంతరంగులయేరన్న విషయం అనుమీయ మానమవుతోంది. యుక్తాయుక్త విచక్షణాదక్షుడైన విదురుని జన్మలో వారి సంయోగం ప్రతిఫలించిందని వేరే చెప్పనక్కర లేదు కదా? ''ధర్మచక్రం'' నవలలో తత్వాన్వేషణ పురుషునిదయితే భారతంలో స్త్రీది. బీజక్షేత్ర న్యాయాలు ఇక్కడ వ్యత్యస్తాలు. బీజప్రాధాన్య మైన గుణావగుణాలను వీరపురుషదత్తుడు పుణికి పుచ్చుకుంటే, క్షేత్రప్రాధాన్య మైన గుణావగుణాలను ధృతరాష్ట్ర, పాండురాజ, విదురులు సంక్రమించు కున్నారు.

వీరపురుషదత్తుని తల్లి కాళిందికి ధర్మ మీమాంస లేదు కాని భర్త కాని భర్త యైన గోముఖ శాతకర్ణి వైమనస్యం సంతానంలో ఎలా ప్రతిఫలిస్తుందోననే దిగులు మాత్రం ఉంది. అనంతర ఫలమైన సంతానం విషయం అలా ఉంచినా ఈ వైమనస్యం వలన తత్కాల రతి క్రీడోద్భూతి నందవరోధం కొంతకాకపోతే కొంతవఱకైనా ఉండి సంపర్క సాఫల్యం పరిపూర్ణత నొందలేదనే చెప్పాలి. ఈ ద్వివిధ సంయోగాలకూ సంతానం ప్రధాన లక్ష్యం కావటం వల్ల తద్గుణావగుణాలను సంతానపరంగానే చర్చించ వలసి వచ్చింది. అలాకాకపోతే ఆ స్త్రీపురుషుల కలయికకు శృంగారమే పరమావధియై ఈ ధర్మా ధర్మ చర్చకు గాని, గుణావగుణ మీమాంసకు కాని స్థానం ఉండేది కాదు కదా?

కాళిందీ, శాతకర్ణులు తమ రహస్య కామ ఫలితం ఎలా ఉంటుందని ఊహించారో అదే విధంగా జరిగింది. తల్లి ఏ కులానికి చెందిందో తెలియక, కులం కారణంగా వివాదాస్పదుడు కావటంతో వీరపురుషదత్తునికి సుక్షత్రియులెవరూ పిల్లనివ్వటాని కెవడూ అంగీకరించ లేదు. సుక్ష యస్త్రీ అయిన కదంబరాజ దుహిత భట్టిదేవి వీరపురుషుని పట్ల విముఖురాలని తెలిసికొని, ఆమెపై కోపంతో కదంబుల మీదికి దండెత్తి, భట్టిదేవిని జయించి తెచ్చుకున్నాడు. ఆమెని పట్టమహిషిని చేసేడు. ''సుక్ష త్రియాణి సందిగ్ధ జన్ముడైన యితనితో సంసారము చేయునా?''[9] అని అక్కడక్కడ వినిపించటం, భట్టిదేవి కూడా వీరపురుషుని పట్ల తొలి సమాగమానంతరం విముఖురాలవటం ఆతని కోపాగ్ని మీగ ఆజ్యం పోసినట్ల యింది. భట్టిదేవి మీది విరహం పదిమంది భార్యలతో తీరునని ఆతని ఉద్దేశము. ఈ కారణంగా వీరపురుష దత్తుడు శాంతిశ్రీని, రుద్రధారని, బాపిశ్రీని, షష్ఠ శ్రీని ఇలా ఒకరి తరువాత ఒకరిని వివాహమాడేడు. మనశ్శాంతి

కోసం బౌద్ధురాలైన మేనత్త శాంతిశ్రీని, బౌద్ధాచార్యుడైన భదంతానందుని, భార్యయైన శాంతిశ్రీని, చివఱకు కన్న తల్లి యైన కాళిందిని తనకు శాంతిభిక్ష ప్రసాదించుమని కోరేడు, బౌద్ధశ్రమణులని ఆదరించేడు. బౌద్ధారామాలు కట్టించేడు. తన పిల్లల్ని పూర్తిగా బౌద్ధమతస్థులుగానే పెంచాడు. అయినా అతనికి మనశ్శాంతి లభించలేదు. హిందూ దేవాలయాలని పడగొట్టాడు. శివలింగాన్ని కాలితో తన్నాడు. యజ్ఞయాగాలని నాశనం చేశాడు. వాటిని ప్రోత్సహించిన ఎంతోమంది బ్రాహ్మణుల మరణానికి కారణమయ్యాడు. కాని అతని మనసులోని పగప్రతీకారాలు అణుమాత్రం తగ్గలేదు. చక్రవర్తి అంశ ఉన్న గోముఖ శాతకర్ణి కుమారుడైన కారణంగా వీరపురుషదత్తుడు ఆంధ్రదేశానికి చక్రవర్తి కాగలిగినా, సంయోగ సమయంలో తల్లిదండ్రుల మానసిక సంఘర్షణ అతనిలో తీవ్రమైన ఆత్మన్యూనతా భావాన్ని పెంపొందింప చేసాయి. తత్ఫలితమే ఆతడి తీవ్ర ప్రకృతి. కారణాలు ఏవైనా ఆత్మన్యూనతా భావాలు మానవుని మీద ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయో, సమాజ సుస్థిరతకు అటువంటి భావాలు ఎంతటి భంగకారులో రచయిత వీరపురుషదత్తుని పాత్ర ద్వారా చూపించేరు.

ప్రసిద్ధ మనస్తత్వ శాస్త్రవేత్త "ఆడ్లర్" ఆత్మన్యూనతా భావం గురించి ఈ విధంగా చెబుతున్నారు. ఆత్మన్యూనతాభావం అన్నది చిన్నతనంలోనే పలకరిస్తుందట! ఆ న్యూనతని గమనించి, తన ఆధిక్యతని నిలబెట్టుకోవటానికి వ్యక్తి చిన్నతనంనుంచీ ప్రయత్నిస్తూనే ఉంటాడట! దీనినే కాంపన్సేటరీ ఆక్టివిటీ (compensatory activity) అంటారు. తానే వంశానికి చెందినవాడో తెలియక, తనని అందరూ క్షత్రియుడని అనుకోవాలనే తపనతో వర్ణవ్యవస్థని నిరాకరించిన బౌద్ధాన్ని ఆశ్రయించి, దారుణమారణకాండ సలిపి, ఆ విధంగా ఆధిక్యతని సంపాదించాననుకున్నాడు వీరపురుషదత్తుడు. ఈ కాంపన్సేటరీ ఆక్టివిటీతో తమ ఆత్మన్యూనతా భావాలను అధిగమించిన కొద్దిమందిని తలుచుకోవటం ఇక్కడ అప్రస్తుతం కాదేమో! పుట్టు చెవిటివాడైన బెతోవిన్ గొప్ప సంగీత విద్వాంసుడవటానికీ, పొట్టివాడైన నెపోలియన్ గొప్ప సేనాపతి కావటానికీ, నత్తివాడైన డెమస్తనీస్ గొప్ప వక్త కావటానికీ ఈ కాంపన్సేటరీ ఆక్టివిటీ యే కారణమని చరిత్ర చెబుతోంది.

ప్రస్తుత నవలలో వీరపురుషునికి తన ఆత్మన్యూనతా భావానికి కారణమేమిటో తెలిసినా, దాన్ని అధిగమించటానికి ఆతడెన్నుకున్న మార్గమే సరియైనది కాకుండా పోయింది. ఆత్మన్యూనతా భావంతో బాధపడే వారికి కౌన్సిలింగ్ (జశీబఅఎఱశ్రీఱఅస్త్ర) చేసి ఆ భావం నుండి బైటపడేటట్లు చేయటం ఒక పద్ధతిగా ఆధునిక మనస్తత్వ శాస్త్రం చెబుతోంది. ఇక్కడ వీరపురుషుని తల్లి చేసిందీ అదే. ఆతడి జన్మరహస్యం అతడికి తెలియజెప్పి, ఆతడుత్తమ కులసంజాతుడేనన్న విషయాన్ని బయల్పఱచి ఆతనికి మానసికశాంతి కలి గేటట్లు చేసింది కాళింది. ఆర్షధర్మం పట్ల, మానవత్వం పట్ల అత్యంత అభిమానమున్న విశ్వనాథ వారు ధర్మబద్ధమైన దాంపతం యొక్క ఆవశ్యకతనీ, ఆత్మ న్యూనత, దాని ఫలితాలనీ, ఈ నవల ద్వారా అత్యంత ఆసక్తికరంగా వర్ణించేరు.

శాసనాధారాల వలన తెలుస్తున్న నాటి రాజకీయ సాంఘిక, మత పరిస్థితులని కూడా నవలలో చాలా చక్కగా నిక్షేపించేరు. మేనత్త కూతుర్లను వివాహమాడటం (అంటే ఎదురు మేనరికమన్నమాట), తాత పేరు మనుమడికి పెట్టటం తెలుగునాట వీరపురుషుడేర్పఱచిన సంప్రదాయాలని చరిత్ర చెబుతోంది. సందర్భానుసారంగా పైవిషయానికి నవలలో స్థానం కల్పించి నవలకొక ప్రామాణికతని కల్పించారు. ఎవరి మతానుసారంగా వారు దానధర్మాలు చేసేవారట! మహారాజ సోదరి బౌద్ధమతానుయాయియై బౌద్ధ భిక్షువులకు భద్రకరణాలు చేయించి, బంగారు నాణేలని, ఫలాలని దానం చేసి, శ్రమణులకి కావిటులిప్పించి, తన బౌద్ధమతాభిమానాన్ని చాటుకుంటే, రాచ కుటుంబంలోని మిగిలిన సభ్యులు బ్రాహ్మణులకి గోదానాలు చేసి ముత్తైదువులకి చీరలు పంచి పెట్టి, హిరణ్యకోటి దానాలు చేసి వైదికమతం పట్ల తమ భక్తిప్రపత్తులని చాటుకున్నారు. కర్షకులకి హలములు,

శకటములు, బలీవర్ధములు దానాలు చేసి వ్యవసాయ రంగాన్ని ఎంతో అభివృద్ధి చేశారని నవల ద్వారా తెలియ జెప్పారు. ఆకాలంలో వైదిక, బౌద్ధమతాలు రెండూ పడుగు పేకల్లా పెనవేసుకుపోయి ఉన్నాయని, వైదికమత ప్రభావం బౌద్ధమతం మీద ఉందని చెప్పకనే చెప్పారు. ఇంతేకాదు బౌద్ధమత శిల్పాన్ని, ఆ మతంలో అనంతరం వచ్చిన శాఖోపశాఖలని, నాటి ప్రసిద్ధ మతబోధకుడు నాగార్జునుని గురించి, బౌద్ధ మత లక్షణాలనీ, అందులో అనంతరం వచ్చిన మార్పులనీ నవలలో ప్రాసంగికంగా వివరించారు. పెరిగిన పరిస్థితులు మనిషి జీవితం, నడవడికలమీద తమ ప్రభావం చూపకమానవు. వీరపురుషదత్తునికి, పట్టమహిషి భట్టిదేవికి జన్మించిన పిల్లలు బాహుబల శాంతమూలుడు (ఎహువల శాంతమూలుడుగా చరిత్రలో ప్రసిద్ధుడు), కొడబలి శాంతిశ్రీలు. భట్టిదేవి మీది కోపంతో వీరపురుషుడు తన పిల్లల్ని తల్లికి దూరంగా వారి ప్రవర్తన మీద అదుపాజ్ఞలన్నవి లేకుండా పెంచేడు. ఫలితం బాహుబలుడు నిత్య యుద్ధ ప్రియుడు. కొడబలి శాంతిశ్రీ స్త్రీ యయ్యు పురుషుడిలా పెరిగి తల్లిదండ్రుల కే కాక, కట్టుకున్న భర్త కే ఎదురు తిరిగి ఆతడి మీద యుద్ధం ప్రకటించే స్థితికి చేరుకుంది. జన్మతః సత్కుల సంజాతలే అయినా, తల్లిదండ్రుల సరియైన ప్రేమకు నోచుకోనివారు ఈ విధంగానే తయారవుతారన్నది ఇక్కడ నవలలో సుస్పష్టం. నవలలు యదార్థాలకి ప్రతిరూపాలే కదా!.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# పిల్లల్లో భాషావికాసం - గడించవలసిన నైపుణ్యాలు

- డాక్టర్ బి. ప్రసాద్‌బాబు, సహాయ ప్రాంతీయ సంచాలకులు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం, విజయవాడ-1.

మానవుడిని మిగిలిన జంతువుల నుండి వేరు చేసే ప్రధానమైన అంశం 'వాక్కు'. వాగ్రూపాలు క్రమంగా భాషగా అభివృద్ధి చెందాయి. తన భావాలను మానవుడు ఇతరులకు తెలియజేసే సాధనమే భాష. భాషకు శబ్దాలు సంకేతాలుగా ఉండి, అని స్పష్టమైన అర్థాన్నిస్తాయి. తెలుగైనా, హిందీ అయినా లేక ఆంగ్లభాషైనా తన శబ్ద సంకేతాల ద్వారా ఒక మనిషిలోని భావనలను ఇంకొకరికి అదిస్తుంది. అయితే భాష భాషకు శబ్ద సంకేతాలు మారుతూ ఉంటాయి. భారతదేశంలో హిందీ, అంతర్జాతీయంగా ఇంగ్లీషు భాషల్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు. మానవుడు జన్మించినప్పటి నుండి తన వాక్కును అనేక రూపాల్లో ఉచ్చరిస్తూ ఉంటాడు. పుట్టిన వెంటనే భాష రాదు కనుక తన భావాలను బహిర్గతం చేయటానికి శిశువు అనేక సంకేతాలను వినియోగిస్తాడు. ఈ సంకేతాలే ప్రాగ్భాషారూపాలు. ఈ ప్రాగ్భాషారూపాలు క్రమేపి పరిణితి చెంది భాషారూపాలుగా మారుతాయి. భాషా వికాసానికి అభ్యసనం, పరిణితి దోహదం చేస్తాయి.

### వాక్కు-వికాసం (Development of Speech) :

మాట్లాడటానికి పునాది శైశవదశలోనే ఏర్పడుతుంది. పూర్వబాల్యదశలో ఇంతకుముందే వేయబడిన పునాది పైన ఆధారపడి వాక్చాతుర్యం అభివృద్ధి అవుతుంది. కాని పూర్వబాల్యదశలో వాక్చాతుర్యానికి నమూనా ఏర్పడుతుంది. తర్వాతికాలంలో ఏర్పడే వాక్చాతుర్యం ఈ నమూనాపై ఆధారపడి ఉండటం వల్ల పూర్వబాల్యదశను చాలా ముఖ్యమైనదశగా చెప్పవచ్చు. చిన్నతనంలో వాక్చాతుర్యాభివృద్ధి, చలన నైపుణ్యాభివృద్ధి ఒకదానిని అనుసరించి మరొకటి ఏర్పడతాయి. నరాలు, కండరాలు పరిపక్వత చెందే కొద్దీ వాక్చాతుర్యం, చలన నైపుణ్యం అభివృద్ధి చెందుతాయి.

పరిసరాల్లో గల అవకాశాలు కూడా రెండు నైపుణ్యాలు ఒకేసారి అభివృద్ధి చెందటానికి దోహదం చేస్తాయి. ముఖ్యంగా పూర్వబాల్యదశలో సాంఘికీకరణకు వాక్చాతుర్యం ఎంతో అవసరం. ఆటలు ఆడుకునేటప్పుడు స్నేహితులతో మాట్లాడటానికి వాక్చాతుర్యం అవసరం. ఇతర పిల్లలతో చాతుర్యంగా మాట్లాడి, వారు మాట్లాడే మాటలు అర్థం చేసుకొంటేనే పిల్లవాడు బాగా సాంఘికీకరణకు గురవుతాడు. బాగా మాట్లాడగలిగితేనే విద్యా విషయంలో, సాంఘికంగా కూడా పిల్లలు ముందంజ వేయగలుగుతారు. లేకపోతే పిల్లలు తమ తోటిపిల్లల కన్నా వెనుకబడిపోతారు.

### వాక్చాతుర్యాభివృద్ధిలో గడించవలసిన నైపుణ్యాలు:

మాట్లాడటం నేర్చుకోవాలంటే సరిగా అర్థంచేసుకోవటం, తగిన పదజాలాన్ని ఉపయోగించటం, ఉచ్చారణను నేర్చుకోవటం, కొన్ని పదాలను కలిపి వాక్యాలుగా మాట్లాడటం మొదలైన ముఖ్యనైపుణ్యాలు చాలా అవసరం. ఈ నైపుణ్యాలు పూర్వబాల్యదశలోనే నేర్చుకోవాలి. ఈ విధంగా నేర్చుకోటానికి తగిన అవకాశాలు, సలహాలు పిల్లలకు లభించకపోతే సమవయస్కులతో పోలిస్తే ఆ పిల్లవాని వాక్చాతుర్యం తక్కువగా ఉంటుంది.

**1. అవగాహన శక్తి** (Comprehension) :

పిల్లలు ఇతరులతో మాట్లాడటానికి వాళ్ళు తనతో ఏమి మాట్లాడుతున్నారో గ్రహించి, అవగాహన చేసుకోవాలి. లేకపోతే ఇతరులు మాట్లాడే మాటలకు, పిల్లవాడు ఇచ్చే సమాధానానికి సంబంధం ఉండదు. ముఖ్యంగా శ్రవణలోపం గల పిల్లలు సరిగా వినకపోవటం వల్ల అర్థంలేని సమాధానాలు ఇస్తారు. అందువల్ల సాంఘిక సంబంధబాంధవ్యాలు కుంటుపడతాయి. అంతేకాక ఒంటరితనంగా ఉండటం అలవాటవుతుంది. ఇంట్లో ఒక భాష, పాఠశాలలో మరోభాష ఉన్నప్పుడు కూడా పిల్లల

వాక్చాతుర్యం దెబ్బతింటుంది. ఎందుకంటే పాఠశాలలో తనతోటి వారు మాట్లాడే భాషకు, తనకు ఇంట్లో మాట్లాడే భాషకు పోలిక ఉండదు. కాని ఈ చిన్న వయస్సులో పిల్లలు ఇతరుల ముఖకవళికల వల్ల, వాళ్ళు చేసే సంజ్ఞల వల్ల అవతలి వ్యక్తులు మాట్లాడేభాషను అర్థం చేసు కొంటారు.

**2. వాక్చాతుర్యాభివృద్ధి** (Speech Development) :

ప్రాక్ పాఠశాల వయస్సు మొత్తంలో పిల్లవాని భాషాజ్ఞానం అభివృద్ధి చెందుతుంది. పిల్లవానికి కొత్తపదాలు నేర్పటంవల్ల, కొత్తపదాల అర్థాలు నేర్చు కోవాలనే కుతూహలం పిల్లవానిలో జనించటం వల్ల కూడా వాక్చాతుర్యం అభివృద్ధి చెందుతుంది. పిల్లవాడు కొత్తకొత్త పదాలు నేర్చుకోవటమే కాకుండా నేర్చుకొన్న పాతపదాలకు కొత్త అర్థాలు గ్రహిస్తాడు. అర్థంలో అతి సూక్ష్మ భేదాలను మాత్రం పిల్లలు ఈ వయస్సులో గ్రహించలేరు.

**3. ఉచ్చారణ** (Pronunciation):

పిల్లవాని ఉచ్చారణ త్వరగా అభివృద్ధి చెందవలసి ఉంటుంది. పిల్లవాని పరిసరాలలో మాట్లాడే వారి తీరు పైన, పిల్లవాని ఉచ్చారణపైన, పెద్దలు తీసుకొనే శ్రద్ధపైన పిల్లవాని ఉచ్చారణ ఆధారపడి ఉంటుంది. ఉచ్చారణలో కూడా కొన్ని శబ్దాలు పిల్లవాడు ఉచ్చరించ టానికి కఠినంగా ఉంటాయి.

**4. వాక్యాలు మాట్లాడటం** (Speaking Sentences) :

పూర్వ బాల్యదశలో వాక్యాలు కూర్చడం ఒక నిర్ణీత క్రమపద్ధతి ప్రకారం జరుగుతుంది. రెండు సంవత్సరాలలో 2 లేదా 3 పదాలతో వాక్యాలు కూరుస్తారు. పిల్లలు ఎక్కు వగా నామవాచకాలను వాక్యాల్లో వాడతారు. క్రియలు, ఉపసర్గలు, సంబంధవాచకాలు వాళ్ళ వాక్యాల్లో తక్కువగా ఉంటాయి. పిల్లవాని వాక్యాలు సంపూర్ణంగా కూడా ఉం డవు. మూడు సంవత్సరాల నుంచి 6-8 పదాల వాక్యాలు పిల్లలు ఉపయోగిస్తారు. ఆరు సంవత్సరాలకు అన్ని విధాలైన వాక్యాలు వాడగలుగుతారు.

**5. మాటల తప్పులు** (Speech Errors) :

మాట్లాడటం నేర్చుకోవటం చాలా కష్టం. పిల్లలు తప్పులు లేకుండా మాట్లాడలేరు. కొంతమంది పిల్లలు మాత్రం మాటలను స్పష్టంగా ఉచ్చరిస్తారు. మరికొందరు ఆవిధంగా చేయలేరు. మూడు లేదా నాలుగు సంవత్స రాల వరకు పిల్లలు సరిగా ఉచ్చరించలేరు. ఆ తర్వాత 5, 6 సంవత్సరాలకు పిల్లలు స్పష్టంగా ఉచ్చరిస్తూ మాట్లాడతారు. సాధారణంగా 3, 4 సంవత్సరాల వరకు వాళ్ళ మాటలలో వ్యాకరణ దోషాలు ఉంటాయి. ప్రధానంగా సందర్భానికి తగిన సర్వనామాలు, క్రియలు, కాలాలు ఉపయోగించటంలో దోషాలు ఉంటాయి. ఏకవచన, బహువచన ప్రయోగంలో తప్పులు చేస్తారు. అలాగే, మూడు సంవత్సరాల నుంచి పదజాలాన్ని ఉప యోగించటం నేర్చుకున్నా వ్యాకరణంలో తప్పులు ఎక్కువగా ఉంటాయి.

**6. భాషాక్రమభంగాలు** (Speech Disorders) :

కొన్ని శారీరకమైన లోపాలవల్ల కొన్ని భాషాక్రమ భంగాలు (దోషాలు) వస్తాయి. ఉచ్చారణ లోపాలు ఆంగిక లోపం వల్ల ఏర్పడతాయి. నాసికారంధ్రాల్లో ఏదైనా అడ్డం ఉన్నా, దండాల నిర్మాణంలో లోపాలు ఉన్నా, దౌడలు, పెదవులు, చిరునాలిక నిర్మాణంలో లోపాలు ఉన్నా , నాలిక కదిలించలేని పరిస్థితి ఉన్నా మాట్లాడటంలో దోషాలు ఏర్పడతాయి. పూర్వబాల్యదశలో కనబడే భాషా క్రమభంగాలు ముఖ్యంగా మూడు విధాలు. ముద్దు పలుకుల దోషము (lisping), అస్పష్టంగా త్వరగా మాట్లాడటం (slurring), మరియు నత్తిగా మాటాడటం (stuttering).

**7. మాటల్లోని విషయాలు** (Content of Speech) :

మొదట్లో మాటలు చలనశీలతతోబాటు వెలువడి తర్వాత గట్టిగా ఆలోచించడం జరుగుతుంది. ఉదా హరణకు పిల్లలు ఈ వయస్సులో రైలుబొమ్మతో ఆడు కొంటూ 'రైలును మీద నడిపిస్తానని' గట్టిగా చెప్పి నడిపిస్తారు. అంటే తాను చేసే ప్రతికార్యం గురించి గట్టిగా ఆలోచిస్తారన్నమాట. చెబుతున్న విషయాలు జరుగు

తున్నట్లు మాట్లాడతారు. కాని మరొకరితో ఏమీ చెప్పరు. స్వగతంగానే మాట్లాడతారు.

**8. సలహా ఆవశ్యకం** (Importance of Advice) :

పిల్లవాడిని సాంఘికీకరించాలంటే తోటి స్నేహితులతో సవ్యంగా ఏ విధంగా మాట్లాడాలో నేర్పించాలి. తప్పులు మాట్లాడటం అలవాటై పోకుండా ఎప్పటికప్పుడు తప్పులు సరిదిద్ది, సలహాలు ఇవ్వాలి. అంతేకాకుండా పెద్దవాళ్ళతో మర్యాదగా మాట్లాడటం నేర్చించాలి. ఆవిధంగానే ఇతరులను పేర్లు పెట్టి పిలవటం, విమర్శించటం, స్వంత విషయాలను గురించి ప్రగల్భాలు పలకటం వంటి అలవాట్లు చిన్నప్పుడే రూపుమాపాలి.

**ముగింపు** (Conclusion) :

చాలా సందర్భాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలు మిగతా పిల్లల కంటే ఎక్కువ భాషలు నేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో ఉంటారు. దీంతో రెండుభాషల్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. వీటిల్లో ఒకటి ఇంట్లో మాట్లాడే భాష కాగా రెండోది పాఠశాలలో ఉపయోగించే భాష. అయితే, చాలా పరిశోధనల్లో నిరూపితమైన విషయం ఏమిటంటే ఇంటి భాష, బడిభాష ఒకటి కాకపోతే ఆ పిల్లల వాక్చాతుర్యంలో లోపం ఏర్పడుతుంది. పిల్లలు ఎంత మాట్లాడతారనే విషయమే కాకుండా ఎట్లా మాట్లాడతారు? ఏ విషయాలు మాట్లాడతారు? ఎవరెవరితో మాట్లాడతారు అనే విషయాల్లో కూడా వ్యక్తిగత భేదాలు ఉంటాయి. మేధావులు, పరిపక్వం చెందినవారు ఎక్కువగా మాట్లాడతారు. తల్లిదండ్రులు అమలుచేసే క్రమశిక్షణ విధానం కఠినంగా ఉండే ఇళ్ళలోని పిల్లలకంటే ఎక్కువ స్వతంత్రాన్ని ఇచ్చే కుటుంబాల్లోని పిల్లలు ఎక్కువగా మాట్లాడతారు. కాబట్టి, తల్లిదండ్రులు మొదటగా పిల్లలకు ఒక భాషను నేర్పిన తరువాత ఇంకొక భాషను నేర్పించటం మంచిది.

**పరిశీలించిన గ్రంథాలు :**

1. విద్యామనోవిజ్ఞాన శాస్త్రం, తెలుగు అకాడెమి ప్రచురణ, హైదరాబాదు
2. శిశు సంవర్థనం, తెలుగు అకాడెమి, ప్రచురణ, హైదరాబాదు
3. బాల్యదశ - వికాసం, నాగార్జున పబ్లికేషన్స్, గుంటూరు
4. అమ్మ, నాన్న, బుజ్జాయి, శ్రీరాఘవేంద్ర పబ్లిషర్స్, విజయవాడ
5. పిల్లల ప్రవర్తన - తల్లిదండ్రుల పాత్ర, తెలుగు అకాడెమి, హైదరాబాదు.

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# కొలుపులు - అధ్యయనం

- డా. దాసర విజయకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్, కేంద్రీయవిశ్వవిద్యాలయం, హైదరాబాదు.

**కొలుపులు :**

ఒక గ్రామంలోని ప్రధాన దేవతను ఆ గ్రామంలోని ప్రజలే ఆరాధించడాన్ని కొలుపులు అని అంటారు. ఏగ్రామానికి ఆ గ్రామం వేరుగా కొలుపులు జరుపు కొంటుంది. ఈ కొలుపులలో ప్రజలు గ్రామదేవతల జాతర లలో పాటించే పద్ధతులు, ఉత్సవాలలో పాటించే పద్ధతులు కలగలిపి పాటిస్తారు.

కొలుపులు జానపద విజ్ఞానంలో భాగంగా పరిగణించ బడుతుంది. కొన్ని ప్రాంతాలలో నేటికి కొలుపులు జరుపుకుంటున్నారు. 2013 సంవత్సరము జూన్ 20వ తేదీన ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, కారు మంచి గ్రామానికివెళ్ళి సేకరించిన అంశం ఈ వ్యాసంలో పొందుపరచడమైంది.

జానపద విజ్ఞానం అనే అర్థంలో W.J. Thoms 1846 లో folklore అనే పదాన్ని వాడారు. Rechard M. Dorson తన folklore అనే గ్రంథంలో జానపద విజ్ఞానాన్ని నాలుగు శీర్షికలుగా విభ జించారు. (1) వాగ్రూప సంస్కృతి (Oral folklore) (2) సాంఘిక జానపదాచారం (Socila folk Customs) (3) వస్తు సంస్కృతి లేదా భౌతిక సంస్కృతి (Matirial Culture) (4) జానపద కళలు (folk Arts)

మొదటిది అయిన వాగ్రూపు సంస్కృతిలో జానపద అభ్యాసం (Folklore Narratives) అఖ్యాన జానపద కవిత్వం (Narrative folk poetry) జానపదేతిహాసం (Folk Epic) సామెతలు సామెతలను పోలిన వ్యక్తీకరణాలు (Proverbs and Proverbial Expressions) పొడుపు కథలు (Riddles) జానపదుల భాష (Folk Speech) మొదలైనవి ఉంటాయి.

రెండవది సాంఘిక జానపదాచారం (Social folk custom) దీంట్లో పండుగలు మరియు ఉత్సవాలు (Festival and Celebrations) వినోదాలు మరియు ఆటలు (Recreation and Games) జానపద వైద్యం (folk Medicine) జానపద మతం (folk Religeon) మొదలైనవి చేరతాయి. పండుగలు, ఉత్సవాలు అనే విభాగం కిందికి కొలుపులు వస్తాయి.

మనదేశంలో హిందూ సంస్కృతిలో తెలుగు నెలలో అనేక పండుగలు వస్తుంటాయి. అవి ఉగాది, వినాయక చవితి, దసరా, దీపావళి సంక్రాంతి మొదలగునవి. వీటి తోపాటు మన సంస్కృతిలో భాగంగా గ్రామదేవతల జాతరలు, పరసలు, తిరునాళ్ళు తీర్థాలు, ముస్లింలకు చెందిన ఉరుసులు మొదలగునవి కూడా ఉన్నాయి. వీటన్నిటిని పండుగలు అని వ్యవహరిస్తాము.

ఆర్. ఎస్. బాగ్స్ పండుగని నిర్వచిస్తూ "సాంఘిక సంక్షేమం కోసం విశేష సందర్భాలలో జానపద విశేషాలు, సంప్రదాయాలకుఅతీతంగా ఆచరించే సంక్షిప్తమైన అంశమే పండుగ" అన్నాడు.

**(జి.యస్. మోహన్ : 2010-209)**

సంవత్సరమంతా కష్టపడి పనిచేసే కష్ట జీవులు ఆ కష్టం నుండి బయటపడి కొంతసేద దీరడం కోసం, పండుగలు, ఉత్సవాలు, జాతరలు, కొలుపులు, పరసలు మొదలగునవి జరుపు కుంటారు. వాటిలో ఆటలు, పాటలు, విందులు వినోదాలు ఏర్పాటు చేసుకొని సమష్టిగా జరుపుకొని ఆనందంగా గడుపుతారు.

ఒక గ్రామంలోని ప్రధాన దేవతను ఆ గ్రామంలోని ప్రజలే ఆరాధించడాన్ని "కొలుపులు" అని అంటారు. అంకమ్మతల్లి కొలుపులలో ప్రక్క గ్రామాల ప్రజలు పాల్గొనరు.

ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కారుమంచి గ్రామంలో ఆ గ్రామదేవత అయిన అంకమ్మతల్లి కొలుపులు జరుగుతాయి. ఆగ్రామానికి చెందిన జి. సుబ్బరామయ్య అనే వ్యక్తి అయిన ఈ కొలుపుల గురించి

చెప్పారు. అతని వయస్సు 50 సం॥లు. అతడు మాల కులానికి చెందినవ్యక్తి. కారుమంచి గ్రామంలో ప్రతి 3 సం॥లకు ఒకసారి అంకమ్మతల్లి కొలుపులు జరుపు కుంటారు. ముందుగా ఆ గ్రామంలో షెడ్యూల్డు కులానికి చెందిన కాలనిలో నివసించే పదిమంది కులపెద్దలు అమ్మవారి గుడివద్ద సమావేశమవుతారు. ఈ కొలుపులు ఎప్పుడు జరపాలో నిర్ణయిస్తారు. తరువాత అమ్మవారి చరిత్ర తెలిసిన బైనీడివారిని పిలిపిస్తారు. బైనీడివారు వచ్చి అమ్మవారి పూజకు కావలసిన వస్తువులను సమకూర్చు కుంటారు. అంకమ్మతల్లి కొలుపులు మొత్తం పదిరోజులు జరుగుతాయి. మొదటి ఐదు రోజులు జోగి ఎత్తుతారు. పదిమంది పెద్దలలో ఒక వ్యక్తిని అమ్మవారిని ఎత్తు కోడానికి నియమిస్తారు. అమ్మవారిని ఎత్తుకోడమంటే అమ్మవారి రూపము దాల్చిన ఒక మట్టి ముంతను కుల పెద్ద ఎత్తుకోవడం. ఆ వ్యక్తిని దేవర అంటారు. అతనితో పాటు నలుగురు బైనీడి వాళ్ళు, కొంతమంది గ్రామ పెద్దలు కలిసి ఇంటింటికి తిరిగి జోగి ఎత్తుతారు. అపుడు గ్రామస్తులు అమ్మవారు తమ ఇంటి ముందుకి వచ్చి నప్పుడు, ధనాన్నిగాని, ధాన్యాన్ని గాని ఇస్తారు. మొదటి ఐదు రోజులు ఇదేవిధంగా చేస్తారు.

ఈ జోగి ఎత్తడానికి ముందు బైనీడి వాళ్ళు, ఇంకా కొంతమంది పెద్దలు కలిసి గ్రామంలో ఉన్న గ్రామ దేవతల ఆలయాలకు వెళతారు. అపుడు బైనీడివారు "ఏమయ్యా గ్రామంలో ఉన్నటువంటి బడుగులవారు, అమ్మగారు వారు అయ్యగారు వారు, పల్నాటి వారు మారాసివారు స్థలము పరస్థలము తెలిసినవారు తెలియని వారూ ఈ యొక్క అమ్మవారి కొలుపులు జరిపించుటకు శలవేనయా" అని అంటారు. అపుడు ఆ గుడిలో పూజ చేసే పెద్దలు (పూజారులు) "ఆ శలవే, ఆ శలవే, ఆ శలవే" అని మూడుసార్లు అంటారు. ఇదేవిధంగా గ్రామం లోని అమ్మవారి దేవాలయాలకు వెళ్ళి "శలవే" అని అడిగివచ్చిన తరువాత ఆ మరుసటి రోజు నుండి జోగి ఎత్తుతారు. మొదటి ఐదు రోజులు జోగి అడుగుతారు.

**ఆరవరోజు :**

బైనీడి వాళ్ళు కులపెద్దలు కలిసి ఆరవరోజు తెల్లవారు జామున నాలుగు గంటలకు అమ్మవారి అవశేషాలు, (అనగా అమ్మవారి గవ్వలు, పావణం అనగా అమ్మవారి ఉత్సవ విగ్రహము, తీసుకొని ఒక మేకపోతు, కొన్ని బియ్యం, పసుపు కుంకుమ తీసుకొని మేళతాళాలతో కారుమంచి గ్రామానికి దగ్గరలో ఉన్న సముద్రం దగ్గరకు వెళతారు. ఆ తరువాత అందరు సముద్రంలో స్నానం చేస్తారు. ఆ సముద్రం దగ్గర బైనీడి వాళ్ళు అమ్మ వారి రూపం వచ్చేలా ఒక ముగ్గు వేస్తారు. ఆ ముగ్గు దగ్గర అమ్మవారి ఉత్సవ విగ్రహం, గవ్వలు మొదలగునవి ఉంచుతారు. తరువాత వారు వెంట తీసుకొని వెళ్ళిన మేకపోతుని బలిచ్చి, పొంగలి వండి అమ్మవారికి నైవేద్యం పెడతారు. పిమ్మట అమ్మవారి కథను చెప్పుకొని, అందరు భోజనాలు చేసి అదే రోజు సాయంత్రానికి గ్రామానికి చేరుకుంటారు. అందరు ఆగ్రామ పొలిమేరకు చేరుకోగానే మేళతాళాలతో అమ్మవారిని గ్రామంలోకి తీసుకొస్తారు. ఆ గ్రామ నడిబొడ్డులో ఉన్న మంచి నీటి చెరువులో ఒక ప్రక్కన నీళ్ళలో అమ్మవారిని ఉంచి ఎవరి ఇంటికి వారు వెళ్ళిపోతారు.

**ఏడవరోజు :**

ఏడవ రోజు మాత తుడుపు జరుగుతుంది. ఈ గ్రామంలో మన్నంవారు అనే కుటుంబానికి చెందిన వారు ఈ అంకమ్మ తల్లి కొలుపులు నిర్వహిస్తారు. వారి కుటుంబంలోని పిల్లలు, పెద్దలు అందరు అమ్మవారి గుడి వద్దకు వస్తారు. అప్పుడు బైనీడివారు అమ్మవారి గుడి ముందు ముగ్గువేసి మేకపోతుని బలి ఇస్తారు. అప్పుడు అబ్బాయి మాత తడుపు ఉన్నది అందరు కూర్చోండి అని బైనీడి వారు అంటారు. మన్నంవారు అమ్మవారి కొలుపులు జరిపిస్తున్నారు చూడండి అనగానే దీనినే ఆచారము జరిపిస్తున్నారు అని కూడా అంటారు. మిగిలినవారు అమ్మవారి గుడి ద్వారానికి ఇరువైపుల నిలబడతారు. మన్నంవారు నాలుగు ముంతల కల్లును తెప్పిస్తారు. అపుడు మాతంగిని అక్కడకు తీసుకువస్తారు.

మాతంగి కొంతసేపు అమ్మవారివలె నృత్యం చేస్తుంది. ఆ తరువాత వేప ఆకులు కొన్ని నోట్లో ఉంచుకొని "తాటి కల్లు"ను నోట్లో పోసుకొని ఈ కొలుపులు జరిపిస్తున్న వారి మీద ఊదుతుంది. ఆమె మొత్తం కల్లును అదే విధంగా మన్నంవారిపై చల్లుతుంది. అదేరోజు సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచిన చెరువు వద్దకు వెళ్ళి అక్కడ అమ్మవారి ముందు ముగ్గు వేసి అమ్మవారి కథను చెప్పి మేకపోతుని బలిఇస్తారు. ఆ తరువాత నీటిలో ఉంచిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తీసుకొని ఊరేగిస్తూ అమ్మవారి గుడి వద్దకు వస్తారు.

## ఎనిమిదవ రోజు :

ఎనిమిదవరోజు సుడికప్పెర జరుపుతారు. ఆరోజున ఉదయం అందరు అమ్మవారి గుడివద్దకు చేరుకుంటారు. అమ్మవారికి పొంగలి నైవేద్యం పెడతారు. ఆ తరువాత బైనీడి వారు అమ్మవారి గుడి ముందు ముగ్గు వేస్తారు. ఒక మేకపోతును బైనీడి వాళ్ళు ఆ ముగ్గు ముందు ఉంచుతారు. ఆ తరువాత వారు ఆ మేకపోతు ప్రాణ ముండగానే దాని కడుపు నుండి పేగులు, ఊపిరితిత్తులు బయటికి తీస్తారు. మేకపోతు ఊపిరి తిత్తులను వారు దొబ్బ అంటారు. వారు ఆ మేకపోతును చెత్తలోకి విసిరేస్తారు. బైనీడివాళ్ళలో ఒక వ్యక్తికి నల్లని వస్త్రాలు కట్టి, ఎర్రని బొట్టు పెట్టి మేకపోతు పేగులను కొన్ని అతని చేతులకు కట్టి, కొన్ని పేగులను అతని మెడలో వేసి దొబ్బ ను (ఊపిరితిత్తులు) ను అతని నోట్లో పెట్టి అలంకరిస్తారు. ఆ తరువాత ఒక కుండను తీసికొని సమానంగా మధ్య లోకి పగులగొట్టి దాని పై భాగాన కొన్ని పుల్లలను నిల బెడతారు. మేకపోతు పేగులను కొన్నింటిని తీసుకొని ఆ పుల్లలకు అల్లుతారు. ఈ విధంగా అలంకరించిన ఆ కుండను నల్లని వస్త్రాలు ధరించిన బైనీడి వ్యక్తి తలపై పెడతారు. ఆ తరువాత నోట్లో ఉంచిన దొబ్బను ఒకచోట దాచిపెడతారు. అపుడా వ్యక్తి దాచిపెట్టిన దొబ్బను వెతికి పట్టుకొని దాన్ని నోట్లో పెట్టుకొని, కుండను నెత్తిమీద పెట్టుకొని ఒక గంటసేపు నృత్యము చేస్తాడు. కొందరు ఈ నృత్యాన్ని చూసి భయపడతారు. తల్లిదండ్రులు చిన్నపిల్లలు ఆ నృత్యం చూడకుండ జాగ్రత్త పడతారు. ఈ దృశ్యం అంత భయాన్ని కలిగిస్తుంది. ఆ బైనీడి వ్యక్తి ఆవిధంగా నాట్యం చేస్తు దారి వెంట పరిగెడతాడు. అలా పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆ గ్రామ పొలిమేరలో ఆ కుండను పడేస్తాడు. అదే సమయంలో గ్రామపెద్దలు వేరొక మేకపోతు తలను నరికి ఒక గంపలో ఉంచి బలి అంకయ్య అనే వ్యక్తి తలపై ఆ గంపను ఉంచుతారు. ఆ బలి అంకయ్య ఆ గంపను నెత్తిపై పెట్టుకొని నడుస్తుంటాడు. ఆ గ్రామంలోని యువకులు గంప పై భాగాన కర్రతో కొట్టుకుంటూ అతని వెనక వెళతారు. ఆ విధంగా చేస్తూ ఆ గంపను కూడ ఆ ఊరి పొలిమేరలో పడేస్తారు. యువకులు ఆ గంపపైన ఎందుకు కొడతా రంటే ఆ గంప ఎత్తుకున్న అంకయ్యను అమ్మవారు బలి తీసుకో కుండ ఉండడానికి చేస్తారు. ఈ ఆచారాన్ని ఆ గ్రామస్థులు తమ పూర్వీకుల కాలం నుండి చేస్తున్నట్లు చెబుతారు.

## తొమ్మిదవ రోజు :

తొమ్మిదవ రోజు గ్రామ ఉత్సవం చేస్తారు. ఆ రోజు గ్రామంలో అమ్మవారి ఊరేగింపు చేస్తారు. ఒకవ్యక్తికి చిన్నపాప వేషము వేస్తారు. ఒక వ్యక్తి పూల కప్పెర పట్టుకుంటాడు. పూలకప్పెర అనగా దూదితో పూల వృక్షం చేస్తాడు. ఒక వ్యక్తి వేప మండలు పట్టుకొని నృత్యం చేస్తాడు. వేరొక వ్యక్తి అమ్మవారి వలె అలంకరించు కుంటాడు. వీరంతా కలిసి తొమ్మిదవరోజు ఊరేగింపుగా ఊరంతా తిరుగుతారు. ఈ ఊరేగింపునే ఆ గ్రామస్తులు ఉత్సవం అని పిలుస్తారు.

## పదవరోజు :

పదవరోజు గ్రామస్తులు అందరు ఎవరి శక్తికి తగినట్లుగా వారు మేకపోతులను, కోళ్ళను బలి ఇచ్చి వాటిని ఇంటికి తీసుకొని వెళ్ళి పొంగలివండి సాయంత్రం 5 గం॥లకు అమ్మవారికి నైవేద్యం పెడతారు. అంకమ్మతల్లి కొలుపులు నిర్వహించినవారు. రాత్రి భార్యా, భర్త ఇరువురు కొంగుముడితో వచ్చి అమ్మవారి సన్నిధిలో తలంబ్రాలు పోసుకుంటారు. ఈ తంతు పదవరోజు సాయంత్రం

ఎనిమిది నుండి పది గంటల వరకు జరుగుతుంది. ఈ విధంగా కారుమంచి గ్రామంలోని అంకమ్మ తల్లి కొలుపులు జరుగుతాయి.

**ఆచార సంప్రదాయాలు :**

ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం, కారుమంచి గ్రామంలో జరిగే అంకమ్మ తల్లి కొలుపులలో ఆ గ్రామస్థుల ఆచార సంప్రదాయాలు మనకు తెలుస్తున్నాయి.

మంచిరోజు చూసుకొని షెడ్యూల్డ్ కులంలోని కులపెద్దలు పదిమంది అమ్మవారి గుడివద్ద సమావేశమై అమ్మవారి కొలుపులు ఎప్పుడు జరపాలో నిర్ణయించుకుంటారు. అమ్మవారి చరిత్ర తెలిసిన బైనీడివారిని అక్కడకు పిలిపిస్తారు. వీరు అమ్మగుడి ముందు అమ్మవారి ముగ్గు వేస్తారు. మన్నంవారు అమ్మవారి కొలుపులు నిర్వహిస్తారు. వీటన్నింటిని పరిశీలించినట్లైతే ఆ గ్రామంలోని ప్రజల సమష్టి జీవన విధానం మనకు తెలుస్తుంది.

**జోగి ఎత్తడం :**

ఆ జోగి ఎత్తడమనే దానిని ఆధునిక సమాజంలో కూడా కొంతమంది ఆచరిస్తూ ఉంటారు. సంతానం లేని వారు వారికి సంతానం కలిగితే జోగి ఎత్తి తిరుపతికి గాని, షిరిడీకి గాని వస్తామని మొక్కుకుంటారు. కొంతమంది జోగిఎత్తిన ధనంతో పుట్టిన బిడ్డకు చెవిపోగులు చేయిస్తామని, మరికొంతమంది కొన్ని గ్రామాలలో జోగి ఎత్తుతామని మొక్కు కుంటారు.

వారి కోరిక తీరిన తరువాత మేళతాళాలతో వారు మొక్కుకున్న గ్రామాలలో తిరుగుతూ జోగి ఎత్తి మొక్కులు తీర్చుకుంటారు. కొంతమంది గ్రామాలలో జోగి ఎత్తేటప్పుడు కుల వివక్షను చూపిస్తారు. వారు గ్రామంలో తిరుగు తున్నపుడు షెడ్యూల్డు కులాల వారి ఇళ్ళు ఉండే ప్రాంతానికి వచ్చినప్పుడు మేళతాళాలను వాయించడం ఆపివేసి జోగి ఎత్తడం కూడ మానేసి వెళ్ళిపోతుంటారు. సమాజంలో ఎంత ధనవంతులయినప్పటికి వారు మొక్కుకున్న విధంగానే జోగి ఎత్తి, ఆ ధనంతోనే తమ మొక్కులు తీర్చుకుంటారు.

ఈ అంకమ్మ తల్లి కొలుపులు చేయడానికి మొదటి ఐదు రోజులు జోగి ఎత్తుతారు. ఆ గ్రామంలోని ప్రజలందరు సామూహికంగా కొలుపులు జరపడానికి సహాయం చేస్తారు. ప్రజలందరు ఎవరికి తోచినంత వారు సహాయం చేయడమనేది చెప్పుకోదగిన అంశం.

**అమ్మవారి ముగ్గు వేయడం :**

బైనీడివారు అమ్మవారి ఉత్సవమూర్తుల ముందు అమ్మవారి గుడి ముందు అమ్మవారి రూపాన్ని ముగ్గుగా వేస్తారు. అమ్మవారి ముగ్గువేసిన ప్రతిసారి మేకపోతుని బలి ఇచ్చే ఆచారం మనకు కనబడుతుంది.

**మాతతడుపు :**

ఏడవ రోజు అమ్మవారి కొలుపులు జరిపించే మన్నం వారు వచ్చి అమ్మవారి గుడిముందు కూర్చుంటారు. అపుడు ఒక మాతంగి వచ్చి కొంతసేపు అమ్మవారిలాగ నృత్యం చేసి ఆ తరువాత వేపాకులు నోట్లో ఉంచుకొని తాటికల్లు నోట్లో పోసుకొని అమ్మవారి కొలుపులు జరిపించే మన్నంవారిపై ఆ కల్లుని ఊదుతుంది. ఆ విధంగా చేయడమనేది కొలుపులు జరిగేటప్పుడు ఆ గ్రామస్థులు ఆచరించే ప్రత్యేకమైన ఆచారం. ఈ ఆచారాన్ని వారు మాతతడుపు అని పిలుస్తున్నారు.

**సుడికప్పెర :**

ఎనిమిదవరోజు చేసే సుడికప్పెర అనేది కూడా ఒక ప్రత్యేక ఆచారంగా మనకు కనబడుతుంది. ఎనిమిదవ రోజు ఒక మేకపోతు ప్రాణముండగానే దాని పొట్టలో పేగులు ఊపిరితిత్తులు బయటకి తీసి ఒక బైనీడి వ్యక్తికి అలంకరించడం, కొన్ని పేగులను పగలగొట్టిన కుండలో పుల్లలు పెట్టి ఆ పుల్లలకు పేగులు చుట్టి ఆ కుండను బలి అంకయ్య తలపై పెడతారు. అతడు ఒకగంటసేపు వికృతంగా నృత్యం చేస్తాడు. ఆ విధంగా చేస్తూ దారి వెంట పరిగెడుతూ ఆ ఊరు పొలిమేరకు చేరుకుని ఆకుండను ఆ ఊరి పొలిమేరలో పడేస్తాడు. అదే సమయంలో ఒక మేకపోతు తల నరికి ఒక గంపలో పెట్టి, ఆ గంపను అతని తలపై పెట్టి, కొంతమంది యువ

కులు కర్రలతో ఆ గంపపై కొట్టుకుంటూ అతణ్ణి ఊరి పొలిమేర వరకు తీసుకొని వెళతారు. అపుడు అతడు ఆ గంపను ఊరి పొలిమేరలో పడేస్తాడు. ఇక్కడ జానపదుల నమ్మకం కూడా మనకు తెలుస్తుంది.

గంపను ఎత్తుకున్న వ్యక్తిని అమ్మవారు ఆవహించి అతనికి ఏవిధమైన హాని జరుగకూడదనే సదుద్దేశంతో యువకులు గంపపై కర్రలతో కొడతారు. వారు ఆవిధంగా కర్రలతో కొట్టడం వల్ల అమ్మవారు పైకి లేవకుండ ఉం టుందని బలి అంకయ్య క్షేమంగా ఉంటాడని ఆ గ్రామస్థుల నమ్మకం.

**పూలకప్పెర :**

తొమ్మిదవ రోజు పూలకప్పెర జరపడం అనేది ఈ గ్రామస్థులు ఆచరించే ఆచారం. దూదితో పూల వృక్షం తయారుచేసి ఒక వ్యక్తి దాన్ని పట్టుకుంటాడు. ఒక వ్యక్తి పాపవేషం వేసుకుంటాడు. మరొక వ్యక్తి అమ్మవారి వేషధారణ చేస్తాడు. ఇంకొక వ్యక్తి వేపమండలు ధరించి నృత్యం చేస్తాడు. ఆ విధంగా తొమ్మిదవ రోజు ఆ గ్రామంలో ఉత్సవం జరుగుతుంది. ఇది వారి సంస్కృతిలో ఒక భాగమని వ్యక్తమవుతుంది. చివరగా పదవరోజు ఈ కొలుపులు నిర్వహించిన వారు రాత్రి 8 నుండి 10 గం॥ల వరకు భార్యాభర్తలు కొంగుముడితో వచ్చి అమ్మవారి సన్నిధిలో తలంబ్రాలు పోసుకుంటారు. ఈవిధంగా చేయడం వల్ల వారి సంసారం ఎటువంటి అరమరికలు లేకుండ నడుస్తుందనే నమ్మకం.

ఈవిధంగా కారుమంచి గ్రామంలో నిర్వహించే అంకమ్మ తల్లి కొలుపుల వల్ల, ఆ గ్రామంలోని కుటుం బాలలో ఉండే సమిష్టి జీవన విధానం వ్యక్తమవుతుంది. ఆ గ్రామస్థుల ఆచార సంప్రదాయాలు, నమ్మకాలు మనకు తెలుస్తున్నాయి. ఈ కొలుపులు నిర్వహించడంలో బైనీడీ వారికి ఉన్న ప్రాధాన్యత వెల్లడి అవుతుంది.

ఈ విధంగా మరి కొంత పరిశోధన చేయవలసిన ఆవశ్యకత కనిపిస్తుంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కృష్ణకుమారి, నాయిని. 1990. తెలుగు జానపద గేయగాథలు. తెలుగు అకాడమి, హైద్రాబాద్.
2. మోహన్, జి.యస్. 2010. జానపద విజ్ఞానాధ్యయనం. ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం
3. క్షేత్రపర్యటన
4. సుబ్బారావు, టి.వి.1983. శ్రీపతి ఆర్ట్స్ ప్రింటర్స్, గుంటూరు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# గిరిజనుల భిన్నాభక్తి దృక్పథాలు

- డా॥ హెచ్. కిషన్, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, బి.జె.ఆర్.జి.డి.సి. నారాయణగూడ, హైదరాబాద్.

భక్తికి కావలసింది ప్రేమానురాగాలు, ఆప్యాయత మాత్రమే ఉండాలి. భక్తికి విద్యార్హతలు, బుద్ధి, గుణం, కులం, గోత్రం, ఆస్థి, అంతస్తులు అవసరం లేదు. నిర్మల మైన భక్తుడికి మనసా వాచా, కర్మణా శరణాగతుడై భగ వంతుని ప్రార్థించాలి. సేవించడమే నిజమైన భక్తిగా భావించవచ్చు. ఎప్పుడైతే మనిషి అపారమైన భక్తితో తన ఇష్టమైన దేవతను మనసు పూర్తిగా దర్శించి పూజిస్తారో అప్పుడు అతని హృదయం, మనస్సు ఆనందంతో నిండిపోతుంది. అదో ముక్తిని ప్రసాదిస్తుంది.

## గిరిజనుల భక్తి :

గిరిజనులకు భక్తి అధికం. భక్తిని ప్రదర్శించడంలో వారిదే పై చేయి అని చెప్పాలి. మూర్ఖత్వం అని లోకం అవహేళన ఒక్కోసారి చేస్తున్నా వారిది అమాయకమైన మూఢభక్తి, ముగ్ధభక్తి అనాలి. భక్తకన్నప్ప నండి ఏకలవ్యుని వరకు ఒక్కొక్కరిది ఒక్కో భక్తిమార్గం. ఆ భక్తి మార్గానే తమదిగా ఎంచుకొన్న గిరిజనులు మారుమూల ప్రాంతంలో, అడవికి సమీపంలో ఉంటూ ప్రకృతినే దైవంగా స్వీకరించారు. తమదైన భక్తిమార్గంలో ఆరాధిం చారు, ఆరాధిస్తున్నారు.

## భక్త కన్నప్ప :

శ్రీకాళహస్తీశ్వర మహత్యంలో భక్త కన్నప్ప ఒక చెంచు జాతివాడు. శివునికి పరమ భక్తి కలవాడు. ఒకరోజు అడవిలోని చెట్ల మధ్యలో సూర్యుని వెలుగులా మెరుస్తూ ఉన్న ఓ శివలింగాన్ని చూశాడు. తాను అదేరోజు వేటాడిన జంతువుల మాంసాన్ని భక్తితో నైవేద్యంగా సమర్పించాడు. ఆనాటి నుండి ప్రతిరోజు మాంసాన్ని నైవేద్యంగా పెట్టే వాడు. ఓ పూజారి ఆ చోటికి వచ్చాడు. శివలింగాన్ని సమర్పించిన మాంసాన్ని చూసి అసహ్యంచుకొన్నాడు. తను బాధతో శివుడిని ప్రార్థించాడు. అతని నిజమైన భక్తి గురించి తెలుసుకోవాలంటే కనబడకుండా రహస్యంగా ఉండి అతని భక్తిని గమనించమని ఆకాశవాణి తెలిపింది.

తిన్నడు కాల్చిన మాంసంతో వచ్చాడు. అక్కడున్న లింగం కంటి నుండి నీరు కారడం గమనించాడు. బాధ పడి కన్నీటిని తుడిచాడు. అంతదాక నీరు కారుతున్న కంటి నుండి రక్తం కారుతుంది. వెంటనే ఆలస్యం చేయ కుండా తన కన్ను ఒకదానిని తీసి దాని స్థానంలో పెట్టాడు. ఆ వెంటనే రెండవ కంటి నుండి కూడా రక్తం కారు చుండెను. తన కాలి బొటనవేలి రెండవ కంటిపై ఉంచి తన రెండవ కన్నును తీసి అమర్చడానికి సిద్ధపడ్డ గొప్ప భక్తుడు భక్త కన్నప్ప.

తన భక్తిని గ్రహించి శివుడు ప్రత్యక్షమై మోక్షాన్ని అనుగ్రహించాడు. శివుడికి అత్యంత ప్రీతిపాత్రుడైనాడు. శరీరంను లెక్కచేయకుండా కన్నును తీసి శివుడికి సమర్పించి, తన భక్తిని చాటిచెప్పాడు. ఇతడు గిరిజనుడు కావడం గ్రామ విశేషంగా భావించవచ్చు.

## ఏకలవ్యుడు :

మహాభారతంలో ద్రోణాచార్యుడి వల్ల సకల శాస్త్ర విద్యలు నేర్చుకుంటూ ఉన్నారని విని ఎరుకల రాజు కుమారుడు ఏకలవ్యుడు ద్రోణాచార్యుడి వద్దకు వచాచడు. ఇతను నిషాదపుత్రుడని తెలిసి శిష్యుడిగా స్వీకరించడానికి ఒప్పుకోలేదు. అప్పుడు ఏకలవ్యుడు వినయంతో ఆచార్యుల వారి పాదాలకు మొక్కి అడవికి వెళ్ళాడు. వారి ప్రతిమను మట్టితో తయారు చేశాడు. దానియందే గురుభక్తి ఉంచాడు. దీక్షతోను, పట్టుదల తోను అనేక విద్యలు అభ్యసించాడు. ద్రోణాచార్యుల శిష్యులందరికంటే అధికుడైనాడు.

తదు పిమ్మట ఆచార్యుల దగ్గరికి అర్జునుడు వెళ్లాడు. ఏకలవ్యుడికి నాకంటే ఎక్కువగా విద్య బోధించి అధి కుడిగా చేశారేమిటి అని ప్రశ్నించాడు. అప్పుడు అతణ్ణి

వెంటబెట్టుకొని అడవికి ఎదురుగా వెళ్ళి తీసుకొచ్చి కూర్చుండబెట్టాడు. వెంటనే ఆచార్య నేను మీ శిష్యుడను నా వల్ల మీకు ఏమి కావాలని ఇంతదూరం వచ్చారు ఆజ్ఞాపించండి. అని రెండు చేతులు జోడించి తన ఎదురుగా నిలబడ్డాడు. ఇలా నిల్చోని ఉన్న ఏకలవ్యుని చూసి, నీవు నా శిష్యుడవైతే నాకు గురుదక్షిణ సమర్పించమన్నాడు ద్రోణుడు. వెంటనే చెప్పిన మాటను విని గురుదేవా! ఇది నా శరీరం, ఇది నా ధనం, వీరంత నా పరిజనులు మీకు ఏది కావాలో ఇష్టంగా అడగండి, ఆనందంతో సమర్పిస్తాను అని చెప్పాడు. అప్పుడు ద్రోణుడు నీ దక్షిణాంగుష్టం తెగనరికి ఇమ్ము అని పలికాడు. వెంటనే ఏకలవ్యుడు గురువుగారి ఆజ్ఞ ప్రకారం వెనుక ముందు ఆలోచించకుండా ఎలాంటి ఆలస్యం చేయకుండా, తడబడకుండా గురుభక్తితో తన కుడిచేతి బొటన వేలు కోసి గురువుకు దక్షిణగా సమర్పించాడు. తన గురుభక్తిని వినయ విధేయతను చాటి చెప్పుకున్న ఏకలవ్యుడు గిరిజనుడు కావడం అదృష్టంగా భావించవచ్చు.

**శబరి :**

వనాలలో నివసిస్తూ ఉగ్రమైనా తపస్సు చేస్తుంది. ఈమె శ్రీరాముడి భక్తురాలు. రాముడి రాకకోసం అనేక తపస్సులు చేసింది. ఆమె చేసిన తపస్సుకు ప్రతిఫలంగా శ్రీరాముడు వచ్చాడు. శబరి దగ్గరికి వెళ్ళి నీ తపస్సు వృద్ధిలో ఉందా! కోపం నిగ్రహించుకున్నావా, నీ వ్రతాలన్నీ ఫలించాయా భక్తితో చేసినా తపస్సు సుఖంగా ఉందా! నీ గురుపూజ సఫలమైందా! ముసలిపండు శబరి, సిద్ధులు గౌరవించే తపస్వీని తపస్సిద్ధి పొందినా ధన్యురాలు అని అన్నాడు.

అప్పుడు శబరి రాముని దగ్గర కూర్చొని ఈ విధంగా అన్నది. రామా! నీ దర్శనమైంది, నేను భక్తితో చేసినా తపస్సు సిద్ధించింది. గురుపూజ సఫలమైంది పురుషోత్తమా! నువ్వు దేవదేవుడివి, నిన్ను పూజించాను, ఇవాళ నా జన్మ ధన్యమైంది. శత్రువులను నాశనం చేసే వాడివి నువ్వు, నీ దయా దృష్టితో నా పాపాలన్నీ పటాపంచలై పోయాయి. పవిత్రురాలనయ్యాను. నీ పాద స్పర్శతో అక్షయమైనా పుణ్యలోకాలు పొందుతాను అని అంటూ పురుషోత్తమా! రామా! పంపానది ఒడ్డు అడవిలో రకరకాల పళ్ళను నీకోసం ఏరి తెచ్చి దాచిపెట్టాను అని శబరి భక్తితో రాముడికి ఎంగిలి పళ్ళను తినిపించింది. అప్పుడు శబరితో రాముడు అంటాడు నీవు నాకోసం తపస్సు చేశావు, నన్ను భక్తితో పూజించావు అందుకు నువ్వు కోరినా లోకానికి సుఖంగా వెళ్ళిపోమని అన్నాడు. వెంటనే శ్రీరాముడి అనుజ్ఞ పొందినా శబరి (భక్త శబరి) కూడా గిరిజన తెగకు చెందినది కావడం పెద్ద గొప్ప విశేషం.

**గుహుడు :**

గుహుడు నిషాదరాజు, శృంగిబేరపురం ఇతని నగరం. ఇతడు శ్రీరాముడి భక్తుడు. సీతారామలక్ష్మణుల్ని వనవాసం వెళ్ళేటప్పుడు నదిని దాటిస్తాడు. భరతుడు రాముని చూడడానికి రాబోగా యుద్ధోన్ముఖుడై వస్తున్నాడని అడ్డగిస్తాడు. భరతుడు వివరం చెప్పగా దారి ఇచ్చి వెళ్ళడానికి అంగీకరించినా గుహుడు గిరిజనుడు కావడం గర్వించదగ్గ విషయం.

శ్రీరాముడు అడవులకు వెళ్లిన సమయంలో ఆయనకు వెన్నెంటి ఉన్న వారంతా అడవుల్లో నివసించే గిరిజనులే కావడం గమనార్హం.

**సంత్‌సేవాలాల్ :**

సేవాలాల్ మేరమా భవానికి ప్రియభక్తుడు. ఇతను అనేక విధములుగా సహాయం పడుతూ ఉంటాడు. బంజారా తెగవారు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. అప్పుడు ఆ పరిస్థితుల నుండి కాపాడటానికి, ఆదిశక్తిగా భావించే మేరమా భవానీ అనుగ్రహంతో ఒక నిరుపేద దంపతులకు కల్గిన సంతానమే సేవాలాల్. ఇతణ్ణి బంజారా జాతివారు తమ కుల గురువుగా భావిస్తారు. అందర్ని ప్రేమగా ఆదరించేవాడు. ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా ఆ కష్టాలను తొలించేవాడు. అందుకే అందరికి ఆరాధ్యుడయ్యాడు. ఈ నేపథ్యంలో ఓ బలమైన కథ ప్రచారంలో ఉంది.

ఓ సమయంలో బంజారాలు పశువులను తోలుకుంటూ ఒక ప్రదేశంలోనున్న స్థలానికి వెళుతుంటే, మార్గ

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

మధ్యలో దారికి అడ్డంగా ముస్లింలు మా వరి చేను నుండి మీరు వెళ్ళడానికి వీలు లేదని, మీ పశువులను వెనుకకు తీసుకెళ్ళండి అని ఇబ్బంది పెట్టారు. బంజారాలకు ఏమి చేయాలో తోచడం లేదు. బాగా ఆలోచనలో పడ్డారు. వెంటనే సేవాలాల్‌ను ప్రార్థించారు. అంతలోనే అతడు ఒక సన్నని చెక్క పెట్టెను చేయించి, దాని మీద నుండి ఆవతల ప్రక్కకు ఒకదాని వెనుక ఒకటి వరుసగా చేను బయటికి దాటి వచ్చాయి. ఈ వింతను కళ్ళారా చూసి, నవాబుకు తెలియపర్చారు. నవాబు సేవాలాల్‌ను పిలి పించి నీకు ఏమైనా మంత్రాలుగాని, తంత్రాలుగాని వచ్చా అని ప్రశ్నించాడు. వెంటనే అంతా మేరమా భవానీ లీలలే అని జవాబు ఇచ్చాడు.

సేవాలాల్‌ను పూర్తిగా పరీక్షించడానికి ఇంకో పరీక్ష పెట్టాడు. అది ఏమిటంటే ఒకరోజు ఇతన్ని ఓ లోతైన బావిలో దింపాడు. నువ్వు నూలుపోగు ఆధారంగా పైకి రావాలని అంటాడు నవాబు, మేరమా భవానీని స్మరిస్తూ ఒడ్డుకు చేరుతాడు సేవాలాల్. ఈ వింత దృశ్యాన్ని చూసిన నవాబు సేవాలాల్‌ను ప్రశంసిస్తూ వీరి కొరకు ప్రత్యేకమైన దారి ఏర్పాటుకు ఆదేశంచాడు. ఈ బాటను నేటికి బంజారాలు డొంకలంటున్నారు.

బంజారాలు సేవాలాల్‌ను ప్రతి పూజా కార్యక్రమంలో భక్తితో ఆరాధిస్తుంటారు. ఇతడు శాఖాహారి అందువల్ల అపారమైన భక్తిశ్రద్ధలతో, నియమనిష్టతో పరిమాన్నం పాశం చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. ప్రతి తండా నాయ కుని ఇంటిముందు నాటి నుండి నేటి వరకు సేవాలాల్ భాయి పేరు మీద ఒక జెండా ఉంటుంది, మేరమా భవానీ పేరు మీద ఒక జెండా ఉంటుంది. ఇది ప్రక్క ప్రక్కనే రెపరెపలాడుతుంటాయి.

సేవాలాల్ బాలబ్రహ్మచారి. ఆది పరాశక్తి తన విశ్వ రూపంను చూపిస్తుంది. తన నోటి నుండి వచ్చే ప్రతి వాక్కు నిజమయ్యేలా వరాన్ని పొందాడు. తను పోగొట్టు కున్నవి అన్నిటిని పొందగలిగాడు. ఒక బియ్యం మెతుకుతో దాదాపు పదివేల మందికి భోజనం పెట్టగల దైవభక్తిని సమరూర్చుకోగలిగారు సేవాలాల్. ఇతడు గిరిజనుడు కావడం బంజారాలు చేసుకున్న పూర్వజన్మ సుకృతం.

## బంజారా వంశీయుల భక్తి :

రాథోడ్ వంశము వారు (భూక్యా) దేవతా-ఖోక్‌రోచి అనగా (పార్వతి)దేవిని జిల్లెడు చెట్టు క్రింద భక్తిభావంతో పూజిస్తారు. చౌహాన్ వంశము వారు దేవతా - నాగరచి అనగా (లక్ష్మీ) దేవిని తులసి చెట్టు క్రింద అధికమైన భక్తి విశ్వాసాలతో ఘనంగా ఆరాధిస్తారు. పమార్ వంశము వారు దేవతా - ఆసావళి అనగా (ఛంకి) దేవిని ఆరిమాను (ఝుంజేర్) చెట్టు క్రింద అపారమైన భక్తితత్త్వాముతో పూజిస్తారు. జాదవ్ వంశము వారు (వడ్తియా) దేవతా - పానావళి అనగా (ఛండి) దేవిని చాలా భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు.

## శ్రీహాతీరాంబావాజీ :

వీరు తమ జీవితకాలంలో ఎన్నో అద్భుతాలను చూపించినారు. కొండకోనల్లో, అడవి సమీపంలో పట్టణా నికి దూరంగా చిన్న చిన్న గూడారాలు కట్టుకొని నివసిస్తూ జీవిస్తున్న బంజారాలను భక్తిమార్గంలో నడిపించానరు. కాబట్టి వివిధ సందర్భాలలో భక్తిశ్రద్ధలతో పూజింపబడు తున్నాడు. ఇతను గిరిజనుడు కావడం అదృష్టంగా భావించవచ్చు.

## సప్తశక్తి దేవతలు :

బంజారాల జీవనాధారం పశుసంపద వీరు పశు సంపద కొరకు పశువుల ఆరోగ్యం కొరకు, తండా సౌభాగ్యం కొరకు, తమకు మశూచి, కలరా వంటి వ్యాధులు సోకకుండ పశువులకు రోగాలు రాకుండా ఈ ఏడుగురు శక్తిదేవతలు కాపాడుతారు. ఈ ఏడుగురు శక్తి దేవతలకు అద్భుతమైన దివ్యశక్తి ఉంటుంది. బంజారాలను అన్ని విధాలుగా రక్షణగా ఉంటాయి. వారు తొళ్ళాభవాని, మత్రాల్‌భవాని, హింగళా భవాని, ద్వాళాంగర్ భవాని, కంకాళి భవాని, దండి (మేరమా) భవాని, సీత్లా భవానీలు, వీరు ఏడుగురు శక్తిదేవతలను అక్కాచెల్లెళ్లుగా పేర్కొంటారు.

భక్తిని ప్రదర్శించడంలో గిరిజనులు దైవానికి దగ్గరగా, అడవుల్లో కొండ, కోనల్లో నివసిస్తూ ప్రకృతిని దైవంగా భావించి జీవిస్తారు. వీరు ఆచార వ్యవహారాలను, సంస్కృతి సంప్రదాయాలను అనుసరించి భక్తి భావంతో జీవిస్తారు. వివిధ పండుగల్లో ఏదో ఒక రూపంలో భక్తితో దేవతలను ఆరాధిస్తుంటారు. జీంతువులను బలి ఇవ్వడం లాంటివి చేస్తారు. వీరు ఎక్కువగా భక్తి భావంతోనే వీరి జీవితం కొనసాగుతుందని చెప్పడంలో సందేహం లేదు.

వీళ్ళకు భయం, భక్తి ఎక్కువ. ప్రతి దేవుణ్ణి నమ్ముతారు. వీరు జీవితాంతం నమ్మకంతో జీవిస్తారు. భక్తితో చనిపోతారు. ఇందులో ఎలాంటి సందేహం లేదని చెప్పవచ్చు.

ఇలా చెప్పుకుంటూ వెళితే భగవంతుడికి అత్యంత సన్నిహిత అపార భక్తులుగా పేరు ప్రతిష్టలు తెచ్చుకొని, చరిత్రలో నిలచిపోయిన గిరిజనులు కోకొల్లలుగా ఉన్నారని చెప్పవచ్చు.

సమాజంలో అందరిలాగే అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు కూడా తమ ఇష్టదైవాన్ని వివిధ రూపాల్లో ఆరాధిస్తున్నారు.

**ఆధార గ్రంథాలు :**

1. శ్రీకాళహస్తీశ్వర మహత్యం
2. మహాభారతం
3. రామాయణం
4. బంజారా చరిత్ర సంస్కృతి - ప్రగతి
5. బంజారా (లంబాడి) వంశావళి
6. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం - జీవన చిత్రణ
7. సుగాలి సంస్కృతి - భాషా సాహిత్యం

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# బల్లి పురుషోత్తమ కవి "ఎస్తేరు" పాత్ర చిత్రణ

**- డా॥. ఎస్. యజ్ఞశేఖర్**, శాఖాధిపతి, తెలుగు విభాగం, మద్రాసు క్రిష్టియన్ కళాశాల, చెన్నై, తమిళనాడు.

బల్లి పురుషోత్తమ కవి రచించిన ఎస్తేరు నాటకంలో కథానాయిక ఎస్తేరు. ఇది ఏడంకాలు ఇరవై ఏడు రంగాల నాటకం. ఇతివృత్తం బైబిల్ గ్రంథం పాత నిబంధనలోని 10 అధ్యాయాలు. ఇది చారిత్రక కథా వస్తువు. ఈమె యూదు జాతి స్త్రీ. ఈమె బానిసగా పారశీక దేశానికి తీసుకుపోబడింది. అక్కడ మహారాణి అయిన తర్వాత తన జాతి యూదు ప్రజల్ని ఎలా రక్షించుకొన్నది అనేది ఇతివృత్తం.

ఎస్తేరు నాటకంలో ప్రధాన పాత్రలు నాలుగే కని పిస్తాయి. నెబుకెద్నెజర్ కాలంలో బాబిలోనుకు బానిసగా పట్టుకుపోబడిన అగ్రశ్రేణి యూదుల కూతురు ఎస్తేరు. ఈమె చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణిస్తారు. మొర్దెకై అనునతడు ఈమె పెంపుడు తండ్రి. తెలుగులో వచ్చిన క్రైస్తవ నాటకాల్లో స్త్రీ పాత్ర ప్రాధాన్యంతో వెలువడ్డ నాటకం మహత్తరంగా ఆధ్యాత్మిక ఔన్నత్యంతో రూపొం దించబడింది.

పురుషోత్తమ కవి ఎస్తేరును గొప్ప అందగత్తెగా, దైవభక్తుపరురాలిగ తన జాతి వారిని రక్షించుకునే చారిత్రక స్త్రీగా వర్ణిస్తాడు. భారతీయ పురాణల్లో కన్పించే కొన్ని స్త్రీ పాత్రల్లాగా ఎస్తేరును కవి సృజించాడనడంలో సందేహం లేదు.

## ఎస్తేరు దైవభక్తి :

నిజానికి మూలంలో ఎక్కడా దైవస్తుతి చేయడు. కవి యిక్కడ భారతీయ భక్తితత్వాన్ని చొప్పించి ఆమె పాత్రకు గౌరవాన్ని తెచ్చారు. ప్రథమాంకంలో యూదులు దైవజన యెహోవాను ఎస్తేరు ఇలా ప్రార్థిస్తుంది.

"వసుధపైనున్నట్టి । యిసుక రేణువులు
వశమౌనె లెక్కకె । వ్యారికేనిచెపుమ
కావింతునట్టినీ । కన్నసంతతిని
పోవయ్యనీవునే౸ । బొమ్మన్న కథకు
నీవుమెట్టినదంత । నీదుకాణాచి

అని భక్తి రసంలోనే ఎస్తేరు పాత్రను కవి పరిచయం చేస్తాడు.

పారశీక రాజు అహష్వేరోషు సముఖానికి చాలామంది అందగత్తెలు రాణిగా ఎన్నికవడానికి వెళ్తుంటారు. ఆ సందర్భంలో ఎస్తేరు చేసే యెహోవా నా ప్రార్థనతో కవి భారతీయత చొప్పించాడు. మూలంలో ఇది లేదు. కవి ఒక సీస పద్యంలో ఎస్తేరు ప్రార్థనను యిలా రాస్తాడు.

సీ॥. పరికింప ముంగొగు । బంగారు నీచాప
యనువాణి సత్సదా । క్యముగ వెలి౸గి
అబ్రహామాది మా । యనుగుదండ్రులతోడి
నీ ప్రయాణము మాయ । నిదిగ నమ్మి
మిడినాగు హామాను । మిడిమేల పుంబన్నా
గడ నీటి బుడగగా । నెడద౸దోచి
నా విన్నపమువీటి । వీవంచు నాయంత
రాత్మకుందట్టిముం । దడుగువేసి

గీ॥. అరుగు చుంటిని పారశీ । కాగ్రణ సము
ఖమున కాతని భీకరాం । క్ష౸దలమీ
తాల్తు శిరమున నీదయా । దానమనుచు
మరణమైనను బ్రతుకైన । మా యెహోవ

అను గీతపద్యంతో ముగుస్తుంది. నాటక ఆద్యంతం కవి ఎస్తేరు పాత్ర ద్వారా భక్తిరసాన్ని చొప్పించారు. ఈ కథాంశం చారిత్రాత్మకం, విదేశీయం. అయినా మూలంలో భక్తిని గూర్చిన విశేషాలు లేకపోయినా భారత దేశపు నాటక లక్షణాల్ని కవి పాటించారు. మన నాటక లక్షణాలైన నాందివలె ఎస్తేరు నాటకనాంది పద్యం యిలా ఉంది. నాటకం ఎటువంటి ఆటంకం లేకుండా జరుగు టకు చేసే దైవస్తుతిలో...

శ్రీరమ్యంబగు సృష్టినే పితపాన । ర్చెన్ నేత్ర
కారుణ్యంబుననే సుతుండు సకలా । ఘంబుల్ విమోచించెసం
స్కారంచే ప్రయతాత్మ, స్వాంతనమునన్ । సాగించునాత్రైకుడే
ఆరూధంబుగ మీకొసంగుత సమస్తైశ్వర్యముల్ నిచ్చలున్

అని తండ్రి కుమార పరిశుద్ధాత్మలు (త్రి + ఏక - త్రైక) దేవుని నాందెలో ప్రార్థించినట్లు ఉంది.

## అందగత్తెగా ఎస్తేరు :

ఎస్తేరు నాటకంలో అంగిరసం భక్తి. అంగరసం శృంగారం. పారశీక రాజు అది వరకు తన రాణి గొప్ప అందగత్తే అయినా ఒకానొక సందర్భంలో ఆమె అందం పదిమందికీ తెలుపాలనే సందర్భంలో ఆమె నిరాకరించడంతో ఆమెని పరిత్యజించి మరో రాణిని ఎన్నుకోవాలనుకుంటాడు. అప్పుడు కవి ఎస్తేరు అందాన్ని యిలా వర్ణిస్తాడు.

ఆ.వె.॥ చివురునలరుగొమ్మ కవును భూషణములు
భూషణమునకెద్ది । భూషణంబు
చివురునలరుమరుని । చిలుకు ఎస్తేరమ
కొమ్మగాని కొమ్మ । కొమరుబొమ్మ

మన్మదబాణం లాంటి అందమైన బొమ్మగా కవి ఎస్తేరును పోలుస్తాడు.

మరో సందర్భంలో పారశీక రాజు అహష్వేరోషు ఎస్తేరు అందాన్ని పొగడే సందర్భంలో...

''అపరంజి బంఒగారు । నపహసింపఁగల
అపురూపమగు దీని । యభిదానమేమొ
ఏవక్రమును లేక । యింపెసలాడు
ఈ విగ్రహముసేత । యే శిల్పిదగును

ఏ శిల్పి ఈ బొమ్మను యింత అందంగా చెక్కాడో అని ఎస్తేరు అందాన్ని కవి, రాజు చేత చెప్పిస్తాడు.

## ఉదాత్త భారతీయ స్త్రీగా ఎస్తేరు :

మూలంలోని బైబిల్‌లోని చారిత్రక కథనాన్ని బట్టిచూస్తే ఎస్తేరు పాత్ర కొంత వరకు ఉదాత్తత లేని పాత్ర. హామాను అనే మంత్రి మహారాజును చంపాలని కుట్రపన్నుతాడు. ఈ సందర్భంలో ఎస్తేరు దాదాపు 500 మందిని చంపిస్తుంది. రాజును ప్రేరేపించి హామాను మంత్రి 10 మంది కుమారుల్ని ఉరి తీయిస్తుంది. వివిధ సంస్థానాల్లోని యూదు వ్యతిరేకులైన దాదాపు 75 వేల మందిని చంపించడం ఎస్తేరు పాత్ర ఉంది.

పురుషోత్తమ కవి నాటకంలో ఎస్తేరును చక్కగా తీర్చి దిద్దాడు. ఎస్తేరును భారతీయ నాయికల్లోని ప్రత్యేకతలతో కొత్త ఎస్తేరును సృష్టించాడు. అందుకే పై విషయాన్ని నాటకం చూపించలేదు. భారతీయ నాయికల్లోని ఉదాత్త గుణం ఎస్తేరులో పాత్రకు ఆపాదించాడు.

## ఎస్తేరు నాటకంలోని ధ్వని :

భారతీయ నాటకాల్లో కనిపించే మరో ప్రత్యేకత ధ్వని. పురుషోత్తమ కవి ఎస్తేరు పాత్ర ద్వారా తెలుగు నాటక శైలిలో ధ్వనిని ఎస్తేరు నాటకంలో చొప్పించాడు.

''వ్యంగ్యార్థ ప్రధానమైంది ధ్వని'' అని రామరాజ భూషణుడు అంటాడు. దీనిని కవి తన నాటకంలో ఆపాదించాడు. ఈ క్రింది చంపకమాల పద్యంలో...

చం.॥ పులియను సింహమున్ మరియు । బొచ్చు మెకంబును గాదురాజనన్
జళుకదియేలనమ్మనినుఁ । జంపడులే నఖ దంష్ట్రికాహతిన్
మళయజమంటి నట్టి మడ । మల్ గమనించు రసజ్ఞుఁజాతసిం
గలియుఁగనెన్నడున్ బెదరుఁ గానకు సౌఖ్య పదంబదేయగున్

రాజంటే క్రూరజంతువుకాదు అటువంటి కోరలతో నిన్ను చంపడానికి. అతడు కూడా మానవుడే నీవు అతనితో కలసి సుఖాలనుభవించవచ్చు అని రాజు ఎస్తేరుల సంగమ విషయం ప్రేక్షకులకు ధ్వనించేటట్లు చేశారు కవి.

ఎస్తేరు యూదా జాతి స్త్రీ అయినా ఆమెను వివాహ మాడిన చక్రవర్తి అహష్వేరోషు హిందూ దేశం నుండి

ఇతియోఫియా దేశం వరకు 127 సంస్థానాల్ని ఏలాడన్నది చరిత్ర. కవి మొట్టమొదట ఎన్నుకున్న కథాశం బైబిల్లోనిదైనా తెలుగు నాటక మర్యాదల్ని ఈ నాటకానికి భారతీయత్వం ఆపాదించారు. తెలుగు క్రైస్తవ సాహత్యంలో ఎన్నో నాటకాలు వచ్చాయి. తెలుగులోని సాధారణ నాటకాలతో పోలిస్తే కొందరు పాశ్చాత్య నాటక పద్ధతుల్ని ఎన్నుకున్నారు. సంప్రదాయ నాటక మర్యాదల్ని అనుసరించి, సంస్కృతరూపక మర్యాదల్ని పూర్తిగా పాటించి చేసిన రచన ఎస్తేరు నాటకం. ఈ నాటకంలో మొత్తం 57 వృత్తి పద్యాలు, 65 కందాలు 10 సీస పద్యాలు, 24 గీత, 14 ఆటవెలది పద్యాల్ని కవి ప్రయోగించాడు. సంస్కృతంలో లాగా విశేష వృత్తాలైన తరువోజ, మానిని, పంచచామర, మత్తకోకిల, స్రగ్విణి, ఉత్సాహం, తరలము, చంద్రకళ, మలయజం, అంబురుహం, మహాస్రగ్ధర మొదలైన పద్యాల్ని కవి ప్రయోగించాడు. తెలుగు పలుకు బదులు సామెతలు, పదబంధాలు ఎస్తేరు పాత్ర ద్వారా కవి చెప్పిస్తాడు.

ఎస్తేరు నాటక గొప్పదనాన్ని గుర్తించిన మైసూరు, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాలు 1976లో డిగ్రీ 3వ సంవత్సరం ఓరియంటల్ టైటిల్‌కు పాఠ్యాంశంగా నిర్ణయించారు.

ఈ నాటకంలో ఎస్తేరు నాయికగా, బానిసగా పట్టుకు పోబడిన ఒక యూదు జాతి స్త్రీగా అంటే సామాన్య స్త్రీ స్థాయి నుండి మహారాణి స్థాయికి ఎదిగిన స్త్రీగా కవి చిత్రించారు. ఈ పాత్రలో దినజాతి ప్రజల పట్ల ప్రేమ, మహారాజు మరియు తన భర్త అయిన అహష్వేరోషును కాపాడుకోవడంలో గల మాట చాతుర్యం తొంగి చూస్తుంది. తనను పెంచి పెద్ద చేసిన పెంపుడు తండ్రి మొర్దుకై అంటే అభిమానం రాజును చంపాలనుకున్న వారికి శిక్ష వేయించడం మొదలైన నాయకత్వపు లక్షణాలు ఎస్తేరు పాత్రను భారతీయ సాహిత్యంలోని స్త్రీ పాత్రల్లో ఒకటిగా నిలుపుతుంది. బల్లి పురుషోత్తమ కవి చిత్రించిన ఎస్తేరుకు మూలంలోని ఎస్తేరుకు స్వభావంలో ఎంతో తేడా కనిపిస్తుంది. ఎస్తేరు నాటకంలో శాంతి, సహనం, ప్రేమ మూర్తీభవించిన భారతీయ హైందవ స్త్రీ లక్షణాలు ఎస్తేరులో కనిపిస్తాయి.

అందుకే జి.ఎన్. రెడ్డి గారు ఎస్తేరు నాటకానికి పీఠిక రాస్తూ "ఎస్తేరు నాటకం అటు కవికే గాకుండా నాటక లోకానికి కూడా ఒక ఉన్నత స్థానం సంపాదించి పెట్టింది. ఎస్తేరు అనువాదం కాదు, అనుసరణము కాదు, ఒక స్వతంత్ర్యమైన రచన" అంటారు.

Bhavaveena
Vol. 16, Issue. (6(1), June - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ఆధునిక తెలుగు సాహిత్యం - తెలంగాణ మాండలికం

**డా.జి.శ్రీనివాసరావ్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ
**APJAK** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్ చెరువు, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

**1. ఉపోద్ఘాతం:-**

ఆధునిక తెలుగు సాహిత్యంలో తెలంగాణ మాండలికం అనేది కేవలం ప్రాంతీయ మాటతీరు కాదు; తెలంగాణ ప్రజల జీవితం, సంస్కృతి, పోరాటం, అస్తిత్వాన్ని వ్యక్తం చేసే శక్తివంతమైన సాహిత్య భాష. తెలుగు ప్రధాన మాండలికాల్లో తెలంగాణ ఒకటి. మాండలి కాలలో తెలంగాణ మాండలికకు ఒక ప్రత్యేకమైన స్థానంను సంతరించుకుంది.

**2.మాండలిక సాహిత్యానికి నాంది:-**

పాల్కురికి సోమనాథుడు తన రచనల్లో అప్పటి తెలంగాణ సామాజిక జీవితాన్ని, శూద్ర కులాల ఆచారాలను విశదంగా చిత్రించాడు; దీని వల్ల తెలంగాణ భాషా సంప్రదాయానికి ప్రాచీన పునాది కనిపిస్తుంది.

ఆధునిక కాలంలో కాళోజీ తెలంగాణ తెలుగును బహిరంగ వేదికల్లో స్థిరంగా ఉపయోగించడం ద్వారా దానికి సాహిత్య గౌరవం తీసుకొచ్చారు. అల్లం రాజయ్య వంటి విప్లవ రచయితల రచనల తర్వాత తెలంగాణ మాండలికానికి సాహిత్య గౌరవం మరింత బలపడింది.

3. తెలంగాణ మాండలికం స్వరూపం స్వభావం:-

తెలంగాణ మాండలికంలో ఉర్దూ ప్రభావం, జానపద పదజాలం, పల్లె నుడికారాలు, స్థానిక నానుడులు కనిపిస్తాయి. ఇది గ్రామీణ శ్రమజీవుల అనుభవాలు, వారి భావోద్వేగాలు, సామాజిక వాస్తవాలను సహజంగా పలికించగలదు.

**4.ఆధునిక సాహిత్యంలో తెలంగాణ మాండలిక స్థానం:-**

ప్రారంభ దశల్లో గ్రాంథిక లేదా ప్రమాణ భాషకే అధిక గౌరవం ఉండటంతో తెలంగాణ మాటను కొందరు తక్కువగా చూశారు. కానీ తెలంగాణ ఉద్యమాల ప్రభావంతో, ముఖ్యంగా 1969 తర్వాత, మాండలిక ప్రయోగం ప్రాంతీయ అస్తిత్వాన్ని ప్రకటించే సాహిత్య సాధనంగా బలపడింది.

తెలంగాణ మాట, ఉచ్చారణ, పదజాలం, సంభాషణ శైలిని సాహిత్యంలో నిలిపాయి.

వ్యవసాయం, బానిసత్వం, వెట్టిచాకిరీ, విమోచనోద్యమం, గ్రామీణ సమస్యలు వంటి అంశాలను సహజంగా చిత్రించాయి.

"మాండలికం కేవలం పల్లెటూరి మాట కాదు; అది ప్రజల జీవితాన్ని మాట్లాడించే భాష" అనే దృక్పథాన్ని ఈ రచనలు స్థిరపరిచాయి.కవిత్వం, కథ, నవల, నాటకం, పాటల్లో తెలంగాణ యాసను ఉపయోగించడం ద్వారా రచయితలు ప్రజల నిజమైన జీవనభాషను సాహిత్యంలోకి తీసుకొచ్చారు. తెలంగాణ సాహిత్యం భాషతో పాటు చరిత్ర, పండుగలు, జానపదం, సామాజిక అసమానతలు, దళిత--బహుజన--స్త్రీ అస్తిత్వాలను కూడా ముందుకు తెస్తుంది.

**5. ప్రధాన లక్షణాలు:-**

మాండలికం ఆయా ప్రాంత ప్రజల దైనందిన కార్యక్రమాల్లో భాగంగా, వారి నిత్య కృత్యాలు పని పాటలలో భాగంగా ఉచ్చరిస్తారు.

**5.1.సహజత్వం:-**

పాత్రలు మాట్లాడే భాషలోనే రచన సాగడం వల్ల జీవన వాస్తవికత పెరుగుతుంది.

5. 2. జానపద ప్రభావం: -

సామెతలు, పలుకుబడులు, పాటలు, స్థానిక పదాలు విస్తృతంగా ఉంటాయి.

### 5.3.ఉద్యమ చైతన్యం:-

నిజాం వ్యతిరేక పోరాటం, రైతు సమస్యలు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వంటి అంశాలకు స్వరం ఇస్తుంది.

### 5.4.అస్తిత్వ ప్రకటన:-

మా భాషకు కూడా గౌరవం ఉంది" అనే ప్రాంతీయ స్వాభిమానాన్ని నిర్మిస్తుంది.

### 5.5.సామాజిక విమర్శ:-

కులం, వర్గం, లింగ వివక్ష, భూస్వామ్య వ్యవస్థ వంటి సమస్యలను ప్రశ్నిస్తుంది.

## 6.ప్రముఖ తెలంగాణ రచయితలు - మాండలిక విశిష్టత:-

కాళోజీ నారాయణరావు ప్రజల భాషలో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని వ్యక్తం చేసిన ప్రముఖ కవి. దాశరథి వంటి అభ్యుదయ కవులు తెలంగాణ ప్రజల పోరాటాలు, బాధలను తమ రచనల్లో ప్రతిబింబించారు.

నందిని సిధారెడ్డి కవిత్వంలో తెలంగాణ భాష, యాస, గ్రామీణ సంస్కృతి, ప్రాంతీయ అస్తిత్వం ప్రత్యేకంగా కనిపిస్తాయి; ఆయన మాండలికాన్ని ఆధునిక వచన కవిత్వంలో గౌరవనీయమైన వ్యక్తీకరణగా నిలిపారు.

సామల సదాశివ -- తెలంగాణ మాండలికంలో ఆత్మకథ రాసిన ముఖ్య రచయిత; "యాది" ఆయన ప్రతినిధి రచన.

పైడిమర్రి రామకృష్ణ -- తెలంగాణ భాషలో బాలల కథలను రాసిన బాలసాహితీవేత్త.

తోకల కృష్ణమూర్తి యాదవ్ -- తెలంగాణ మాండలికంలో వచన కవిత్వానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కవి.

ఇ. చిదానందం --- తెలంగాణ మాండలికంలో కథలు, బాలల సాహిత్యం, కుల-వృత్తి పదకోశం రంగాల్లో కృషి చేశారు; నియతి, బడి పిలగాల్ల కతలు వంటి రచనలు చేశారు.

సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్ --- తెలంగాణ కథా సంకలనాలకు సంపాదకత్వం వహించి, ప్రాంతీయ కథా ప్రక్రియను వ్యవస్థీకరించారు.

లక్ష్మణరావు పటంగే --- తెలంగాణ వాడుక భాషా పదాలను నిఘంటు రూపంలో అందుబాటులోకి తెచ్చారు.

ముదిగంటి సుజాతారెడ్డి --- తెలంగాణ--తెలుగు సాహిత్య చరిత్ర (2015) ద్వారా తెలంగాణ సాహిత్య చరిత్రకు చట్రం అందించారు.

తాటికొండల నరసింహారావు --- తెలంగాణ నాటకరంగ చరిత్రపై ప్రత్యేక గ్రంథం రాశారు.

డా. వి. ఆర్. రాసాని -- మాండలిక కథలు, నవలల ద్వారా తెలంగాణ పలుకుబడిని సాహిత్యీకరించారు

"కోవిలోల్ కథ" --- చరకుపల్లి రఘోత్తమరావు; 1940లో తెలంగాణ మాండలికంలో రాసిన కథ.

"కొలిమంటుకుంది" --- అల్లం రాజయ్య; మాండలిక నవల.

"మా ఊరు మాట్లాడింది" --- సినారె; తెలంగాణ మాటను కేంద్రంగా పెట్టిన రచన.

"ఊరికి ఉప్పలం", "జిగిరి" --- పెద్దింటి అశోక్ కుమార్ రాసిన మాండలిక నవలలు.

యశోదారెడ్డి మాండలిక కథలు --- తెలంగాణ గ్రామీణ జీవితాన్ని, స్త్రీ అనుభవాలను ప్రతిబింబిస్తాయి.

## 7. ముగింపు:-

ఆధునిక తెలుగు సాహిత్యంలో తెలంగాణ మాండలిక విశిష్టత కేవలం భాషాపరమైన అంశం మాత్రమే కాదు; అది తెలంగాణ ప్రజల జీవితం, సంస్కృతి, చరిత్ర, పోరాటం, అస్తిత్వ చైతన్యానికి ప్రతిబింబంగా నిలిచింది. ఒకప్పుడు గ్రాంథిక భాష ఆధిపత్యంలో "పరాయి" భాషగా భావించబడిన తెలంగాణ యాసను నందిని సిధారెడ్డి వంటి కవులు కవిత్వంలో గౌరవప్రదమైన స్థాయికి తీసుకొచ్చారు. వారి రచనల్లో పల్లె జీవనం, రైతు అనుభవాలు, ప్రజల మాటలు, తెలంగాణ పదజాలం, నానుడులు సహజంగా కనిపిస్తాయి.

తెలంగాణ సాహిత్యం ప్రాంతీయ భాషను మాత్రమే ఉ

పయోగించలేదు; ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ప్రజలను చైతన్యపరచడానికి, వారి వివక్షను వ్యక్తపరచడానికి, సామూహిక గుర్తింపును నిర్మించడానికి ఒక శక్తివంతమైన మాధ్యమంగా మారింది.

అందువల్ల, ఆధునిక తెలుగు సాహిత్యంలో తెలంగాణ మాండలిక ప్రయోగం భాషా వైవిధ్యాన్ని ధనికపరిచింది; సాహిత్యాన్ని ప్రజల నోటి మాటకు, నేలకు, జీవితానికి దగ్గర చేసింది. తెలంగాణ మాండలికం తన ప్రత్యేక అస్తిత్వంతో తెలుగు సాహిత్యంలో శాశ్వతమైన, గౌరవనీయమైన స్థానాన్ని సంపాదించుకుందని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు:-**

ఆంధ్ర వాఙ్మయ చరిత్రము --- దివాకర్ల వేంకటావధాని:

1.తెలంగాణ సాహిత్యంలో మాండలిక ప్రయోగాలు --- పడాల జగన్నాథ రావు

2.తెలంగాణ కథకులు--కథన రీతులు --- బి.ఎస్. రాములు

3.తెలంగాణ పదకోశం / తెలంగాణ పద(బంధ) కోశం .......... నలిమెల భాస్కర్

4.నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం..రవ్వా శ్రీహరి

3.తెలంగాణ సామెతలు...వేముల పెరుమాళ్లు

5.మాండలిక పదకోశం..అకిరాజు రామాపతిరావు, తెలుగు అకాడమీ, 1985

6.మాండలిక వృత్తి పదకోశం..తెలుగు అకాడమీ, 1962

✶ ✶ ✶

భావ వీణ BHAVA VEENA
ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253
Journal of Telugu Literary, Culture & Language Study
June (1) 2019
తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక




Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.